ఈనాడు

విజయవాడ 29-8-2017 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 19

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

गुरुः ब्रह्मा गुरुः विष्णु, गुरुः देवो महेश्वरा ।
गुरुः साक्षात परब्रह्मा, तस्मै श्री गुरुवे नमः ॥

We at FIITJEE rever every Guru in the same sentiment. And extending the philosophy we act like true Gurus of Modern Era.

Biggest Guru Dakshina for FIITJEE Teachers is the Success of our Students.

A glimpse of our Students' Extraordinary Success recently in JEE Advanced, JEE Main, XII Boards, Olympiads, KVPY & NTSE

JEE Advanced, 2017

7 FIITJEE Students in **Top 20 All India Ranks** from Long Term Classroom / Integrated Programs

All India Rank **3**



Ananye Agarwal
Three Year Classroom Program

All India Rank **11**



Kushagra Juneja
Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program

All India Rank **13**



Tushar Agarwal
PINNACLE-Two Year Integrated Program switched from Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program

All India Rank **14**



Kushal Patil
Four Year Classroom Program + UDAYA - One Year Classroom Program

All India Rank **18**



Shubham Atri
Two Year Classroom Program

All India Rank **19**



Devansh Garg
Intensive Contact Program

All India Rank **20**



Rahul Bhardwaj
PINNACLE-Two Year Integrated Program switched from Four Year Classroom Program

FIITJEE Students from Short Duration Classroom + Test Series or Rankers Study Material Programs securing a Rank in **Top 10 All India Ranks**

All India Rank - **2**



Akshat Chugh
Concept Strengthening Classroom Program and Rankers Study Material

All India Rank - **6**



Saurav Yadav
Concept Strengthening Classroom Program and All India Test Series

All India Rank - **8**



Onkar Manik Deshpande
Concept Strengthening Classroom Program and All India Test Series

All India Rank - **10**



Lakshay Sharma
Concept Strengthening Classroom Program and Rankers Study Material

Number of FIITJEE Students Topping their IIT Zone / State / City		
IIT Zone	State	City
2	**7**	**24***

These are the Highest numbers for any Institute in the Country.

* FIITJEE Centres are located in 43 Cities across the Country.

FIITJEE Students dominate even in Top 100, 200 & 500 AIR

Rank Profile	in Top 100 AIR	in Top 200 AIR	in Top 500 AIR
Number of FIITJEE Students	**35**	**77**	**187**

For detailed results, please visit **www.iitjeetoppers.com**

All our Results are from General Category only

JEE Main, 2017

Rank Profile	in Top 10 AIR	in Top 20 AIR	in Top 50 AIR	in Top 100 AIR	in Top 200 AIR	in Top 500 AIR
Number of FIITJEE Students	**4**	**7**	**17**	**38**	**78**	**193**

For detailed results, please visit **www.jeemain.iitjeetoppers.com**

XII Boards, 2017

Scored ≥ **95%** Aggregate Marks	Scored ≥ **90%** Aggregate Marks	States Topper in XII Boards	City Topper in XII Boards
1220	**3649**	**4**	**13**

For detailed results, please visit **cbse.fiitjee.com/2017result**

International Olympiads 2016 & 2017

Medals in 2017*		
3 Gold ❖ 1 Silver ❖ 1 Bronze		
Gold Medalists in IPhO (Physics)	Ananya Agarwal	Three Year Classroom Program
	Debaditya Pramanik	Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program
Gold Medalist in IChO (Chemistry)	Irin Ghosh	Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program
Silver Medalist in IChO (Chemistry)	Pranav Ramakrishnan	PINNACLE - Two Year Integrated Program
Bronze Medalist in IMO (Mathematics)	Shubham Saha	Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program

Medals in 2016		
5 Gold ❖ 2 Silver		
Gold Medalists in IPhO (Physics)	Preey Hiten Shah	Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program
	Debaditya Pramanik	
Gold Medalist in IChO (Chemistry)	Valay Agarwal	Three Year Classroom Program
Gold Medalist in IOAA (Astronomy & Astrophysics)	Anand Iyer	PINNACLE-Two Year Integrated Program switched from Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program
Gold Medalist in IJSO (Jr. Science)	Archit Boobna	Four Year Classroom Program
Silver Medalist in IPhO (Physics)	Manan Bhatia	SUPREME - Four Year Integrated Program + UDAYA - One Year Classroom Program
Silver Medalist in IOAA (Astronomy & Astrophysics)	Aditya Sharma	Two Year Classroom Program

* Final round of Astronomy, Jr. Science & Jr. Astronomy are still to be held. **4 FIITJEE Students** have been selected to participate in the final round of these olympiads and they will surely prove their mettle in these Olympiads as well.

For detailed results, please visit www.fiitjee.com/olympiads.htm

Kishore Vaigyanik Protsahan Yojana (KVPY) 2016 - 17

In SA Category (Class XI)	In SX Category (Class XII)
10 State Toppers	**5 State Toppers**
Total **400** FIITJEE Students have been awarded KVPY Fellowships	Total **326** FIITJEE Students have been awarded KVPY Fellowships

For detailed results, please visit www.fiitjee.com/kvpy.htm

National Talent Search Examination (NTSE) 2017

Out of Total **777** Students who are awarded NTSE Scholarships, 2017 across the Country, **405** are FIITJEE Students.

For detailed results, please visit www.fiitjee.com/ntse.htm

All our Results are from General Category only

Attention JEE 2018 Aspirants !

Are you geared up as JEE Advanced is going to be entirely Online !

Give an Edge to your preparation with the Best Online Platform

myPAT
www.mypat.in

Everyone's Personalised Guru
Personalized Online Platform to Improve Test Performance & Achieve Success in JEE Advanced, JEE Main, BITSAT, KVPY & NTSE

For more information, Contact :
1800 121 0206
e-mail us at - support@mypat.in

This Advertisement has been released by FIITJEE Limited headquartered at New Delhi. The mentioned Test is not an Admission Test to our Colleges and Admissions are done on "First Come First Serve Basis" as per Andhra Pradesh Board norms.

Where winning is a habit !

FIITJEE
FORUM FOR IIT-JEE

National Admissions Office : FIITJEE House, 29-A, Kalu Sarai, Sarvapriya Vihar, New Delhi-110 016

Vijayawada Centre : D. No. 38-8-45 (Pass Port Office Building), Opp. All India Radio Station, M.G. Road Ph.: 8885549700, 8885549800, 8885549711, 8885549811, 0866-6669100, 6669200

Toll Free No. 1800114242 Web: www.fiitjee.com www.facebook.com/fiitjeeindia123 www.twitter.com/fiitjee www.youtube.com/fiitjeeltd www.instagram.com/fiitjee.india www.pinterest.com/fiitjee0550

FIITJEE - THE PREMIER INSTITUTE FOR IIT-JEE and BEYOND...

A Gift from FIITJEE to the Students of Vijayawada Region

FIITJEE International School
VIJAYAWADA

We Invest in Excellence to Innovate a better Tomorrow !

Diksha Initiation

- **Our Expertise** lies in nourishing the Students to be true global citizens who excel in a diverse & multicultural society.
- **Our Faculty Members** are enthusiastic & precision driven professionals who inspire Students and nurture them to achieve excellence.
- **Our Programs** include small robust class size, year round enrichment programs and international levels of education to enhance academic excellence.
- **Our Amenities** are active, systemized, hygienic, green and secure.
- **Our Management & Leadership** exhibit a vision of transparency and accountability along with a belief of a Utopian future to the mankind on earth.

For Students of Class VI, VII, VIII, IX & X

For more details, Call :
08885549700, 08885549711, 08885549800, 08885549811

FIITJEE INTERNATIONAL SCHOOL
VIJAYAWADA

Beside PVP Mall, M.G. Road, Vijayawada - 10

ఈనాడు

విజయవాడ 29-8-2017 మంగళవారం సిటీ సంపుటి 44 . సంచిక 19
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 18+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


విజేత భూమా బ్రహ్మానంద రెడ్డికి, ఎన్డీఏలో మాకు విలువైన భాగస్వామి తెదేపాకు అభినందనలు


మన ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నంద్యాల ఓటర్ల తీర్పు అద్దం పట్టింది


సీఎంపై నమ్మకం, భూమా కుటుంబంపై ఉన్న ప్రేమ, నాయకుల సమష్టి కృషి వల్లే విజయం దక్కింది

మొత్తం ఓట్లు
2,18,858
పోలైన ఓట్లు
1,73,187
తెదేపాకు
97,076
వైకాపాకు
69,610
కాంగ్రెస్‌కు
1,382

బ్రహ్మాండ విజయం

నంద్యాలలో తెదేపా జయభేరి



- భారీ మెజార్టీతో బ్రహ్మానందరెడ్డి గెలుపు
- శిల్పా మోహన్‌రెడ్డి పరాజయం
- ధరావతు కోల్పోయిన కాంగ్రెస్

నవనందుల నంద్యాలలో తెదేపా జెండా ఎగిరింది. హోరాహోరీగా సాగిన ఉప ఎన్నికల సమరంలో ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు. అన్ని పార్టీలు హామీలు కురిపించినా... వాటిని ఆచరణ సాధ్యం చేసే పార్టీ వైపు ఓటర్లు మొగ్గు చూపారు. 18 ఏళ్లుగా నియోజకవర్గంలో అధికారానికి దూరమైన తెదేపాకు అండగా నిలిచారు. ఆ పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి భారీ ఆధిక్యాన్ని అందించారు. నియోజకవర్గంలో తెదేపా బలం కూడా పెరిగింది. గత సాధారణ ఎన్నికలతో పోల్చితే 11.15శాతం ఓట్లు పెరగ్గా.. వైకాపా బలం 6.77శాతం తగ్గింది.


నంద్యాలలో బ్రహ్మానందరెడ్డి విజయానందం

- పూర్తి వివరాలు, కథనాలు 2, 14, 15 పేజీల్లో



ప్రగతి బాటకే పట్టం

శిల్పా పార్టీ మారినా 'ఫలితం' శూన్యం

జగన్ 13 రోజులపాటు మకాం వేసినా..

మైనారిటీల మద్దతు తెదేపాకే!

సవాళ్లను అధిగమించి.. సానుకూలత

- ఫలించిన చంద్రబాబు మంత్రాంగం
- కలసివచ్చిన సమన్వయం, సమయస్ఫూర్తి

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉప ఎన్నికల షెడ్యూలు ప్రకటించే రెండు, మూడు నెలల ముందు వరకు అక్కడ తెలుగుదేశానికి అన్నీ ప్రతికూల సమీకరణాలే. తెదేపా టిక్కెట్ కోసం పోటీపడిన, నియోజకవర్గంపై పట్టున్న, పార్టీకి ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన (మిగతా 2లో)

ఎక్కడ ఎన్నికలు వచ్చినా మాదే గెలుపు

'ఎక్కడ ఏ ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీదే విజయం. నంద్యాల ఉప ఎన్నిక ఫలితంతో రాష్ట్రమంతా ఊపిరి పీల్చుకుంది. ప్రతిపక్ష పార్టీ ఎక్కడ గెలుస్తుందోనని ఆందోళన చెందారు. వాళ్లు వస్తే అరాచకం, రౌడీయిజం, అవినీతి రాజ్యమేలతాయని భయపడ్డారు.'
- చంద్రబాబు

20 ఏళ్ల కారాగారం

- డేరా బాబాకు ఒక్కో కేసులో పదేళ్ల జైలు శిక్ష
- రూ.30 లక్షల జరిమానా
- బాధితురాళ్లకు చెరో రూ.14 లక్షలు ఇవ్వాలి
- అత్యాచార కేసుల్లో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు
- అతడొక ఆటవిక మృగంలా ప్రవర్తించాడు: న్యాయమూర్తి
- బోరుమన్న గుర్మీత్‌సింగ్
- తక్కువ శిక్ష వేయాలని చేతులు జోడించి అభ్యర్థన




రోహ్‌తక్ (హరియాణా)

వివాదాస్పదుడైన డేరా సచ్చా సౌధా అధిపతి గుర్మీత్ రామ్‌రహీం సింగ్ (50) ఇద్దరు మహిళా అనుచరులపై అత్యాచారం చేసినట్లు రుజువు కావడంతో అతనికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తున్నట్లు సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగ్‌దీప్ సింగ్ సోమవారం ప్రకటించారు. రెండు కేసుల్లో ఒక్కోదానికి గానూ పదేళ్లు చొప్పున మొత్తం ఇరవై ఏళ్లు కారాగారంలోనే ఉండాలనీ, ఒక్కో కేసులో రూ.15 లక్షలు చొప్పున మొత్తం రూ.30 లక్షలు జరిమానా చెల్లించాలనీ తీర్పుచెప్పారు. ఇద్దరు బాధితురాళ్లకు ఈ మొత్తంలో చెరో రూ.14 లక్షలు చొప్పున వెళ్లేలా చూడాలనీ ఆదేశించారు. రోహ్‌తక్‌లోని సునారియా కారాగార గ్రంథాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన న్యాయస్థానంలో న్యాయమూర్తి తన తీర్పును వినిపించారు. దోషిగా రుజువయ్యాక శుక్రవారం నుంచి గుర్మీత్‌ను ఇదే కారాగారంలో ఉంచిన విషయం తెలిసిందే.

'గుర్మీత్‌సింగ్ ఆటవిక మృగంలా ప్రవర్తించాడు. తన అనుచరుల్లోనే ఇద్దరు మహిళల్ని చెరచడం ద్వారా గుడ్డిగా నమ్మినవారిని మోసగించిన తీరు అత్యంత తీవ్రమైనది. తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ బాధితుల్ని బెదిరించిన అలాంటి వ్యక్తి విషయంలో న్యాయస్థానం ఎలాంటి కనికరం చూపాల్సిన అవసరం లేదు.'
- న్యాయమూర్తి

'బాధితురాళ్లు ఇద్దరూ గుర్మీత్‌ను దైవానికి మారురూపుగా భావించారు. అలాగే ఆరాధించారు. గుర్మీత్ మాత్రం వారిని నిలువునా వంచించాడు. డేరా సచ్చా సౌధా వంటి మత సంస్థలకు నాయకత్వం వహిస్తున్న వారు (మిగతా 2లో)



డోక్లామ్

ముగిసిన ప్రతిష్టంభన

- బలగాలను వెనక్కి తీసుకున్న భారత్, చైనా
- రహదారి నిర్మాణ సామగ్రిని తరలించుకుపోయిన డ్రాగన్
- మోదీ ప్రభుత్వానికి పెద్ద విజయం

దిల్లీ/ బీజింగ్: డోక్లామ్‌పై భారత్, చైనా సైన్యాల మధ్య దాదాపు రెండున్నర నెలలుగా తలెత్తిన వివాదం ఎట్టకేలకు శాంతియుతంగా పరిష్కారమైంది. దౌత్యపరమైన చర్చల అనంతరం రెండు దేశాలూ తమ బలగాలను వేగంగా వెనక్కి తీసుకునేందుకు అంగీకరించినట్లు భారత్ సోమవారం ప్రకటించింది. ఈ మేరకు రెండు దేశాల సైనికుల ఉపసంహరణ పూర్తయిందని తెలిపింది. అక్కడ వివాదానికి మూల బిందువుగా ఉన్న రహదారి నిర్మాణానికి సంబంధించి సామగ్రిని కూడా చైనా వెనక్కి తరలించుకుంది. దౌత్యపరంగా ఇది మోదీ సర్కారుకు దక్కిన పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. రెండున్నర నెలలుగా యుద్ధోన్మాద వ్యాఖ్యలు చేసిన చైనా కూడా పరువు పోకుండా గౌరవప్రదంగా వెనక్కి తగ్గడానికి వీలు కలిగిందని చెబుతున్నారు. కిందపడ్డా తనదే పైచేయి అన్న అభిప్రాయాన్ని కలిగించేందుకు చైనా ప్రయత్నిస్తోంది. ఉపసంహరణ గురించి డొంకతిరుగుడుగా మాట్లాడింది. సెప్టెంబర్ 3-5 తేదీల్లో చైనాలో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన 'బ్రిక్స్' కూటమి శిఖరాగ్ర సదస్సు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆ భేటీకి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకావాల్సి ఉంది. సెప్టెంబర్‌లో చైనా అధికార కమ్యూనిస్టు పార్టీ 19వ కాంగ్రెస్ జరగనుంది. కీలకమైన (మిగతా 2లో)



ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ మిశ్ర ప్రమాణ స్వీకారం

దిల్లీ: భారత దేశ 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్ర సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బారు హాలులో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. 64 ఏళ్ల మిశ్ర దేవునిపై ప్రమాణం చేశారు. ఆయన 2018 అక్టోబరు రెండో (మిగతా 2లో)

ఇదీ సంగతి!


గుర్మీత్ డేరా ఉన్న జైలు!

డిజిటల్‌కు జీఎస్టీ ప్రోత్సాహకం!

2% రాయితీ ఇచ్చే యోచనలో కేంద్రం


ఈనాడు, దిల్లీ: నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి పన్ను రాయితీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కొనుగోలు బిల్లు రూ.2000 వరకు ఉంటే వస్తు-సేవల పన్ను (జీఎస్టీ)లో 2 శాతం రాయితీ ఇవ్వాలని ప్రతిపాదించింది. ఈమేరకు ఆర్థికశాఖ రూపొందించిన ప్రతిపాదన ప్రస్తుతం రిజర్వు బ్యాంకు పరిశీలనలో ఉంది. ఈ రాయితీ నగదు వాపసు లేదా తక్షణ డిస్కౌంట్ రూపంలో ఉండనుంది. దేశంలో రూ.2000, అంతకన్నా తక్కువ మొత్తంలో ఉండే లావాదేవీలే అధికంగా జరుగుతాయి. ఇవన్నీ నగదు రూపంలోనే జరుగుతుంటాయి.

నగదు లావాదేవీలు రూ.2 లక్షలకు మించితే వాతే!

- హద్దు దాటితే వంద శాతం జరిమానా
- ఆదాయపు పన్ను శాఖ తాజా హెచ్చరిక

6లో





కూచిపూడి భంగిమ ఆకృతి

- జంట ఆకాశహర్మ్యాల ఆకృతులు రూపొందించిన షాపూర్జీ పల్లోంజీ సంస్థ
- మూడు వారాల్లో సమగ్ర డిజైన్లతో రావాలని సీఎం సూచన
- పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

6లో

‘బ్రహ్మా’ండ విజయం



గెలిచినట్లు ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న భూమా బ్రహ్మానందరెడ్డి

కర్నూలు, నంద్యాల, నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే

నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి 27,466 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. బ్రహ్మానందరెడ్డికి 97,076 ఓట్లు రాగా.. ఆయన ప్రత్యర్థి, వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి 69,610 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌కు కేవలం 1382 ఓట్లు వచ్చాయి. నోటాకు 1231 ఓట్లు రావడం విశేషం. నంద్యాల ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. తొలి రౌండ్ నుంచి భూమా బ్రహ్మానందరెడ్డి(తెదేపా) ఆధిక్యం కొనసాగింది. మొత్తం 19 రౌండ్లకు గానూ 18 రౌండ్లలో భూమా బ్రహ్మానందరెడ్డి మెజార్టీ సాధించగా, ఒక్క రౌండ్(16వ)లో శిల్పా మోహన్‌రెడ్డి స్వల్ప మెజార్టీ దక్కించుకున్నారు. మొత్తం పోలైన ఓట్లలో భూమా బ్రహ్మానందరెడ్డికి 56.05 శాతం, శిల్పా మోహన్‌రెడ్డికి(వైకాపా) 40.19 శాతం ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల్లో భూమా నాగిరెడ్డికి 46.97 శాతం ఓట్లు రాగా శిల్పామోహన్‌రెడ్డికి 44.91 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌కు 1,382(0.79శాతం) మాత్రమే వచ్చాయి. దీంతో ధరావత్తు కోల్పోయారు. రాయలసీమ పరిరక్షణ సమితి తరఫున పోటీ చేసిన భవనాసి పుల్లయ్యకు 154 ఓట్లు మాత్రమే లభించాయి. తెదేపా, వైకాపా అభ్యర్థులకు మినహా మిగిలిన 13 మంది అభ్యర్థులకు ధరావత్తు దక్కలేదు.

రౌండ్లు	భూమా	శిల్పా	మెజార్టీ
1	5,477	4,279	1,198(తెదేపా)
2	5,162	3,400	1,762(తెదేపా)
3	6,640	3,553	3,087(తెదేపా)
4	6,465	2,859	3,606(తెదేపా)
5	6,975	3,563	3,412(తెదేపా)
6	6,161	2,829	3,332(తెదేపా)
7	4,859	4,312	547(తెదేపా)
8	4,436	4,088	348(తెదేపా)
9	4,309	3,430	879(తెదేపా)
10	4,642	3,156	1,486(తెదేపా)
11	4,226	3,622	604(తెదేపా)
12	5,629	4,359	1,270(తెదేపా)
13	5,690	4,235	1,455(తెదేపా)
14	5,172	4,185	987(తెదేపా)
15	6,049	3,760	2,289(తెదేపా)
16	4,663	5,317	654(వైకాపా)
17	5,133	4,148	985(తెదేపా)
18	4,467	3,961	506(తెదేపా)
19	921	554	367(తెదేపా)

అయిదోసారి ‘భూమా’కర్షణ

కర్నూలు జిల్లా రాజకీయాల్లో భూమా కుటుంబం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. మొదట భూమా నాగిరెడ్డి సోదరుడు భూమా శేఖర్‌రెడ్డి నుంచి ఈ ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ కుటుంబంలో వరుసగా ఐదో వ్యక్తిని ఎమ్మెల్యే పదవి వరించింది. భూమా శేఖర్‌రెడ్డి 1989లో తెదేపా అభ్యర్థిగా పోటీ చేసి ఆళ్లగడ్డ శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. ఆయన పదవిలో ఉండగానే 1991 జూన్ 7న కన్నుమూశారు. దీంతో 1992లో జరిగిన ఉపఎన్నికలో ఆయన సోదరుడైన భూమా నాగిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన ఆళ్లగడ్డ నుంచి రెండుసార్లు శాసనసభకు, నంద్యాల నుంచి ఒకసారి, నంద్యాల లోక్‌సభకు మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. భూమా నాగిరెడ్డి ఎంపీగా ఎన్నిక కావడంతో 1997లో ఆళ్లగడ్డకు జరిగిన ఉప ఎన్నికల్లో నాగిరెడ్డి సతీమణి శోభానాగిరెడ్డి విజయం సాధించి అయిదుసార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. ఆమె మరణానంతరం 2014లో జరిగిన ఉప ఎన్నికల్లో భూమా నాగిరెడ్డి కుమార్తె భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది భూమా నాగిరెడ్డి మరణంతో జరిగిన తాజా ఉప ఎన్నికల్లో నంద్యాల నుంచి ఐదో వ్యక్తిగా భూమా శేఖర్‌రెడ్డి కుమారుడు భూమా బ్రహ్మానందరెడ్డి ఎన్నికయ్యారు. ఒకే కుటుంబం నుంచి ఐదుగురు శాసనసభలో అడుగు పెట్టడం అరుదైన విషయం.

18 ఏళ్ల తర్వాత నంద్యాల కోటపై తెదేపా జెండా

నంద్యాల శాసనసభ కోటపై 18 ఏళ్ల తర్వాత తెదేపా జెండా రెపరెపలాడింది. నంద్యాల అసెంబ్లీకి 16 సార్లు ఎన్నికలు జరగ్గా.. తెదేపా నాలుగు పర్యాయాలు, కాంగ్రెస్ అయిదు, వైకాపా ఒకసారి, స్వతంత్రులు నాలుగుసార్లు, జనతా పార్టీ అభ్యర్థి ఒకసారి గెలుపొందారు. చివరగా 1999లో ఫరూక్ తెదేపా అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో వైకాపా గెలుపొందింది. తిరిగి 18 ఏళ్ల విరామం తర్వాత తెదేపా అభ్యర్థిగా భూమా బ్రహ్మానందరెడ్డి విజయం సాధించారు.

తెదేపా విజయంపై ప్రధాని అభినందనలు

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉపఎన్నికలో తెదేపా విజయంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. “విజేత భూమా బ్రహ్మానందరెడ్డికి, ఎన్డీఏలో మాకు విలువైన భాగస్వామి తెదేపాకు అభినందనలు” అని ట్వీట్ చేశారు. ప్రధాని అభినందనలపై చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ‘‘మన ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నంద్యాల ఓటర్ల తీర్పు అద్దం పట్టింది” అని ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. కేంద్ర మంత్రులు నిర్మలాసీతారామన్, సురేశ్‌ప్రభు కూడా చంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

ఒక్కటీ నమోదు కాని తపాలా బ్యాలెట్

కర్నూలు: చైతన్యవంతులైన ఉద్యోగులు ఒక్కరంటే ఒక్కరు కూడా ఓటు హక్కు వినియోగించుకోకపోవడం గమనార్హం. నంద్యాల నియోజకవర్గంలో మొత్తం 250 తపాలా బ్యాలెట్లు ఉన్నాయి. ఆర్మీ, పారామిలటరీ, నేవీలో పని చేసే సర్వీస్ ఉద్యోగులకు తపాలా బ్యాలెట్లు పంపారు. వీటిలో 39 ఓట్లు ఆ చిరునామాలో లేరంటూ తిరిగి వచ్చాయి. మిగిలిన 211 మందికి పోస్టల్ బ్యాలెట్ చేరినా... ఒక్కరు కూడా స్పందించలేదు. కనీసం అభ్యర్థులు నచ్చకపోతే ‘నోటా’ అవకాశం ఇచ్చినా ఉపయోగించలేదు. దీంతో 250 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఏ ఒక్క ఓటు నమోదుకాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	మెజార్టీ
2017	భూమా బ్రహ్మానందరెడ్డి	తెదేపా	27,466
2014	భూమా నాగిరెడ్డి	వైకాపా	3,604
2009	శిల్పా మోహన్‌రెడ్డి	కాంగ్రెస్	31,889
2004	శిల్పా మోహన్‌రెడ్డి	కాంగ్రెస్	48,677
1999	ఎన్ఎండీ ఫరూక్	తెదేపా	3,825
1994	ఎన్ఎండీ ఫరూక్	తెదేపా	39,813
1989	వి.రామనాథరెడ్డి	కాం.ఐ	7,212
1985	ఎన్ఎండీ ఫరూక్	తెదేపా	8,447
1983	సంజీవరెడ్డి	తెదేపా	23,241
1978	బొజ్జా వెంకటరెడ్డి	జనతా పార్టీ	1,693
1972	బొజ్జా వెంకటరెడ్డి	స్వతంత్ర	6,611
1967	నబిసాహేబ్	కాంగ్రెస్	11,513
1962	ఎం.సుబ్బారెడ్డి	స్వతంత్ర	851
1959	జీవీ రెడ్డి	కాంగ్రెస్	3,572
1955	జి.రామిరెడ్డి	స్వతంత్ర	11,558
1952	ఎం.సుబ్బారెడ్డి	స్వతంత్ర	2,490

సవాళ్లను అధిగమించి.. సానుకూలత

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి తెదేపాని వీడారు. కొందరు నాయకులు, కార్యకర్తల బలగమూ ఆయన వెంట నడిచింది. సాధారణ కార్యకర్తలతోపాటు మూడేళ్లకుపైగా అక్కడి నుంచి శాసనసభ్యుడిగా వ్యవహరించి, ఆకస్మికంగా మరణించిన భూమా నాగిరెడ్డి వర్గమే తెదేపాలో మిగిలింది. వారిని కలిసికట్టుగా ఉంచగలిగే సరైన నాయకత్వం లేకపోయింది. కనీసం 20వేల ఓట్ల లోటుతో ఎన్నికల గోదాలోకి దిగాల్సిన సమయంలో పార్టీని విజయపథంలో నడిపించటం పెను సవాలే. ఇలాంటి నేపథ్యంలో అందరినీ ఏకతాటిపైకి తెస్తూ, సమన్వయం పాటిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నెరపిన సమర్థ మంత్రాంగం తెదేపాను ఘనవిజయం సాధించేలా చేసింది.

మూడు నెలల కిందటే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా.. వీటికి సమాంతరంగా ఉప ఎన్నికల కోసం ప్రత్యేక బృందం ఏర్పాటైంది. ఇందులో సభ్యులుగా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, నారాయణ, అమరనాథరెడ్డి, కాలవ శ్రీనివాసులు, అఖిలప్రియలతోపాటు ప్రతికూల పరిస్థితుల్ని సానుకూలంగా మలచుకోగల 18 మంది శాసనసభ్యుల్ని చంద్రబాబు స్వయంగా ఎంపిక చేశారు. నియోజకవర్గాన్ని 18 క్లస్టర్లుగా విభజించి ఒక్కోదాన్ని ఒక్కో ఎమ్మెల్యేకి అప్పగించారు. వైకాపాకి గట్టిపట్టున్న పోలింగ్ కేంద్రాలకు దూకుడుగా వ్యవహరించే ఎమ్మెల్యేల్ని, పర్యవేక్షణకు మంత్రి ఆదినారాయణరెడ్డిని నియమించారు. ఈ శాసనసభ్యులు సొంత నియోజకవర్గాల నుంచే కార్యకర్తల్ని తెచ్చుకుని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పనిచేశారు. ఎప్పటికప్పుడు సర్వేలు, వివిధ వర్గాల అభిప్రాయ సేకరణలు చేయించారు. వెల్లడైన లోటుపాట్ల ఆధారంగా ఆయా వర్గాల సీనియర్ నేతల్ని రంగంలో దించి వారితో ప్రత్యేక సమావేశాలు జరిపారు. ఈ వ్యవహారాలు పర్యవేక్షించే బ్యాక్ ఆఫీస్ బాధ్యులుగా సీనియర్ నేత, ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్‌ని నియమించారు.

చిరకాలంగా పార్టీకి గట్టి ఓటు బ్యాంక్‌గా ఉన్న ఓ సామాజిక వర్గం అసంతృప్తితో ఉందని తెలగానే విశాఖపట్నం జిల్లాకు చెందిన ఓ శాసనసభ్యుడిని పిలిపించారు. ఆయనతోపాటు కొంతమంది కార్యకర్తలు నియోజక వర్గంలో వాలిపోయారు. ఆ వర్గం అసంతృప్తిని తొలగించింది. ఓ ప్రధాన సామాజిక వర్గానికి మహానంది దేవస్థానం వద్ద ఓ సమస్య ఉందని తెలియగానే.. వెంటనే పరిష్కారం చూపారు. ఇలాగే దాదాపు ప్రతి వర్గాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు, మంత్రులు భేటీ అయ్యారు. అవసరాన్ని బట్టి ఆఖర్లో నేరుగా ముఖ్యమంత్రితోనే సమావేశాలు ఏర్పాటుచేయించారు. మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలంతా ఒకే హోటల్‌లో విడిది చేశారు. రోజూ మధ్యాహ్నం, రాత్రి భోజన సమయాల్లో మంత్రులు భేటీ అయ్యేవారు. వ్యూహప్రతివ్యూహాల్ని రచించుకునేవారు. నిత్యం సీఎం చంద్రబాబు వారితో చర్చించి ఆచరణలోకి తెచ్చేవారు. పట్టణంలో అభివృద్ధి పనులకి మంత్రి నారాయణ ప్రధాన బాధ్యులుగా వ్యవహరించగా... పార్టీ బలహీనంగా ఉందనుకున్న గ్రామీణ ప్రాంత బాధ్యతలు మంత్రులు ఆదినారాయణరెడ్డి, అమరనాథరెడ్డి చూసుకున్నారు. ప్రతిపక్ష క్యాంపు రాజకీయాల్ని గమనిస్తూ దీటుగా వ్యవహరించే పని సోమిరెడ్డి, కాలవ శ్రీనివాసులకి అప్పగించారు.

గ్రామీణంలో చాలాచోట్ల పార్టీకి సరైన యంత్రాంగం లేదు. దీనిని భర్తీ చేసేందుకు సమర్థులైన స్థానిక కార్యకర్తల్ని గుర్తించి వారిని సానుకూల పోలింగ్ నిర్వహణకు సన్నద్ధం చేయటంలో సీనియర్ ఎమ్మెల్యేలు క్రియాశీలకంగా వ్యవహరించారు. దీంతో ప్రచారం ముగియగానే మంత్రులు, శాసనసభ్యులు నియోజకవర్గం నుంచి నిష్క్రమించినా ఇబ్బంది లేకపోయింది. తృతీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్ని పార్టీలోకి ఆకర్షించటంలోనూ మంత్రులు చొరవ చూపారు. గోస్పాడు మండలంలో భారీగానే లోటుంటుందని సర్వేలో తేలగా.. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ద్వారా మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డిని పార్టీలోకి తెచ్చారు. ఈ క్రమంలో ఆయనకు చిరకాల రాజకీయ శత్రుత్వమున్న భూమా వర్గం నుంచి వ్యతిరేకత వచ్చినా.. ఒకరోజు సమయం తీసుకుని దానిని సానుకూలంగా పరిష్కరించారు.

డోక్లాంపై విపక్ష నేతలకు సమాచారమిచ్చిన ప్రభుత్వం

మన్మోహన్, సోనియాలతో మాట్లాడిన సుష్మా

దిల్లీ: చైనాతో డోక్లాం సరిహద్దుల్లో నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోవడంపై కేంద్ర ప్రభుత్వం విపక్ష నేతలకు సమాచారం అందించింది. ఈ అంశంపై విదేశీ వ్యవహారాలమంత్రి సుష్మాస్వరాజ్.. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాజ్యసభలో విపక్షనేత గులాంనబీ ఆజాద్, ఉప నేత ఆనంద్‌శర్మలతో మాట్లాడినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. విదేశాంగ కార్యదర్శి జైశంకర్ సైతం ఆనంద్‌శర్మతో మాట్లాడారు. తాజా పరిణామాల్ని కాంగ్రెస్ స్వాగతించింది. సరిహద్దు ఉద్రిక్తతల తీవ్రత తగ్గించే దిశగా భారత్, చైనాల మధ్య అవగాహనకు మద్దతునిచ్చింది. ప్రభుత్వం కాంగ్రెస్ నేతలకు సమాచారం ఇచ్చిన అంశాన్ని ఆ పార్టీ నేత ఆనంద్‌శర్మ నిర్ధరించారు. ఈ సానుకూల పరిణామానికి తాము మద్దతునిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్‌సింఘ్వీతో తాజా పరిణామాల్ని ప్రస్తావించినప్పుడు స్పందిస్తూ.. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశమన్నారు.

20 ఏళ్ల కారాగారం

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి సంస్థల పవిత్రతను కాపాడాల్సి ఉంది’ అని న్యాయమూర్తి తన 9 పేజీల తీర్పులో తేల్చిచెప్పారు. నేరపూరిత బెదిరింపు ఆరోపణపై మరో కేసులో విడిగా రెండేళ్ల శిక్ష విధిస్తున్నా అది మిగిలిన శిక్షలతో కలిపి (ఏకకాలంలో) అనుభవించాలని చెప్పారు.

ఇది సాధారణ కేసు కాదు: సీబీఐ

‘గుర్మీత్ తనను తాను దైవంగా చెప్పుకొనేవాడు. ఆ ముసుగులో అత్యాచారాలు వంటి ఘోరాలకు పాల్పడ్డాడు. ఇది సాధారణ కేసు కాదు. అత్యంత అరుదైనది. సమాజంపై ఈ ఘటన చూపే ప్రభావాన్ని బట్టి నిందితునికి గరిష్ఠ శిక్ష విధించాల్సిందే’నని సీబీఐ తరఫు న్యాయవాది కోరారు. తనకు విధించిన శిక్షాకాలం గురించి విన్నవెంటనే గుర్మీత్ రెండు చేతులు జోడించి, భోరుమంటూ పెద్దపెట్టున ఏడ్చాడు. క్షమించాల్సిందిగా కోరాడు. తాత్కాలిక న్యాయస్థానాన్ని వదిలి వెళ్లబోనంటూ కొంతసేపు భీష్మించుకు కూర్చొన్నాడు. న్యాయస్థానంలో న్యాయమూర్తి, ఆరుగురు న్యాయవాదులు, గుర్మీత్ మాత్రమే ఉన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మొదలైన ప్రక్రియ మొత్తం అరగంటలోనే పూర్తయింది. న్యాయస్థానం తీర్పు వెలువడిన తర్వాత హరియాణాలో ఎలాంటి హింస చెలరేగలేదు.

భారీ బందోబస్తు

15 ఏళ్ల క్రితం జరిగిన అత్యాచార ఘటనలపై ఈ నెల 25న కోర్టు నిర్ణయం వెలువడిన వెంటనే డేరా అనుచరులు సృష్టించిన హింసాకాండకు 38 మంది బలైపోయిన నేపథ్యంలో సోమవారం భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఇలాంటి సమస్య తలెత్తకుండా శిక్షాకాలాన్ని ప్రకటించే తీర్పును కారాగారంలోనే వెలువరించడానికి వీలుగా న్యాయమూర్తిని సురక్షితంగా అక్కడకు తరలించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశం మేరకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. ఆ ప్రకారం జగ్‌దీప్‌సింగ్ హెలికాప్టర్లో పంచ్‌కుల నుంచి సునారియాకు చేరుకున్నారు. క్లుప్తంగా సాగిన విచారణలో ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాత ఆయన తీర్పును ప్రకటించారు. గుర్మీత్‌సింగ్ చేసిన ‘మానవీయ సాయం’, అతని ఆరోగ్య కారణాల దృష్ట్యా తక్కువ శిక్ష విధించాలని అతని తరఫు న్యాయవాదులు కోరారు. శిక్ష ఖరారైన తర్వాత వారు విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టులో దీనిపై అప్పీలుకు వెళ్తామని చెప్పారు.

అసాధారణ భద్రత

రోహ్‌తక్, సునారియా కారాగారం, చుట్టుపక్కల ప్రాంతాల్లో అసాధారణ భద్రత ఏర్పాట్లు చేశారు. పోలీసులతో పాటు 23 కంపెనీల పారామిలిటరీ దళాలు పహారా కాశాయి. కారాగారానికి దారితీసే అన్ని మార్గాలనూ మూసివేశారు. రోహ్‌తక్ జిల్లాలోకి బయటివారు అడుగుపెట్టకుండా అడ్డుకట్టలు ఏర్పాటు చేశారు. అవసరమైతే రంగంలో దిగడానికి సైన్యాన్ని అందుబాటులో ఉంచారు. భద్రత పరిస్థితి సవాల్‌గా మారిందనీ, దుండగులు ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా అక్కడికక్కడే కాల్చివేస్తామని అధికారులు ముందుగానే స్పష్టం చేశారు. 1999-2001 మధ్య జరిగిన అత్యాచారాలపై 2002 ఏప్రిల్‌లో ఫిర్యాదు రాగా, పంజాబ్-హరియాణా హైకోర్టు ఆదేశాల మేరకు అదే ఏడాది డిసెంబరులో సీబీఐ కేసు నమోదు చేసింది. 2007 జులైలో అభియోగపత్రం నమోదయింది. గత నెల నుంచి రోజువారీగా విచారణ నిర్వహించి, ఈ నెల 25న గుర్మీత్‌ను దోషిగా ప్రకటించారు.

సరైన శిక్షే పడిందన్న రాజకీయ పక్షాలు

దిల్లీ: తనను తాను దైవాంశ సంభూతునిగా చెప్పుకొంటూ అత్యాచారాలకు ఒడిగట్టిన గుర్మీత్ సింగ్‌కు న్యాయస్థానంలో పడిన శిక్షను కాంగ్రెస్ సహా రాజకీయ పక్షాలు ఆహ్వానించాయి. హైకోర్టు కూడా తీవ్రస్థాయిలో తలంటినా హరియాణా సర్కారులో చలనం రాలేదని కాంగ్రెస్‌ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వి విమర్శించారు. హింసచెలరేగకుండా చూడడంలో ప్రభుత్వం విఫలమయిందని సీపీఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. హరియాణా సీఎం ఖట్టర్ ఇప్పటికైనా రాజీనామా చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. చట్టంముందు ఎవరూ పెద్దవారు కాదనే విషయాన్ని డేరాబాబా శిక్ష రుజువు చేసిందని భాజపానేత సుబ్రమణ్యస్వామి అన్నారు. అప్పీలుకు వెళ్లినా శిక్షతగ్గే అవకాశాలు కనిపించడం లేదన్నారు.

ఈ శిక్ష నా తండ్రికి నివాళి...

డేరాలో మహిళలపై జరుగుతున్న లైంగిక అకృత్యాల గురించి కథనాలు రాసినందుకు హత్యకు గురైన పాత్రికేయుడు రామ్‌చందర్ ఛత్రపతి కుటుంబం కూడా గుర్మీత్‌కు శిక్షపై హర్షం వ్యక్తం చేసింది. ఘరానా మోసగాడి ముసుగును కోర్టు తొలగించిందనీ, తన తండ్రి అతనిపై చేసిన పోరాటం ఫలప్రదమయిందని ఛత్రపతి కుమారుడు అన్షుల్ చెప్పారు. గుర్మీత్‌కు పడిన శిక్ష తన తండ్రికి నివాళిగా నిలిచిపోతుందన్నారు. ఇంతవరకు హరియాణా ప్రభుత్వాలేవీ తమకు సహకరించికపోయినా సీబీఐ, న్యాయవ్యవస్థ మాత్రం న్యాయం చేశాయన్నారు. తన తండ్రి హత్య కేసు వచ్చే నెల 16న ఇదే ప్రత్యేకన్యాయమూర్తి ముందుకు రాబోతోందని చెప్పారు.

సిర్సా ప్రశాంతం... త్వరలో డేరా ఆస్తుల జప్తు

సిర్సా: డేరా బాబాకు శిక్ష ఖరారైన తర్వాత సిర్సాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని గుడ్‌గావ్ నగరపాలక సంస్థ క॥మిషనర్ వి.ఉమాశంకర్ రావు చెప్పారు. సిర్సా కేంద్రంగా ఉన్న డేరా ఖాతాలను జప్తు చేయాల్సిందిగా జిల్లా యంత్రాంగం ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. హింసాత్మక ఘటనల బాధితులకు ఈ డబ్బు నుంచి పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. డేరా ప్రధాన కార్యాలయంలో ప్రస్తుతం ఉన్నవారి సంఖ్య వెయ్యికి మించదని చెప్పారు. సిర్సాలో సైనిక బలగాలు కవాతు నిర్వహించాయి. తీర్పును గౌరవించి, ప్రజలంతా, ముఖ్యంగా డేరా అనుచరులు శాంతి పరిరక్షణకు సహకరించాలని హరియాణా ముఖ్యమంత్రి ఖట్టర్ విజ్ఞప్తి చేశారు. తీర్పు అనంతర పరిణామాలపై ఆయన అత్యవసర సమీక్ష నిర్వహించారు. గవర్నర్ వి.పి.సింగ్ బద్నోర్‌తో భేటీ అయి పరిస్థితి వివరించారు. ఎలాంటి అవాంఛిత ఘటనలూ కొత్తగా చోటు చేసుకోకపోయినా పంజాబ్, హరియాణాలు అత్యంత అప్రమత్తత పరిస్థితిని కొనసాగించనున్నాయి. హరియాణాలో చెలరేగిన హింసపై రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి ఒక నివేదిక పంపించారు. వైఫల్యాల గురించి దానిలో ఎలాంటి ప్రస్తావనా లేదు.



గుర్మీత్‌సింగ్‌పై తీర్పు వెలువరించిన అనంతరం సిర్సాలో గస్తీ తిరుగుతున్న భద్రతాదళాలు



గుర్మీత్‌సింగ్ దత్తత తీసుకున్న హనీప్రీత్ ఇన్సాన్(పాతచిత్రం)



జైలు తీర్పు వెలువడిన అనంతరం సిర్సాలోని కోట్లి గ్రామం వద్ద గుర్మీత్‌సింగ్ మద్దతుదారులు దహనం చేసిన కారు



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రతో ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ప్రధాని మోదీ,

ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ మిశ్ర ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

తేదీ వరకు పదవిలో కొనసాగుతారు. ఇంతవరకు ఈ పదవిలో ఉన్న జస్టిస్ జె.ఎస్.ఖేహర్ ఆదివారం పదవీ విరమణ చేశారు. సంప్రదాయం ప్రకారం నెల రోజుల క్రితమే ఆయన జస్టిస్ మిశ్ర పేరును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి సూచించారు. 1977లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్న జస్టిస్ మిశ్ర ఒరిస్సా హైకోర్టులో రాజ్యాంగ, సివిల్, క్రిమినల్, ఉద్యోగుల సర్వీసు వ్యవహారాలు, అమ్మకం పన్ను కేసులను వాదించేవారు. 1996 జనవరి 17న ఒరిస్సా హైకోర్టులో తాత్కాలిక న్యాయమూర్తిగా చేరారు. 1997 డిసెంబరు 19న శాశ్వత న్యాయమూర్తిగా నియమతులయ్యారు. అనంతరం మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. పట్నా, దిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2011 అక్టోబరులో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

గ్రహం అనుగ్రహం

29-8-2017 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
అష్టమి: రా. 2-11 తదుపరి నవమి
అనూరాధ నక్షత్రం: రా. 11-43 తదుపరి జ్యేష్ఠ
అమృతఘడియలు: మ. 12-17 నుంచి 2-03 వరకు
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: ఉ. 8-18 నుంచి 9-08 వరకు
తిరిగి రా. 10-53 నుంచి 11-39 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ. 5-48; సూర్యాస్తమయం: సా. 6-15

డోక్లామ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సదస్సులో.. మరో ఐదేళ్లపాటు తనను పదవిని కొనసాగించేందుకు పార్టీ అనుమతిస్తుందని దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలోనూ ఈ పరిణామానికి ప్రాధాన్యం ఏర్పడింది.

విస్తృత సంప్రదింపులు.. వివాదంపై రెండు దేశాల నడుమ దౌత్యపరమైన సంప్రదింపులు కొనసాగాయని, అందులో తమ అభిప్రాయాలు, ఆందోళనలు, ప్రయోజనాల గురించి వ్యక్తంచేశామని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. “దీని ఆధారంగా డోక్లామ్‌లో ప్రతిష్టంభన ఏర్పడిన ప్రదేశం నుంచి సరిహద్దు సిబ్బందిని వేగంగా ఉపసంహరించుకోవాలన్న నిర్ణయం జరిగింది. ఆ ప్రక్రియ కొనసాగుతోంది” అని తొలుత విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. సాయంత్రానికి అది దాదాపుగా పూర్తయిందని అనంతరం మరో ప్రకటన చేసింది.

డొంక తిరుగుడు.. పరస్పరం ఉపసంహరణకు అంగీకారం కుదిరిందంటూ భారత విదేశాంగ శాఖ చేసిన ప్రకటన.. సామాజిక మాధ్యమాల్లో విస్తృత స్థాయిలో వ్యాపించడంతో చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ స్పందించారు. భారత బలగాల ఉపసంహరణనే ఆమె ప్రధానంగా ప్రస్తావించారు. తాము వెనక్కి తగ్గామన్న అభిప్రాయం తలెత్తకుండా చూసేందుకు ప్రయత్నించారు. “సోమవారం మధ్యాహ్నానికల్లా.. భారత చొరబాటు బలగాలతోపాటు వారి సాధన సంపత్తి కూడా వెనక్కి వెళ్లిపోయాయి. దీన్ని మా సైనికులు ధ్రువీకరించారు. ఆ ప్రాంతంపై చైనా సార్వభౌమాధికారం కొనసాగుతోంది. మా సైనికులు అక్కడ గస్తీ తిరుగుతున్నారు. పరిస్థితికి తగ్గట్టుగా అక్కడ సర్దుబాట్లు చేసుకుంటాం” అని ఆమె తెలిపారు. ఆ సర్దుబాట్లు ఏమిటన్నది వివరించలేదు. ప్రతిష్టంభనను తొలగించడానికి రెండు దేశాల మధ్య పరస్పర ఒప్పందం కుదిరిందా అన్న ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు ఆమె నిరాకరించారు. వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్న రోడ్డు నిర్మాణంపైనా ఆమె మౌనం వహించారు.

తగ్గాల్సిందే.. చైనా ప్రకటన నేపథ్యంలో అయోమయం తలెత్తింది. దీన్ని బట్టి చూస్తే ఆ దేశం వెనక్కితగ్గలేదని స్పష్టమవుతోందని కదా అన్న ప్రశ్నకు.. “వేగవంతమైన ఉపసంహరణ అంటే.. రెండు పక్షాలూ వెనక్కి తగ్గాలని అర్థం. భారత్ ఏకపక్షంగా తన బలగాలను వెనక్కి తీసుకోవడానికి చైనాతో ఒప్పందం అవసరంలేదు కదా” అని భారత అధికారులు బదులిచ్చారు. అనంతరం సాయంత్రం భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ మాట్లాడుతూ. . “నిశిత పరిశీలనల నడుమ ఉపసంహరణల ప్రక్రియ దాదాపుగా పూర్తయింది” అని తెలిపారు. మరోవైపు చైనా తన బలగాలతోపాటు రోడ్డు నిర్మాణ సామాగ్రిని కూడా వెనక్కి తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. తాజా ప్రతిష్టంభన వీడటానికి దాదాపు 10వారాలుగా రెండు దేశాల అధికారుల నడుమ చర్చలు జరిగినట్లు వివరించాయి. తొలుత ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారుల నడుమ సమాలోచనలు జరిగాయి. ఆ తర్వాత విదేశాంగ శాఖ కార్యదర్శి ఎస్.జైశంకర్ నేతృత్వంలో భారత బృందం చర్చలు సాగించింది. దీనికి చైనాలో భారత రాయబారి విజయ్ గోఖలే సహకరించారు. రెండు దేశాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించేందుకు గోఖలే తీవ్రంగా శ్రమించారు. సరిహద్దుల్లో శాంతియుత పరిస్థితులు లేకుంటే ద్వైపాక్షిక సంబంధాలపై అది ప్రభావం చూపుతుందని భారత్.. ఈ చర్చల్లో గట్టిగా స్పష్టంచేసింది. నిరంతర చర్చలతోపాటు తాము వెనక్కి తగ్గకుంటే.. భారత్ కూడా అక్కడి నుంచి కదలబోదని చైనా తెల్సుకున్నాకే రెండు పక్షాల నడుమ ఒక అంగీకారం కుదిరింది. మరోవైపు భారత్.. చైనాకు గౌరవప్రదమైన ఉపసంహరణకు అవకాశం కల్పించింది. భారత బలగాలు మాత్రమే వెనక్కి తగ్గినట్లు చైనా తొలుత తెలిపింది. దీన్ని మొదట్లో భారత్ కూడా బహిరంగంగా ప్రశ్నించలేదు. అయితే సాయంత్రం చేసిన రెండో ప్రకటనలో.. రెండు పక్షాలూ వెనక్కి మళ్లినట్లు స్పష్టంచేసింది.

మోదీ భేష్: ఒమర్.. డోక్లామ్ ప్రతిష్టంభన విషయంలో చాకచక్యంగా వ్యవహరించి చైనాపై పైచేయి సాధించారని ప్రధాని మోదీపై జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రశంసల వర్షం కురిపించారు. ఈ విషయంలో డాంబికాలు ప్రదర్శించకుండానే ఈ విజయాన్ని సాధించారని తెలిపారు.

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	22.3	27.1
గుంటూరు	23.0	31.0
కర్నూలు	23.4	30.2
విశాఖపట్నం	24.0	27.4
అనంతపురం	24.3	33.4
తాడేపల్లిగూడెం	25.5	29.0
విజయవాడ	25.2	30.3
శ్రీకాకుళం	25.5	34.0
నరసాపురం	25.9	29.1
రాజమహేంద్రవరం	26.0	28.0
కడప	26.0	32.0
నెల్లూరు	26.0	32.0
తిరుపతి	26.5	32.5
ఒంగోలు	26.8	34.0



ప్రధాని మోదీని దిల్లీలో కలసిన గుజరాత్‌కు చెందిన మహిళా బైకర్ల బృందం

మహిళా బైకర్ల బృందానికి ప్రధాని ప్రశంసలు

దిల్లీ: ప్రభుత్వం చేపట్టిన పలు సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలతో ముఖాముఖీ చర్చిస్తూ సుమారు 10వేల కిలోమీటర్ల ప్రయాణం చేసిన గుజరాత్‌కు చెందిన 50 మంది మహిళా బైకర్ల బృందం సోమవారం నాడిక్కడ ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలుసుకుంది. 'స్వచ్ఛభారత్', 'బేటీ బచావో... బేటీ పఢావో'... వంటి కార్యక్రమాలపై ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తూ 13 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు మోటారు సైకిళ్లపై పర్యటించిన ఈ మహిళా బృందం చొరవను ప్రధాని ప్రశంసించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వాహన ప్రయాణ యోగ్యమైన రోడ్డుగా పేరుగాంచిన లద్దాక్‌లోని 'ఖర్‌దుంగ్ లా పాస్' వద్ద ఈ బృందం ఆగస్టు 15న భారత పతాకాన్ని ఆవిష్కరించింది.

భారత సంతతి బాలుడికి అత్యధిక మేధో ప్రజ్ఞ

లండన్: బ్రిటన్‌లోని భారత సంతతికి చెందిన పదమూడేళ్ల బాలుడు అసాధారణ ప్రజ్ఞాపాటవాలను కనబరిచాడు. మెన్సా ఐక్యూ పరీక్షల్లో వరుసగా 162, 152 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. ప్రపంచంలో ఈ స్థాయి మేధో ప్రజ్ఞ కలిగిన ఒక శాతం మంది జాబితాలో చోటుదక్కించుకున్నాడు. ఆగ్నేయ ఇంగ్లాండ్‌లోని వోకింగ్‌హామ్ నివాసి అయిన ధ్రువ్‌గార్గ్... బెర్క్‌షైర్ 'రీడింగ్ స్కూల్' విద్యార్థి. ఒంటరిగా ఉండే వారి కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించే పనిలో ఉన్నాడు. ఆటలతో పాటు చదువుల్లోనూ చురుగ్గా ఉండే ధ్రువ్‌లోని విశేష ప్రతిభను గుర్తించి చిన్ననాటి నుంచే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నట్లు తల్లి దివ్యా వెల్లడించారు.

17 వేల సంస్థలపై ప్రభుత్వం కొరడా

- **నల్లధనం మార్పిడికి సహకరించినట్టు గుర్తింపు**

దిల్లీ: పెద్ద నోట్లను రద్దు చేసిన తరువాత వాటిని వివిధ మార్గాల్లో మార్పిడి చేయడానికి సహకరించిన దాదాపు 17 వేల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో పెట్టుబడి సలహా సంస్థలు, స్థిరాస్తి సంస్థలు, హోటళ్లు, బియ్యం మిల్లులు, ఆభరణాల దుకాణాలు, సినీ నిర్మాణ, మీడియా సంస్థలు ఉన్నాయి. ఇదంతా నల్లధనమని అధికారులు అంచనా వేస్తున్నారు. తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (సీరియస్ ఫ్రాడ్ ఇన్‌వెస్టిగేషన్ ఆఫీసు-ఎస్ఎఫ్ఐఓ), ఆదాయపు పన్ను విభాగం (ఐ.టి.), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లు ఇందుకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేశాయి. మొత్తం 16,749 సంస్థలు అక్రమాలకు పాల్పడినట్టు లెక్కతేల్చారు. ఈ జాబితాలో 43 ఆహార కంపెనీలు, 9 బియ్యం మిల్లులు, 860 స్థిరాస్తి, భవన నిర్మాణ కంపెనీలు, 150 ఉక్కు-లోహాల సంస్థలు, 40 ప్రకటనలు, మల్టీ మీడియా సంస్థలు, రెండు కొత్త మీడియా కంపెనీలు, డజన్ల కొద్దీ ఆభరణాల దుకాణాలు, రెండు రేడియో సంస్థలు, వేలాది ఆర్థికవ్యవహార సంస్థలు ఉన్నాయి. వాటి దస్త్రాల్లో ఉన్న తేడాలు ఆధారంగా అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. 14,247 సంస్థలు బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదు వివరాల కన్నా చాలా తక్కువ మొత్తాన్ని ఆదాయపు పన్ను రిటర్నుల్లో చూపించినట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

పోలవరం నిధుల బాధ్యత నాది

- **కృష్ణా నీళ్ల కోసం పోరాడదాం**
- **సమీక్షలో సీఎం చంద్రబాబు**

ఈనాడు, అమరావతి: "పోలవరం ప్రాజెక్టుకు నిధులు సమకూర్చే బాధ్యత నాది. నిధులపరంగా ఏ ఇబ్బంది ఉన్నా తక్షణమే నాకు తెలియజేయాలి. పనుల బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాల్సిందే..." అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు స్పష్టం చేశారు. "కాంక్రీటు పనులు మరింత వేగం పుంజుకోవాలి. 2018 జూన్‌కు కాఫర్ డ్యాం పూర్తి చేసి నీళ్లిచ్చేందుకు అనువుగా ఈ పనులు ఎలా పూర్తి చేస్తారో పక్కా ప్రణాళికతో రావాలి. రోజుకు 4000 నుంచి 5000 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని జరిగితేనే ఇది సాధ్యమవుతుంది. ఈ లక్ష్యం నెరవేర్చేందుకు ఎదురయ్యే ఇబ్బందులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ సిద్ధం చేయాలి..." అని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పనుల తీరుపై సీఎం సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. వర్చువల్ పద్ధతిలోను పనులను పరిశీలించారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. పోలవరం నుంచి పర్యవేక్షక అధికారి వేమన రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ వారంలో రికార్డు స్థాయిలో 21,226 క్యూబిక్ మీటర్ల మేర పని జరిగిందన్నారు. సరాసరిన రోజుకు 3050 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని సరిపోదన్నారు.

కర్ణాటక సీఎం, ప్రధానికి లేఖ రాద్దాం: ఈ సీజన్‌లో ఆలమట్టిలో 60 టీఎంసీల వరకు మాత్రమే నీరు వచ్చే అవకాశం ఉందని కర్ణాటక రోజుకు 1.5 టీఎంసీల నుంచి 2 టీఎంసీల నీరు వినియోగించుకుంటున్నందున దిగువకు చుక్క నీరు వచ్చే ఆస్కారం కనిపించడం లేదని జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దిగువకు నీరు విడుదల చేసే విషయంలో కర్ణాటక సీఎంకు, ప్రధానికి లేఖలు రాద్దామని, వెంటనే అవసరమైన ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు చెప్పారు. న్యాయస్థానంలోను తక్షణమే పిటిషన్ దాఖలు చేసి హక్కుల కోసం పోరాడదామన్నారు. ఇక గోదావరి నీటిని సద్వినియోగం చేసుకోవడమే మార్గమని, తక్షణమే గోదావరి నీరు సోమశిలకు తీసుకువచ్చేందుకు ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. అన్ని చోట్ల కాలువ కాకుండా టన్నెల్ నిర్మాణం కష్టమయ్యే చోట పైపులైను ఏర్పాటుకు ఉన్న అవకాశంపై దృష్టి పెట్టాలని సూచించారు.

వచ్చే నెల జలహారతి: సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో జలహారతి కార్యక్రమం చేపడదామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆ మూడు రోజులు రాష్ట్రంలోని అన్ని జలవనరులను పూజించుకునేలా... ప్రజలు ఇందులో భాగస్వాములయ్యేలా కార్యక్రమం చేపట్టాలన్నారు. 28 ప్రాజెక్టుల పనులు ఎలా సాగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పనులు అనుకున్నంతగా జరగకపోవడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో భూగర్భజలాలు ఎగువకు ఉన్నందున ఎన్టీఆర్ జలసిరి కింద అక్కడ మరిన్ని బోర్ల తవ్వకానికి అనుమతులు ఇవ్వాలన్నారు. ఆప్‌కాస్ అధికారుల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భూగర్భజలాల రీఛార్జిపై దృష్టి సారించాలని చెప్పారు. ఈఎన్‌సీలు వెంకటేశ్వరరావు, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీవీ సింధుకు సీఎం అభినందనలు: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం గెలిచిన క్రీడాకారిణి పీవీ సింధుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందనలు తెలిపారు. ఈ విజయంతో సింధు భారతదేశ కీర్తిపతాకను మరోమారు రెపరెపలాడించిందని పేర్కొన్నారు.

సెప్టెంబరులోగా ఉద్యోగుల కేటాయింపులు

- **తెలుగు రాష్ట్రాల సీఎస్‌ల అంగీకారం**

ఈనాడు, హైదరాబాద్: తుదివిడత ఉద్యోగుల కేటాయింపులను సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణల ఉద్యోగుల విభజన సలహా మండలి నిర్ణయించింది. 1302 ఉద్యోగులు తుదిజాబితాలో మిగిలి ఉండగా వారికి సీనియారిటీని ఖరారు చేసిన అనంతరం విభజన చేసేందుకు అంగీకరించింది. మండలి ఛైర్మన్, కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ కార్యదర్శి అజయ్‌మిత్తల్ సమక్షంలో సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఈమేరకు అంగీకారం కుదిరింది. తెలంగాణ సచివాలయంలో ఏపీ స్థానికత గల 24మంది విభాగాధికారులు, ఏపీలోని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల విభజన అంశం కేంద్రం పరిధిలోకి రాదన్నారు. ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు దీన్ని పరిష్కరించుకోవాలన్నారు.

విభజన ప్రక్రియ ఇలా: ఈ సందర్భంగా మిత్తల్ విభజన ప్రక్రియను వివరించారు. ఇప్పటివరకూ 90 శాఖల్లోని 1534 యూనిట్లలో 55870 మంది ఉద్యోగుల విభజన పూర్తయింది. ఇంకా 1302 మంది మిగిలారు. 536 మంది ఉప కలెక్టర్లు, ప్రత్యేక ఉప కలెక్టర్లు కాగా 62 మంది ఆబ్కారీ సూపరింటెండెంట్లు, 683 మంది డీఎస్పీలు, మరో 21మంది ఇతరులు. ఇందులో 9మంది మినహా మిగిలిన వారంతా కేటాయింపుల అంశంపై హైకోర్టుకు వెళ్లారు. సీనియారిటీ ఖరారు అనంతరం వీరి విభజన జరగాలని హైకోర్టు ఆదేశించింది. వచ్చే నెలాఖరుకలా సీనియారిటీని ఖరారు చేసి తుది విభజన జరపాలని మిత్తల్ సీఎస్‌లకు సూచించారు. దీనికి వారు అంగీకరించారు. రెండు రాష్ట్రాలు 9మంది ఉద్యోగుల విభజనను ఆమోదించాయి. ఎస్పీఎఫ్‌లో నాలుగు, వైద్య,విద్యాశాఖలో ఇద్దరు, కార్మికశాఖలో ఇద్దరు, ఆరోగ్యశాఖ సంచాలక కార్యాలయంలో ఒకరు చొప్పున జాబితాలో ఉన్నారు. ఇందులో ఏపీకి అయిదుగురిని, తెలంగాణకు నలుగురిని కేటాయించారు.



హైదరాబాద్‌లో కేంద్ర డీవోపీటీ కార్యదర్శి అజయ్‌మిత్తల్ నేతృత్వంలో సమావేశమైన ఏపీ, తెలంగాణ ప్రధాన కార్యదర్శులు దినేష్ కుమార్, ఎస్పీ సింగ్, అధికారులు

వారి సమస్య యథాతథం: ఏపీలో తెలంగాణకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగులు, తెలంగాణ సచివాలయంలో ఏపీ స్థానికత గల 24మంది ఎస్‌వోల సమస్యలను కేంద్రంపరిష్కరించాలని సీఎస్‌లు మిత్తల్‌ను కోరారు. ఇప్పటికే కేటాయింపులు పూర్తయినందున వారు కేంద్ర కమిటీ పరిధిలోకి రారని, ఇరురాష్ట్రాలు చర్చించుకొని నిర్ణయం తీసుకోవాలని మిత్తల్ అన్నారు. దీనికి ఇద్దరు సీఎస్‌లు అంగీకరించారు.

ఇరు ప్రభుత్వాలకు ప్రశంసలు: ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఉత్తరాఖండ్‌లలో ఉద్యోగుల విభజన అంశం ఇంకా అసంపూర్తిగా ఉందని, తెలుగు రాష్ట్రాల్లో మూడేళ్ల వ్యవధిలోనే ప్రక్రియ కొలిక్కి రావడం అభినందనీయమని అజయ్ మిత్తల్ రెండు ప్రభుత్వాలను అభినందించారు. సమావేశంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు దినేష్ కుమార్, ఎస్పీసింగ్, డీవోపీటీ సంయుక్త కార్యదర్శి కింబుయాంగ్, ఇరురాష్ట్రాల ముఖ్యకార్యదర్శులు ప్రేమ్‌చంద్రారెడ్డి, కె.రామకృష్ణారావు పాల్గొన్నారు.

పీజీ వైద్య విద్యార్థులపై ఔదార్యం!

- **అనుత్తీర్ణులైన వారికి అదనంగా 5 మార్కులు!**

ఈనాడు, అమరావతి: అనుత్తీర్ణులైన పీజీ వైద్య విద్యార్థుల సౌకర్యార్థం అదనంగా 5 మార్కుల్ని కలుపనున్నట్లు తెలిసింది. 2014-15 విద్యా సంవత్సరంలో ప్రవేశాల్ని పొందిన పీజీ వైద్య విద్యార్థులు చివరి సంవత్సరం ఫలితాల్ని ఇటీవల ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వెల్లడించింది. కొందరు విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. సూపర్ స్పెషాల్టీ కోర్సుల్లో చేరదల్చుకున్న వారు పీజీ వైద్య విద్యలో ఉత్తీర్ణత తప్పనిసరి. 5 మార్కులను గ్రేస్ మార్కుల కింద కలిపితే సుమారు ఆరవై మంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతారని అంచనా వేశారు. వీరిలో కొందరు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు కూడా ఉన్నారు. 5 మార్కులను గ్రేస్ కింద కలపాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి వచ్చింది.

విద్యుత్ ఒప్పంద ఉద్యోగుల ఆందోళన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్ శాఖలోని ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఒప్పంద ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విశాఖలోని గురుద్వారా వద్దనున్న ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. మద్దిలపాలెం కళాభారతి ప్రాంతం నుంచి సుమారు 1500 మంది ర్యాలీగా బయలుదేరి కార్యాలయానికి చేరుకుని బైఠాయించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ సి.కాశీమధుబాబు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ఒప్పంద కార్మికులు నిత్యం శ్రమించి సంస్థ అభివృద్ధికి దోహదపడుతుంటే యాజమాన్యం మాత్రం వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో తెదేపా ప్రభుత్వం కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీనిచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చాక తమ సమస్యనే మరిచారని పేర్కొన్నారు.

కార్తీని రెండోసారి ప్రశ్నించిన సీబీఐ

దిల్లీ: కేంద్రమాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీని అవినీతి కేసులో సీబీఐ రెండోసారి ప్రశ్నించింది. పీటర్ ముఖర్జియా, ఆయన భార్య ఇంద్రాణిల నేతృత్వంలోని మీడియా సంస్థల్లోకి విదేశీ నిధుల్ని తెచ్చుకునేందుకు అనుమతించారనే అవినీతి ఆరోపణలపై ప్రశ్నించడం ఇది రెండోసారి. సోమవారం ఉదయం కార్తీ సీబీఐ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. కార్తీ సహచరులు భాస్కర్ రామన్, రవి విశ్వనాథన్, మోహనన్ రాకేష్‌లను కూడా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కార్తీ తన తండ్రి చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు మారిషస్ నుంచి నిధుల్ని ముఖర్జియా నిర్వహించే ఐఎన్ఎక్స్ మీడియా సంస్థల్లోకి తెచ్చుకునేందుకు విదేశీ నిధుల ప్రోత్సాహక బోర్డు(ఎఫ్ఐపీబీ) నుంచి అనుమతించారనే కేసులో సంబంధంపై ప్రశ్నించారు. కార్తీ పరోక్ష నియంత్రణలోని ఒక సంస్థ ఐఎన్ఎక్స్ మీడియా నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలున్నట్లు సమాచారం.

7న చింతలపూడి ఎత్తిపోతలకు సీఎంతో భూమి పూజ: దేవినేని

విజయవాడ, న్యూస్‌టుడే: చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులకు సెప్టెంబరు ఏడో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు భూమి పూజ చేస్తారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాగులో ఆధునిక విధానాలు అందిపుచ్చుకోవాలి

ఈనాడు, అమరావతి: రైతులు ఉత్తమ సాగు విధానాలను అందిపుచ్చుకోవాలని, ఉత్పత్తిని పెంచి పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ సూచించారు. ఇక్రిశాట్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలోని ఒక హోటల్‌లో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెండేళ్ల నుంచి అమలవుతున్న రైతు కోసం ప్రాజెక్టుపై రూపొందించిన పుస్తకాన్ని ఆయన ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

రెచ్చగొట్టడం వల్లే పాదయాత్ర చేశా

- **మాజీమంత్రి ముద్రగడ వెల్లడి**

కిర్లంపూడి, న్యూస్‌టుడే: 'ముప్పై మూడు రోజులుగా చలో అమరావతి పేరుతో పాదయాత్రకు బయలుదేరుతుంటే గేటువద్ద ఆపివేసి కనీసం సమాధానం చెప్పని పరిస్థితి ఏర్పడింది. చట్టాన్ని గౌరవిస్తూ సంయమనం పాటిస్తుంటే ప్రభుత్వంలో కొందరు పెద్దలు రెచ్చగొట్టడంతోనే పాదయాత్ర చేసి మా సత్తా చూపించాల్సి వచ్చిందని' మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో విలేకర్లతో మాట్లాడారు. వయసు పైబడిందని, లేకుంటే ఇంకా అనేక రకాల ఆందోళనలు తనమదిలో ఉన్నాయని, అవన్నీ ఆచరించి చూపించగలనన్నారు. పాదయాత్రకు కర్త, కర్మ, క్రియ అంతా తానేనని దీనికి తానే పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ఇంటిలిజెన్సు ఉన్నతాధికారి వైఫల్యం పూర్తిగా ఉందన్నారు. ఆయనపై చర్యలు మాని ప్రభుత్వం కిందిస్థాయి అధికారులపై చర్యలకు ఉపక్రమించడం ఎంతవరకు సమంజసమన్నారు. సీఎం కాపుజాతి పట్ల ఎందుకంత కఠినంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. తన వెనుక ఎవరూలేరని ఏమీ చేయలేరని ముఖ్యమంత్రితో సహా ప్రభుత్వంలో ఉన్న పలువురు మంత్రులు తరచూ అంటున్నారని.. తాను ఏమి చేయగలనో వరుసగా చేస్తూ వస్తున్నానన్నారు. తునిసభ, మోటారుసైకిల్ ర్యాలీ, పాదయాత్ర చేసి చూపించినా ఇప్పటికీ ప్రభుత్వానికి కనువిప్పు కలగడంలేదని విమర్శించారు. రాష్ట్ర డీజీపీ తనస్థాయికి తగ్గట్టు వ్యవహరించడంలేదని ఆరోపించారు. పాదయాత్ర ప్రకటించడానికి వారం రోజులు ముందు సమస్యను పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం వహిస్తానంటూ ముందుకొచ్చి మధ్యలో వదిలేసి పోవడమేనా మీపెద్దరికంటూ అంటూ డీజీపీని ప్రశ్నించారు. నిరవధిక పాదయాత్రను రెండురోజులు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 30న 13 జిల్లాలకు చెందిన ఐకాస నాయకులతో కిర్లంపూడిలో సమావేశమై పాదయాత్రను కొనసాగించాలా, వాయిదా వేసుకోవాలా లేక వేరే రూపంలో ఆందోళనలు చేపట్టాలా అనేదానిపై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.



కిర్లంపూడిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

ఎస్‌బీఐలో 2,780 కిలోల బంగారాన్ని డిపాజిట్ చేసిన తితిదే

తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానం సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో 2,780 కిలోల బంగారాన్ని 12 ఏళ్లకు డిపాజిట్ చేసింది. అమరావతి సర్కిల్ ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ మణిపల్వేసన్ ఇందుకు సంబంధించిన పత్రాలను తితిదే ముఖ్య గణాంకాధికారి ఒ.బాలాజీకి అందజేసినట్లు పీఆర్వో రవి తెలిపారు. 'గోల్డ్ మోనిటైజేషన్' పథకం కింద డిపాజిట్ చేసిన ఈ బంగారంపై తితిదే 2.5% వడ్డీ పొందనుంది.

వెంకటపాలెంలోని 'మంతెన' ప్రకృతి ఆశ్రమం భూముల సేకరణ

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి భూసమీకరణలో ఇవ్వని భూముల్ని తీసుకునే ప్రక్రియలో భాగంగా వెంకటపాలెం గ్రామానికి చెందిన 66.120 ఎకరాలకు సంబంధించి గుంటూరు జిల్లా కలెక్టర్ సోమవారం తుది ప్రకటన (రూఢి ప్రకటన) జారీ చేశారు. వీటిలో కృష్ణా కరకట్టకు, నదికి మధ్య ఉన్న భూములు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో మంతెన సత్యనారాయణరాజు నిర్వహిస్తున్న ప్రకృతి ఆశ్రమానికి చెందిన సుమారు 16 ఎకరాల భూమి, వాటిలోని ఐదు భవంతులు కూడా ఉన్నాయి. ఒక్కో భవంతిని జీ+5 విధానంలో నిర్మించారు.

ఏసీబీ కేసుల్లో ముగ్గురు అధికారులకు జైలు

- **నెల్లూరు, తూర్పుగోదావరి, కడప జిల్లాలలో వేర్వేరు కేసులు**
- **ప్రత్యేక న్యాయస్థానాల తీర్పు**

నెల్లూరు, విజయవాడ, కర్నూలు న్యూస్‌టుడే

అవినీతి నిరోధక శాఖ నమోదుచేసిన కేసుల్లో ముగ్గురు అధికారులకు జైలుశిక్ష విధిస్తూ ఆయా ఏసీబీ న్యాయస్థానాలు సోమవారం తీర్పునిచ్చాయి. లంచం డిమాండ్ చేశారనే కేసులో నేరం రుజువు కావడంతో ప్రకాశం జిల్లాకు చెందిన విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుగ్గు శ్రీనివాసులురెడ్డికి న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. రూ.10వేల జరిమానా కూడా విధిస్తూ నెల్లూరు ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్‌రఫీ తీర్పుచెప్పారు. పొలంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ప్రకాశం జిల్లా ఎర్రగుంటపాళెం మండలం గుర్రపశాల గ్రామానికి చెందిన రైతు మందా ఇసాక్‌ను అధికారి రూ.20వేల లంచం డిమాండ్ చేశారు. ఇద్దరి మధ్య రూ.13వేలకు ఒప్పందం కుదిరింది. రూ.ఐదువేలు ఇచ్చినప్పటికీ మిగిలిన డబ్బుకు ఒత్తిడి తేవడంతో రైతు ఏసీబీని ఆశ్రయించారు. వారు వలపన్ని ఆయన్ని పట్టుకున్నారు. దుకాణం లైసెన్సు పునరుద్ధరించేందుకు లంచం తీసుకుంటూ పట్టుబడిన రాజమహేంద్రవరం కార్మిక శాఖ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వేదాంతం భాస్కర నరసింహమూర్తికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ విజయవాడ ఏసీబీ న్యాయస్థాన న్యాయమూర్తి వెంగయ్య తీర్పునిచ్చారు. ధవళేశ్వరానికి చెందిన బాధితుడు ఎస్.శ్రీనివాసరెడ్డి 2003లో పని ఒత్తిడితో తన దుకాణం లైసెన్స్ పునరుద్ధరణ కోసం కార్మికశాఖ కమిషనర్ కార్యాలయానికి ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్నారు. రూ.1500 ఇస్తే లైసెన్సు పునరుద్ధరిస్తానని అధికారి చెప్పడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కడప జిల్లాకు చెందిన ఎస్సై రామచంద్రయ్య, ఆయన డ్రైవర్ టి.శ్రీనివాసులుకు రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయమూర్తి కె.సుధాకర్ తీర్పుచెప్పారు. కడప జిల్లా వల్లూరుకు చెందిన సి.హెచ్.శ్రీనివాసులు ఆటోను ఆర్టీసీకి అనుబంధంగా ఉన్న ఎస్సై టి.రామచంద్రయ్య సీజ్ చేశారు. రూ.వేయి జరిమానాతోపాటు రూ.రెండు వేల లంచం డిమాండు చేయడంతో బాధితుడు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. కడప బస్టాండు వద్ద ఎస్సైకి జరిమానాతోపాటు లంచం డబ్బు ఇచ్చేందుకు వెళ్లగా వలపన్ని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.



టెక్సాస్‌లోని డికిన్సన్‌లో వరదనీటిలో మునిగిన కార్లు



నర్సింగ్‌హోమ్‌లో నడుము వరకు వచ్చిన వరదనీటిలో బిక్కుబిక్కుమంటూ ఉన్న వృద్ధులు

అమెరికా హరికేన్‌లో చిక్కుకున్న భారత విద్యార్థులు

- **హ్యూస్టన్ వర్సిటీ వద్ద వరద బీభత్సం**
- **సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సేవా సంస్థలు**

హ్యూస్టన్/ దిల్లీ: అమెరికాను కుదిపేస్తున్న 'హార్వే' హరికేన్ ధాటికి వెల్లువెత్తిన వరదల్లో హ్యూస్టన్ విశ్వవిద్యాలయం వద్ద మెడలోతు నీటిలో 200 మంది భారతీయ విద్యార్థులు చిక్కుకున్నారు. ఆ ప్రాంతంలోని భారతీయులు, అమెరికన్లు వీరిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వారికి ఆహారం, ఇతర సామగ్రి అందజేస్తున్నారు. హ్యూస్టన్‌లో భారత కాన్సుల్-జనరల్ అనుపమ్ రే బాధిత విద్యార్థులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారు. భారత-అమెరికా సామాజిక సేవా సంస్థలన్నీ ఒక్కతాటిపై నిలిచి బాధితులను ఆదుకునేందుకు, తక్షణ సాయం అందించేందుకు శ్రమిస్తున్నాయి. వరదల మూలంగా నిరాశ్రయులైన కుటుంబాలకు ప్రార్థనా మందిరాలు, వాణిజ్య ప్రాంగణాల్లో ఆశ్రయం కల్పిస్తున్నారు. అక్కడున్న భారతీయ రెస్టారెంట్లు వరద బాధితులకు ఎప్పటికప్పుడు ఆహార పొట్లాలను అందచేస్తున్నాయంటూ హ్యూస్టన్‌లో నివసిస్తున్న నల్గొండ (తెలంగాణా) వాసి కిశోర్ రామరాజు తెలిపారు.

అంతకుముందు....: వరద నీటిలో చిక్కుకున్న వారిలో షాలినీ, నిఖిల్ భాటియా అనే ఇద్దరు విద్యార్థుల్ని అత్యవసర వైద్యసేవల విభాగంలో చేర్చినట్లు భారత విదేశాంగ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ ట్విటర్‌లో తెలిపారు. సాధ్యమైనంత త్వరలో వారి బంధువులు ఆసుపత్రికి చేరేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులకు సాయం అందించేందుకు సంబంధిత భారత కాన్సుల్ జనరల్ అక్కడకు చేరుకుంటున్నట్లు కూడా వెల్లడించారు.

టెక్సాస్‌లో 76.2 సెం.మీ. వర్షపాతం

- **లూసియానాలో అత్యవసర పరిస్థితి ప్రకటించిన ట్రంప్**

హూస్టన్: హరికేన్ హార్వే కారణంగా టెక్సాస్‌లో కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల 13 లక్షల మంది వరదల్లో చిక్కుకున్నారు. వీధులన్నీ నదులను తలపిస్తున్నాయి. టెక్సాస్‌లో ఈ స్థాయి వరదలు ఇంతకుముందెన్నడూ లేవని జాతీయ వాతావరణ సేవలు(ఎన్‌డబ్ల్యూఎస్)కు చెందిన సంచాలకుడు లూయిస్ డబ్ల్యూ.యుసీల్లిని చెప్పారు. వర్షాలు ఇప్పట్లో తగ్గవని, బుధవారంనాటికి 127 సెం.మీ. వర్షపాతం నమోదు కానుందని హెచ్చరించారు. గత 72 గంటల్లో 76.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. టెక్సాస్‌లోని పాఠశాలలు, విలియం పి.హాబీ విమానాశ్రయాన్ని వారంరోజులపాటు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. టెక్సాస్‌లోని రెండు జలాశయాల గేట్లు పూర్తిగా ఎత్తివేసి, నీటిని కిందికి వదిలేస్తున్నారు. 800 ఏళ్లకు ఒకసారి ఈ స్థాయిలో వరదలు వస్తాయని, జలాశయాల డిజైన్ ఇంతటి నీటిసామర్థ్యాన్ని తట్టుకునేలా నిర్మించలేదని ఫోర్ట్ బెండ్ కౌంటీ జడ్జి రాబర్ట్ హెబెర్ట్ ఒక ప్రకటన విడుదల చేశారు. వరదనీరు ఇళ్లను చుట్టుముట్టడంతో పైకప్పుపై కూర్చుని ప్రాణాలు కాపాడుకుంటున్న వెయ్యి మందికిపైగా తమను రక్షించాలని ఫోన్లు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. వరద ఉద్ధృతి నుంచి ప్రాణాలతో కాపాడాలంటే దాదాపు 30 వేల మందిని శిబిరాలకు తరలించాల్సి ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 1200 మందిని సహాయక సిబ్బంది రక్షించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లూసియానాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

20 మంది వృద్ధరోగులను కాపాడిన ట్వీట్

హరికేన్ హార్వే కారణంగా కురిసిన కుండపోత వర్షాల వల్ల నడుములోతు వరదనీటిలో చిక్కుకుపోయిన వృద్ధరోగులను ట్విటర్‌సాయంతో కాపాడగలిగారు. టెక్సాస్‌లోని డికిన్సన్‌లో గల లా విటా బిల్లా నర్సింగ్‌హోమ్‌లో 20 నుంచి 25 మంది వృద్ధరోగులు ఉన్నారు. వరదనీరు ఆదివారం ఉదయం భవనాన్ని ముంచెత్తుతుండటంతో దాని యజమాని అప్రమత్తమయ్యారు. వరద ఉద్ధృతిని ఫొటో తీసి తన కుమార్తె, అల్లుళ్లకు ట్వీట్ చేశాడు. అల్లుడు వెంటనే దాన్ని రీట్వీట్ చేసి, అత్యవసర సహాయక సిబ్బంది వెంటనే స్పందించాలని కోరాడు. వృద్ధుల దయనీయ పరిస్థితిపై ట్వీట్లు వెల్లువెత్తడంతో సిబ్బంది రంగంలోకి దిగారు. హెలికాప్టర్ సాయంతో 20 మంది రోగులను సురక్షితప్రాంతానికి తరలించారు.

ఆల్మట్టికి పెరిగిన ప్రవాహం

ఈనాడు, హైదరాబాద్: కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి ఆల్మట్టిలోకి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఆరు వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా అది శనివారం 17,886 క్యూసెక్కులకు చేరుకుంది. ఆదివారం నాటికి 20,792 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో విద్యుదుత్పత్తి ద్వారా పదివేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. తుంగభద్రకు తొమ్మిది వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా దిగువకు చుక్క నీరు కూడా వదలడం లేదు. మరోవైపు గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్‌కు 17,642 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 7.60 టీఎంసీలుకాగా ప్రస్తుతం 7.22 టీఎంసీలకు చేరుకుంది.

ఛత్తీస్‌గఢ్ మీదుగా అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: ఒడిశా తీరం సమీపంలో వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం మధ్య ఛత్తీస్‌గఢ్ మీదుగా కదులుతోందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ఇది ఇప్పటికీ సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసి కదులుతోందని చెప్పారు. దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో రానున్న 4 రోజుల్లో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. రాయలసీమలో రానున్న 4 రోజుల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రం మీదుగా ద్రోణి కొనసాగుతూనే ఉంది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు కోస్తాలో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కుప్పంలో 16 సెం.మీ, పలాసలో 12, కొమరాడ, గరుగుబిల్లి, పాడేరులో 9, సీతానగరం, పాతపట్నం, పార్వతీపురం, టెక్కలిలో 8, వేపడ, జియ్యమ్మలో 7 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

పొగాకు బోర్డు కార్యదర్శిగా శ్రీధర్‌బాబు: భారత పొగాకు బోర్డు కార్యదర్శిగా ఉత్తరాఖండ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబును కేంద్ర ప్రభుత్వం నియమించింది.

ఈనాడు

డేరాలు నేర్పే గుణపాఠాలు!

పాపం పండటం అంటే ఇదే. దైవ సమానుడిగా కోట్లాది జన నీరాజనాలందుకొనే డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ సీబీఐ న్యాయస్థానంలో దోషిగా నిలబడి ఇరవై ఏళ్ల కఠిన కారాగార శిక్షకు గురికావడం- కేవలం స్వయంకృతాపరాధమే! రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లాలో శ్రీ గురుసర్ మోదియా గ్రామంలో 1967లో జన్మించిన గుర్మీత్- హరియాణాలో అత్యంత ప్రభావశీల డేరా అధినేతగా ఎదగడం ఓ అబ్బురం. ట్విట్టర్‌లో తన గురించి తాను ఆధ్యాత్మిక బోధకుడిగా, దాతగా, పాటగాడిగా, ఆటగాడిగా, నట దర్శకుడిగా రచయితగా పేర్కొన్న గుర్మీత్‌కు 'రాక్‌స్టార్'గా ఉన్న ఆదరణ అద్భుతం. హరియాణాలోని సిర్సాలో వెయ్యి ఎకరాల్లో ఉన్న గుర్మీత్ ఆశ్రమంలో సేవ చేసేందుకు తల్లిదండ్రులు తమ బిడ్డల్ని 'సాధ్వి'గా పంపడం ఆనవాయితీ. అలా వెళ్ళిన ఓ బాలిక, గుర్మీత్ బెదిరించి తనపై అత్యాచారం చేశాడంటూ పలు రాజ్యాంగ వ్యవస్థలకు 2002లో రాసిన ఆకాశ రామన్న లేఖ తీవ్ర సంచలనం సృష్టించింది. ఆ లేఖను తీవ్రంగా పరిగణించిన ఉన్నత న్యాయస్థానం సిర్సా జిల్లా సెషన్స్ జడ్జి ద్వారా ప్రాథమిక విచారణ జరిపించి, ఆయన సూచన మేరకు కేసు దర్యాప్తు బాధ్యతను 2002 సెప్టెంబరులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించింది. అప్పటినుంచి ఏ 'క్రైం థ్రిల్లర్' సినిమాకూ తీసిపోని ఉత్కంఠభరిత మలుపులతో- కేసు మూసివేతకు నర్మగర్భ ఆదేశాలు, సాక్షుల బెదిరింపులు, హత్యలతో బీభత్స ప్రధానంగా సాగిన కేసు దర్యాప్తు ఓ కొలిక్కి వచ్చి గుర్మీత్ దోషిత్వాన్ని మొన్న శుక్రవారం సీబీఐ కోర్టు నిర్ధారించిన వేళ, ఏం జరిగిందో యావద్దేశం విస్తుపోయి పరికించింది. డేరా అనుచర గణాలు సృష్టించిన విధ్వంసం 38మంది ప్రాణాలు బలిగొంది. రైల్వేస్టేషన్లు, పెట్రోలు బంకులు, బస్సులు, ప్రైవేటు వాహనాలను పరశురామప్రీతి గావిస్తూ ముష్కర మూకలు రెచ్చిపోయాయి. ఆ దారుణం పునరావృతం కానివ్వకుండా సైన్యాన్నీ రంగంలోకి దింపి, గుర్మీత్‌ను ఉంచిన జైలునే తాత్కాలిక కోర్టుగా మార్చి జస్టిస్ జగ్‌దీప్‌సింగ్ వెలువరించిన తీర్పు- చట్టం ముందు అందరూ సమానమేనని ఎలుగెత్తి చాటింది!

చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొనే హక్కు ఎవరికీ లేదన్న ప్రధాని మోదీ- ఎవరు హింసకు దిగినా సహించేది లేదని స్పష్టీకరించారు. రక్తదానం, నేత్రదానం, మహిళా సాధికారత, స్వచ్ఛత, ఆహార-వస్త్ర బ్యాంకులు, నిర్వాసితులకు గూడు కట్టించడం వంటి సమాజహిత కార్యక్రమాల్లో డేరా తలమునకలై ఉంటుందని చెప్పే గుర్మీత్ అనుయాయులు, అసలు సిసలు అసాంఘిక శక్తులై చెలరేగిపోయారు. గుర్మీత్‌పై ఈగవాలినా శివాలెత్తిపోయే డేరా అనుచరగణాలు ఎంతకైనా తెగిస్తాయన్న వాస్తవం హరియాణా అధికార శ్రేణులకు తెలియనిది కాదు. 2002లో డేరాకు చెందిన సాధ్వి రాసిన ఆకాశరామన్న లేఖను ప్రచురించిన సంపాదకుడు హతమారిపోయాడు. ఫిర్యాదు లేఖ రాసింది ఫలానా సాధ్వి అయి ఉంటుందన్న అనుమానంతో ఆమె సోదరుణ్నీ చంపేశారు. ఆ కేసులూ గుర్మీత్ మెడకు ఉచ్చు బిగిస్తున్నాయిప్పుడు! పంజాబ్, హరియాణా, దిల్లీ, రాజస్థాన్‌లతోపాటు పలుచోట్లకు విస్తరించిన డేరా ప్రాబల్యం తమకు అధికారం కట్టబెట్టే కామధేనువులాంటిదని పార్టీలన్నింటికీ తెలుసు. 2009లో హరియాణాలో కాంగ్రెస్ కొమ్ముకాసిన డేరా, 2014లో భాజపా విజయానికి బాటలు పరచింది. తమ గెలుపు గుర్మీత్ భిక్షేనని ఖట్టర్ మంత్రివర్గం భావిస్తోంది. కాబట్టే- ధ్వంసరచన వ్యూహాలు కళ్లకు కడుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం దీటుగా స్పందించలేక హైకోర్టు చేత మొట్టికాయలు వేయించుకొంది. ఏ విధంగా చూసినా దారుణ వ్యవస్థాగత వైఫల్యమిది. కేవలం శాంతిభద్రతల కోణానికే పరిమితం కాకుండా- సామాజిక సమానత్వ, సౌభ్రాతృత్వ అంశాలపై దృష్టి సారిస్తేనే అసలు రుగ్మత మూలాల్ని గుర్తించి నయం చెయ్యగల వీలుంటుంది!

అస్పృశ్యతను విడనాడి అందరినీ అక్కున చేర్చుకోవాలని, సామాజిక సమానత్వానికి ప్రోది చెయ్యాలని సిక్కుమతం ప్రబోధిస్తున్నా- జరుగుతున్నది వేరు! గురుద్వారాలన్నీ జాట్ వర్గం గుప్పిట్లో ఉండటం, మతపరంగానూ సమానత్వ భావన మృగ్యం కావడం, ఆర్థిక వెనకబాటుతనం- షెడ్యూలు కులాల్లో, వెనకబడిన వర్గాల్లో సిక్కు మతానికి ప్రత్యామ్నాయంగా డేరాల విస్తృతికి కారణమయ్యాయని చెప్పక తప్పదు. పంజాబులోనే కొన్ని వేల డేరాలున్నాయంటున్నారు. రాధా సోమీస్, సచ్చా సౌధా, నిరంకారీ, నామ్‌ధారీ, దివ్యజ్యోతి జాగరణ్ సంస్థాన్ వంటివి సిక్కులతో సంబంధం లేని డేరాలుగా బలం పుంజుకొన్నాయి. డేరా సచ్చాసౌధాకు దాదాపు అయిదు కోట్లమంది అనుయాయులు ఉండటం, గుర్మీత్ పట్ల వారి భక్తిప్రపత్తులు, డేరా సభ్యులందరిలో సమానత్వ భావనల్ని పెంచే కట్టుబాటు, విద్యావైద్య రంగాల్లో అద్భుత చేయూత వంటివన్నీ గుర్మీత్ ఎదుగుదలకు ఎంతగానో దోహదపడ్డాయి. గుర్మీత్‌పై కేసులున్నా అతగాడికి 'జెడ్ ప్లస్' కేటగిరీ భద్రత కల్పించి ప్రభుత్వాలు తరించిపోవడంలో ఓటుబ్యాంకు రాజకీయాలున్నాయి! రాజ్యాంగం ప్రస్తావించిన సమానత్వం, సౌభ్రాతృత్వ భావాల్ని, వ్యక్తి గౌరవానికి పట్టం కట్టే సామాజిక సంస్కృతినీ స్వతంత్ర భారతావనిలో డెబ్భయ్యేళ్లుగా పాదుకొల్పలేకపోబట్టే- డేరాలు పుట్టుకొస్తున్నాయి. రాజకీయాలతో జట్టుకట్టి చట్టబద్ధ పాలనకే సవాళ్లు రువ్వుతున్నాయి. ప్రభుత్వాలతోపాటు మత పెద్దలు, ఆధ్యాత్మికవేత్తలు నిశితంగా ఆత్మశోధన చేసుకోవాల్సిన అంశమిది. భిన్నస్థాయుల్లో దిద్దుబాటు చర్యలు సత్వరం పట్టాలకెక్కినప్పుడే సమానత్వం సాధ్యపడుతుంది; సామరస్యం వెల్లివిరుస్తుంది!

కాసుల కోసం దగా... కావాలిప్పుడు నిఘా!



దేశవ్యాప్తంగా వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చి సుమారు రెండు నెలలు అవుతోంది. 'విలువ ఆధారిత పన్ను' స్థానంలో సంక్లిష్టత లేని ఏకీకృత పన్నుల వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలపై భారం తగ్గించాలన్న నరేంద్ర మోదీ ప్రభుత్వ ప్రయత్నం ఏ మేరకు సఫలీకృతమైందన్న సమీక్షకు ఇది తగిన తరుణం! దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అవసరాన్ని గుర్తించి జీఎస్‌టీని తీసుకువచ్చారు. గతంలో అమలులో ఉన్న ఎన్నో పన్నులను జీఎస్‌టీలో కలిపేయడంతో ప్రజలకు లెక్కకు మిక్కిలి పన్నుల జంజాటం భరించాల్సిన బాధ తప్పింది. 2003లో వాజ్‌పేయీ హయాములో పురుడు పోసుకున్న జీఎస్‌టీ, అనేక వాద వివాదాలను అధిగమించింది. ఎట్టకేలకు 2014లో మోదీ ప్రభుత్వం కనబరచిన చొరవ, ఆర్థిక మంత్రి జైట్లీ నిరంతర కృషి ఫలితంగా బిల్లు రూపుదిద్దుకొంది. రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు, వివిధ రంగాల ప్రతినిధుల సలహాలను పరిగణనలోకి తీసుకొని జీఎస్‌టీ బిల్లులో ఎన్‌డీఏ ప్రభుత్వం మార్పులు చేసింది. 2017 జులై ఒకటో తేదీనుంచి జీఎస్‌టీ దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది.

తగ్గని ధరలు

వస్తు సేవల పన్ను పరిధినుంచి కొన్ని సరకులను తొలగించడం, మరి కొన్నింటికి సంబంధించి పన్ను రేట్లు తగ్గించడంవల్ల రాష్ట్రాల రెవిన్యూకు స్వల్పంగా గండిపడే అవకాశాలు కొట్టిపారేయలేనివి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆర్థిక మంత్రులు జీఎస్‌టీ అమలువల్ల తమ ఆదాయానికి గండి పడుతుందని ఆందోళన వ్యక్తపరచారు. వస్తు సేవల పన్ను కారణంగా సుమారు రూ.2,900 కోట్ల మేర రాష్ట్ర రాబడికి కోతపడుతుందని ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలకు ఏర్పడే లోటును భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం వచ్చే అయిదేళ్లపాటు తగిన ఆర్థిక సాయం అందజేస్తుందన్న హామీని చట్టంలో పొందుపరచారు. జీఎస్‌టీ 'పన్ను ఉగ్రవాదం' నుంచి దేశానికి విముక్తి కలిగిస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఈ పన్ను అమలువల్ల నల్లధనానికి అడ్డుకట్ట వేయవచ్చుననీ ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వినియోగదారులకు అత్యవసరమైన బియ్యం, గోధుమలు, పప్పు దినుసులు, నూకలు తదితర నిత్యావసరాలను ఈ పరిధిలోకి తీసుకురాలేదు. వాటితోపాటు పెట్రోలియం, మద్యాన్నీ జీఎస్‌టీ ఛత్రం కిందకు తీసుకురాలేదు. బ్రాండెడ్ వస్తువులకు ఈ సదుపాయం వర్తించదు. చాలావరకు వినియోగదారులు ప్రస్తుతం మార్కెట్లలో అత్యధిక శాతం బ్రాండెడ్ వస్తువులనే కొనుగోలు చేస్తున్నందున, వారిపై పన్నుల భారం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నిత్యావసర వస్తువులపై పన్నుభారాన్ని 14 శాతంనుంచి అయిదు శాతానికి తగ్గించారు. ఈ పన్ను అమలు తీరును పర్యవేక్షించేందుకు అనువుగా ఇప్పటివరకూ ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. చాలావరకు మార్కెట్లో అనేక వస్తువుల ధరలు ఎప్పటిలానే ఉన్నాయని, వాటి ధరలు ఏమాత్రం తగ్గలేదన్న మాట వినియోగదారులనుంచి విస్తృతంగా వినిపిస్తోంది. జీఎస్‌టీ కారణంగా కొన్ని వస్తువుల ధరలు కొండెక్కి కూర్చున్నట్లు తెలుస్తోంది. రోగులకు అవసరమైన వివిధ పరికరాల ధరలు ఏడు శాతం నుంచి 12 శాతానికి పెరిగినట్లు స్వయంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ 'వెబ్‌సైట్'లోనే పేర్కొనడం ఈ సందర్భంగా గమనించాల్సిన అంశం. కూరగాయల ధరలు కనీవినీ ఎరుగని స్థాయిలో పెరిగిపోయాయి. ఇందుకు చాలావరకు వ్యాపారస్తుల వైఖరే కారణం. జీఎస్‌టీని అడ్డుపెట్టుకొని వినియోగదారులపై భారంవేసి అత్యధిక లాభాలు ఆర్జించేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. దేశంలోని వినియోగదారుల్లో నిరక్షరాస్యులూ ఉండటంతో వారి అమాయకత్వాన్ని అడ్డుపెట్టుకొని కొందరు వ్యాపారులు గరిష్ఠ చిల్లర ధర(ఎంఆర్‌పీ) కన్నా అధిక ధరలు వసూలు చేస్తూ, జీఎస్‌టీపై అపనిందలు వేస్తున్నారు. వ్యాపారుల అక్రమాలకు ముకుతాడు వేసేందుకు ఒక ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని బిల్లులో సూచించినా, ఇప్పటివరకూ చర్యలు లేవు. పూర్తి స్థాయి లాభార్జనకే ప్రాధాన్యమిచ్చినన్నాళ్లూ జీఎస్‌టీ నుంచి ఆశించిన ఫలితాలు ఒనగూడవు. నిత్యావసరాలను అధికంగా వీధుల్లోని కిరాణా వ్యాపారులనుంచే వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారు. చిన్నతరహా వ్యాపారస్తులకు జీఎస్‌టీలో రాయితీలు ఉన్నాయి. వార్షిక లావాదేవీలు రూ.20 లక్షలలోపు ఉన్న వ్యాపారులపై పన్నుభారం ఉండదు. వార్షిక లావాదేవీలు రూ.20 లక్షలనుంచి రూ.75 లక్షల వరకు ఉన్న వ్యాపారస్తులపై ఒక శాతం పన్ను మాత్రమే విధిస్తారు. ప్రతి రాష్ట్రంలోనూ చాలావరకు చిన్నతరహా వ్యాపారస్తులే పెద్దసంఖ్యలో ఉంటారు. జీఎస్‌టీ రాకతో తమకు వస్తున్న లాభాలకు అనుగుణంగా సరకుల ధరలు తగ్గించి వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చాల్సి ఉంది. అయితే దేశవ్యాప్తంగా వ్యాపారులు ఆ మేరకు నిజాయతీగా వ్యవహరిస్తున్నారా అన్నది సందేహమే!



రెండు నెలల క్రితం పార్లమెంటులో మోగిన వస్తుసేవల పన్ను గంట

జీఎస్‌టీ అమలుపై ఇకనైనా గట్టి పర్యవేక్షణ

దేశంలో వ్యవసాయం, చేనేత రంగాలు తీవ్ర సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. దేశ జనాభాలో 60 శాతానికి వ్యవసాయ రంగమే ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, కూలీల కొరత, విద్యుత్ సరఫరాల్లో ఒడుదొడుకులు, ఉత్పాదకాల ధరలు మితిమీరడం, సకాలానికి బ్యాంకుల నుంచి రుణాలు లభించకపోవడం, కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభ్యం కాకపోవడం వంటి సమస్యలతో దేశవ్యాప్తంగా రైతన్నలు సతమతమవుతున్నారు. ఈ పరిస్థితిలో 'చెక్‌పోస్టు'లు తొలగించి రైతులు స్వేచ్ఛగా దేశంలో ఏ మార్కెట్‌లోనైనా లాభసాటి ధరకు తమ ఉత్పత్తులు విక్రయించుకొనే సదుపాయం కలగజేయడం స్వాగతించాల్సిన అంశం. సేద్యానికి అవసరమైన పనిముట్లను జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చారు. మొన్నటివరకూ పన్నులేని ట్రాక్టర్లపై 12 శాతం, రసాయనిక ఎరువులపై అయిదు శాతం పన్ను విధించడం రైతును దెబ్బతీసే ప్రమాదం ఉంది. వ్యవసాయ ఉత్పాదకాలను తక్షణం జీఎస్‌టీ పరిధినుంచి తొలగించడమో లేదా వాటిపై విధించిన పన్నురేటును తగ్గించడమో చేయాలి. ఈ విషయాన్ని జీఎస్‌టీ మండలిలో సమీక్షించి సానుకూల నిర్ణయం తీసుకోవాలి. సేద్య వ్యయాలు పెరగడంతో వ్యవసాయంలో కొనసాగడం అన్నదాతలకు కష్టమవుతోంది. ఈ పరిస్థితుల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకురావడం చాలా అవసరం. సుభాష్ పాలేకర్ ప్రతిపాదించిన పెట్టుబడిలేని వ్యవసాయ విధానాల అమలు విషయాన్నీ పరిశీలించాలి. వ్యవసాయ ఉత్పత్తి పరికరాలపై పన్ను రాయితీలు ప్రకటించడంతోపాటు తగిన ప్రోత్సాహకాలనూ అందజేయాలి.

ఎగవేతదారులకు ముకుతాడు

ప్రభుత్వం అంచనా వేసినట్లే జీఎస్‌టీ అమలు వల్ల పన్నుల ఎగవేతకు పాల్పడేవారికి ముకుతాడు పడింది. పన్ను చెల్లించేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 2016-2017 ఆర్థిక సర్వే ప్రకారం దేశంలో ఆరున్నర లక్షల మంది వ్యాపారస్తులు కొత్తగా జీఎస్‌టీలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. దీనివల్ల రాబోయే రోజుల్లో పన్నుల ద్వారా జమపడే ఆదాయం బాగా పెరిగే అవకాశం ఉంది. అయితే పెరిగే పన్ను భారాన్ని కొందరు వ్యాపారులు వినియోగదారుడికి బదిలీ చేసే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. జీఎస్‌టీలో రసాయన ఎరువులపై అయిదు శాతం పన్ను, క్రిమికీటక సంహారిణులపై పన్నును 12.5 శాతం నుంచి 18 శాతానికి పెంచారు. దీనివల్ల రసాయనాల వినియోగం తగ్గి, సేంద్రియ వ్యవసాయంవైపు రైతులు మొగ్గుచూపితే అది సేద్యానికి మేలు చేసే పరిణామమే! ఎక్సైజ్ సుంకం రూపంలో పారిశ్రామిక రాష్ట్రాలైన గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడులకు చెప్పుకోదగ్గ రెవిన్యూ సమకూరేది. అయితే జీఎస్‌టీ వచ్చాక ఉత్పత్తులను ఎక్కడ విక్రయిస్తారో వాటిపై చెల్లించే పన్ను కూడా ఆ ప్రాంతానికే దఖలుపడుతుంది. ఫలితంగా పారిశ్రామిక ప్రధాన రాష్ట్రాల ఆదాయం తగ్గుతోంది. అయితే ఈ రకంగా ఏర్పడే లోటును కేంద్ర ప్రభుత్వం భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఎవరూ పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పాలన పరంగా అమలు చేసే ఏ సంస్కరణ విషయంలోనైనా తొలుత వ్యతిరేకత ఉండటం సహజం. జీఎస్‌టీ ప్రభావాన్ని సమగ్రంగా మదింపు వేయాలంటే కనీసం ఆరు నెలల కాలం ఆగక తప్పదు. అందుకోసం జీఎస్‌టీ అమలవుతున్న తీరును, దానివల్ల దేశ ప్రజలపై ప్రసరిస్తున్న సానుకూల, ప్రతికూల ప్రభావాలను నిరంతరం సమీక్షించడం అవసరం. ఈ పన్ను అమలయ్యే తీరును పర్యవేక్షించి, సముచిత సలహాలు సూచనలు అందించేందుకు నిపుణులతో కూడిన ఓ ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలి. పన్ను అమలులో తిరకాసుకు పాల్పడి మితిమీరిన లాభార్జనకు వ్యాపారులు ప్రయత్నిస్తే దాన్ని అడ్డుకోవడానికి ఓ పటుతర వ్యవస్థ ఉండాలి. వివిధ పన్నుల సంక్లిష్టతల నుంచి దేశానికి విముక్తి లభించడంతో పారిశ్రామికవేత్తలు స్వేచ్ఛగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తారు. దేశవ్యాప్తంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు విస్తరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది ఒకరకంగా ఆర్థికాభివృద్ధితోపాటు సామాజిక వికాసానికీ దోహదపడే పరిణామం.

– ఆచార్య కె. వెంకటరెడ్డి

(రచయిత– శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ మాజీ ఉప కులపతి)

చేనేతకు సాంత్వన అవసరం

ప్రాచీనకాలం నుంచి భారత ఆర్థిక వ్యవస్థలో చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. ఇప్పటికీ స్వదేశీ, విదేశీ విపణుల్లో భారతీయ చేనేత ఉత్పత్తులకు విపరీతమైన గిరాకీ ఉంది. ముడిసరకుల కొరత, మిల్లులనుంచి తీవ్రమవుతున్న పోటీ కారణంగా దేశీయ చేనేత రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. తగిన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంవల్ల చేనేత రంగం ఇబ్బందుల్లో కూరుకుపోయి ఉంది. దెబ్బమీద దెబ్బ అన్నట్లుగా చిలపల నూలుపై అయిదు శాతం, పూర్తి అయిన వస్త్రాలపై 10 శాతం జీఎస్‌టీ విధించడంవల్ల చేనేత పరిశ్రమ మనుగడే ప్రమాదం పడింది. కాబట్టి తక్షణం దీన్ని జీఎస్‌టీ పరిధినుంచి తొలగించడమో లేదా ప్రకటించిన పన్నుల రేటును గణనీయంగా తగ్గించడమో చేయాలి. ప్రభుత్వ తక్షణ కర్తవ్యమిది. ఆ మేరకు జీఎస్‌టీ మండలిలో చర్చించి సత్వరం సానుకూల నిర్ణయం వెలువరించాల్సిన అవసరం ఉంది.




అమ్మ భాషకు అంబారీ!

'చుక్కాని పట్టరా తెలుగోడా/ నావ దరిజేర్చరా మొనగాడా!'- ఇది ఎప్పుడో 65 ఏళ్లక్రితం తెలుగునాట మారుమోగిన పాట. దశాబ్దాల నాటి ఆ పిలుపు, ఇప్పటికీ తెలుగుభాష సముద్ధరణ విషయంలో అక్షరాలా వర్తిస్తుంది! భాష అంటే మాట. ప్రమాణం అనే మరో అర్థమూ ఉంది. ఎవరి మాతృభాషలో వారు మాట్లాడాలి. ఎవరి భాషలో వారు అక్షరాలు దిద్దాలి. మాట, పాట, బాట ఎవరిది వారిదై ఉండాలి. అమ్మను ప్రేమించినట్లే, అమ్మభాషనూ ప్రేమిస్తామని ప్రమాణం చేయాలి. సొంత భాషే ప్రతి ఒక్కరికీ ప్రామాణికం కావాలి... ఇవన్నీ ఏటా వచ్చి వెళ్లే భాషా దినోత్సవ నినాదాలుగా మిగిలిపోకూడదు. కేవలం ఏ ప్రభుత్వ విధాన ప్రకటనలకో ఇవి పరిమితం కావడం అసలే సరికాదు. 'తేట మాటల తెలియజెప్పుము/ దిక్కులన్నియు మారు మ్రోగిన/తెలుగువారల పేరు పెంపును/ తెలియకుండగ ఉండబోకుము' అని తట్టిలేపిన 'కవిరాజు' బాటలో నడిస్తే అదే అచ్చమైన తెలుగుదనం. భాషకు అంతటి మేలు కలిగినప్పుడే, తెలుగుజాతికి ఉత్సవ శోభ! ఉత్సవాన్ని పండుగ అని మాత్రమే కాదు, కోరికలు కొనసాగడం అనే అర్థంలోనూ వాడతారు. 'నేను తెలుగువాణ్ని-నా భాష నాకు ప్రాణం' అనే ఏకైక సూత్రం ఒంటపట్టినప్పుడు, ఆ గాఢత్వమే అతడి కోరికగా స్థిరపడినప్పుడు; ఈ ఒక్కరోజే కాదు, నిత్యమూ భాషోత్సవమే!

సాధికారత ఏదీ?

ఎవరి భాషలో వారికి విద్యను బోధిస్తేనే ప్రయోజనమని గిడుగు రామమూర్తి, బడి పలుకుల భాష కంటే పలుకుబడుల భాషే అవసరమని కాళోజీ ఏనాడో చాటిచెప్పారు. భాషలో, సాహిత్యంలో ఉద్యమకారులైన ఆ ఇద్దరి మాటా సిసలైన బంగారు బాట. అసలైన పురోగతి మాతృభాషతోనే సాధ్యమని జాతిపిత గాంధీజీ, అమ్మభాషలో బోధన విద్యార్థి సృజనను ఎంతో పెంచుతుందని విశ్వకవి రవీంద్రుడు హితవు పలికి ఎన్నో ఏళ్లు గడిచాయి. జ్ఞానానికి నాంది ఆలోచన. అది ఉంటేనే మాటలు వెలువడతాయి. అవే భాషగా రూపుదిద్దుకుంటాయి. ఆ పునాది ఆధారంగానే పదాలపై పట్టు, భాషపై సాధికారత అలవడతాయి. విషయం తెలుసుకోవాలన్నా, భావాన్ని వ్యక్తపరచాలన్నా మొట్టమొదటి మాధ్యమం- మాతృభాషే. ఆ తోడ్పాటుతో సంస్కృతి వెల్లివిరుస్తుంది. ఇంట్లో, బయట, రోజువారీ పనుల్లో, చదువులో, పాలనలో, ఏ రంగంలోనైనా తెలుగుతోనే సౌలభ్యం ఒనగూడుతుంది. ఇదొక గొలుసుకట్టు. కాలక్రమ పరిణామాల్లో బడి చదువు భారంగా మారింది. కళాశాల విద్య అర్థం కానిదిగా తయారైంది. పనిమీద ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారికి ఏ దస్త్రంలో ఏముందో తెలియకుండా పోతోంది. న్యాయస్థానాల్లో ఎవరు ఏం మాట్లాడుతున్నారో, అక్కడ జరుగుతున్నదేమిటో కక్షిదారులకు ఒక పట్టాన అంతుపట్టడం లేదు. సొంత భాష సొంతం తెలియక, ఇతర భాష ఎంతకీ అవగతం కాక- పలు చోట్ల భాషా దారిద్ర్యం, భావ దౌర్భాగ్యం తాండవిస్తున్నాయి.

భాషా ప్రయోజనాల్ని అందరి దరికీ చేర్చే బాధ్యత ప్రభుత్వానిది. ఆ విధిని విస్మరించి వ్యవహరించే ఏ ప్రభుతా ఎంతో కాలం మనలేదు. తెలుగునాట తెలుగు భాషాబోధనను నిర్బంధం చేయాలన్న ప్రతిపాదన ఇప్పటిది కాదు. ప్రాథమిక దశ నుంచి ఉన్నత పాఠశాల చదువు ముగిసే పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలోనే బోధించాలన్న డిమాండు నాలుగేళ్ల క్రితం ప్రపంచ తెలుగు మహాసభల (తిరుపతి) వేదికమీద మారుమోగింది. పాఠ్యపుస్తకాల్ని పిల్లలందరికీ బాగా అర్థమయ్యేలా రూపొందించాలన్నది మరో కీలక సూచన. భాషా సంస్కృతుల సంరక్షణకు ఓ ప్రత్యేక సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ తరవాత నియమించింది. ప్రభుత్వ పాలనా వ్యవహారాల్ని తెలుగుమయం చేయడం, సమాచార-సాంకేతిక రంగాల్లో ఆ భాషనే వినియోగించడంపైనా చూపు సారించింది. తెలంగాణ సర్కారు చారిత్రక, సారస్వత, సాంస్కృతిక అంశాల పరిరక్షణతోపాటు ప్రజా ప్రయోజనాలు, అవసరాలు, పురోగామి దృక్పథంతో తెలుగు వాచకాలు తయారుచేయించేందుకు ముందుకొచ్చింది. భాషను అన్నివిధాలా ప్రోత్సహించే సంస్థల నిర్మాణానికి, హైదరాబాద్ వేదికగా వచ్చే అక్టోబరులో తెలుగు మహా సదస్సు నిర్వహణకు నడుంకట్టింది. కొన్ని న్యాయస్థానాలు తెలుగులో తీర్పులివ్వడం వంటివీ ఉభయ రాష్ట్రాల్లోని భాషాసంబంధ నిబద్ధతను చాటేవే. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగులో దస్త్రాలు, ఊరూవాడా దుకాణాలకు తెలుగు పేర్లు, ప్రజాప్రతినిధులు-అధికారులు తెలుగులోనే సంతకాలు చేయడం, తెలుగు వార్తాపత్రికల్ని ఇష్టపడి చదివేలా పిల్లల్ని ప్రోత్సహించడం- ఈ అన్నీ హామీల దశ దాటాల్సి ఉంటుంది. సమగ్ర రీతిలో తెలుగు పారిభాషిక పదకోశాల నిర్మాణం, సామాజిక-వైజ్ఞానిక అంశాలపై తెలుగులోకి విరివిగా గ్రంథాల అనువాదం, తెలుగు బోధనాభాష అయినవారికి తదుపరి చదువులు- ఉద్యోగాల్లో నిరంతర ప్రాధాన్యమివ్వడం ప్రభుత్వాల విద్యుక్త ధర్మాలు. ప్రజల వద్దకు పాలన అనేది ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో వెలువడితేనే, ప్రజలకు భాషాసంబంధ ప్రోత్సాహకాలు కొనసాగితేనే సాధ్యపడుతుంది. 'మన' అనుకునే భాషలోని స్వతంత్రత, సరళత, స్పష్టత, శ్రావ్యత ఎంత గొప్పవి! అభ్యాసం సులభసాధ్యం. సామాజిక చైతన్యం పెరుగుతుంది. సొంత భాషే మాధ్యమంగా ఉన్నప్పుడు, దాని ద్వారా ఇతర భాషలూ సులువుగానే ఒంటపడతాయి. అనువాదంలో, పోటీ పరీక్షల్లో, ఆ తరవాత ఉద్యోగాలపరంగానూ పెద్ద సమస్యలేమీ ఎదురు కావు. తెలుగులోనే పరీక్షలు రాసి, ఆ భాషలోనే ముఖాముఖిలో పాల్గొని, కేంద్రప్రభుత్వ అధికారులుగా ఎంపికైనవారు ఎంతమంది లేరు?



నేడు తెలుగు దినోత్సవం

కన్నడ భాషాబోధనను అక్కడి ప్రభుత్వం ఉన్నత పాఠశాలదాకా నిర్బంధం చేసింది. కర్ణాటకలో పనిచేసేవారికి ఆ భాష తప్పనిసరిగా తెలిసి ఉండాలని తేల్చిచెప్పింది. తమిళనాడులో భాషానురక్తి ఎంత బలంగా ఉంటుందో తెలియనిది కాదు. మాతృభాషలో చదివితేనే అక్కడ ఉద్యోగాలిస్తారు, కొనసాగనిస్తారు. భాషా పరిరక్షణలో కేరళ ప్రభుత్వమూ ముందు వరసలోనే ఉంటోంది. మలయాళ భాష, సంస్కృతిని పదిలపరచుకొనేందుకు అక్కడ ప్రత్యేకంగా ప్రాధికార సంస్థ ఏర్పాటైంది. ఒడిశా, గుజరాత్, పశ్చిమ్ బంగ, మహారాష్ట్రల్లోనూ చదువుల్లో, ఉద్యోగాల్లో అక్కడి మాతృభాషలకే పెద్దపీట వేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లోని భాషాసంబంధ రచనలు ఇతర భాషల్లోకీ వడివడిగా చేరుతున్నాయి. మన సారస్వతాన్ని విస్తృతంగా అనువదింపజేసేలా ఓ సంస్థను నెలకొల్పాలన్న భాషాప్రియుల వినతి రెండేళ్లనాడు ప్రపంచ తెలుగు రచయితల మహాసభ (విజయవాడ) నుంచి వినవచ్చింది. అది ఇప్పటికీ ఉభయ తెలుగు రాష్ట్రాల పరిశీలన దశలకే పరిమితమైంది!

మాటలకన్నా చేతలు మిన్న

విదేశాల మాటకొస్తే- చైనా, రష్యా, జపాన్, జర్మనీ వంటి వివిధ దేశాలు మాతృభాషలో బోధనకే సమధిక ప్రాధాన్యమిస్తున్నాయి. సొంత భాషపై పట్టు లోపిస్తే, ముఖ్యంగా పిల్లల్లో సరైన వ్యక్తీకరణ ఉండదు. అది వారి ఆత్మవిశ్వాసంపైన ఎంత బలమైన దెబ్బకొడుతుందో ఆ దేశాలకు బాగా తెలుసు. అందుకే అక్కడ అన్ని జాగ్రత్తలు! ఆంగ్లంలోని గ్రంథాల్ని ఇజ్రాయెల్ తన భాషలోకి కొద్దికాలంలోనే తర్జుమా చేసుకొంది. అత్యాధునిక పరిజ్ఞానానికి సంబంధించిన ఏ పదమైనా వెంటనే స్వీడన్ భాషలోకి అనువాదమవుతోంది. విద్య, ఉద్యోగ, వాణిజ్య అవసరాల కోసం అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లినవారు- అక్కడ సంఘాల ఏర్పాటుతో భాషను వెలిగిస్తున్నారు. పలు సభలు, పోటీలు, ఉత్సవాలతో పాటు తెలుగు పుస్తకాల ప్రచురణ రంగంలోనూ నిత్య నూతనోత్సాహం కనబరుస్తున్నారు. ఫ్రాన్స్, ఇంగ్లాండ్‌లోని కొన్ని విశ్వవిద్యాలయాలు తెలుగు అధ్యయన పీఠాల్ని ఏర్పాటు చేస్తున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్ సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది తెలుగు జాతీయులు అక్కడ తమ భాషలోనే మాట్లాడుకుంటున్నారు. ఇవన్నీ తెలుగు రాష్ట్రాల్లో భాషా స్ఫూర్తిని రగిలించాలి. అకాడమీలు, విశ్వవిద్యాలయాల్లోని పరిశోధన విభాగాలు, ఇతర సంస్థలు పద సంపదను పెంపొందించాలే తప్ప- కృతకమైన, సారహీనమైన భాషకు కారణం కాకూడదు. తెలుగువాటిని పలు ప్రపంచ భాషల్లోకి సమర్థంగా అనువదించే 'సాఫ్ట్‌వేర్' రూపకల్పన, 'ఆన్‌లైన్' నిఘంటువుల నిర్మాణం, నమూనా వ్యవహార కోశాల తయారీ- సంకల్పబలంతో ఆచరణకు తేవాల్సినవి అనేకం ఉన్నాయి. భాషోద్ధరణ, ఆధునికీకరణ, శిష్ట వ్యావహారికం కోసం జీవితాన్నే అంకితం చేసిన 'గిడుగు' దాదాపు శతాబ్ది కిందటే 'తెలుగు' పత్రికను విజయవంతంగా నడిపారు. ఆ కారణజన్ముడి పుట్టిన రోజును భాషాదినోత్సవంగా ఆచరిస్తున్న ఈ శుభ సందర్భంలో- మన భాషను మనం నిలబెట్టుకోవాలన్న గట్టి పట్టుదలే తెలుగును బతికిస్తుంది, జాతికి బతుకునిస్తుంది!

– శరత్

చైతన్యం

సృష్టిలో రాళ్లూరప్పల్ని వదిలేస్తే, చైతన్యానికి ప్రకృతే ప్రతీక! కాలం, దానితో పాటు పంచభూతాలు ఎప్పుడూ స్తబ్ధంగా ఉండవు. అవి నిత్య చైతన్యానికి నిదర్శనాలు. స్తంభించాయంటే, లోకమే శూన్యమవుతుంది.

గాలి వీస్తూ ప్రాణవాయువు ఇస్తుంది. నీరు ప్రవహిస్తూ దప్పిక తీరుస్తుంది. కల్మషాన్ని తొలగిస్తుంది. అగ్ని జ్వలిస్తూ సమస్త వ్యర్థాల్నీ భస్మీపటలం చేస్తుంది. ఆకాశం- సూర్యచంద్రులకు, నక్షత్రాలకు, మబ్బులకు వేదికగా నిలుస్తుంది. కాల గణనకూ ఆధారమవుతుంది. భూమి తన చుట్టూ తాను, అలాగే సూర్యుడి చుట్టూ తిరుగుతూ ప్రాణులకు కాల గమనాన్ని ఎరుకపరుస్తుంది. రుతువులకు అస్తిత్వమిస్తుంది. పక్షులు ఎగరడానికి, జంతువులు ఉరకలెత్తడానికి, కీటకాల కదలికకు, చెట్ల పరపరాగ సంపర్కానికి, జీవుల ఫలదీకరణకు, సృష్టిచక్రం నిరాఘాటంగా తిరగడానికి- అంతటికీ చైతన్యమే మూల కారణం.

కణ నిర్మితమైన మానవ శరీరం చైతన్యవంతమైంది. కోట్ల కణాల వల్ల అది ఎదుగుతుంది. జడ పదార్థంగా కనిపించే విత్తనాన్ని మట్టిలో నాటి, నీటిచుక్కలు చిలకరించగానే జీవం పోసుకుంటుంది. మొలకెత్తి మొక్కగా, చెట్టుగా మారుతుంది. మొగ్గ, పువ్వు, కాయ, పండు- ఒకదాని తరవాత మరొకటిగా దశలన్నీ మారుతుంటాయి. వాటిని క్షుణ్నంగా పరికించగలిగితే, చైతన్య స్వరూపానికి అర్థం అవగతమవుతుంది.

ఒకరోజు ఒక వ్యక్తి బుద్ధుడి వద్దకు వెళ్ళి, అనరాని మాటలన్నాడు. నిందించాడు. ఆయన శాంతంగా ఉన్నాడు. చిరునవ్వుతో విన్నాడు. తరవాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు వచ్చి, పశ్చాత్తాపంతో బుద్ధుడి పాదాలపై పడి, క్షమాపణ కోరాడు. నిన్న దూషించినందుకు మన్నించాలని అర్థించాడు. బుద్ధుడు 'ఒక వ్యక్తిని నిందించి, మరో వ్యక్తిని క్షమాపణ కోరుతున్నావు' అన్నాడు. అతడు నిర్ఘాంతపోయి, 'నిన్న వచ్చి మిమ్మల్ని నిందించాను కదా' అని గుర్తుచేశాడు. 'నిద్రపోయి లేచాను. ఇప్పుడు నేను మరో మనిషిని. నది ప్రవహిస్తూ ఉంటుంది. అయినా, నిన్న అడుగుపెట్టిన నదినీటిలో నేడు అడుగుపెట్టలేవు. జీవితమూ నది నీరు వంటిదే' అని బుద్ధుడు బదులిచ్చాడు. చైతన్య పూరితమైన ఆయన మనసుకు ప్రతి క్షణమూ కొత్తదే.



అంతర్యామి

ఈ చరాచర జగత్తు సమస్తం ఒక లీలావినోదం. ఇది విశ్వ చైతన్య ప్రదర్శన. నాట్యం నుంచి నాట్యకారుణ్ని విడదీయలేం. సృష్టిని, సృష్టికర్తను వేరు చేయలేం. ఈ సత్యమే నటరాజ స్వరూపంలో కనిపిస్తుంది. ఈ రూపంలోనే పంచభూతాలూ గోచరిస్తాయి. శివం అంటే చైతన్యం. నటరాజు ఒక చైతన్య స్వరూపం. ఆయన ఆనంద నాట్యానికి వేదిక ఈ విశ్వం!

ప్రాణులకు మెలకువ, కల, నిద్ర అనే మూడు అవస్థలు ఉంటాయి. నాలుగోది చైతన్య స్థితి. అంటే- మెలకువ, కల, నిద్ర కాని స్థితి! ఆ స్థితి ధ్యానంలోనే అనుభవానికి వస్తుంది. అదే స్థితిలో లభ్యమయ్యే క్షణకాల దర్శనమే శివ తత్వం! చేతనత్వంతో నిండిన ఆ రూపం విశ్వవ్యాప్తంగా ఉంటుంది. జీవం గల ప్రతిదానిలోనూ ఆ తత్వం నిబిడీకృతమై ఉంది. దాన్ని దర్శించి అనుభూతి చెందాలి.

బాల్యం, యౌవనం, కౌమారం, వార్ధక్యం- ఇవి మనిషి జీవితంలోని శారీరకమైన ముఖ్య దశలు. మనసు మాత్రం కాలానికి లొంగని నిత్య చైతన్య స్రవంతి. దాన్ని వయసుతో ముడిపెట్టకూడదు. 'నా దేహానికి ముసలితనం వచ్చినా, నా చైతన్యానికి ముదిమి రాలేదు' అనేవారు 'లోకమాన్య' బాలగంగాధర తిలక్.

మన ఆలోచనలే ప్రగతికి కారణాలు. ప్రతిబంధకాలూ అవే! సవ్యమైన ఆలోచనలు సత్ఫలితాలనిస్తాయి. అనవసరమైన ఆలోచనల నుంచి మనసును లక్ష్యం వైపు మళ్లించాలి. నీరు ప్రవహించకుంటే, అది కల్మష కాసారమవుతుంది. గాలి స్తంభిస్తే, ఉక్కిరిబిక్కిరవుతాం. ఒక్కోసారి అనుకోని పరిణామాలు ఎదురయ్యాయని మొత్తం ఆలోచనలన్నింటినీ వాటిపైనే కేంద్రీకృతం చేయకూడదు. ఘనీభవించిన ఆలోచనల వల్ల పురోగతి ఉండదు.

మనిషి ఎప్పటికప్పుడు ఆశావహ దృక్పథంతో సాగాలి. నవీనత్వపు ఆలోచనల ప్రవాహానికి అవరోధం కల్పించకూడదు. సాఫీగా కొనసాగనివ్వాలి. అప్పుడే, చైతన్యవంతంగా జీవించడంలోని మధురానుభూతి మానవుడి సొంతమవుతుంది!


– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ముందుకు నడిపించే వాడే నాయకుడు

- పతనం చేసే వాడు అలా కాలేడు
- గోదావరి జలాలను సోమశిలకు తీసుకెళ్తాం
- డ్రోన్ల ద్వారా భూసార పరీక్షల నిర్వహణ
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

ఈనాడు – అమరావతి

ముందుకు నడిపించేవాడే నాయకుడు తప్ప పతనం చేసేవాడు కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేరాబాబా వంటి వాళ్ళ ప్రజలను పక్కదారి పట్టించడం వల్ల నేరాలు, విధ్వంసం, అరాచకాన్ని అందరూ గర్హించి అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలను చైతన్యపరిచి, అభివృద్ధి కార్యక్రమాల వైపు మళ్లించాలని సూచించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. .మిగులు విద్యుత్ సాధించిన తరహాలోనే మిగులు జలాలు సాధించాలన్నది తన లక్ష్యమన్నారు. భవిష్యత్తులో గోదావరి జలాలను నదుల అనుసంధానం ద్వారా సోమశిలకు తీసుకెళ్తామన్నారు. గండికోట రిజర్వాయర్‌ను నింపి అక్కడి నుంచి చిత్తూరుకు సాగునీరు అందిస్తామన్నారు. "ఉపాధి హామీ పథకం అంతర్గత ఆడిట్‌ను సెప్టెంబర్ అయిదో తేదీ నాటికి పూర్తి చేయాలి. ఉపాధి పనుల్లో ఆడిటింగ్, జియో ట్యాగింగ్ కచ్చితంగా జరపాలి. 30 వేల అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు వెంటనే విద్యుత్తు కనెక్షన్లు, తాగునీటి సదుపాయం కల్పించాలి. మా గ్రామం-మా శుభ్రత కార్యక్రమాన్ని 40 గ్రామాల్లో మోడల్ ప్రాజెక్ట్ గా చేపట్టిన పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగానికి అభినందనలు. పారిశుద్ధ్యం, పచ్చదనం, సిమెంట్ రోడ్లు, నీటిభద్రత... అన్నింటిలో పశ్చిమ గోదావరి రాష్ట్రానికే ఒక నమూనా జిల్లా కావాలని" చంద్రబాబు అన్నారు. డ్రోన్ల ద్వారా భూసార పరీక్షలు నిర్వహించే సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. బిల్ అండ్ మిలిండా ఫౌండేషన్ ఆఫ్రికాలో డ్రోన్ల ద్వారా చేపట్టిన భూసార పరీక్ష సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. సెప్టెంబరు 28, 29వ తేదీల్లో బిల్ అండ్ మిలిండా ఫౌండేషన్ ప్రతినిధులు మన రాష్ట్రానికి కూడా వస్తున్నారని, వారితో తాను భేటీ అవుతానని చెప్పారు. రాష్ట్రంలో కోటి ఎకరాల్లో పంటలతోటల సాగు, బిందు సేద్యం జరగాలన్నారు.



నేనున్నాననీ.. మీకేం కాదని!

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని వివిధప్రాంతాల నుంచి వైద్యపరమైన ఇబ్బందులతో వచ్చిన వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారు. వినతులు స్వీకరించి వివిధ రూపాల్లో ఆర్థికసాయం ప్రకటించారు.

★ గుంటూరు జిల్లా నీరుకొండకు చెందిన రవికి కాలేయ మార్పిడి చికిత్స నిమిత్తం రూ.28 లక్షలు అవుతుందని కుటుంబసభ్యులు సీఎంకు విన్నవించారు. ముఖ్యమంత్రి రూ.10 లక్షలు మంజూరు చేశారు. మిగిలిన మొత్తాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఆసుపత్రి భరించేలా యాజమాన్యానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు.

★ తిరుపతి నుంచి వచ్చిన హరిణిచౌదరికి రూ.2లక్షల ఆర్థికసాయం ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెకు ఉపాధి కల్పించే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పదుడైన భర్త ఆమెను వేధించడంతో వసతిగృహంలో ఉంటోంది. అయినా తరచూ వచ్చి హింసిస్తున్నాడని తనకు రక్షణ కల్పిస్తూ.. విడాకులు ఇప్పించాలని ముఖ్యమంత్రిని ఆమె వేడుకుంది. కష్టాలు విన్న చంద్రబాబు ఆర్థిక సాయంతోపాటు ఫిర్యాదును మహిళా కమిషన్‌కు పంపించాలని, చర్యలు తీసుకోవాలని సూచించారు.

★ తల్లిదండ్రులు దూరమై నాయనమ్మ సంరక్షణలో పెరుగుతున్న విజయవాడకు చెందిన షాహీనా అనే బాలిక పరిస్థితి చూసి చలించిన చంద్రబాబు ఆమెకు రూ.2 లక్షలు మంజూరు చేశారు.

★ ఎన్టీఆర్ వైద్యసేవ, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం పొందలేని వారికి నెలకు కొంత మొత్తం చొప్పున ఆర్థికసాయం అందించాలని కడప జిల్లా రాజంపేటకు చెందిన ఎస్. వెంకటసుబ్బ నాయుడు కోరారు.

★ ఆర్థిక సమస్యలతో బాధపడుతూ జీవనం సాగిస్తున్న పేద మహిళకు రూ.50వేలు మంజూరు చేశారు.

పరిష్కార వేదిక ద్వారా వినతి.. స్పందించిన సీఎం

చక్రాల కుర్చీకే పరిమితమైన గుంటూరు జిల్లా పొత్తూరుకు చెందిన గుమ్మడి సుమన్‌కు వైద్యచికిత్స నిమిత్తం రూ.2లక్షలు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. గుమ్మడి విజయమణి, హనుమంతరావు కుమారుడైన సుమన్ చిన్నతనంలో నిద్రిస్తూ మంచం నుంచి కిందపడి గాయపడ్డాడు. అప్పట్నుంచి మానసిక ఆరోగ్యం దెబ్బతిని చక్రాల కుర్చీకే పరిమితమయ్యాడు. ప్రత్యేక చికిత్స చేయిస్తే తెలివి వస్తుందని వైద్యులు చెప్పారని తల్లిదండ్రులు 1100 పరిష్కార వేదిక ద్వారా సీఎంకు విన్నవించగా సహాయం ప్రకటించారు.

సామాజిక తనిఖీ సంచాలకుడి పదవీ కాలం ఇక మూడేళ్లు..

ఈనాడు, అమరావతి: గ్రామీణ ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) విభాగ సంచాలకుడి పదవీ కాలాన్ని మూడేళ్లకు పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక ఏడాదికే పదవీ కాలాన్ని పరిమితి చేస్తూ సోషల్ ఆడిట్ విభాగ సంచాలకుడిగా జి. శ్రీకాంత్‌ను మొదట నియమించారు. తదుపరి ఆదేశాల మేరకు ఆయన పదవీ కాలాన్ని మూడేళ్లకు పెంచారు.

నేడే 'కాకినాడ' ఎన్నిక

సర్వం సిద్ధం చేసిన అధికారులు

ఈనాడు, కాకినాడ: మరికొద్దిసేపట్లో కాకినాడ నగర పాలక సంస్థ పోలింగ్ ప్రారంభం కాబోతోంది. ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 48 డివిజన్లకు గానూ 241 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 2,29,373 ఓట్ల కోసం 196 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు సోమవారం ఎన్నికల సామాగ్రిని తరలించారు. సుమారు 3,500 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారు. 28 అత్యంత సమస్యాత్మక, 52 సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రతా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సెప్టెంబరు ఒకటో తేదీన జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ముగిసిన గ్రూపు-I ప్రధాన పరీక్షలు

ఈనాడు, అమరావతి: గ్రూపు-1 ప్రధాన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 17 నుంచి సోమవారం వరకు ఐదు పరీక్షలు జరిగాయి. విశాఖపట్టణం, కృష్ణా, చిత్తూరు, అనంతపురం జిల్లాలో ఈ పరీక్షలను నిర్వహించారు. 3900 మంది ఈ పరీక్షలు రాయాల్సి ఉండగా జనరల్ ఇంగ్లీష్‌లో 66.58%, పేపరు-1లో 64.84%, పేపరు-2 63.41, పేపరు-3 62.48, పేపరు-4 62.00, పేపరు-5 పరీక్షకు 61.82% మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యదర్శి వైవీఎస్టీ శాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

- డీఈవోల నియామకాలపై మంత్రి గంటా స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: జిల్లా విద్యాశాఖ అధికారుల(డీఈవో) నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తప్పవని మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు హెచ్చరించారు. 'ఈనాడు'లో ప్రచురితమైన 'డీఈవో పోస్టులు అమ్మకానికి' కథనంపై ఆయన స్పందించారు. రాష్ట్ర స్థాయిలో పదోన్నతుల కమిటి నిర్ణయం మేరకే అర్హులైన అధికారులకు పదోన్నతులు కల్పించి, డీఈవోలుగా నియమిస్తామన్నారు. రాష్ట్రంలో విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ నియామకాలు చేపట్టామని, ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగినా అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. డీఈవో పోస్టుల పదోన్నతుల ప్రక్రియ, నియామకాలు పారదర్శకంగా చేపడతామని తెలిపారు.

'డీఈవో పోస్టుల భర్తీపై విచారణ': డీఈవో పోస్టుల భర్తీలో అక్రమాలు జరుగుతున్నట్లు వచ్చిన వార్తలపై విచారించి, పోస్టుల భర్తీని పర్యవేక్షించేందుకు త్వరలోనే ముగ్గురు సభ్యులతో కమిటీని వేస్తామని పాఠశాల విద్యాశాఖ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలితే ఎంతటివారైనా జైలుకు పంపడం ఖాయమని హెచ్చరించారు.

వెలిగొండ ప్రాజెక్టులో రూ.28 కోట్లతో అదనపు పనులు

ఈనాడు,అమరావతి: వెలిగొండ ప్రాజెక్టులో మూడు అదనపు పనులు చేపట్టేందుకు (2016-17 ఎస్ఎస్ఆర్ ధరలతో) రూ.28.28 కోట్లతో పాలనామోదం ఇస్తూ జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నల్లమల సాగర్ రిజర్వాయర్ నుంచి హెడ్ రెగ్యులేటర్ వరకు అప్రోచ్ ఛానల్ తవ్వకం, హెడ్ రెగ్యులేటర్ నుంచి తూర్పు ప్రధాన కాలువ వరకు సొరంగం తవ్వకం పనులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులకు ఈ నిధులు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించి టెండర్లు పిలిచి పనులు అప్పగించాలని ఆదేశించారు.

జొన్న చేనుకు చిలుకపచ్చ తోరణం!



విద్యుత్ స్తంభంపై తోరణాలను తలపించేలా పెద్దసంఖ్యలో కొలువుదీరిన ఈ చిట్టిపక్షులు రామచిలుకలు. విజయవాడ శివారు తాడిగడప సమీపంలో ఓ రైతు జొన్న సాగు చేశారు. ప్రస్తుతం జొన్న చేను కంకులతో కళకళలాడుతోంది. వీటిని తినేందుకు నిత్యం గుంపులుగుంపులుగా రామచిలుకలు అక్కడికి చేరుకొని సమీపంలోని విద్యుత్ స్తంభంపై ఇలా బారులు తీరుతున్నాయి. యజమానిలేని సమయంలో ఈ చిలుకలు పెద్దసంఖ్యలో జొన్న చేనులోనికి ప్రవేశించి కడుపారా గింజలను తిని అనంతరం తుర్రుమని ఎగిరిపోతున్నాయి.

– ఈనాడు, విజయవాడ

కోడిగుడ్లు సరఫరా గుత్తేదారు దయ..!

- కొన్ని బదులకు కుళ్లిపోయిన గుడ్ల చేరవేత
- పరిమాణంలోనూ చిన్నవి అందజేస్తున్న తీరు
- వారానికి ఒకేసారి సరఫరాతో నిల్వకు ఇక్కట్లు
- క్షేత్రస్థాయిలో గాడితప్పిన పర్యవేక్షణ

ఈనాడు – అమరావతి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషకాహారం అందించాలనే సదుద్దేశంతో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా కోడిగుడ్లు ఇస్తున్నా.. వాటి సరఫరాలో మాత్రం గుత్తేదార్ల ఇష్టారాజ్యమే నడుస్తోంది. గతంలో వంట ఏజెన్సీల ద్వారా అందించే కోడిగుడ్ల సరఫరా బాధ్యతను ఇటీవల గుత్తేదార్లకు అప్పగించారు. వారు చాలాచోట్ల కుళ్లిన, తక్కువ బరువున్న కోడిగుడ్లను అందిస్తుండడంతో విద్యార్థులకు పోషక విలువలు అందటంలేదు.. గుడ్ల ధరలు పెరిగినపుడల్లా వంట ఏజెన్సీలు విద్యార్థులకు అరటిపండ్లు, చిన్నచిన్న కోడిగుడ్లు అందిస్తున్నాయనే ఫిర్యాదులతో ప్రభుత్వం గుడ్ల సరఫరాను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించింది. అయినా పరిస్థితుల్లో పెద్దగా మార్పులేదు. గతంలో వారానికి రెండు గుడ్లు ఇవ్వగా..ఆగస్టు నుంచి మూడుకు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు గుత్తేదార్లు టెండర్లు దక్కించుకున్నారు.

ఇదీ పరిస్థితి..: రాష్ట్రవ్యాప్తంగా 45,945 పాఠశాలల్లో 36.87లక్షల మంది విద్యార్థులకు కోడిగుడ్లను సరఫరా చేస్తున్నారు. గుత్తేదార్ల ద్వారా పాఠశాలల్లోని వంట ఏజెన్సీలకు కోడిగుడ్లు అందిస్తున్నందున వాటికి చెల్లించే మొత్తంలో గుడ్ల కింద కొంత కోత విధిస్తున్నారు. ఇలా ఏజెన్సీల నుంచి రికవరీ చేసిన మొత్తంతోపాటు కేంద్రం వాటాగా ఇచ్చే నిధుల్లోంచి కొంతమొత్తం కలిపి గుత్తేదార్లకు చెల్లిస్తున్నారు. వారు ఒక్కో గుడ్డు రూ.4.10చొప్పున ప్రభుత్వానికి సరఫరా చేస్తున్నారు.ఇవి బహిరంగ మార్కెట్‌కు తరలివెళ్లకుండా రంగురంగుల స్టాంపింగ్ వేస్తున్నారు.

పట్టించుకునే వారేరీ..!: పాఠశాలలకు కోడిగుడ్లు అందించే గుత్తేదారు ఒకేసారి ఎక్కువ మొత్తంలో సరఫరా చేయడం, బాగా నిల్వ ఉన్న వాటిని అందించడం వల్ల చాలాచోట్ల కుళ్లిపోయినవి వస్తున్నాయి. గుడ్లను తీరా ఉడికించేటపుడు అలాంటివి వస్తే ఆ దుర్వాసనకు బాగున్న వాటిని తినేందుకూ విద్యార్థులు ఇష్టపడడం లేదు. పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం చీరపల్లి జిల్లాపరిషత్తు పాఠశాలలో ఇటీవల కోడిగుడ్లు తిన్న 12 మంది అస్వస్థతకు గురయ్యారు.

పరిమాణం తగ్గిపోతుంది..: బయట మార్కెట్‌లో అమ్ముడుపోని చిన్న గుడ్లను పాఠశాలలకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం.. 48-52 గ్రా. బరువుండే కోడిగుడ్లను సరఫరా చేయాలి. పాఠశాలలకు ఇస్తున్నవాటిల్లో 45గ్రా. లోపే ఉంటున్నాయి.

★ విశాఖపట్నం, తూర్పుగోదావరి, చిత్తూరులాంటి జిల్లాల్లో అక్షయపాత్ర, ఇస్కాన్ సంస్థలు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తున్నాయి. ఇవి శాకాహారమే అందిస్తాయి. మధ్యాహ్న భోజనంలో ఉడికిన గుడ్లు ఇవ్వాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలిచ్చినా తామది చేయలేమని ముందే చెప్పాయి. దీంతో అయా పాఠశాలల్లో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా కోడిగుడ్లను ఉడకబెట్టించి విద్యార్థులకుఅందించాలని, ఇందుకయ్యే మొత్తాన్ని వాటికి చెల్లించాలని అధికారులు నిర్ణయించారు. ఇది ఎంత, ఎలా చెల్లించాలనే దానిపై కసరత్తు చేస్తూనే ఉన్నారు.

★ కోడిగుడ్లను సక్రమంగా నిల్వ చేయకపోతే 10-12 రోజులకు మించి ఉండవు. పాఠశాలలకు వారానికి సరిపడా గుడ్లను ఒక్కసారే ఇస్తుండడంతో వీటి నిల్వ ఇబ్బందికరంగా మారింది.

జాతీయ రహదారుల నిర్వహణకు అదనంగా రూ.105 కోట్లు

కేంద్ర ప్రభుత్వం అంగీకారం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని జాతీయ రహదారులపై గుంతల్ని సరిచేయడంతోపాటు నిర్దేశిత కాలవ్యవధిలో నిర్వహణ పనులు చేపట్టేందుకుగాను అదనంగా రూ.105 కోట్ల నిధులు కేంద్రం నుంచి రాబోతున్నాయి. కేంద్ర రహదారులు, రవాణ మంత్రిత్వ శాఖ ఈ మేరకు అంగీకారం తెలిపింది. ఆ శాఖ డైరక్టర్ జనరల్ మనోజ్ కుమార్ సోమవారం రాష్ట్రంలోని జాతీయ రహదారి ప్రాజెక్టులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి సుమిత దావ్రా మాట్లాడుతూ.. జాతీయ రహదారుల నిర్వహణకు అదనపు నిధుల అవసరాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వ ప్రతిపాదనలను వివరించారు. ఇందుకు డైరక్టర్ జనరల్ సానుకూలంగా స్పందించారు. అనంతరం విజయవాడ కనకదుర్గ పైవంతెన పనుల్లో జాప్యంపై చర్చించారు. ఈ నెలాఖరున కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ పనుల్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. రాయ్‌పూర్ - విశాఖపట్నం జాతీయ రహదారి నాలుగు వరుసల విస్తరణ, విజయనగరం బైపాస్‌కు సంబంధించిన భూసేకరణ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. విజయనగరం బైపాస్ పనులు వచ్చే నెల 15 నాటికి మొదలుపెట్టాలని మనోజ్‌కుమార్ సూచించారు.

ఆరుగురు పురపాలక కమిషనర్లకు పదోన్నతి

ఈనాడు, అమరావతి: ఆరుగురు పురపాలక కమిషనర్‌లకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో అత్యధికులకు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ప్రాంతాల్లోనే కొనసాగే అవకాశం కల్పించారు. స్పెషల్ గ్రేడ్ కమిషనర్లుగా పదోన్నతులు పొందిన వారిలో ఎన్.శివాజీ (జీవీఎంసీ జోనల్ కమిషనర్), డి.చంద్రశేఖర్ (విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్), సీహెచ్‌వీఎస్ బాపిరాజు (అమలాపురం మున్సిపల్ కమిషనర్), పి.గోపీనాథ్ (పురపాలక మంత్రి ఓఎస్‌డీ), పి.విశ్వనాథ్ (హిందూపురం మున్సిపల్ కమిషనర్) ఉన్నారు. పదోన్నతి పొందిన మరో అధికారి సి.ఓబులేసును పురపాలక మంత్రి పేషీలో నియమించారు. మరో ఏడుగురి కమిషనర్‌లపై వివిధ అభియోగాల కారణంగా పదోన్నతులు నిలిపివేశారు.

జీవనదులను పరిరక్షించుకుందాం



దేశంలోని జీవనదుల పరిరక్షణ కోసం 'ర్యాలీ ఫర్ రివర్స్' కార్యక్రమానికి ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్ సెప్టెంబరు 3వ తేదీన శ్రీకారం చుట్టనున్నారు. 16 రాష్ట్రాల మీదుగా దాదాపు నెలపాటు కొనసాగే ఈ యాత్రపై అవగాహనకు సంబంధించి.. సోమవారం తమిళనాడు కోవైలోని ఆశ్రమంలోని ఆదియోగి విగ్రహం వద్ద జగ్గీ వాసుదేవ్ శిష్యులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, కోయంబత్తూరు

ఆదాయ పన్ను లక్ష్యం రూ.21,704 కోట్లు

తెలుగు రాష్ట్రాల ప్రధాన సీసీఐటీ ఎస్‌పీ చౌదరి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ టీడీఎస్ విభాగానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.21,704 కోట్లు ఆదాయ పన్ను లక్ష్యంగా నిర్ణయించారని తెలుగు రాష్ట్రాల ప్రధాన చీఫ్ ఐటీ కమిషనర్ ఎస్‌పీచౌదరి తెలిపారు. సోమవారమిక్కడ ఘజియాబాద్ టీడీఎస్ అధికారులు, సీఏలతో సమావేశమయ్యారు. పన్ను చెల్లింపుదారులు, ఐటీశాఖ మధ్య బంధానికి సీఏలు కీలకమన్నారు. నిర్ణీత గడువులోగా ప్రతి త్రైమాసికానికి రిటర్నులు దాఖలు చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో గత ఏడాది వసూలైన పన్ను మొత్తంలో 45శాతం అంటే రూ.18,007 కోట్లు ఆదాయపన్ను రూపంలో ఖజానాకు జమ చేసినట్లు వివరించారు.

లైట్ మెట్రో డీపీఆర్ కోసం ఆసక్తి వ్యక్తీకరణ నోటీసు

- దరఖాస్తుకు నెల గడువు
- నాలుగు నెలల్లో డీపీఆర్

ఈనాడు, అమరావతి: విజయవాడ నగరానికి తేలిక పాటి మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు అమరావతి మెట్రో రైలు కార్పొరేషన్ (ఏఎంఆర్‌సీ) ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు (ఈఓఐ) ఆహ్వానించింది. విజయవాడ ఎంఆర్‌టీఎస్ (మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్)కు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక, ఇతర సాంకేతిక సేవలు అందించేందుకు ఆసక్తి ఉన్న అంతర్జాతీయ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని నోటీసు జారీ చేస్తూ ఏఎంఆర్‌సీ సోమవారం అధికారిక వెబ్‌సైట్‌లో నోటీసును పెట్టింది. నెల రోజులు గడువు ఇచ్చింది. సెప్టెంబరు 28 ఆఖరి తేదీగా పేర్కొంది. విజయవాడ మెట్రో ప్రాజెక్టు నిర్మాణం పలు మలుపులు తిరుగుతున్న విషయం తెలిసిందే. మొదట నిర్మాణం చేయతలపెట్టిన మీడియం మెట్రో ప్రాజెక్టు సాధ్యం కాదని తేల్చి తేలికపాటి మెట్రో ప్రాజెక్టుకు ప్రభుత్వం మొగ్గుచూపింది. దీనిపై జర్మనీ దేశానికి చెందిన నిపుణులు డాట్సన్ 15రోజుల పాటు అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. దీంతో లైట్ మెట్రోపై డీపీఆర్ తయారు చేయించాలని సీఎం ఆదేశించారు. లైట్ మెట్రోకు జర్మనీ దేశానికి చెందిన ఆర్థిక సంస్థ కెఎఫ్‌డబ్ల్యూ (జర్మన్ డెవలప్‌మెంట్ బ్యాంకు) ఆర్థిక సాయం చేసేందుకుముందుకు వచ్చింది. ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను కెఎఫ్‌డబ్ల్యూ సంస్థ కూడా తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఏఎంఆర్‌సీ ఎండీ రామకృష్ణారెడ్డి 'ఈనాడు'తో చెప్పారు. ఇండో-జర్మనీ దేశాల ఆర్థిక సహకార కార్యక్రమం కింద పర్యావరణహిత మెట్రో ప్రాజెక్టు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రెండు కారిడార్లు 26 కిలోమీటర్లతో పాటు మరో అయిదు కిలోమీటర్లు పొడిగించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని వివరించారు. అందులో భాగంగానే మరో కారిడార్ జక్కంపూడి ఆర్థిక నగరం వరకు, మరో కారిడార్ కృష్ణాకెనాల్ జంక్షన్ వరకు పొడించే ప్రతిపాదనలు రూపొందించాలని పేర్కొన్నారు. తేలిక పాటి మెట్రో రైలుకు పూర్తి స్థాయి ప్రతిపాదనలు, ప్రస్తుతం రూపొందించిన ముందస్తు ఫీజిబిలిటీ నివేదికకు ప్రత్యామ్నాయ మార్గాలు, రూట్ ఎలైన్‌మెంట్, స్టేషన్‌లు, ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్‌లు సిగ్నల్ వ్యవస్థ, ఇతర సాంకేతిక పరిజ్ఞానం, అవసరమైన భూసేకరణ, వ్యయం అంచనా, పర్యావరణ, సామాజిక ప్రభావం, ఆర్థిక సాధ్యాసాధ్యాలు, రెవెన్యూ అంచనా తదితర అన్ని అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు సమగ్ర నివేదికను నాలుగు నెలల్లో పూర్తి చేసి అందించాలని షరతు విధించింది. వచ్చే నెల 28లోగా దరఖాస్తు చేయాలని, వాటిలో అర్హతలు ఉన్న సంస్థలకు అప్పగిస్తామని మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డి వెల్లడించారు.

బాబాలు.. శిక్షలు...

ఈ పుణ్యభూమిలో బస్తీకో బాబా.. ఊరికో స్వామి! కాషాయం కడితే చాలు.. కాళ్లు మొక్కేవాళ్లు ఎందరో! ఇదే బలహీనతను ఆసరా చేసుకుని స్వార్థపరులెందరో ఈ అవతారం ఎత్తుతున్నారు.. జనాన్ని నమ్మించి వంచిస్తున్నారు.. చివరకు పాపం పండినప్పుడు కటకటాల పాలవుతున్నారు. ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన కేసులో తాజాగా హరియాణాకు చెందిన డేరా బాబాకు 20 ఏళ్ల జైలు శిక్ష ఖరారైంది. ఒక బాబా ఇలా జైలు శిక్షను ఎదుర్కొనాల్సిన పరిస్థితిని రావటం ఇదేం మొదటిసారి కాదు. గతంలోనూ ఇలా ఎంతోమంది బాబాలు దారితప్పి.. పోలీసు కేసులను ఎదుర్కొని జైలుపాలైనవారు ఉన్నారు. అపరిమితమైన సంపద, అనుచరగణం, ఏది చేసినా చెల్లుతుందనే అతి విశ్వాసం ఫలితంగా కొందరు బాబాలు దారి తప్పుతున్నారు. భక్తులను మోసం చేయటం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడటం, భూములను ఆక్రమించటం, తమ దారికి అడ్డొచ్చేవారిని అడ్డుతొలగించుకోవటం.. తదితర నేరాల్లో భాగస్వాములు అవుతున్నారు.

స్వామి అమృత చైతన్య

స్వామి అమృత చైతన్య పేరుతో ప్రజాదరణ పొందిన స్వామి సంతోష్ మాధవన్. కేరళకు చెందిన ఈ మతబోధకుడు పలు రకాలైన మోసాలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఒక ఎన్నారై మహిళను మోసం చేసి రూ. 45 లక్షలు వసూలు చేసినట్లు అభియోగాన్ని ఎదుర్కొన్నారు. ఇది కాక ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. మహిళలతో బలవంతంగా నీలిచిత్రాలు తీయించారనే పెద్ద వివాదం సైతం చుట్టుముట్టింది. నేరం రుజువు కావటంతో 2009లో కేరళ రాష్ట్రంలోని న్యాయస్థానం ఆయనకు 16 ఏళ్ల జైలు శిక్ష, రూ. 2.10 లక్షల జరిమానా విధించింది.

సంత్ రాంపాల్

హరియాణాలోని హిస్సార్‌లో సంత్ రాంపాల్‌కు చెందిన సంత్‌లోక్ ఆశ్రమంలో అయిదుగురు మహిళల శవాలను పోలీసులు గుర్తించారు. ఒక మైనర్ బాలిక శవం కూడా లభ్యమైంది. ఆశ్రమంలోకి పోలీసులను రానివ్వకుండా తన శిష్యులతో మానవ కవచాన్ని నిర్మించి పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జరిగిన గొడవల్లో ఆరుగురు చనిపోయారు. ఈ కేసులను విచారించిన న్యాయస్థానం సంత్ రాంపాల్‌కు 22 నెలల జైలు శిక్ష విధించింది.

మెహిందీ ఖాసీం

ఓ ఊళ్లో నలుగురు అక్కాచెల్లెళ్లు. వారికి మగపిల్లలు మందబుద్ధులుగా, ఆడపిల్లలు అందగత్తెలుగా జన్మించారు. వంశోద్ధారకులు ఇలా అయోమయంగా ఉండటం వారిని కలచివేసింది. ఎవరో చెప్పారు మెహిందీ ఖాసీం బాబాను ఆశ్రయిస్తే ఫలితం ఉంటుందని. దీంతో పిల్లలందరినీ వెంట పెట్టుకొని బాబా దర్శనం చేసుకున్నారు. మగపిల్లలు సంగతేమో కానీ బాబా దృష్టి ఆడపిల్లల మీద పడింది. మందబుద్ధులు మంచివారు కావటానికి, ఆడపిల్లలకు భవిష్యత్తులో పెళ్లిళ్లు అయ్యాక వారికి మందబుద్ధులు పుట్టకుండా ఉండటానికి తనవద్ద పరిష్కారం ఉందని నమ్మబలికాడు. ఒక మంచిరోజు చూసి ఆడపిల్లలను తన వద్దకు పంపించాలని ఆదేశించాడు. బాబా ఎత్తుగడను అర్థం చేసుకోలేక వారు ఆ ఆదేశాన్ని పాటించారు. దుర్మార్గమైన ఆలోచనతో ఉన్న బాబా ఇదే అవకాశంగా వారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఆయనకు జీవితకాలం పాటు జైలు శిక్ష విధించింది.

స్వామి ప్రేమానంద

తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఆశ్రమాన్ని స్థాపించి మతబోధనల పేరుతో శిష్యగణాన్ని తయారు చేసుకున్న స్వామి ప్రేమానంద ఒక మహిళపై అత్యాచారాన్ని పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. 1994లో ఒక మహిళ స్వామీజీ తనపై అత్యాచారం చేసినట్లు, ఫలితంగా తాను గర్భవతిని అయినట్లు ఆరోపణ చేశారు. పలువురు మైనర్ బాలికలపై స్వామీజీ, ఆయన అనుచరులు అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ నేరాలపై తమిళనాడులోని పుదుక్కొట్టాయ్ న్యాయస్థానంలో విచారణ జరిగింది.



ఆరోపణలు రుజువు కావటంతో స్వామి ప్రేమానందకు కోర్టు జీవితఖైదు, రూ. 67లక్షల జరిమానా విధించింది.

జ్ఞాన చైతన్య

మూడు హత్యా నేరాలపై స్వామి జ్ఞాన చైతన్య 14 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా తన నేర ప్రవృత్తిని విడనాడలేదు. ఒక బ్రిటిష మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు.


చంద్రస్వామి

ఆర్థిక నేరాలకు పాల్పడటం, మోసగించటం చంద్రస్వామిపై వచ్చిన అభియోగాలు. రాజకీయ నాయకులకు అతి సన్నిహితంగా మెలిగిన చంద్రస్వామి పలు వ్యవహారాల్లో మధ్యవర్తిగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విదేశీ మారక ద్రవ్య నిబంధనలను ఉల్లంఘించిన కారణంగా ఆయనకు న్యాయస్థానం రూ. 9 కోట్ల పెనాల్టీ విధించింది. లండన్ వ్యాపారిని మోసం చేసిన కేసులో జైలు పాలయ్యారు.

– ఈనాడు ప్రత్యేకవిభాగం

డేరాను కూల్చిన అజ్ఞాత సాధ్వి లేఖ..

- **నాటి ప్రధాని వాజపేయీ దృష్టికి గుర్మీత్ అకృత్యాలు**



అజ్ఞాత సాధ్వి రాసిన లేఖ ఇదే..

దిల్లీ: డేరా సచ్చా సౌధాలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నట్టు 15 ఏళ్ల క్రితం ఓ గుర్తు తెలియని సాధ్వి నాటి ప్రధాని వాజపేయీకి హిందీలో రాసిన లేఖే గుర్మీత్ సింగ్‌కు శిక్ష పడడంలో ప్రధాన పాత్ర పోషించింది. అతని సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కబళించింది.

"నేను పంజాబ్‌కు చెందిన బాలికను. గత అయిదేళ్లుగా సిర్సాలోని డేరా సచ్ఛా సౌదాలో సాధ్విగా పనిచేస్తున్నాను. నాలాంటివారు వందలాది మంది ఉన్నారు. రోజుకు 16-18 గంటల పాటు పనిచేస్తున్నారు. మమ్మల్ని శారీరకంగా దోపిడీ చేస్తున్నారు. డేరా మహరాజ్ గుర్మీత్‌సింగ్ బాలికలపై అత్యాచారం చేస్తున్నారు. నేను డిగ్రీ చదివాను. నా తల్లిదండ్రుల కోరిక మేరకే సాధ్విగా మారాను.

సాధ్విగా మారిన రెండేళ్ల తరువాత ఒక రోజు రాత్రి మహరాజ్‌కు సన్నిహితురాలైన ఓ మహిళా భక్తురాలు నా దగ్గరకు వచ్చింది. గుర్మీత్ నివాసమైన 'గుఫా'కు వెళ్లాలని చెప్పింది. నేను తొలిసారిగా వెళ్లనుండడంతో దేవుడే పిలిచాడన్న సంతోషంతో పొంగిపోయాను. నేను మేడ మీదికి వెళ్లగానే మంచంపై కూర్చొన్న మహరాజ్ చేతిలో టీవీ రిమోట్ పట్టుకొని నీలిచిత్రం చూస్తున్న దృశ్యాన్ని గమనించాను. పరుపుపై ఉన్న తలగడ పక్కన రివాల్వర్ కూడా ఉంది. ఇది చూసి నిర్ఘాంతపోయాను. మహరాజ్ అలాంటివారని నేను అనుకోలేదు. మహరాజ్ టీవీని కట్టేసి నన్ను ఆయన పక్కన కూర్చోబెట్టుకున్నారు. తాగడానికి నీళ్లిచ్చారు. చాలా ఇష్టమైనదానివైనందునే పిలిపించానని చెప్పారు. అది నా మొదటి అనుభవం. హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నట్టు తెలిపారు. నన్ను కూడా ప్రేమించమని అడిగారు. ఇందుకు నేను అభ్యంతరం చెప్పినప్పుడు 'సందేహం లేదు, నేను దేవుణ్ణే' అని అన్నారు. దేవుడు ఇలాంటి పనులు చేస్తారా అని అడిగినప్పుడు ఆయన ఏమి చెప్పారంటే..

1. శ్రీకృష్ణుడూ దేవుడే. ఆయన 360 మంది గోపికలతో ప్రేమ లీల జరిపారు. అయినప్పటికీ ప్రజలు ఆయనను దేవునిగానే చూశారు. ఇదేమీ కొత్త విషయం కాదు.
2. ఈ రివాల్వర్‌తో కాల్చి చంపి ఇక్కడే అంత్యక్రియలు చేస్తాను. నీ కుటుంబ సభ్యులు నా పట్ల అమిత భక్తి ఉన్న అనుచరులు. వారు నాకు వ్యతిరేకంగా ఏమీ చేయరు.
3. ప్రభుత్వాల్లో నాకు మంచి పలుకుబడి ఉంది. పంజాబ్, హరియాణ ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు నా పాదాలకు నమస్కరిస్తారు. రాజకీయ నాయకులు నా మద్దతు కోసం వస్తారు. నా దగ్గర సొమ్ము తీసుకుంటారు. నాకు వ్యతిరేకంగా వారు ఎటువంటి చర్యా తీసుకోలేరు. నీ కుటుంబ సభ్యులను ప్రభుత్వ ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేయించగలను. వారిని చంపించి ఆధారాలు లేకుండా చేయగలను. గతంలో డేరా మేనేజర్ ఫకీర్ చంద్‌ను చంపించిన విషయం నీకు తెలిసే ఉంటుంది. డబ్బుతో రాజకీయనాయకులు, పోలీసులు, న్యాయాన్ని కొనేస్తాను.

అలా చెప్పి నాపై అత్యాచారం చేశాడు. గత మూడు నెలలుగా ఇలా చేస్తూనే ఉన్నాడు. ప్రతి 25-30 రోజులకు నా వంతు వస్తోంది. ఇక్కడ ఉన్న ఇతర బాలికలను కూడా ఇలాగే చేస్తున్నాడని నమ్ముతున్నాను. 35-40 ఏళ్ల వయసు ఉన్న మహిళలు డేరాలో 35-40 మంది వరకు ఉన్నారు. జీవితాలతో రాజీ పడిపోయి వారిక్కడ జీవిస్తున్నారు. చాలా మంది చదువుకున్నవారే. బి.ఎ, ఎం.ఎ, బీఈడీ డిగ్రీలు ఉన్నవారే. వారి కుటుంబ సభ్యులు పిచ్చి అనుచరులు కావడంతో డేరాలో నరకం అనుభవిస్తున్నారు. మహరాజ్ ఆదేశాల మేరకు మేం తెల్ల దుస్తులు ధరిస్తాం. మేం మగవారిని చూడడం నిషేధం. ఒక బాలిక మరో బాలికతో మాట్లాడానికి అనుమతి లేదు. కుంటుంబాలతో ఫోనులో కూడా మాట్లాడడానికి అవకాశం లేదు. డేరాలోని వాస్తవాలు గురించి ఎవరైనా మాట్లాడితే మహారాజ్ ఆదేశాల మేరకు వారిని శిక్షిస్తారు. కొద్ది రోజుల క్రితం భటిండాకు చెందిన ఓ బాలిక మహారాజ్ చేస్తున్న తప్పుల గురించి మాట్లాడితే మహిళా భక్తులు వచ్చి ఆమెను లాగిపారేశారు. గాయాలపాలైన ఆమె మంచం పట్టింది. ఇంటికి వెళ్లిపోయింది. కురుక్షేత్రకు చెందిన ఓ బాలిక కూడా ఇంటికి వెళ్లిపోయింది. డేరాలో తాను పడిన కష్టాలను కుటుంబ సభ్యులకు వివరించింది. దాంతో ఆయన తమ్ముడు డేరాలో సేవాదార్‌గా పని మానేశాడు. సంగ్రూర్‌కు చెందిన ఓ బాలిక ఇంటికి వెళ్లిపోయి ఇక్కడి అకృత్యాలను ప్రజలకు వివరించింది. ఇది తెలిసి డేరాకు చెందిన సేవాదార్లు ఆయుధాలు పట్టుకొని ఆమె ఇంటికి వెళ్లి చంపేస్తామని బెదిరించారు. ఇదే విధంగా పంజాబ్‌లోని మన్సా, ఫిరోజ్‌పూర్, పాటియాల, లుధియానా జిల్లాలకు చెందిన బాలికలు ఇళ్లకు వెళ్లిపోయి మౌనంగా ఉంటున్నారు. సిర్సా, హిస్సార్, ఫతేబాద్, హనుమాన్‌గఢ్, మేరఠ్ ప్రాంతాల బాలికలదీ ఇదే పరిస్థితి. డేరా గూండాల కండ బలానికి భయపడి ఒక్క మాటా మాట్లాడడం లేదు. నేను కూడా నా పేరు, చిరునామా, నా కుటుంబం పేరు వెల్లడించినా నన్నూ చంపేస్తారు. డేరాలో జరుగుతున్న అకృత్యాలను బహిర్గత పరచాలని అనుకుంటున్నాను. పత్రికలో, ప్రభుత్వ సంస్థలో దర్యాప్తు చేస్తే... డేరాలో భయంగా జీవిస్తున్న 40-45 మంది మహిళలను ఒప్పించగలిగితే..వారు నిజాలు చెప్పే అవకాశం ఉంది.

మాకు వైద్య పరీక్షలు కూడా జరిపించాల్సి ఉంది. మేము బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్న అనుచరులమో కామో మా వారికి తెలుస్తుంది. మేము కన్యలం కామంటే మా పవిత్రతను హరించిన వారెవరో దర్యాప్తు జరిపించాలి. గుర్మీత్ సింగ్ మా జీవితాలను నాశనం చేశాడన్న నిజం బయటపడుతుంది."

మగవారిని నపుంసకులను చేసేవాడు

- **ఆడవారిపై అత్యాచారాలు నిత్యకృత్యం**
- **డేరా బాబా మాజీ అంగరక్షకుడి వెల్లడి**
- **వెలుగుచూసిన ఒళ్లు గగుర్పొడిచే నిజాల టేపులు**

దిల్లీ: "జైలు శిక్ష పడిన డేరా బాబా రాంరహీం సింగ్ చేసిన అకృత్యాలు అన్నీఇన్నీ కావు. ఆశ్రమంలో ఉన్న తన పురుష అనుచరులందరినీ డేరా బాబా నపుంసకులను చేసేశాడు. బలవంతంగా వారి వృషణాలను తొలగింపచేసి... ఎందుకు పనికిరాని వారిగా తయారు చేశాడు. మరోవైపు తాను(డేరాబాబా) మాత్రం ఆశ్రమంలోని సాధ్విలందరిపైనా వంతుల వారీగా అత్యాచారానికి పాల్పడేవాడు. వారి ఆక్రందనలు, ఆక్రోశాలేవీ అతడిని కదిలించలేకపోయేవి. అత్యంత దారుణంగా మానభంగాలు చేసి వారందరినీ ఆశ్రమంలోనే బందీలుగా ఉంచేవాడు" ఒకప్పుడు సిర్సాలో డేరాబాబా అంగరక్షకుడిగా పనిచేసిన బియాంత్ సింగ్ ఒళ్లు జలదరింపచేసే ఈ వివరాలన్నిటినీ వెల్లడించాడు. అందుకు సంబంధించిన టేపులు ఇప్పుడు వెలుగుచూశాయి. 18న నిముషాల ఆ వీడియో టేపు చూసిన వారికెవరికైనా డేరా బాబా అకృత్యాలు తెలిసి వెన్నులో చలి పుట్టుకొస్తుంది. సాధ్విలంతా కూడా అదేదో దైనందిన క్రతువులాగా బాబా గదిలోకి వెళ్లేవారు. అక్కడ అతడు ఆదేశించిన అభ్యంతరకరమైన పనులన్నిటినీ చేసేవారు. 1995లో మౌంట్ అబూ వెళ్లినపుడు ముక్కుపచ్చలారని ఓ పదహారేళ్ల అమ్మాయిని బాబా గదికి తీసుకు వచ్చారు. ఆమెను గదిలో బందీగా పట్టుకున్న బాబా కొన్ని గంటలపాటు... అసహాయురాలైన ఆ అమ్మాయిపై అత్యాచార అకృత్యాన్ని కొనసాగించాడనీ...అందుకు తానే సాక్ష్యమనీ బియాంత్ సింగ్ చెప్పాడు. కేకలు పెడుతూ... ఏడుస్తూ...ప్రాధేయపడుతున్న ఆ పదహారేళ్ల పసిదానికి జరిగిన అన్యాయానికి అక్కడున్న సెక్యూరిటీ గార్డులందరూ కూడా ప్రత్యక్ష సాక్షులేనని బియాంత్ సింగ్ చెప్పారు. ఒక్కరం కూడా ఆరోజు ఆ అన్యాయాన్ని అడ్డుకునే సాహసం చేయలేకపోయామన్నారు. ఇప్పటికీ ఆమె డేరాలో బందీగా ఉందన్నారు.

'ఆరోజు పారిపోయాను'

చివరకు తనను కూడా సంసారానికి పనికిరాని పురుషుడిగా... నపుంసకుడిగా తయారుచేసేందుకు రంగం సిద్ధమవడం చూసి భయంతో పారిపోయినట్లు బియాంత్ చెప్పాడు. ప్రాణభయంతో చివరకు విదేశాలకు వెళ్లిపోయానన్నాడు.

చంపేసి... ఆశ్రమంలోనే పూడ్చిపెట్టేవారు

హత్యలు డేరా ఆశ్రమంలో ఒకరకంగా నిత్యకృత్యమేనని చెప్పాడు. తొలిసారిగా ఫకీర్‌చంద్ అనే వ్యక్తిని అత్యంత కిరాతకంగా చంపేసి ఆశ్రమంలోనే పూడ్చేశారన్నారు. ఆ తర్వాత చంపిన వారందరినీ పక్కనే ఉన్న పఖ్రా నదిలో పడేసేవారని చెప్పారు. ఆ తర్వాత ఆశ్రమ ప్రాంగణంలో పూడ్చిపెట్టడాలు జరిగేవని చెప్పారు. ఒక్కమాటలో చెప్పాలంటే బాబా 'ఓ సైతాను' అని బియాంత్ పేర్కొన్నాడు.

డేరాలో భారీ ఎత్తున నల్లధనం నిల్వలున్నట్లు చెప్పారు. నిరుపేదల భూములను కబ్జాచేసి భారీ ఆశ్రమాన్ని నిర్మించారన్నారు. భూమి సొంతదారులకు ఏదో కాస్త ముట్టజెప్పారని కూడా బియాంత్ సింగ్ వెల్లడించారు.

హనీప్రీత్ ఇన్సాన్... బాబా పెంపుడు కుమార్తె కాదు

డేరా బాబా ఆశ్రమంలో ఎక్కడికైనా... ఎప్పుడైనా సంచరించగలిగే మహిళ హనీప్రీత్. ఆమెను బాబా తన పెంపుడు కుమార్తెగా చెప్పుకొంటారనీ...అది పచ్చి అబద్ధమనీ బియాంత్ వెల్లడించారు. హనీప్రీత్ అతడికి ఎంతో ఇష్టమైన సహచరురాలని చెప్పారు. హనీ అసలు భర్త బిశ్వాస్ గుప్తా అత్యంత సంపన్నుడనీ...ఆయన డేరా బాబా భక్తుడనీ తెలిపారు. హనీని చేరదీసిన బాబా ఆమెతో కలిసి బిశ్వాస్‌ను నానా హింసలకూ గురిచేశారన్నారు.

క్యాన్సర్, గుండెపోటు ముప్పును తగ్గించే ఔషధం




బోస్టన్: శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించేందుకు ఉపయోగించే ఒక శ్రేణికి చెందిన ఔషధాలకు తరచూ వచ్చే గుండెపోట్లు, పక్షవాతం, ఊపిరితిత్తుల క్యాన్సర్లను తగ్గించే గుణమున్నట్లు తాజా అధ్యయనంలో గుర్తించారు. 'కనకినుమాబ్'గా వ్యవహరించే ఔషధం బైపాస్ శస్త్రచికిత్సల్ని 30 శాతానికిపైగా తగ్గిస్తుందని పరిశోధకులు వెల్లడించారు. అమెరికాలోని బ్రిగామ్, మహిళల ఆస్పత్రిల్లో 25 ఏళ్లపాటు నిర్వహించిన పరీక్షల ద్వారా ఈ అంశాన్ని తేల్చారు. పరీక్షల్లో భాగంగా ఈ ఇంజక్షన్ ద్వారా ఈ ఔషధాన్ని తీసుకున్నవారిలో గుండెజబ్బు ముప్పు 15 శాతంమేర తగ్గినట్లు గుర్తించారు. అత్యవసరం గుండె చికిత్సల ముప్పు 17 శాతందాకా తగ్గినట్లు వెల్లడైంది. వ్యయంతో కూడిన బైపాస్, యాంజియోప్లాస్టీ వంటి చికిత్సల అవసరం 30 శాతందాకా తగ్గినట్లు గుర్తించారు. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే ఔషధం గుండెముప్పును కూడా తగ్గిస్తున్నట్లు గుర్తించడం తొలిసారి అని పరిశోధకులు పాల్ రిడ్కర్ పేర్కొన్నారు.

కాఫీ మీ జీవితాన్ని పెంచుతుంది..

లండన్: కొంత మందికి కాఫీ తాగితే కానీ ఆరోజు గడిచినట్లు ఉండదు. కాఫీ తాగిన తర్వాత హుషారు ఉరకలెత్తుతుంది. అందుకే ప్రపంచంలో ఎక్కువమంది తాగే పానీయాల్లో కాఫీ ఒకటి. ఈ అలవాటే అకాల మరణాన్ని దూరం చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రోజుకు నాలుగు కప్పుల కాఫీ తాగితే ఎక్కువ కాలం జీవించవచ్చని, అకాల మరణం దరిచేదని స్పెయిన్‌లోని హాస్పిటల్ డె నవర్ర పరిశోధకులు పేర్కొన్నారు. ఎప్పుడూ కాఫీ తాగని వారికంటే రోజుకు నాలుగు కప్పులు తాగేవారిలో అన్నిరకాల మరణాలు సంభవించే ప్రమాదం 64 శాతం తగ్గిందని వెల్లడించారు. రోజూ ప్రతి రెండు అదనపు కప్పులకు 22 శాతం మరణ ప్రమాదం తగ్గుతుందన్నారు.

చలికాలంలో గుండె "పోటు"!



లండన్: చలికాలంలో గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువని తాజా అధ్యయనంలో తేలింది. స్వీడన్‌లోని లుండ్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. మైనస్ ఉష్ణోగ్రతలు... శరీరంపై బయట నుంచి విపరీత ప్రభావాన్ని చూపిస్తున్నట్లు వారు గుర్తించారు. భిన్న వాతావరణ కేంద్రాల్లో ఉష్ణోగ్రతలు, వాటి పరిధుల్లో నమోదవుతున్న గుండె పోట్లను వారు పరిశీలించారు. దీంతో రోజువారి సగటు ఉష్ణోగ్రతలు 0 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉన్నప్పుడు... . గుండెపోటు కేసులు నాలుగు రెట్లు ఎక్కువగా (10 డిగ్రీల ఉష్ణోగ్రతలతో పోల్చినప్పుడు) నమోదైనట్లు వెలుగులోకి వచ్చింది. మైనస్ ఉష్ణోగ్రతలతోపాటు గాలి వేగం, ఎండ తక్కువసేపు ఉండటం, గాలిలో తేమ శాతం ఎక్కువ కావడం లాంటి అంశాలూ గుండె పోటును ప్రభావితం చేస్తున్నట్లు వారు వివరించారు. బృహద్ధమనులు కుంచించుకుపోవడంతో రక్త ప్రసరణపై ఒత్తిడి పెరగడం, వణుకు, గుండె కొట్టుకునే వేగం, జీవక్రియా రేటు పెరగడం లాంటి అంశాలే దీనికి కారణమని వారు తెలిపారు.

ఉప్పు ఎక్కువైతే గుండెకు ప్రమాదం

లండన్: ఆహారంలో ఉప్పు అధికంగా ఉంటే గుండె వైఫల్యం చెందే ప్రమాదం రెండింతలు ఎక్కువట. 12 ఏళ్ల పాటు పరిశోధించిన ఫిన్లాండ్ జాతీయ ఆరోగ్య సంక్షేమ సంస్థ శాస్త్రవేత్తలు ఈ వివరాలు వెల్లడించారు. రోజుకి 6.8గ్రాముల కంటే తక్కువగా ఉప్పు తీసుకునేవారితో పోలిస్తే, 13.7గ్రాముల కన్నా ఎక్కువగా ఉప్పు తినేవారికి ఈ ప్రమాదం రెండు రెట్లు అధికంగా ఉన్నట్లు వారు తెలిపారు. అధిక రక్తపోటుకు ప్రధాన కారణం తినే ఆహారంలో ఉప్పు పరిమాణం ఎక్కువగా ఉండటమేనన్నారు. ఇది గుండెపోటుకు, గుండె జబ్బు(కరోనరి వ్యాధి)కి దారితీస్తుందని జాతీయ ఆరోగ్య, సంక్షేమ సంస్థ ఆచార్యులు పెక్కా జౌసిల్హతి పేర్కొన్నారు. దీనికోసం వీరు 25 నుంచి 64 ఏళ్ల వయస్సున్న 4,630మంది స్త్రీ, పురుషులను అధ్యయనం చేశారు.

కూచిపూడి భంగిమ ఆకృతిలో జంట ఆకాశహర్మ్యాలు

- **ఆకృతులు రూపొందించిన షాపూర్జీ పల్లోంజీ సంస్థ**
- **మూడు వారాల్లో సమగ్ర డిజైన్లతో రావాలని సీఎం సూచన**

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని 900 ఎకరాల పరిపాలనా నగరంలో... దక్షిణ దిశలో కృష్ణా నదికి పక్కనే జంట ఆకాశహర్మ్యాలు (ట్విన్ టవర్స్) నిర్మించనున్నారు. వీటిని నగరం మొత్తాన్ని తిలకించేందుకు వీలుగా 'వ్యూయింగ్ టవర్స్'గా నిర్మించడంతో పాటు, బహుళ ప్రయోజనకర భవనాలుగా తీర్చిదిద్దనున్నారు. వీటి ఆకృతులను ప్రముఖ నిర్మాణ సంస్థ షాపూర్‌జీ పల్లోంజీ రూపొందిస్తోంది. ఆంధ్రుల సంప్రదాయ కూచిపూడి నృత్యంలోని ఒక భంగిమను స్ఫూర్తిగా తీసుకుని... ఆ సంస్థ ఒక ఆకృతిని రూపొందించింది. ఈ ఆకృతుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పరిశీలించారు.

ముఖ్యాంశాలు ఇవీ..!

- ఆధునికత, సంప్రదాయ శైలి ఉట్టిపడేలా ఆకృతి సిద్ధం చేశారు.
- రెండూ ఒకే ఎత్తులో ఉండవు. గాలి గమనాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ డిజైన్ సిద్ధం చేశారు.
- మొదటి దాని పొడవు 324 మీటర్లు ఉంటుంది. మొత్తం 72 అంతస్తులుంటాయి.
- రెండో దాని పొడవు 189 మీటర్లు ఉంటుంది. మొత్తం 42 అంతస్తులుంటాయి.
- రెండు టవర్లలోను మధ్య మధ్యలో స్కై గార్డెన్‌లు ఉంటాయి.
- మొదటి దానిలో 12 అంతస్తుల ఎత్తుతో సమానమైన 6 స్కైగార్డెన్‌లు, రెండో దానిలో 6 అంతస్తుల ఎత్తుతో సమానమైన 3 స్కై గార్డెన్‌లు ఉంటాయి.
- రెండో టవర్ పైన హెలిప్యాడ్ కూడా ఉంటుంది.
- వీటిల్లో హోటళ్లు, రిటైల్, ఆఫీసు స్పేస్, సర్వీసు అపార్ట్‌మెంట్లు, కళలు, జానపద కళల మ్యూజియం, వాణిజ్య కేంద్రాలు, స్కై క్లబ్‌లు, 360 డిగ్రీల్లో అబ్జర్వేటరీ వంటివి ప్రతిపాదించారు.

అగ్రశ్రేణి కట్టడాలకు దీటుగా..!

- ప్రపంచంలోని పది అగ్రశ్రేణి కట్టడాల్ని అధ్యయనం చేసి వాటికి దీటుగా అమరావతిలో జంట టవర్ల ఆకృతులు సిద్ధం చేయాలని సీఎం సూచన



జంట ఆకాశహర్మ్యాల ఆకృతులు

- మూడు వారాల్లో సమగ్ర ఆకృతులు, నివేదికతో రావాలని సీఆర్‌డీఏ అధికారులకు ఆదేశం.
- ఈ జంట ఆకాశహర్మ్యాలు నిరుపమాన భవనాలుగా (ఐకానిక్) ఉండాలి.
- దుబాయ్‌లో బుర్జ్ ఖలీఫా, మలేషియా, సింగపూర్ దేశాల్లో ఈ తరహా నిర్మాణాలు ఉన్నాయి.
- వాటికి లేని ప్రత్యేక ఆకర్షణలు అమరావతిలో ఉన్నాయి. జలసంపద, పచ్చదనం, క్రియాశీలంగా వ్యవహరించే పౌరులు మన దగ్గర ప్రధాన వనరులు.
- జంట ఆకాశహర్మ్యాలలో 55 నుంచి 57 శాతం విస్తీర్ణాన్ని కార్యాలయాలకు, 12 నుంచి 13 శాతం విస్తీర్ణాన్ని దుకాణాలకు, 8 శాతం విస్తీర్ణాన్ని సర్వీసు అపార్ట్‌మెంట్లకు వినియోగించే రూపొందించినట్టు వివరించిన షాపూర్జీ ప్రతినిధులు.

మెడిటెక్ జోన్‌లో కలాం టెక్నాలజీ కేంద్రం ఏర్పాటు

ఈనాడు, అమరావతి: కేంద్ర బయోటెక్నాలజీ శాఖ విశాఖ మెడిటెక్ జోన్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో జరిపిన సంప్రదింపుల ఫలితంగా కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌టెక్నాలజీ పేరుతో ఈ కేంద్రం ఏర్పాటుకానుంది. తదుపరి చర్యల నిమిత్తం కేంద్ర ప్రభుత్వ బయోటెక్నాలజీ శాఖ కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శులతో కలిపి తొమ్మిది మందితో సంఘం ఏర్పడింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులిచ్చారు.

దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ శిక్షణ

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులకు భారీ స్థాయిలో విద్యా శిక్షణ కార్యక్రమాన్ని అక్టోబరు 2 గాంధీ జయంతి నుంచి ప్రారంభించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా 2019 మార్చి నాటికి సర్వ శిక్ష అభియాన్‌లో భాగంగా 11 లక్షల మంది శిక్షణ లేని ఉపాధ్యాయులకు శిక్షణను అందించనున్నారు. వీరిలో 6 లక్షల మంది ప్రభుత్వ, 5 లక్షల మంది ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులున్నారు. 2019 మార్చి నాటికి ప్రాథమిక విద్యలో డిప్లొమా శిక్షణను పూర్తిచేయనున్నారు.

ఆర్థిక సంవత్సరంలో మార్పు ఉండదు

దిల్లీ: ఆర్థిక సంవత్సరాన్ని మార్పు చేయాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ప్రస్తుతం ఏప్రిల్-మార్చి కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా గుర్తిస్తుండగా, దాన్ని కేలండర్ సంవత్సరంతో సమానంగా జనవరి-డిసెంబరుగా మార్చాలని ప్రతిపాదించింది. అయితే వివిధ కారణాల దృష్ట్యా ఇప్పుడిప్పుడే దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు సోమవారం చెప్పారు. 2018-19లోనే దీనిపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్రాల నుంచి మద్దతు లభించకపోవడంతో నిర్ణయాన్ని వాయిదా వేశామని చెప్పారు.

చిత్రం చెప్పిన శస్త్రచికిత్స

- **'స్నాప్‌చాట్'లో వైద్య వీడియోలు**
- **ఆంక్షల విధింపునకు అమెరికా కసరత్తు**

న్యూయార్క్: విజ్ఞానానికి, వినోదానికి అడ్డాగా మారిపోయింది 'యూ ట్యూబ్'! చాలామందికి స్మార్ట్‌ఫోన్‌లో అదొక్కటుంటే చాలు... సినిమాలు, వీడియోలు చూసుకుంటూ రోజు గడిపేస్తారు. కానీ, విచిత్రం... అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో లక్షలాది మంది శస్త్రచికిత్సల వీడియోలను ఆసాంతం ఆసక్తిగా తిలకిస్తున్నారట! రోగులకు ఆపరేషన్ చేసినప్పుడు వీడియో తీసి, తర్వాత వారికి ఆ సీడీని అందించడం పాత సంగతే. కానీ... ఇప్పుడు చాలామంది వైద్యులు, ముఖ్యంగా ప్లాస్టిక్ సర్జన్లు తాము శస్త్రచికిత్స చేస్తున్న తీరును సామాజిక మాధ్యమం 'స్నాప్‌చాట్'లో పెడుతున్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ సర్జన్ డా. మైఖేల్ సల్జాహౌర్ ఈ పోకడకు ఆద్యుడు. ఇప్పటికే తాను చేసిన చికిత్సల వీడియోలతో లక్షలాది మందిని ఆకర్షించి, 'డాక్టర్ మియామి'గా ప్రసిద్ధి చెందాడు. ఆ వీడియోలను చూసిన జనం, ఆయనతోనే ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాలని ఎగబడుతున్నారట. 2019 వరకూ ఆయనకు తీరికలేకుండా ఇప్పటికే తేదీలన్నీ బుక్కయిపోయాయి కూడా! మరో ప్రముఖ వైద్య నిపుణుడు డా.మాథ్యూ షల్మన్‌కైతే స్నాప్‌చాట్‌లో ఏకాఎకి 50 లక్షల మంది వీక్షకులు ఉన్నారంటే ఆశ్చర్యపోనక్కర్లేదు! "వైద్యుల వ్యాపారాభివృద్ధికి తప్ప మరెందుకూ ఈ ధోరణి పనికిరాదని" తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా, వైద్యులు ఏమాత్రం లెక్కచేయడం లేదు. దీంతో శస్త్రచికిత్సా కేంద్రాల్లో సామాజిక మాధ్యమం వినియోగంపై ఆంక్షలు విధిస్తూ మార్గదర్శకాలు తీసుకురావాలని అమెరికన్ సొసైటీ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్స్ (ఏఎస్‌పీఎస్) నిర్ణయం తీసుకుంది. డా.మాథ్యూ ఈ విమర్శలను గట్టిగానే తిప్పికొట్టారు. "చాలామందికి ఆపరేషన్ చేయించుకోవాలంటే భయం. రోగాన్ని భరిస్తారుగాని శస్త్రచికిత్సకు ముందుకు రారు. అలాంటి వారికి ఈ వీడియోలు కొండంత ధైర్యాన్నిస్తాయి. మేం చికిత్స ఎలా చేస్తాం, ఎంత సమయం పడుతుంది, రోగులు ఎలా కోలుకుంటారు వంటి విషయాలపై అవగాహన వస్తుంది. వైద్య విద్యార్థులు, ఆసక్తిపరులకూ వ్యాధులు-చికిత్సల పట్ల అవగాహన కలుగుతుంది" అని ఆయన వివరించారు. మొత్తానికి సినిమాలు చూసే జనం... ఇప్పుడు శస్త్రచికిత్సలను కూడా ఆసక్తిగా చూస్తుండటం విశేషం!

నగదు లావాదేవీలు 2లక్షలకు మించితే వాతే!

- **వ్యాపార వ్యయాల్లో రూ.పదివేలే...**
- **హద్దు దాటితే వంద శాతం జరిమానా**
- **ఆదాయపు పన్ను శాఖ తాజా హెచ్చరిక**

దిల్లీ: నల్లధనాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా ఆదాయపు పన్ను శాఖ నగదు లావాదేవీలపై ఆంక్షలను తీవ్రతరం చేసింది. రూ.2లక్షలకు మించి నగదు లావాదేవీలు నిర్వహించే వారికి చట్టప్రకారం భారీ జరిమానా విధించనున్నట్లు సోమవారం హెచ్చరించింది. దీని ప్రకారం ఒక వ్యక్తి నుంచి రోజుకు ఒకటి లేదా అంతకుమించిన లావాదేవీల్లో రూ.2లక్షలకు మించి నేరుగా నగదును స్వీకరించరాదు. స్థిరాస్తుల క్రయవిక్రయాల్లో ఈ పరిమితి రూ.20వేలే. అదే వ్యాపారపరమైన వ్యయాలు, వృత్తిసంబంధిత అంశాల్లో అయితే రూ.10వేలే. అంతకు మించి నగదు చేతులు మారటానికి వీల్లేదని ఐటీ శాఖ విస్పష్టం చేసింది. "నగదు చెల్లింపులు నిషేధం. ఉల్లంఘిస్తే భారీ జరిమానా తప్పదు. నగదు రహిత విధానాలకు మళ్లండి. నల్లధనాన్ని నివారించండి" అని ఆ ప్రకటనలో ఐటీ శాఖ పేర్కొంది. ఎవరైనా నిషేధ ఉల్లంఘనకు పాల్పడినట్లు తెలిస్తే సమీపంలో ఉండే ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్‌కు నేరుగా లేదా blackmoneyinfo@incometax.gov.inకు ఈమెయిల్ ద్వారా తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఆర్థిక చట్టంలో చేర్చిన 269ఎస్‌టీ నిబంధన ప్రకారం ఈ నిషేధాన్ని ఉల్లంఘించే వారికి భారీ జరిమానా విధించవచ్చు. ఈ నిషేధం ప్రభుత్వ చెల్లింపులకు, పోస్టాఫీసులు, బ్యాంకులు, సహకార బ్యాంకుల్లో చేసే పొదుపునకు వర్తించదు.

సహకార సంఘాల సమాఖ్య సభ్యులకు సాయం

ఈనాడు, అమరావతి: వివిధ కులవృత్తుల సంక్షేమానికి ఏర్పడిన సహకార సంఘాల సమాఖ్య సభ్యులకు ఇక నుంచి వ్యక్తిగతంగా, ఐదుగురితో ఏర్పడే బృందాలకు ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం అందనుంది. ఇప్పటివరకు సమాఖ్యల్లో 15 మంది సభ్యుల బృందానికి మాత్రమే ప్రభుత్వం నుంచి రాయితీ, బ్యాంకు రుణాలు అందుతున్నాయి. ఈ విధానంతో బ్యాంకు రుణాలు అందకపోవడం, ఇతరత్రా సమస్యలను రాష్ట్రంలోని 11 సమాఖ్యల ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఈ ప్రతిపాదనలు పరిశీలించిన సర్కారు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ అనుమతితో సమాఖ్య సభ్యులకు వ్యక్తిగతంగా, ఐదుగురు సభ్యులతో ఏర్పడే బృందాలకు సాయం అందించేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

గిరి ప్రాంతాల్లో ఉపాధి నిధులతో రహదారులు

సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, చింతూరు, కేఆర్‌పురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. అంచనా వ్యయంలో 90 శాతం ఉపాధి నిధులు, మిగతా పది శాతం గిరిజన సంక్షేమశాఖ నిధులు వినియోగించేలా నిర్ణయించారు.

వసుంధర

కేరళ చేపలు... మహారుచి!

కేరళ వంటకం అనగానే గుర్తొచ్చేవి.. అరిటాకులో వడ్డించిన కమ్మని కొబ్బరి ఘుమఘుమలు. కేరళ తీరం చేపల రుచికీ చాలా ప్రత్యేకత ఉంది. ఆ కమ్మని రుచిని ఆస్వాదించాలంటే ఈసారి ఆ చేపలతో ఇలా ప్రయత్నించి చూడండి..



నెత్తిలి ఫ్రై

కావల్సినవి: నెత్తిలి చేపలు - పావుకేజీ, నూనె - వేయించేందుకు సరిపడా.

మసాలా కోసం: చిన్న ఉల్లిపాయలు - ఎనిమిది, వెల్లుల్లి- నాలుగు రెబ్బలు, అల్లం ముక్కలు - రెండు, కారం - చెంచా, పసుపు - చిటికెడు, మిరియాల పొడి - పావు చెంచా, మైదా - మూడు చెంచాలు, గుడ్డు - ఒకటి ఉప్పు - తగినంత.

తయారీ: గుడ్డుసొన తప్ప మసాలా కోసం తీసుకున్న పదార్థాలన్నింటినీ మిక్సీలో వేసి మెత్తని ముద్దలా చేసుకోవాలి. ఆ మిశ్రమంలో గుడ్డుసొనని కూడా కలపాలి. అందులో చేపముక్కల్ని వేసి వాటికి మసాలా పట్టించాలి. తరవాత పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక కొద్దికొద్దిగా చేపల్ని తీసుకుని నూనెలో ఎర్రగా వేయించుకోవాలి. ఇలాగే మిగిలినవీ చేసుకుంటే చాలు.



స్పైసీ ఫిష్ ఫ్రై

కావల్సినవి: చేపలు - అరకేజీ, కారం- నాలుగు చెంచాలు, పసుపు- పావు చెంచా, అల్లం ముక్క- చిన్నది, మిరియాలు - చెంచా, కరివేపాకు- నాలుగు రెబ్బలు, ఉప్పు - తగినంత, నూనె- వేయించేందుకు సరిపడా.

తయారీ: ముందుగా చేపలు శుభ్రం చేసి పెట్టుకోవాలి. అల్లం, మిరియాలు, కరివేపాకును మిక్సీలో ముద్దలా నూరుకోవాలి. ఈ మిశ్రమానికి కారం, పసుపు, ఉప్పు, చెంచా నీళ్లు కలిపి చేప ముక్కలకు పట్టించాలి. అరగంటయ్యాక బాణలిని పొయ్యిమీద పెట్టి నూనె వేయాలి. అది బాగా కాగిన తరువాత ఒక్కొక్క చేపను వేసి ఎర్రగా వేయించి తీసుకోవాలి.

ఫిష్ మసాలా

కావల్సినవి: చేపముక్కలు - ఆరు, కారం - ఒకటిన్నర చెంచా, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి, మిరియాలపొడి - అరచెంచా చొప్పున, నిమ్మ కాయ - అరచెక్క, అల్లం, వెల్లుల్లి ముద్ద - అరచెంచా, ఉప్పు - తగినంత.

మసాలా కోసం: ఉల్లిపాయలు, టొమాటోలు - రెండు చొప్పున, కొబ్బరి పాలు - పావు కప్పు, కారం - చెంచా, పసుపు - పావు చెంచా, ధనియాల పొడి- ముప్పావు చెంచా, మిరియాల పొడి - పావు చెంచా, గరంమసాలా - అరచెంచా, మెంతి పొడి - చిటికెడు, అల్లం వెల్లుల్లి ముద్ద - అరచెంచా, పచ్చిమిర్చి - మూడు, కరివేపాకు - రెండు రెబ్బలు, కొబ్బరి నూనె- అరకప్పు, ఉప్పు - తగినంత.



తయారీ: ఓ గిన్నెలో అల్లం, వెల్లుల్లి ముద్ద, కారం, పసుపూ, ధనియాలపొడీ, మిరియాల పొడీ, నిమ్మరసం, తగినంత ఉప్పు తీసుకుని ముద్దలా కలపాలి. అందులో చేపముక్కలను వేసి వాటికి ఆ మసాలా పట్టేలా బాగా కలిపి అరగంట సేపు పక్కన పెట్టేయాలి. తర్వాత కొబ్బరిపాలు నూనె తప్ప మసాలా కోసం పెట్టుకున్న పదార్థాలను ముద్దలా చేసుకోవాలి. ఇప్పుడు పొయ్యి మీద బాణలి పెట్టి పావుకప్పు నూనె వేయాలి. అది వేడయ్యాక చేపముక్కలు వేసి వేయించి తీసుకోవాలి. అదే బాణలిలో మిగిలిన నూనె వేసి ముందుగా చేసుకున్న మసాలా వేసి బాగా వేయించాలి. అందులో కొబ్బరిపాలు పోసి మంట తగ్గించాలి. ఐదారు నిమిషాలయ్యాక ముందుగా వేయించిన చేపముక్కల్ని వేయాలి. అవి ఉడికి కూరలా తయారయ్యాక ఇంకొంచెం ఉప్పు వేసి దింపేయాలి.

నెత్తిలి కుళంబు

కావల్సినవి: నెత్తిలి చేపలు- అర కేజీ, ఉల్లిపాయలు - రెండు, అల్లం ముక్కలు- చెంచా, టొమాటోలు - రెండు, నూనె - నాలుగు చెంచాలు, కరివేపాకు- నాలుగు రెబ్బలు, చింతపండు రసం- కప్పు, కారం - రెండు చెంచాలు, ధనియాల పొడి - చెంచా, ఉప్పు - తగినంత, పసుపు - పావుచెంచా.

తయారీ: చేపలను శుభ్రం చేసుకున్నాక వాటిపై పసుపూ, ఉప్పు వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. చింతపండు రసాన్ని ఉడికించి పెట్టుకోవాలి. ఇందులో కారం, ధనియాలపొడీ వేయాలి. అల్లం, ఉల్లిపాయముక్కలను మిక్సీలో వేసి మెత్తని ముద్దలా చేసుకుని తీసుకోవాలి. అదే విధంగా టొమాటో ముక్కల్ని కూడా ముద్దలా చేసుకుని పెట్టుకోవాలి. బాణలిని పొయ్యిమీద పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక కరివేపాకూ, ముందుగా చేసిపెట్టుకున్న ఉల్లిపాయ ముద్ద వేసి వేయించాలి. ఉల్లిపాయ ముద్దలోని పచ్చి వాసన పోయాక టొమాటో ముద్ద వేయాలి. అది బాగా ఉడికాక చింతపండు గుజ్జూ, ఇంకొంచెం ఉప్పూ వేయాలి. ఈ రసం బాగా ఉడికిందనుకున్నాక చేపల్ని వేసి మంట తగ్గించాలి. పది నిమిషాల్లో చేపలు ఉడుకుతాయి. అప్పుడు దింపేయాలి.



మలబార్ ఫిష్ కర్రీ



కావల్సినవి: చేప ముక్కలు - ఒకటిన్నర కప్పు, కొబ్బరి ముక్కలు - అర కప్పు, పసుపు - చెంచా, అల్లం తరుగు - చెంచా, పచ్చిమిర్చి - ఒకటి, చింతపండు గుజ్జు - మూడు చెంచాలు, ఉల్లిపాయలు - రెండు, మినప్పప్పు, ఆవాలు - అరచెంచా చొప్పున, కరివేపాకు - రెండు రెబ్బలు, కొబ్బరి నూనె - రెండు చెంచాలు, ఉప్పు - తగినంత, కారం చెంచా.

తయారీ: కొబ్బరి ముక్కలూ, పసుపూ, అల్లం తరుగూ, కారం, తగినంత ఉప్పూ, చింతపండు గుజ్జూ, పచ్చిమిర్చీ, అరచెంచా నీళ్లు మిక్సీలో తీసుకుని ముద్దలా చేసుకోవాలి. బాణలిని పొయ్యిమీద పెట్టి చెంచా నూనె వేయాలి. అది వేడయ్యాక ఈ మిశ్రమాన్ని వేయాలి. ఐదు నిమిషాలు వేయించి.. అందులో చేపముక్కలను వేసి బాగా కలిపి దింపేయాలి. మరో గిన్నెను పొయ్యిమీద పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక మినప్పప్పూ, ఆవాలూ, కరివేపాకు వేసి ఆ తాలింపులో చేప ముక్కల్ని వేసి మూత పెట్టేయాలి. అవి ఉడికి కూరలా తయారయ్యాక దింపేయాలి.

ఆ వైవిధ్యానికే పురస్కారం!

నగరాల్లోని చిన్నారులకి ప్లే స్కూళ్లు ఉంటున్నాయి కదా! నిరుపేదలు కూడా తమ పిల్లలు బాగుండాలనే తపనతో వాళ్లని అక్కడికి పంపిస్తుంటారు. మరి గ్రామసీమల్లో పరిస్థితేమిటీ? అక్కడున్న నిరుపేదలకి ఆటపాటలతో బడిపాఠాలని పరిచయం చేసే వేదికేముంది? ఎందుకు లేదు.. అంగన్‌వాడీలు అందుకేగా అంటారు కడారి మల్లమ్మ. అనడం కాదు వాటిని నిజంగానే అంత ఆకర్షణీయంగా మలిచారు. అంతేకాదు సామాజిక చైతన్య కేంద్రంగానూ మార్చారు. అందుకే అంగన్‌వాడీ కార్యకర్తలకిచ్చే జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 31న అందుకుంటారు. ఇంతకీ ఆమె ఏం సాధించారు?

మీకో విషయం తెలుసా? పేద, మధ్య తరగతికి చెందిన చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం కోట్లలో ఖర్చు చేస్తోంది. వాటిని అమలు చేసే బాధ్యత అంగన్‌వాడీలదే. నిధులున్నాయి.. వసతులున్నాయి. కానీ ఈ అంగన్‌వాడీని నమ్మి వచ్చే పిల్లలే తక్కువ. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లి అంగన్వాడీ కేంద్రం పరిస్థితి కూడా ఇదే. పైగా ఇది హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉండటంతో సహజంగానే చిన్నచూపు ఎక్కువ. కాస్త దూరమైనా సరే ప్లే స్కూళ్లకి పిల్లల్ని పంపిస్తుంటారు తల్లిదండ్రులు. పంపించలేనివారు ఇంటిదగ్గరే పిల్లల్ని ఉంచుతారుకానీ.. అంగన్‌వాడీకి పంపించరట. ఫలితంగా పిల్లల్లో రక్తహీనత కనిపించడం, టీకాలు సక్రమంగా తీసుకోకపోవడం వంటి సమస్యలు కనిపించాయి. ఈ నేపథ్యంలోని తమ అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లల్ని రప్పించడానికి వైవిధ్య పద్ధతులు అనుసరించారు మల్లమ్మ. ముందు ఇంటింటికి తిరిగి తల్లిదండ్రుల్ని ఒప్పించి పిల్లల్ని రప్పించారు. ప్లే స్కూల్ తరహాలో ఆట బొమ్మలూ పెట్టారు. వారు ప్రాథమిక స్థాయికి వెళ్లేలోపే అన్ని ఆంగ్ల, తెలుగు అక్షరాలు, సంఖ్యలు, యూకేజీ వరకు ఎంత నేర్చుకునేలా చేశారు. చక్కటి పోషకాహారం, వారి ఆరోగ్యానికి భరోసా ఇచ్చే టీకాలు వేయించడం ఇందుకు అదనం! దాంతో పిల్లల సంఖ్య పెరిగింది. మల్లమ్మ అంగన్‌వాడీ కార్యకర్తగా చేరిన 17 ఏళ్లలో 466 మంది పిల్లలను ప్రాథమిక విద్య కోసం పాఠశాలలో చేర్పించింది. ఆ మధ్య కళ్లు లేని ఓ బాలికను తల్లిదండ్రులు విక్రయించబోతుంటే అడ్డుకుని తన అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాబుద్ధులు నేర్పించారు కూడా! ఇప్పుడా బాలిక ప్రత్యేక పాఠశాలలో చదువుతోంది. ఓ సాధారణ అంగన్‌వాడీ కార్యకర్తే కావొచ్చు.. తన చుట్టూఉన్న సమాజంలో ఆమె తీసుకువచ్చిన స్ఫూర్తిదాయక మార్పుని గుర్తించే కేంద్రప్రభుత్వం ఆమెని జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈనెల 31న దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి మేనకా గాంధీ అందిస్తారు. అవార్డు కింద కింద రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందిస్తారు.



-మహేష్‌గౌడ్, న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణ

బంగారం-వెండి



28న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	30,100	30,150
ఆర్నమెంట్	-------	-------	28,000	27,800
వెండి (కిలో)	-------	-------	40,500	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	29,950	29,900	29,420	29,670
ఆర్నమెంట్	27,780	27,680	27,950	27,740
వెండి (కిలో)	40,100	40,000	39,500	39,100
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,000	30,070	-------	-------
ఆర్నమెంట్	27,950	27,660	2,795	2,774 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	42.20	41.70 గ్రా

ఫోన్ ఇంటర్వ్యూలో.. ఆ పొరబాట్లేమిటీ?

కెరీర్ వసుంధర

డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

? నేను బ్యాంకింగ్ రంగంలో స్థిరపడాలని అనుకుంటున్నాను. నేను దరఖాస్తు చేసుకున్న సంస్థలు చాలావరకు ఫోన్ ఇంటర్వ్యూలే నిర్వహిస్తున్నాయి. అదే నాకు సమస్యగా మారుతోంది. నాకు మంచి మార్కులే ఉన్నా.. నా మాటల్లో పెద్దగా ఆత్మవిశ్వాసం కనిపించదు. అంతేకాదు నేను అంతర్ముఖురాలిని కూడా! అందువల్ల ఇంటర్వ్యూ ఫోన్ రాగానే ఆందోళనకి గురై చాలా లోగొంతుకతో మెల్లగా మాట్లాడుతున్నా. ప్రతిసారీ 'కాస్త గట్టిగా మాట్లాడండి..!' అంటున్నారు. సరేనని బిగ్గరగా మాట్లాడటం అలవర్చుకున్నా. అయినా అదే పరిస్థితి. తర్వాతి దశకి పిలుపు రావడమే లేదు. నేనెక్కడ తప్పు చేస్తున్నానో.. మీరేమన్నా చెప్పగలరా?

- కిరణ్మయి, విశాఖ

✔ ఫోన్ ఇంటర్వ్యూల సమయంలో ఎలా స్పందిస్తున్నారో ఇంకాస్త వివరంగా రాస్తేకానీ.. మీరు చేస్తున్న పొరబాట్లేమిటో చెప్పడం కష్టం. కాకపోతే, ఈ ఇంటర్వ్యూల సమయంలో సహజంగా అందరూ చేసే తప్పులు కొన్ని ఉంటాయి. మీరూ అవే చేస్తున్నారేమో సరిచూసుకోండి. మొదటిది.. మీ కంఠస్వరం(టోన్)పై దృష్టిపెట్టకపోవడం. మామూలు ముఖాముఖిలో మీరు కళ్లలో కళ్లుపెట్టి చూసేవిధానం, కూర్చునే తీరు, శరీర కదలికలూ ఇవన్నీ మీలోని ఉత్సాహానికీ, ఆత్మవిశ్వాసానికి సంకేతాలుగా భావిస్తారు. ఫోన్ ఇంటర్వ్యూలో అది సాధ్యం కాదు. ఇక్కడ మీ స్వరంలోనే అన్నీ పలికించాలి. కాస్త శ్రద్ధపెట్టి మీ గొంతులో ఆసక్తీ, ఉత్సాహం, కలుపుగోలుతనం ధ్వనించేలా చూడండి. రెండు.. ఎదుటివాళ్ల మాట పూర్తికాకముందే మనం మాట్లాడేయటం! ఫోన్ ఇంటర్వ్యూలో మనపై సదభిప్రాయం రాకపోవడానికీ ఇది కూడా కారణమే. ఇక, మూడోది.. చాలామంది బస్సూ, రైళ్లలో వెళ్తూ ఫోన్ ఇంటర్వ్యూకి సమాధానమిస్తుంటారు. దీనివల్ల మీకు ఉద్యోగంపై పెద్దగా ఆసక్తిలేదేమో అనుకుంటారు. కొందరు ఏ ఈమెయిల్ చూస్తూనో, ఇంకేదైనా పనిచేస్తూనో ఫోన్ ఇంటర్వ్యూలు నడిపిస్తుంటారు. ఇదీ తప్పే. ఫోన్‌లో మాట్లాడేటప్పుడు ఆ సంభాషణ నుంచి ఏమాత్రం మనదృష్టి పక్కకు తప్పినా అది ఎదుటివాళ్లకి ఇట్టే తెలిసిపోతుందని గ్రహించండి! ఇక నాలుగో తప్పు.. మీ రెజ్యూమెని దగ్గర ఉంచుకోకుండా మాట్లాడటం. ఇంటర్వ్యూ చేసేవారు సాధారణంగా మన దరఖాస్తుని చూస్తూనే ప్రశ్నలు వేస్తుంటారు. అలాంటప్పుడు రెజ్యూమె మనదగ్గర లేకపోతే జవాబు చెప్పలేక తడబడతాం. ఇక ఐదో తప్పు.. జీతం, భత్యాల విషయంలో ఏం మాట్లాడాలో, ఎంత మేరకు అడగాలో సిద్ధంకాకపోవడం. అసలు ఫోన్ ఇంటర్వ్యూలనేవి వడపోతకోసమే. అందులోనూ జీతభత్యాల విషయంలో సంస్థకి అనువుగా లేరు అనుకునేవారిని అప్పటికప్పుడు పక్కనపెడతారు. ఈ విషయంలో మనకొక స్పష్టతలేకుండా తబ్బిబ్బులాడితే ఆ వడపోతలో మనమూ ఉండిపోతాం!

'మనం ఆర్థికంగా కుదురుకున్నాం సరే.. కానీ సమాజంలో కనీస ఆర్థిక స్వేచ్ఛకూడా లేని స్త్రీల పరిస్థితి ఏంటి? వాళ్ల కోసం ఏదైనా చేయాలి..' - ఇలానే ఆలోచించారు ఆ ఇద్దరు మహిళా వ్యాపారవేత్తలు. సేంద్రియ సౌందర్య ఉత్పత్తులూ, మోమోలూ, స్ప్రింగ్‌రోల్స్ వంటి ఫ్రాజెన్ చిరుతిళ్ల తయారీలో రాణిస్తున్న కల్యాణి గొంగీ, దివ్య మెదార్ తోటి మహిళలని ఆదుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేశారో తెలుసుకుందాం..



ఆ 30మంది నిలదొక్కుకున్నారు!

దివ్యమెడార్ ఆవిరిపై ఉడికించి తయారుచేసే ప్రత్యేకమైన చిరుతిళ్లతోపాటూ వివిధ రకాల ఆహార ఉత్పత్తులని తయారుచేస్తుంటారు. కల్యాణి... రసాయనాలు ఉపయోగించకుండా సౌందర్య ఉత్పత్తులని తయారుచేస్తుంటారు. ఒకరి ఫ్యాక్టరీ బాలానగర్‌లో ఉంటే... మరొకరిది జీడిమెట్లలో ఉంది. ఈ ఇద్దరినీ కలిపింది మాత్రం 'గోల్డెన్ మ్యాన్ సాక్స్ 10కె విమెన్' అనే కార్యక్రమం! 'మా సంస్థ తయారుచేసిన ఉత్పత్తులని వినియోగదారులకి చేర్చడం కోసం పర్యావరణ హిత బ్యాగులని ఉపయోగించేదాన్ని. వాటి తయారీ కోసం మా ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఉండే మహిళల సాయం తీసుకునేదాన్ని. దానివల్ల వారికి ఆర్థికంగా ఎంతో కొంత సాయం అందేది. వాళ్లకి సాయం చేశానన్న తృప్తీ నాకుండేది. ఇదిలా ఉంటే... ఏడాది కిందట హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ నుంచి నాకో సమాచారం అందింది. ఫార్చ్యూన్- యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ గ్లోబల్ మెంటారింగ్ ప్రోగ్రామ్‌కి నేను ఎంపికయ్యానని తెలిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన నాలాంటి వారికి రెండు వారాలపాటూ 'ఫార్చ్యూన్-500'గా గుర్తింపు సాధించిన ప్రపంచంలోని వివిధ మహిళా వ్యాపారవేత్తలు తరగతులు నిర్వహించారు. అక్కడ వ్యాపార మెలకువలతోపాటూ, వివిధ దేశాల్లో మహిళలు ఆర్థిక సాధికారత ఎలా సాధిస్తున్నారో తెలుసుకున్నా..' అంటారు కల్యాణి. ఈ కార్యక్రమానికి కల్యాణియే కాదు.. ఆ తర్వాతి ఏడాది దివ్య కూడా వెళ్లారు. ఆ అనుభవంతో ఇద్దరూ కలిసి ఓ ప్రాజెక్టుని తయారుచేశారు. దాని లక్ష్యం... గడపదాటి బయటకు రానినిరుపేద మహిళల ఇళ్లకే వెళ్లి ఆర్థికంగా కుదురుకునేలా చేయడం. అలా తమ ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఉన్న వెంకన్నహిల్స్ తదితర ప్రాంతాల్లోని మహిళలని ఒక చోటికి చేర్చారు. 'వాళ్లతో మాట్లాడినప్పుడు చాలామందిలో చదువు లేకపోయినా ఏవో కొన్ని నైపుణ్యాలున్నాయని తెలిసింది. కానీ మార్కెట్ చేసుకోవడం ఎలానో వారికి తెలియలేదు. వారికి ఆసక్తి ఉన్న బ్యాగులూ, కలంకారీ గాజుల తయారీ, కుషన్ కవర్లూ, బొమ్మల తయారీ వంటివి నేర్పించాం. వాటికి ఎలా ఖరీదు కట్టాలో కూడా నేర్పించాం. వాటితోపాటూ వ్యాపార మెలకువలు కూడా.. అంటే నాణ్యతా ప్రమాణాలు పాటించడం, ఒక ఆర్డరుని అందుకున్నాక వినియోగదారులకు సకాలంలో ఎలా ఇవ్వాలో వంటి వాటినీ నేర్పించాం. మొదట్లో కొంత పెట్టుబడి సహకారం కూడా అందించాం. ఎలీప్, ఎమ్ఎస్ఎమ్ఈ వంటి సంస్థల సహకారంతో రుణాలపై అవగాహన కల్పించాం. అలా ఐదునెలలపాటూ ముప్పైమంది వరకూ శిక్షణ తీసుకున్నారు. వాళ్లందరూ వివిధఉత్పత్తులు తయారుచేస్తున్నారు. తాజాగా వారి ఉత్పత్తులతో ఒక ఎగ్జిబిషన్‌ని కూడా నిర్వహించాం. వీటిని అమ్మేందుకు ఈకామర్స్ సైట్ కూడా సిద్ధమవుతోంది. ఈ సైట్‌లో నిరుపేదలై తమదైన ఉత్పత్తులు తయారుచేస్తున్నవాళ్లు ఎవరైనా వాటిని అమ్ముకోవచ్చు. త్వరలో మరో బ్యాచ్‌ని కూడా సిద్ధం చేస్తున్నాం. నైపుణ్యం ఉండి నేర్చుకోవాలనుకునేవారికీ సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అంటున్నారు కల్యాణి.



చెప్పులు వేసుకునే ముందు...



వర్షం పడినప్పుడు వాతావరణం ఎలా ఉంటుందో తెలిసిందే కదా. ఈ సమయంలో మనల్ని ఎక్కువగా ఇబ్బంది పెట్టేవి చెప్పులే. ఈ కాలంలో ఎలాంటి చెప్పులు ఎంచుకోవాలో చూద్దాం..

- వానాకాలంలో కాన్వాస్ షూస్ ఎంత తక్కువగా వేసుకుంటే అంత మంచిది. అవి తడిస్తే... వాటిల్లో హానికర బ్యాక్టీరియా, సూక్ష్మక్రిములు వృద్ధి చెందుతాయి.
- ప్లాస్టిక్ చెప్పులను కొనేటప్పుడు వాటి అంచులు బాగా మొనదేలి ఉన్నాయోమో గమనించండి. ఇవి మీ పాదాన్ని ఈ కాలంలో బాగా గాయపరుస్తాయి.
- వానాకాలంలో చెప్పుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి. మీరు ఎంచుకునేవి శాండిల్స్ అయినా, హీల్స్ అయినా కాలికి పట్టినట్టు ఉండేవాటిని ఎంచుకోవాలి. లేదంటే వానల్లో తడిచినప్పుడు జారి పడే ప్రమాదం ఉంటుంది.
- తడిసిన చెప్పులూ, బూట్లను మంచం కిందా, చెప్పుల స్టాండులో పెట్టకండి. వాటిలో బ్యాక్టీరియా వృద్ధి చెంది దుర్వాసన వస్తుంది. ఈ చెప్పులను ఎండలో ఆరబెట్టాలి లేదా వెలుతురూ, గాలి తగిలే ప్రదేశంలో పెట్టాలి. దాంతో బ్యాక్టీరియా నశిస్తుంది.
- సాక్స్‌లను కూడా ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉండాలి. బాగా ఆరిన తరవాతే వేసుకోవాలి. .
- కర్పూరం మంచి యాంటీసెప్టిక్‌లా పనిచేస్తుంది. కాస్త కర్పూరం పొడిలో టాల్కం పౌడర్ కలిపి బూట్లు వేసుకునే ముందు పాదాలకు రాసుకోవాలి.



ఒకేసారి ఎత్తేయకండి..

మనం గమనించంగానీ.. మనం చేసే రోజువారి పనులు కొన్ని తెలియకుండానే మన శరీర ఆకృతిని ప్రభావితం చేస్తుంటాయి. వెన్నుపై ఒత్తిడి తీసుకొస్తుంటాయి. అలాంటి సమస్య లేకుండా ఈ జాగ్రత్తలు తీసుకుని చూడండి.

- ముఖం కడుక్కునే సమయంలో, బ్రష్ చేసుకునేటప్పుడూ సింకు దగ్గర నిటారుగా నిలబడి ఉంటాం కదా! అలాకాకుండా ఒక చేతిని గోడకు దన్నుగా ఉంచుకుంటే వెన్నుపై ఒత్తిడి పడకుండా ఉంటుంది.
- పాత్రలు తోమేటప్పుడు కూడా అలానే గంటల తరబడి నిల్చుని తోమేస్తుంటాం. చివరికి నడుము నొప్పంటూ బాధపడతాం. అందుకే అంట్లు తోమేటప్పుడు... ఒక తేలిక పాటి ప్లాస్టిక్ కుర్చీ వేసుకుని ఒక మోకాలిని మడిచి దానిపై ఉంచుకుంటే వెన్నుపై భారం పడకుండా ఉంటుంది.
- బూట్ల లేసులు కట్టుకునేటప్పుడూ అంతే. గొంతుక్కూచుని కానీ, కుర్చీలో కూర్చుని కానీ కట్టుకోవాలి. అంతేతప్ప పూర్తిగా వంగి వాటిని కట్టేయకూడదు.
- బరువైన వస్తువులని అటకపై లేదా అల్మారాల్లో పెట్టేటప్పుడు ఒక్కసారిగా అలానే ఎత్తి పెట్టేయడానికి ప్రయత్నించవద్దు. అలా చేస్తే తలా, మెడపై భారం పడుతుంది. చిన్న స్టూలు అయినా వేసుకోవాలి.





జీఎస్‌టీ రిటర్నులు 36 లక్షలు

దిల్లీ: జీఎస్‌టీ విధానం కింద ఇప్పటిదాకా 36 లక్షల మంది వ్యాపారస్తులు తొలి పన్ను రిటర్నులను దాఖలు చేసినట్లు అత్యున్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. అన్ని రిటర్నులు వచ్చాక.. మొత్తం పన్ను వసూళ్ల గణాంకాలు వెల్లడవుతాయని తెలిపారు. ఆగస్టు 25తో తొలి నెల వారీ రిటర్నులు, పన్ను చెల్లింపులకు గడువు ముగిసింది. అయితే ఆగస్టు 25లోగా స్వయం మదింపు ఆధారంగా పన్నులు చెల్లించిన వారు 28లోగా రిటర్నులు దాఖలు చేసుకోవడానికి అనుమతి ఉంది. మరోవైపు కంపెనీ నుంచి ఉద్యోగి పొందే నగదేతర ప్రయోజనాలు కూడా జీఎస్‌టీ కిందకు వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.



జైలు శిక్ష తీర్పుపై శామ్‌సంగ్ అధినేత పిటిషన్

సియోల్: స్థానిక కోర్టు తనకు ఐదేళ్ల జైలు శిక్ష విధించడాన్ని సవాలు చేస్తూ శామ్‌సంగ్ గ్రూపు అధినేత లీ జే యాంగ్ పిటిషన్ దాఖలు చేశారు. లీ తరఫు న్యాయవాది కిమ్ జుంగ్ హు సోమవారం ఈ పిటీషన్‌ను దాఖలు చేసినట్లు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు అధికారిక వెబ్‌సైట్ ప్రకారం తెలుస్తోంది. పిటీషన్‌కు సంబంధించి ఇంతకుమించి మరిన్ని వివరాలు ఆ వెబ్‌సైట్‌లో లేవు. మరోవైపు లీకి కఠిన శిక్ష విధించాలని కోరుతూ పిటీషన్ దాఖలు చేసేందుకు ప్రభుత్వ తరపు న్యాయవాదులు (ప్రాసిక్యూటర్లు) సిద్ధమవుతున్నారు. అయితే ఈ పరిణామాలపై స్పందించేందుకు శామ్‌సంగ్ అధికార ప్రతినిధి నిరాకరించారు.

వేబిల్లు అవసరమా..!



వేబిల్లు.. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో వ్యాపారులను కలవరపెడుతున్న పదాల్లో ఇది ఒకటి. అలాగని ఇది కొత్తదేమీ కాదు.. జీఎస్‌టీతోనే పుట్టుకొని రాలేదు. గతంలోని రాష్ట్రాల వ్యాట్, అమ్మకపు పన్ను విధానాల్లోనూ వేబిల్లును వాడేవారు. 'వేబిల్లు' అనే పదం గత కొన్ని దశాబ్దాలుగా వ్యాపారులకు సుపరిచితమే. ఇప్పుడు జీఎస్‌టీ అమల్లోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేబిల్లు వినియోగాన్ని ఆచరణలోకి తెస్తున్నాయి. అలాగని వేబిల్లును తప్పనిసరిగా ఉపయోగించాలనే నిబంధనేదీ కూడా ఇప్పటివరకు జీఎస్‌టీ విధానంలో భారత ప్రభుత్వం నిర్దేశించలేదు.



సతీష్ సరాఫ్

సరకు రవాణా జరిగినప్పుడు ఓవైపు సరఫరాదారు ఎలాగైతే ఉంటాడో.. మరోవైపు గ్రహీతా ఉంటాడు. వేబిల్లును అన్నివేళలా సరఫరాదారు ఒక్కడే జారీ చేయాల్సిన అవసరం లేదు. గ్రహీత కూడా ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో గ్రహీతా, సరఫరాదారు ఇద్దరిలో ఎవరో ఒకరు జారీ చేసినా సరిపోతుంది. మరికొన్ని సందర్భాల్లో వేబిల్లు అవసరం లేకుండానే సరకు రవాణా చేయొచ్చు. ఏయే సమయంలో వేబిల్లు అవసరం అవుతుందో.. ఎప్పుడు అక్కర్లేదో తెలియాలంటే ముందుగా వేబిల్లు నియమ నిబంధనలు తెలిసుండాలి. ముఖ్యంగా ఆయా రాష్ట్రాల్లో వేబిల్లు నిబంధనలపై వ్యాపారులు, సామాన్య ప్రజలు అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం.

తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

- జీఎస్‌టీ చట్టంతో సంక్రమించిన అధికారాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో సరకు రవాణాపై వేబిల్లుల వినియోగాన్ని 24.07.2017 నుంచి తప్పనిసరి చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా వేబిల్లుల వినియోగాన్ని 16-08-2017 నుంచి తప్పనిసరి చేస్తూ ఆగస్టు 9న నోటిఫికేషన్ జారీ చేసింది.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో వేబిల్లుల వినియోగ విధానాన్ని ఈకింద చూద్దాం.

ఎప్పుడు వాడాలి..

- ఫలానా రాష్ట్ర పరిధిలో వస్తువుల సరఫరా చేసినా/ సరఫరా అయినా (అవుట్‌వార్డ్, ఇన్‌వార్డ్) వేబిల్లును ఉపయోగించాలి.
- జీఎస్‌టీ కింద నమోదైన వారు, నమోదుకాని వారు, నమోదుకు అర్హత ఉన్నవారు పన్ను రశీదు, డెలివరీ చలానా తదితరాలతో కలిపి వేబిల్లును ఇవ్వాల్సి ఉంటుంది.
- జీఎస్‌టీ పన్ను పరిధిలోకి వచ్చే వస్తువులను సరఫరా చేసినప్పుడు ఇవ్వాలి.
- సరఫరా చేసిన సరకు విలువ రూ.50,000 మించినప్పుడు వేబిల్లును ఉపయోగించాల్సి ఉంటుంది.

ఎవరు ఇవ్వాలి..: సరకు రవాణా సమయంలో ఎవరెవరు వేబిల్లును జారీ చేయాలో పట్టిక-1, పట్టిక-2లో చూద్దాం.

ఒక్కటే గడువు..: తెలుగు రాష్ట్రాలు రెండూ వేబిల్లు వినియోగానికి సంబంధించి ఒకే తరహాలో కాలపరిమితిని నిర్ణయించాయి. ఇక్కడ కాలపరిమితి అంటే.. వేబిల్లు జారీ చేసిన సమయం దగ్గర నుంచి గమ్యస్థానానికి సరుకు చేరే లోపు ఎప్పటివరకు వేబిల్లును ఉపయోగించేందుకు వీలుందో ఆ సమయం అన్నమాట. ఆ వివరాలు పట్టిక-3లో

ఎప్పుడు అవసరం లేదు..: వేబిల్లులను అన్ని వేళలా జారీ చేయాల్సిన అవసరం లేదు. కొన్ని సందర్భాల్లో వేబిల్లు అవసరం లేకుండానే సరకులను రవాణా చేయొచ్చు. ఆ సందర్భాలేమిటో ఇలా..

- ఇన్‌వాయిస్ విలువ రూ.50,000 లోపుంటే
- ఒక వ్యక్తి తన సొంత ఇంటికి అవసరమైన వస్తువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేసినప్పుడు
- జీఎస్‌టీ పరిధిలో లేని వస్తువులు
- జీఎస్‌టీ కింద పన్ను వర్తించని మద్యం, పెట్రోలు, డీజిలు, సహజ వాయువు, ఇతర పెట్రోలియమ్ ఉత్పత్తులను సరఫరా చేసినప్పుడు

వేబిల్లు రూపొందించడం ఎలా..

జీఎస్‌టీ డీలర్లు స్టేట్ వ్యాట్ పోర్టల్ నుంచి జీఎస్‌టీ వేబిల్లుల జారీకి ప్రత్యేక లాగిన్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. వేబిల్లు తయారీ సమయంలో సరఫరాదారు, గ్రహీత ఈకింద వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ★ రవాణా, వాహన వివరాలు ★ సరఫరాదారు వివరాలు ★ గ్రహీత వివరాలు ★ దస్త్రాల వివరాలు ★ వాహనదారు పేరు, చిరునామా ★ సరఫరా వస్తువుల వివరాలు

వాహనం మధ్యలో ఆగిపోతే..: సరకు రవాణా చేస్తున్న వాహనం మధ్యలో ఆగిపోతే రవాణాదారు/ సరఫరాదారు/ గ్రహీత ఎవరైతే వేబిల్లును జారీ చేశారో ట్రాన్స్‌షిప్‌మెంట్ డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే ఆ వస్తువులను మరో వాహనం ద్వారా పంపించాలి. ట్రాన్స్‌షిప్‌మెంట్ డిక్లరేషన్ సమయంలో ఆ రెండో వాహనంతో వేబిల్లు, ట్రాన్స్‌షిప్‌మెంట్ డిక్లరేషన్, ఇతర డాక్యుమెంట్లు తప్పనిసరిగా కలిగిఉండాలి.

గమనించాల్సినవి..

- తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఒక వ్యక్తి సరుకు రవాణా చేసే సమయంలో సరఫరాదారు, గ్రహీత జారీ చేసిన రెండు వేబిల్లులు తప్పనిసరిగా ఉండాలి. ✦ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సేవలందించే వారు వస్తువులను సరఫరా చేసినప్పుడు వేబిల్లు నోటిఫికేషన్‌లో నిబంధనలు పొందుపరచలేదు. ✦ నోటిఫికేషన్ ప్రకారం ఫలానా దూరానికి వేబిల్లు వినియోగం నుంచి మినహాయింపంటూ ఏదీ లేదు. ✦ వేబిల్లులో ఏమైనా తప్పులు దొర్లితే జారీ చేసిన సమయం నుంచి 24 గంటల్లోపు దానిని రద్దు చేయాల్సి ఉంటుంది.

జాగ్రత్త అవసరం..: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలే కాకుండా దేశంలో మరికొన్ని రాష్ట్రాలు కూడా వేబిల్లుల జారీని తప్పనిసరి చేస్తూ నోటిఫికేషన్‌ను జారీ చేశాయి. వ్యాపారులు వేబిల్లుల రూపకల్పన, జారీ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. తప్పుడు వేబిల్లును సమర్పిస్తే పన్నుతో పాటు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

(రచయిత చార్టర్డ్ అకౌంటెంట్)

గమనిక: వేబిల్లుల నియమ నిబంధనలపై కొంత అవగాహన తేవడంలో భాగంగా పై వివరాలు తెలియజేశాం. అయితే ఏదేని అంశంపై పూర్తిగా తెలుసుకోవాలంటే చట్టంలోని సంబంధిత నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

పట్టిక-1 (ఆంధ్రప్రదేశ్)

లావాదేవీ	ఎవరు జారీ చేయాలి
రాష్ట్రాల మధ్య (అంతరాష్ట్ర)	1) ఏపీలో రిజిష్టర్ అయిన సరఫరాదారు 2) ఏపీలో రిజిష్టర్ అయిన/ కాని/ రిజిస్ట్రేషన్‌కు అర్హత ఉన్న గ్రహీత
రాష్ట్ర పరిధిలోనే సరఫరా	1) ఏపీలో రిజిష్టర్ అయిన సరఫరాదారు 2) సరఫరాదారు రిజిష్టర్ కాకుండా, గ్రహీత రిజిష్టర్ అయితే అప్పుడు గ్రహీత వేబిల్లు ఇవ్వాల్సి ఉంటుంది. 3) సరఫరాదారు, గ్రహీత ఇద్దరూ రిజిష్టర్ కాకుంటే సరఫరాదారు మాత్రమే వేబిల్లు ఇవ్వాలి.

పట్టిక-2 (తెలంగాణ)

లావాదేవీ	ఎవరు ఇవ్వాలి
ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి సరఫరా అయినపుడు (ఇన్‌వార్డ్)	తెలంగాణలో నమోదైన గ్రహీత
ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి సరఫరా చేసినప్పుడు (అవుట్‌వార్డ్)	తెలంగాణలో నమోదైన సరఫరాదారు
రాష్ట్ర పరిధిలోనే సరఫరా	1) తెలంగాణలో నమోదైన సరఫరాదారు,గ్రహీత 2) సరఫరాదారు రిజిష్టర్ కాకుండా, గ్రహీత రిజిష్టర్ అయితే అప్పుడు గ్రహీత వేబిల్లు ఇవ్వాల్సి ఉంటుంది.

పట్టిక-3

మూలం, గమ్యస్థానం మధ్య దూరం	వేబిల్లు ఉపయోగానికి గడువు
100 కి.మీలోపు	2 రోజులు
101 నుంచి 500 కి.మీల్లోపు	3 రోజులు
501 నుంచి 1000 కి.మీల్లోపు	5 రోజులు
1001 నుంచి 2000 కి.మీల్లోపు	10 రోజులు
2001 కి.మీ మించితే	12 రోజులు

5జీ స్పెక్ట్రమ్ విక్రయంపై చర్చలు ప్రారంభం



దిల్లీ: 5జీ, ఇతరత్రా స్పెక్ట్రమ్ వేలం తదుపరి దశ కోసం చర్చల ప్రక్రియను టెలికాం నియంత్రణాధికార సంస్థ ట్రాయ్ ప్రారంభించింది. గత వేలంలో 700 మెగాహెర్ట్జ్‌కు బిడ్డర్లెవరూ ముందుకు రాని సంగతి తెలిసిందే. తొమ్మిది ఫ్రీక్వెన్సీ బాండ్లలోని మొబైల్ స్పెక్ట్రమ్‌పై రిజర్వ్ ధర సహా వివిధ అంశాలపై ఈ ఏడాది ఏప్రిల్‌లో టెలికాం విభాగం(డాట్) నుంచి స్పందన కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ట్రాయ్ ఈ చర్చాపత్రంతో ముందుకు వచ్చింది. 2017లో వేలాన్ని నిర్వహించాలని డాట్ ప్రతిపాదించగా.. ఎపుడు తదుపరి వేలాన్ని నిర్వహించాలన్నదానిపై ట్రాయ్ స్పందన కోరింది. టెలికాం ఆపరేటర్లపై ఉన్న ఆర్థిక ఒత్తిడి నేపథ్యంలో దశల వారీగా నిర్వహించాలా లేదా అని కూడా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కాగా, ఈ ఏడాది వేలం ప్రక్రియపై ప్రభుత్వం తొందరపడకూడదని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(కాయ్) సలహానివ్వడం గమనార్హం. 5జీ స్పెక్ట్రమ్‌ను 2019లో నిర్వహిస్తే మంచిదని అభిప్రాయపడింది. చర్చాపత్రంపై స్పందించడానికి సెప్టెంబరు 25 వరకు గడువునిచ్చింది. ఆ తర్వాత అక్టోబరు 3 వరకూ ఈ స్పందనలపై వ్యాఖ్యానించడానికి సైతం గడువునిచ్చింది.

అంకురాలకు బాసట

● 100% ఎఫ్‌డీఐలకు అవకాశం ● విధాన పత్రం విడుదల

దిల్లీ: అంకురాలకు ప్రభుత్వం నుంచి మరో రూపంలో గట్టి మద్దతు లభించే అవకాశం కనిపిస్తోంది. విదేశీ వెంచర్ క్యాపిటల్ ఇన్వెస్టర్(ఎఫ్‌వీసీఐ)ల నుంచి 100 శాతం నిధులను సమీకరించడానికి అంకురాలకు తొలి సారిగా అనుమతినివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక సమీకృత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) విధాన పత్రాన్ని విడుదల చేసింది. దీని ప్రకారం..

- అంకురాలు ఈక్విటీ లేదా ఈక్విటీ అనుసంధానిత సెక్యూరిటీలు, లేదా డెట్ సెక్యూరిటీలను ఎఫ్‌వీసీఐలకు జారీ చేయడం ద్వారా విదేశీ నిధులను పొందొచ్చు.
- ప్రవాసులకు కన్వర్టబుల్ నోట్లను సైతం అంకురాలు జారీ చేయొచ్చు.
- ఒక భారత అంకుర కంపెనీ రూ.25 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తాన్ని ఒకే సారి పొందడానికి కన్వర్టబుల్ నోట్లను ప్రవాసులు కొనుగోలు చేయవచ్చు. నాన్ రీపాట్రియేషన్ పద్ధతిలోనూ ప్రవాసులు కన్వర్టబుల్ నోట్లను పొందొచ్చని ఆ చర్చాపత్రం చెబుతోంది.

ప్రస్తుతం అంకురాలు ప్రవాసులకు కన్వర్టబుల్ నోట్లను జారీ చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి.

దీపావళికి రెనో కాప్చర్!

దిల్లీ: రెనో తన 'ఎస్‌యూవీ కాప్చర్' కారును దీపావళికి విడుదల చేసే అవకాశం ఉంది. ఈ కారును భారత విపణిలోకి డిసెంబరు త్రైమాసికంలో విడుదల చేస్తామని రెనో కంపెనీ భారత యాజమాన్య సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సుమిత్ సానే పీటీఐ కి తెలిపారు. కానీ దీపావళికి విడుదల చేస్తారా లేదా అనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. ఈ కారులో 5 సీట్ల సామర్థ్యం, క్రాస్ ఓవర్ డీఎన్‌ఏ, ఫ్రెంచ్ నమూనా, ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్స్ వంటి ఫీచర్లు ఉన్నాయని సానే వెల్లడించారు. విశ్లేషకుల అంచనా ప్రకారం.. ఈ కారు 1.6 లీటర్ పెట్రోల్, 2 లీటర్ల డీజిల్ వంటి రెండు రకాల ఇంజిన్లలోనూ లభ్యం కానుంది. దీని ధర సుమారు రూ.12లక్షలుగా ఉండనుంది. ఈ కారు హ్యుందాయ్ క్రెటా, మహీంద్రా ఎక్స్‌యూవీ500, టాటా హెక్సా, నిస్సాన్ కిక్స్ వంటి కార్లకు దీటుగా రానున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే పది లక్షల కార్లు అమ్ముడయ్యాయనీ.. భారత్‌లోనూ ఇదే స్థాయిలో కొనుగోళ్లు జరుగుతాయని ఆశిస్తున్నామనీ సానే పేర్కొన్నారు. దేశీయంగా విడుదలయ్యే ఈ కారు డస్టర్ కారు కన్నా పై స్థాయిలో ఉంటుందన్నారు. 2020 నాటికి మొదటి అయిదు స్థానాల్లో నిలవాలన్న కంపెనీ ప్రణాళికను ఇప్పటికే చేరుకున్నామన్నారు.



నీలేకని రాకతో ఇన్ఫీ రాణిస్తుంది

● ఆరేళ్లలో అత్యుత్తమ స్థాయికి
● సీఎల్ఎస్ఏ నివేదిక

దిల్లీ

ఇన్ఫోసిస్ ఛైర్మన్‌గా నందన్ నీలేకని అడుగుపెట్టడంతో వచ్చే ఆరేళ్లలో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ అత్యుత్తమంగా పరుగులు తీయడం ప్రారంభిస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఆయన నేతృత్వంలో కంపెనీ తన నాయకత్వ స్థిరత్వాన్ని అందుకుంటుందని, కార్పొరేట్ పాలనపై జరుగుతున్న వివాదాలను పరిష్కరించుకుంటుందని, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుందని సీఎల్ఎస్ఏ తన నివేదికలో పేర్కొంది. వ్యవస్థాపకులు, యాజమాన్యం మధ్య కార్పొరేట్ పాలన విషయంలో జరిగిన ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో సీఈఓ విశాల్ సిక్కా నిష్క్రమించగా.. గత వారం ఛైర్మన్‌గా నీలేకని పగ్గాలు చేపట్టిన సంగతి తెలిసిందే. అదే సమయంలో అప్పటిదాకా ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన శేషశాయి, మరో ముగ్గురు డైరెక్టర్లు రాజీనామా చేసిన విషయమూ విదితమే.

కొత్త ఛైర్మన్ వచ్చిన నేపథ్యంలో సీఈఓ ఎంపిక వేగవంతం అవుతుందని, వ్యూహాలను తిరిగి మదిస్తారని.. ఇవి కంపెనీలకు సానుకూలతలను తెచ్చిపెడతాయని సీఎల్ఎస్ఏ అంచనా వేసింది. మరో పక్క పరిశ్రమ దిగ్గజం గణేశ్ నటరాజన్ మాట్లాడుతూ 'ఇన్ఫోసిస్ ఏ ఏ చర్యలు చేపట్టాలో ఆ చర్యలను తీసుకోవాలి. బోర్డు బాధ్యతాయుతంగా ఉండాలి. యాజమాన్యానికి కావలసిన విధంగా సహకరించాల'న్నారు. ఇన్ఫోసిస్‌కు ప్రస్తుతం ఒక దీర్ఘకాల దృష్టిగల సీఈఓ అవసరం ఉందని నటరాజన్ అన్నారు. బోర్డుతో పాటు.. బయటి గ్రూపులను సైతం సమర్థంగా నిర్వహించే వ్యక్తి అవసరమన్నారు.

రవి వెంకటేశన్‌కు కిరణ్ మజుందార్ షా మద్దతు: రవి వెంకటేశన్‌ను కొంత మంది వాటాదార్లు విమర్శించిన నేపథ్యంలో ఇన్ఫోసిస్ స్వతంత్ర డైరెక్టర్ కిరణ్ మజుందార్ షా మద్దతు పలికారు. ఆయనో విలువైన బోర్డు సభ్యుడని పేర్కొన్నారు. 'వెంకటేశన్‌ను రాజీనామా చేయాలని కోరడం భావ్యం కాదు. నందన్ నీలేకని కూడా వెంకటేశన్‌ను ఒక విలువైన బోర్డు సభ్యుడిగానే భావిస్తున్నారు. ఎలాంటి విశ్వసనీయమైన సమాచారం లేకుండా వ్యాఖ్యలు చేయడం సరికాద'ని అన్నారు.

బైబ్యాక్‌పై ప్రమోటర్ల ఆసక్తి: ఇన్ఫీ

కంపెనీ ప్రకటించిన రూ.13,000 కోట్ల షేర్ల తిరిగి కొనుగోలు(బైబ్యాక్) పథకంపై ప్రమోటర్లు ఆసక్తి వెలిబుచ్చినట్లు ఇన్ఫోసిస్ తెలిపింది. ప్రతిపాదిత బైబ్యాక్‌లో పాల్గొనన్నుట్లు ప్రమోటర్ల నుంచి సమాచారం అందిందని ఇన్ఫీ వివరించింది. అయితే ఎవరెవరు ఎంత మేర బైబ్యాక్ చేస్తున్నారన్న వివరాలను మాత్రం బయటకు వెల్లడించలేదు. ఎన్ఆర్ నారాయణమూర్తి సహా ప్రమోటర్లకు 12.75 శాతం వాటా ఉంది.



మార్కెట్లోకి హ్యుందాయ్ నెక్ట్స్‌జెన్ వెర్నా

హైదరాబాద్ (మాదాపూర్) న్యూస్‌టుడే: హ్యుందాయ్ మోటార్ ఇండియా తన ఐదో తరం 'నెక్ట్స్ జెన్ వెర్నా' హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేసింది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో హ్యుందాయ్ పరిశోధన, అభివృద్ధి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ బెక్ జి హంగ్, ప్రాంతీయ మేనేజర్ సలీం అమీన్‌లు ఈ సెడాన్‌ను ఆవిష్కరించారు. నూతన తరాన్ని ఆకట్టుకునేలా ఈ కొత్త వెర్నాను ఆధునిక పరిజ్ఞానంతో, ఆకర్షణీయ రూపంతో, స్మార్ట్ ఫీచర్లతో రూపొందించినట్లు హంగ్ పేర్కొన్నారు. పెట్రోలు కారు ధర రూ.7,99,900 (హైదరాబాద్ ఎక్స్ షోరూం) నుంచి, డీజిల్ మోడల్ ధర రూ.9,19,900 నుంచి మొదలవుతోంది. 50శాతం అడ్వాన్స్‌డ్ హై స్ట్రెంగ్త్ స్టీల్ (ఏహెచ్ఎస్ఎస్)తో, కే2 ప్లాట్‌ఫాంపై తయారు చేసిన నెక్ట్స్ జెన్ వెర్నాలో డ్రైవింగ్ చేసే వారికి సౌకర్యవంతంగా ఉండేందుకు వీలుగా అన్ని నియంత్రణలనూ ఏ మాత్రం ఇబ్బందిలేకుండా అమర్చారు. వేడి వాతావరణంలో చల్లగా ఉండే సీట్లు, స్మార్ట్ సన్‌రూఫ్‌లాంటి ఫీచర్లు కూడా జత చేశారు. ఆడియో, వీడియో, నావిగేషన్ కోసం తాకేతెర ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు ఉంది. ఏడు విభిన్న రంగుల్లో కారు లభిస్తోంది. గేర్లు, ఆటో ట్రాన్స్‌మిషన్ ఐచ్ఛికాలతో లభిస్తోంది. గేర్ల పెట్రోలు కారు లీటరుకు 17.70 కిమీ మైలేజీ, డీజిల్ గేర్ల కారు లీటరుకు 24.75 కిమీ తిరుగుతుందని హ్యుందాయ్ పేర్కొంది.



నెక్ట్స్ జెన్ వెర్నాతో హ్యుందాయ్ ఇండియా ఆర్అండ్‌డీ ఎండీ బెక్ జి హాంగ్, ప్రాంతీయ మేనేజర్ సలీం అమీన్

మనీలాండరింగ్ నియంత్రణ చట్టంలోకి రత్నాభరణాలు

ముంబయి: రూ.2 కోట్ల పైబడిన టర్నోవరు కలిగిన బులియన్, ఆభరణాల డీలర్లు అక్రమ నగదు చెలామణీ నియంత్రణ చట్టం(యాంటీ మనీ లాండరింగ్ యాక్ట్) కిందకు తీసుకురానున్నట్లు ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ఇంటలిజెన్స్ వీరిని నియంత్రిస్తారు. సవరించిన మనీ లాండరింగ్ నియంత్రణ నిబంధనలు-2005 కిందకు రూ. 2 కోట్లు పైబడిన అధిక విలువ లోహాలు, రత్నాలు, ఇతర అత్యధిక విలువ వస్తువులు కూడా రానున్నాయి. కాగా, తాజా పరిణామంపై వ్యాఖ్యానించడానికి చాలా వరకు ఆభరణ వర్తకులు స్పందించలేదు. పూర్తి స్థాయి వివరాలు వచ్చిన అనంతరమే ఎంత మేర ప్రభావం ఉంటుందో చెప్పగలమన్నారు. ఇకపై రూ. 2 కోట్ల పైడిన టర్నోవరు ఉన్న రత్నాభరణాల డీలర్లు తాము జరిపే రూ.50,000 పైబడిన విక్రయ లావాదేవీల విషయంలో పాన్, 'మీ క్లయింటు వివరాలు తెలుసుకో' వంటి వివరాలను ఇవ్వాల్సి ఉంటుందని ఇండియన్ బులియన్ అండ్ జువెలరీ అసోసియేషన్ ఛైర్మన్ సురేంద్ర మెహతా పేర్కొన్నారు.

అందుబాటు గృహాల కోసం ప్రభుత్వ రంగ సంస్థల భూములు!

దిల్లీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల వద్ద ఉన్న అదనపు భూములను అందుబాటు ధర గృహ ప్రాజెక్టులకు ఉపయోగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. సోమవారమిక్కడ జరిగిన నారెడ్కో స్థిరాస్తి సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ '2022 కల్లా అందరికీ గృహాలను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గృహాల సరఫరాను పెంచడానికి చాలా చర్యలు తీసుకుంది. వడ్డీల్లో సబ్సిడీని వంటి చర్యలనూ ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల అదనపు భూములను ఎలా ఉపయోగించుకోవచ్చన్నదానిపై ఓ నమూనాను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలతో మాట్లాడాం. పీఎస్‌యూల భూములపై ఇప్పటికే కొన్ని రాష్ట్రాలతో చర్చలు జరిపామ'ని గృహ, పట్టణ కార్యకలాపాల కార్యదర్శి దుర్గా శంకర్ మిశ్రా పేర్కొన్నారు.

ఏప్రిల్- జూన్‌లో వృద్ధి 6.5%: కేర్ రేటింగ్స్

ముంబయి: ఏప్రిల్- జూన్‌లో భారత జీడీపీ వృద్ధి 6.5 శాతానికి పెరగొచ్చని కేర్ రేటింగ్స్ అంచనా వేసింది. జనవరి-మార్చిలో ఇది 6.1 శాతంగా నమోదైంది. '2011-12 స్థిర ధరల వద్ద మొదటి త్రైమాసిక జీడీపీ వృద్ధి 6.5 శాతానికి పెరగొచ్చు. వాస్తవ స్థూల విలువ జోడింపు (జీవీఏ) వృద్ధి అయిన 6.3 శాతంతో పోలిస్తే ఇది అనూహ్యమేన'ని తెలిపింది. ప్రభుత్వ అధికారిక జీడీపీ గణాంకాలు రేపు విడుదలవుతాయి.

సంస్కరణలతోనే వ్యాపార సులభతరం

● పేదరిక నిర్మూలనకూ ఇదే మార్గం
● కార్మిక సంస్కరణలకు ప్రాధాన్యమివ్వాలి
● నీతి ఆయోగ్ నివేదిక

దిల్లీ: సంస్కరణలను చురుకుగా అమలు చేయడం ద్వారానే భారత్‌లో సులభంగా వ్యాపారం చేయడం మెరుగుపడుతుందని నీతి ఆయోగ్ నివేదిక అభిప్రాయపడింది. పేదరిక నిర్మూలనకు సైతం ఇదే మంచి మార్గమని, లక్షలాది మందికి మెరుగైన జీవితాన్ని అందించే అవకాశం ఉందని తెలిపింది. 'వ్యాపారాన్ని సులభతరం చేయడం: రాష్ట్ర సంస్థల నివేదిక' పేరుతో ఈ నివేదికను వెలువరించింది. ఇందులో కార్మిక సంస్కరణలు, సంస్థలు సులభంగా ప్రవేశించడం లేదా వైదొలగడం, చిన్న, భారీ సంస్థలు సమానావకాశాలకు నీతి ఆయోగ్ పెద్దపీట వేసింది. నీతి ఆయోగ్, ఐడీఎఫ్‌సీ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ఈ నివేదికను రూపొందించగా.. కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్మలా సీతారామన్ విడుదల చేశారు. కార్మిక చట్టాలను సంస్కరించడంతో పాటు వాటిని విజయవంతంగా అమలు చేయడం ద్వారా వ్యాపార సులభతరం చేయడం మెరుగుపడుతుందని నివేదిక అభిప్రాయపడింది. అన్ని రాష్ట్రాల్లో, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, అండమాన్, లక్షద్వీప్ మినహా అన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 23 తయారీ విభాగాల్లో 3000కు పైగా సంస్థల్లో నీతి ఆయోగ్ సర్వే జరిపింది. అరవింద్ పనగడియా అధ్యక్షతన వెలువడిన ఈ నివేదిక అనేక కొత్త విషయాలను తెలియజేయడంలో సందేహం లేదని నిర్మలా సీతారామన్ చెప్పారు. గత మూడేళ్లలో భారత్ చాలా మారిందని రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు.



నివేదికను విడుదల చేస్తున్న నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రవిశంకర్ ప్రసాద్

సెన్సెక్స్ ▲ 155	31751	
నిఫ్టీ ▲ 56	9913	
రూపాయి 63.91 ▲	(ఒక అమెరికా డాలరుకు)	13 పైసలు
బంగారం 29,395 ▲	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)	రూ.లలో 335
వెండి 39,225 ▲	ముంబయిలో కిలో	రూ.లలో 515
ముడి చమురు 51.85 ▼	(బ్రెంట్ ధర డాలర్లలో)	



ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,794	−20
నాస్‌డాక్	6,276	+11
నిక్కీ 225 (జపాన్)	19,450	−03
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,268	+08
షాంఘై(చైనా)	3,363	+31
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,401	−06
డాక్స్ (జర్మనీ)	12,123	−44


డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.13	67.40
పౌండ్ స్టెర్లింగ్	74.89	86.85
యూరో	69.30	80.36
జపనీస్ యెన్/100	53.25	61.75
ఆస్ట్రేలియా డాలరు	46.14	53.41
సింగపూర్ డాలరు	42.86	50.76
థాయ్ బాత్/100	174.84	209.09
బహ్రెయిన్ దీనార్	157.50	180.40
కువైట్ దీనార్	174.96	217.88
సౌదీ రియాల్	15.46	18.32
యూఏఈ దిర్హమ్	15.82	18.49
మలేషియా రింగిట్	13.34	16.40
చైనీస్ యువాన్	6.88	11.04





సోమవారం నిఫ్టీ కదలికలు

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో చలించొచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న మిశ్రమ సంకేతాలు ప్రభావం చూపొచ్చు. ఆగస్టు డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు దగ్గరపడటంతో మదుపర్లు ఆచితూచి అడుగేసే అవకాశం ఉంది. యూరో బలపడటంతో సోమవారం ఐరోపా మార్కెట్లు బలహీనపడగా, అమెరికా మార్కెట్లపై హరికేన్ 'హార్వే' ప్రభావం చూపింది. నేడు నిఫ్టీ 9870- 9960 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగిసే లోపు నిఫ్టీ మరో 60 పాయింట్లు పెరగొచ్చని అంటున్నారు. మార్కెట్ 50- 60 పాయింట్లు లాభపడితే.. షార్ట్ పొజిషన్లను తీసుకోవచ్చని బ్రోకరేజీ సంస్థలు సిఫారసు చేస్తున్నాయి. రాబోయే వారాల్లో నిఫ్టీ దిద్దుబాటుకు గురికావొచ్చని, దీని వల్ల సూచీ 9630 పాయింట్లకు చేరొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కంపెనీకి కొత్త నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నందన్ నీలేకని స్థిరత్వం తీసుకొస్తారన్న ఆశలతో ఇన్ఫోసిస్ షేరు లాభాలు కొనసాగించే అవకాశం ఉంది.

మళ్లీ 9900 ఎగువకు..

- నాలుగో రోజూ నిఫ్టీ పరుగులు
- 155 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు



సూచీలు వరుసగా నాలుగో రోజూ రాణించాయి. భారత్-చైనా సరిహద్దు దగ్గర గత కొంతకాలంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కొంతమేర సద్దుమణడంతో మదుపర్ల సెంటిమెంట్ మెరుగుపడటమే ఇందుకు నేపథ్యం. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు సైతం ఇందుకు తోడవ్వడంతో నిఫ్టీ మళ్లీ 9900 పాయింట్ల ఎగువకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం దోహదపడింది. ఆసియా మార్కెట్లు కళకళలాడగా, ఐరోపా షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి.

రోజంతా లాభాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 31,756.87 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఒకానొకదశలో 31,809.70 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివరకు 154.76 పాయింట్లు పెరిగి 31,750.82 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఒక నిఫ్టీ సైతం 55.75 పాయింట్ల లాభంతో 9,912.80 దగ్గర ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 9,882- 9,925.75 పాయింట్ల మధ్య కదలాడాయి.

ఇన్ఫోసిస్ వెలుగులు: ఇన్ఫోసిస్ షేరు దూకుడు కొనసాగింది. కంపెనీ కొత్త ఛైర్మన్‌గా నందన్ నీలేకనిని నియమిస్తున్నట్లు కంపెనీ ప్రకటించడంతో షేర్లు 3 శాతానికి పైగా లాభపడ్డాయి. ఒకానొకదశలో 4.49 శాతం పెరిగిన షేరు.. చివరకు 3.14 శాతం లాభంతో రూ.941.15 వద్ద ముగిసింది.

✦ ఇక అమెరికాకు చెందిన అంతర్జాతీయ న్యాయ సంస్థ రోసెన్ లా క్లాస్ యాక్షన్ కేసులు దాఖలు చేయడంతో డాక్టర్ రెడ్డీస్ షేరు డీలాపడింది. ఒకానొకదశలో 2.78 శాతం కోల్పోయిన షేరు.. చివరకు 2.01 శాతం నష్టంతో రూ.2,045.95 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభాలతో ముగిశాయి. ఎన్‌టీపీసీ 2.48%, హీరో మోటోకార్ప్ 2.21%, సన్‌ఫార్మా 1.96%, అదానీ పోర్ట్స్ 1.86%, హిందుస్థాన్ యునిలీవర్ 1.78%, ఏషియన్ పెయింట్స్ 1.66%, యాక్సిస్ బ్యాంక్ 1.02%, కోల్ ఇండియా 0.87%, ఎల్ అండ్ టీ 0.83%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.79%లు రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా మోటార్స్ (1.25%), పవర్‌గ్రిడ్ (1%), ఎస్‌బీఐ (0.41%), టీసీఎస్ (0.38%) చొప్పున నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే మన్నికైన వినిమయ వస్తువులు, ఐటీ, టెక్నాలజీ, ఎఫ్‌ఎమ్‌సీజీ, విద్యుత్, యంత్ర పరికరాలు, స్థిరాస్తి, పీఎస్‌యూ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

'నాణ్యత'లో విశాఖ లారస్ విఫలం

యూఎస్‌ఎఫ్‌డీఏ నివేదికలో వెల్లడి

ముంబయి: విశాఖపట్నంలోని లారస్ ల్యాబ్స్ ముడి ఔషధాల తయారీ యూనిట్ల (1, 3)లో తయారైన ఔషధాల నాణ్యతను పరీక్షించే విధానాలు సరిగా లేవని, ఇవి తమ మార్గదర్శకాలకు అనుగుణంగా లేవని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) వెల్లడించింది. ఈ సదుపాయాలను ఈనెల 14-18న యూఎస్‌ఎఫ్‌డీఏ ప్రతినిధులు తనిఖీ చేశారు. పైన పేర్కొన్న అంశంతోపాటు రెండు లోపాలను గుర్తించి ఫారమ్ 483ని జారీ చేశారు. ముందుగా నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షల ఫలితం రాకపోతే.. దాన్ని 'అవుట్- ఆఫ్- స్పెసిఫికేషన్' అంటారు. ఈ రెండు యూనిట్లలో అవుట్ ఆఫ్ స్పెసిఫికేషన్ పరీక్షలను జాగ్రత్తగా పర్యవేక్షించలేదని, అనుకున్న ఫలితాలు రావడానికి పదే పదే పరీక్షలు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయని యూఎస్‌ఎఫ్‌డీఏ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. లారస్ ల్యాబ్స్ ఆదాయంలో 91 శాతం బల్క్ డ్రగ్గుల ద్వారానే లభిస్తోంది. నాలుగు యూనిట్లలో వీటిని లారస్ ల్యాబ్స్ తయారు చేస్తోంది. వాటిలో ఒకటి, మూడు యూనిట్లకు 483 ఫారమ్ జారీ అయింది. రెండో యూనిట్‌లో ఏప్రిల్-జూన్‌లలో తనిఖీలు జరిగాయి. ఈ యూనిట్‌లో ఏ లోపాలు లేనట్లు యూఎస్‌ఎఫ్‌డీఏ వెల్లడించింది.

అమెరికా విపణిలోకి రెడ్డీస్ ఔషధం

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మరో జనరిక్ ఔషధాన్ని అమెరికా విపణిలోకి ప్రవేశపెట్టింది. బాక్టీరియా వల్ల సోకే అంటు వ్యాధులను (ఇన్‌ఫెక్షన్లు) నివారించడానికి నోటి ద్వారా తీసుకునే సెఫిగ్జిమ్ జనరిక్ ఔషధాన్ని విడుదల చేసినట్లు కంపెనీ వెల్లడించింది. 100 ఎంజీ/5ఎంఎల్, 200 ఎంజీ/5ఎంఎల్ మోతాదుల్లో దీన్ని విక్రయిస్తారు. యాంటీ బయాటిక్ అయిన 'సుప్రాక్స్' (సెఫిగ్జిమ్) బ్రాండ్‌కు డాక్టర్ రెడ్డీస్ ఔషధం జనరిక్. 2017, జూన్‌తో ముగిసిన ఏడాది కాలానికి అమెరికాలో సుప్రాక్స్, దాని జనరిక్ ఔషధాల విక్రయాలు 50.5 మిలియన్ డాలర్లు ఉన్నట్లు అంచనా. అస్టెల్లాస్ ఫార్మా ఐఎన్‌సీ సుప్రాక్స్ రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్‌ను కలిగి ఉంది.

మహీంద్రా అండ్ మహీంద్రా నుంచి ట్రాక్‌స్టార్ ట్రాక్టర్లు

దిల్లీ: మహీంద్రా & మహీంద్రా కొత్త శ్రేణి ట్రాక్టర్లను సోమవారం విడుదల చేసింది. మహీంద్రా అండ్ మహీంద్రా(ఎం అండ్ ఎం), గుజరాత్ ప్రభుత్వ భాగస్వామ్యంతో గ్రోమాక్స్ సంస్థను ఏర్పాటు చేశారు. కొత్త బ్రాండ్ కింద 'ట్రాక్‌స్టార్' ట్రాక్టర్ల శ్రేణిని గ్రోమాక్స్ రూపొందించింది. 30 నుంచి 50 అశ్విక సామర్థ్యం గల ట్రాక్టర్లను కొత్త బ్రాండ్ కింద తయారు చేసినట్లు ఎం అండ్ ఎం వెల్లడించింది. రైతులను దృష్టిలో పెట్టుకునే ఈ ట్రాక్టర్లను తయారుచేశామనీ..వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు ఇది దోహదం చేస్తుందని తెలిపింది. ఈ భాగస్వామ్య ఒప్పందం ప్రకారం గ్రోమాక్స్‌లో ఎం అండ్ ఎంకు, గుజరాత్ ప్రభుత్వానికి 60:40 నిష్పత్తిలో వాటా ఉంది. ఈ బ్రాండ్ విడుదల సందర్భంగా ఎం అండ్ ఎం అధ్యక్షుడు(వ్యవసాయ పనిముట్ల విభాగం) రాజేశ్ జెజురికర్ మాట్లాడుతూ..కంపెనీ ప్రయాణంలో గ్రోమాక్స్ కీలకమైనదని, వ్యవసాయాన్ని యాంత్రీకరణ దిశగా మలిచేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. మహీంద్రా, స్వరాజ్ ట్రాక్టర్‌ల తర్వాత ఈ కొత్త రకం శ్రేణి ట్రాక్‌స్టార్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కంపెనీ వృద్ధి లక్ష్యాన్ని ముందుకు నడిపించేందుకే గ్రోమాక్స్‌ను ఏర్పాటు చేశామనీ ఎం అండ్ ఎం పేర్కొంది. కంపెనీకి వడోదరలో తయారీ కేంద్రం ఉంది.

మూడేళ్లలో 25 మి. డాలర్ల పెట్టుబడి

- ఆర్ & డీ కేంద్రాన్ని విస్తరించనున్న హోస్ట్ అనలిటిక్స్

ఈనాడు, హైదరాబాద్: క్లౌడ్ ఆధారిత ఎంటర్‌ప్రైజెస్ పర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ (ఈపీఎం) సేవలను అందించే హోస్ట్ అనలిటిక్స్ హైదరాబాద్‌లో ఉన్న పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని విస్తరించనుంది. మాదాపూర్‌లో 30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది ఏర్పాటు కానుంది. అమెరికా, హైదరాబాద్‌లో ఒకేసారి ప్రారంభమైన ఈ సంస్థకు ఇక్కడ ఇప్పటికే 150 మంది ఉద్యోగులు ఉన్నారు. కొత్త విస్తరణలో భాగంగా రానున్న మూడేళ్ల కాలంలో 25 మిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టనుంది. ఉద్యోగుల సంఖ్యను కూడా 300కు పెంచనున్నట్లు సంస్థ సీఈఓ డేవ్ కిలోగ్ ప్రకటించారు. కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలను వివరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యాపార సంస్థల్లోని చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లకు అవసరమైన అన్ని రకాల సేవలను తాము అందిస్తున్నట్లు తెలిపారు. ఈపీఎం మార్కెట్ విలువ దాదాపు 16.9బిలియన్ డాలర్లు ఉందని ఇది ఏటా 8శాతం వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. తమ సంస్థ వాటా 4.5బిలియన్ డాలర్లనీ, 11శాతం చొప్పున వృద్ధి సాధిస్తున్నట్లు తెలిపారు. 90కి పైగా దేశాల్లో..650 ఖాతాదారులు ఉన్నట్లు వివరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా, వాటిని సమర్థంగా నియంత్రించేందుకు అవసరమైన రక్షణ ఎప్పటికప్పుడు పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు, కోడింగ్ తదితర అంశాల్లో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. కృత్రిమ మేధస్సు, యాంత్రికత విషయంలోనే ఎక్కువగా పరిశోధన, అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. సంస్థ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ రాన్ బాడెన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ వ్యాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హోస్ట్ అనలిటిక్స్ సీఈఓ డేవ్ కిలోగ్. చిత్రంలో రాన్ బాడెన్, సంజయ్ వ్యాస్.

అధిక లాభాలిస్తామనే పథకాల జోలికెళ్లొద్దు

యువతకు సెబీ సలహా

మథుర: అసాధారణ ప్రతిఫలాలు అందిస్తామంటూ ఊరించే పథకాలు.. ముఖ్యంగా పోంజీ వంటి పథకాల పట్ల యువత జాగ్రత్తగా ఉండాలని మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ పేర్కొంది. 'అత్యాశ పడడానికి బదులు.. మదుపర్లు ఆయా పథకాల నిబంధనలను పూర్తిగా చదవడం మంచిదని సలహానిస్తున్నాం. ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టాల'ని సెబీ డీజీఎమ్ సూర్య కాంత్ శర్మ పేర్కొన్నారు. బీఎస్‌ఈ, సెబీలు సంయుక్తంగా నిర్వహించిన 'ఇన్వెస్టర్స్ ఎడ్యుకేషన్' సెమినార్‌లో ఆ భాగంగా ఆయన మాట్లాడుతూ 'మదుపర్లు మోసాల బారిన పడకుండా తగిన రక్షణ ఉండాల్సిన అవసరం ఉంద'ని ఆయన నొక్కి చెప్పారు. ప్రభుత్వ పథకాల నుంచి ప్రయోజనాలను పొందేలా పేదలకు చైతన్యం కలిగించాలనీ శర్మ పేర్కొన్నారు.

మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ లాభం రూ.8 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి మోల్డ్-టెక్ ప్యాకేజింగ్ స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన రూ.8.05 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.7.94 కోట్లతో పోలిస్తే 1.27 శాతం పెరిగింది. స్థూల అమ్మకాలు 6.32 శాతం వృద్ధితో రూ.93.19 కోట్ల నుంచి రూ.99.08 కోట్లకు చేరినట్లు తెలిపింది. జీఎస్‌టీ అమలు ప్రభావం జూన్ నెల విక్రయాలపై ఉన్నప్పటికీ.. జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి అమ్మకాలు, లాభం సంతృప్తికరంగానే ఉన్నాయని మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) జె.లక్ష్మణ రావు తెలిపారు. కందెనలు, పెయింట్లు, ఆహార, ఎఫ్‌ఎంసీజీ తదితర రంగాలకు మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ ఉత్పత్తులను అందిస్తోంది. ఆహార, ఎఫ్‌ఎంసీజీ విభాగాల్లో సామర్థ్యాన్ని పెంచుకోవడానికి రూ.25 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ పెట్టుబడులతో హైదరాబాద్‌లోని ఈ విభాగాల సామర్థ్యం 1400 టన్నుల నుంచి 3,000 టన్నులకు చేరుతుంది.

బీఎస్‌ఈలో షేరు ధర 1.24 శాతం పెరిగి రూ.294.35 వద్ద ముగిసింది.

మార్కెట్ కబుర్లు

✦ ఆస్ట్రేలియాలో చేపట్టిన కార్మికేల్ బొగ్గు ప్రాజెక్ట్ పనులను అక్టోబరులో ప్రారంభించనున్నామని, 2020 మార్చి నాటికి బొగ్గు ఉత్పాదన మొదలవుతుందని **అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీ** తెలిపారు.

✦ **ఎన్‌టీపీసీ** ఓఎఫ్‌ఎస్ కోసం కనీస ధరను రూ.168గా నిర్ణయించింది. కంపెనీలో 5% వాటా విక్రయం ద్వారా మొత్తం రూ.7,000 కోట్లను సమీకరించాలని కేంద్రం భావిస్తోంది. రెండు రోజుల పాటు జరిగే ఓఎఫ్‌ఎస్‌లో ఒక వేళ అధిక స్పందన లభిస్తే మరో 5 శాతం వాటాను సైతం విక్రయించే అవకాశం ఉంది.

✦ నిఫ్టీ-50 నుంచి టాటా మోటార్స్ డీవీఆర్ సహా మూడు కంపెనీలు సెప్టెంబరు 29 నుంచి నిష్క్రమించనున్నాయి. సూచీ నుంచి వైదొలగనున్న కంపెనీల్లో **టాటా పవర్, ఏసీసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా**లు ఉన్నాయి.

✦ వివిధ వ్యాపార విభాగాల్లో **ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్**కు రూ.1,975 కోట్ల విలువైన ఆర్డర్లు లభించాయి.

✦ తమ వాటాదార్లకు ఒక షేరుకు గాను ఒక రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ షేరును ఉచితంగా ఇవ్వనున్నట్లు **రిలయన్స్ కేపిటల్** వెల్లడించింది. అయితే సెప్టెంబరు 6న షేర్లున్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుందని పేర్కొంది.

✦ బకాయిల చెల్లింపు నిమిత్తం కంపెనీలో 30 శాతం వాటాను అమ్మేందుకు **జైప్రకాశ్ పవర్ వెంచర్స్** బిడ్‌లను ఆహ్వానించింది.

✦ ఒడిశా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వరిస్తున్న **జిందాల్ ఇండియా థర్మల్ పవర్**లో 51 శాతం వాటాను అమ్మేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం బిడ్‌లను ఆహ్వానించింది.

✦ యాంటీ ఇన్‌ఫ్లేమటరీ ఔషధం ఇన్డోసిన్ జెనరిక్ రూపానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్‌ఎఫ్‌డీఏ) నుంచి తుది అనుమతులు లభించాయని **జుబిలెంట్ లైఫ్ సైన్సెస్** వెల్లడించింది.

✦ **బొంబే స్టాక్ ఎక్స్ఛేంజీ** ఎండీ, సీఈఓగా ఆశిష్ కుమార్ చౌహాన్ మరో ఐదేళ్లు కొనసాగేందుకు సెబీ అనుమతిని ఇచ్చింది.

✦ అల్జీరియాకు చెందిన సెవిటాల్ గ్రూపునకు ఇటలీలో ఉన్న అఫ్రేపి స్టీల్ మిల్లును 10 కోట్ల డాలర్లకు కొనేందుకు **జేఎస్‌డబ్ల్యూ స్టీల్** చర్చలు జరుపుతోంది.

ఇన్ఫోసిస్



రూ.943.95 వద్ద ప్రారంభమై రూ.938-953.95 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.912.15తో పోలిస్తే రూ.28.85 (3.16%) లాభంతో రూ.941 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో చేతులు మారిన షేర్లు 2,03,56,054.

డాక్టర్ రెడ్డీస్



రూ.2084 వద్ద మొదలై రూ.2027.10-2089.75 మధ్య చలించి క్రితం ముగింపు రూ.2088.15తో పోలిస్తే రూ.38.75 (1.86%) నష్టంతో రూ.2049.40 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో 8,44,176 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

బజాజ్ ఫైనాన్స్	1837.40
హెరిటేజ్ ఫుడ్స్	1440.00
ఇండియాబుల్స్ హౌసింగ్	1237.95
అవెన్యూ సూపర్‌మార్ట్స్	1057.00
సీఈఎస్‌సీ	1026.65
పిడిలైట్ ఇండస్ట్రీస్	843.70
రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్	775.00
టాటా స్టీల్	642.90
అంబుజా సిమెంట్	281.90


52 వారాల కనిష్ఠం (రూ.లలో)

జేబీ కెమికల్స్	280.00
రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్	55.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
28/08	5,927	6,052	−125	2,546	2,070	476
23/08	3,415	4,244	−829	2,843	2,408	435
22/08	3,415	4,244	−829	2,843	2,408	435
17/08	3,453	4,434	−981	2,765	1,936	829
16/08	5,400	6,490	−1,090	3,570	2,233	1,337

28వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) — కోడిగుడ్లు



(100కు రూపాయలలో)

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
29న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్‌ఎస్‌ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1815.70 (1781.50) 512719
ADANI PORT & 387.50 (380.05) 3245331
AMBUJA CEMEN 279.35 (275.40) 2031129
ASIAN PAINTS 1155.90 (1135.60) 751938
AUROBIND PHA 743.35 (732.15) 2297583
AXIS BANK LT 510.60 (506.85) 3724389
BAJAJ AUTO L 2742.05 (2728.55) 227147
BANK OFBAROD 144.25 (142.85) 10531819
BHARTI AIRTE 434.40 (432.95) 2529369
BHARTI INFRA 386.70 (383.90) 1402650
BOSCH LTD 21843.35 (21676.25) 20425
BPCL 508.00 (508.20) 3110427
CIPLA 574.10 (574.05) 905222
COAL INDIA L 243.60 (241.30) 2231233
DR. REDDYS 2049.40 (2088.15) 844176
EICHER MOTOR 31288.35 (30750.90) 47279
GAIL 382.00 (383.00) 2374961
HCL TECH 867.65 (867.50) 896254
HDFC 1766.45 (1757.35) 4268581
HDFC BANK 1762.25 (1762.50) 376946
HERO MOTOCOR 3959.20 (3882.65) 435266
HINDALCO IND 233.55 (233.00) 5152003
HINDUSTAN UN 1199.70 (1179.70) 630713
ICICI BANK 300.90 (297.70) 8827300
INDIABULLS H 1223.25 (1210.35) 782937
INDIAN OIL 440.70 (428.20) 6117189
INDUSINDBANK 1660.55 (1667.70) 745075
INFOSYS LTD 941.00 (912.15) 20356054
ITC 282.45 (281.45) 9974428
KOTAK MAHIND 976.05 (972.10) 621906
LARSEN & TOU 1138.90 (1131.70) 1884734
LUPIN 991.20 (992.50) 1659832
M&M 1373.05 (1375.15) 1035223
MARUTI SUZIK 7579.00 (7612.85) 391028
NTPC LTD 173.30 (169.00) 5203237
ONGC 160.60 (159.45) 3680139
POWER GRID C 217.10 (220.95) 5486618
RELIANCE IND 1566.55 (1568.05) 2815328
SBI 279.35 (280.30) 10505317
SUN PHARMA 493.20 (483.00) 6388051
TATA CONSULT 2487.30 (2496.60) 1018398
TATA MOT DVR 225.20 (227.35) 1868486
TATA MOTORS 379.30 (384.15) 4403872
TATA POWER 78.85 (79.15) 2117665
TATA STEEL L 635.85 (639.00) 3565779
TECH MAHINDR 427.75 (427.70) 1888194
ULTRATECH 3984.15 (3939.65) 352378
VEDANTA LIMI 301.35 (298.55) 9151882
WIPRO 290.70 (289.40) 2143420
YES BANK LTD 1753.35 (1719.45) 1949997
ZEE ENTERTAI 517.90 (511.70) 1011745

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1364.35 (1349.70) 42283
ASHOK LEYLAN 105.70 (103.00) 11192216
BAJAJ FINANC 1829.95 (1760.10) 1347345
BAJAJ FINSER 5578.00 (5506.25) 214750
BEL 188.85 (187.95) 4338484
BHEL 127.95 (126.95) 2141709
BRITANNIA 4188.30 (4214.10) 150029
CADILA HEALT 501.95 (494.35) 1650380
COLGATE PALM 1100.25 (1093.75) 440426
CONTAINER 1286.90 (1267.80) 209473
CUMMINS INDI 895.25 (891.85) 141986
DABUR INDIA 312.70 (300.05) 1644473
DIVIS LAB 694.90 (673.40) 2008764
DLF LIMITED 180.10 (186.95) 29863787
EMAMI LIMITE 1076.80 (1075.05) 94248
GLAXOSMI CON 5356.40 (5295.60) 7288
GLAXOSMI PHA 2422.90 (2398.35) 11646
GLENMARK PHA 625.60 (616.30) 1245632
GODREJ CONSU 939.85 (917.45) 675982
HAVELLS INDI 489.35 (487.15) 942081
HINDUSTAN ZI 286.50 (283.95) 1067933
HPCL 463.30 (466.20) 4743249
ICICI PRU LI 431.50 (422.90) 980309
IDEA CELLULR 89.85 (90.00) 5239356
INTERGLOBE A 1185.95 (1186.60) 740868
JSW STEEL LT 244.50 (246.05) 3526749
LIC HOUS.FIN 656.60 (658.00) 2123949
MARICO LIMIT 318.25 (316.10) 1213344
MCDOWELL 2571.80 (2567.15) 330962
MOTHERSON 311.75 (310.50) 2106398
NHPC LTD 29.20 (29.75) 6776281
NMDC LTD 122.40 (122.20) 3457248
OIL INDIA 288.10 (283.40) 241503
ORACLE FIN S 3465.20 (3436.30) 27959
P&G HYG&HEAL 8265.50 (8156.45) 3167
PETRONET LNG 224.90 (226.55) 2456549
PIDILITE IND 836.15 (829.05) 592779
PIRAMAL ENTE 2690.65 (2676.75) 125379
PNB 144.85 (144.30) 5356187
POWER FIN CO 122.60 (121.40) 4443434
RURAL ELEC C 165.15 (160.80) 7991020
SAIL 61.50 (60.65) 3574745
SHREE CEMENT 17565.40 (16992.10) 19712
SHRIRAM TRAN 981.45 (975.00) 247808
SIEMENS 1292.60 (1265.15) 124833
SUN TV LTD 715.50 (712.45) 547833
TITAN IND 612.25 (606.80) 1284579
TORRENT PHAR 1238.25 (1226.35) 79924
UNITED BREWE 820.20 (812.70) 108954
UPL LIMITED 839.10 (833.10) 730266

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 178.10 (175.65) 928992
ADANI ENTERP 119.20 (109.15) 16245306
ADANI POWER 30.30 (28.55) 24596908
ALL BANK 68.65 (68.40) 2239453
AMARA RAJA 772.20 (777.20) 764716
ANANT RAJIND 56.50 (55.85) 564318
ANDHRA BANK 52.65 (52.40) 1406981
APOLLO HOSPI 1092.65 (1083.20) 224857
APOLLO TYRES 252.60 (257.00) 5360565
APTECH 302.40 (313.20) 2858254
BAJAJ ELECT. 340.90 (340.20) 128149
BAJAJ HIND 14.90 (14.90) 4074548
BAJAJ HOLDIN 2834.00 (2750.80) 48942
BALAJI TELE 170.10 (168.60) 517060
BALLARPUR IN 13.20 (13.00) 936912
BALRAMPUR CH 173.05 (166.00) 2235530
BANK OF MAHA 27.00 (27.15) 70270
BANK OFINDIA 143.75 (144.15) 4176278
BATA INDIA 681.05 (667.75) 657180
BGR ENERGY S 135.35 (134.80) 72639
BHARAT FORGE 1161.95 (1147.95) 325347
BHUSHAN STEE 70.00 (69.95) 749285
BIOCON LTD 344.10 (338.95) 1549324
BOMBAY DYE 92.60 (85.05) 12296759
CANARA BANK 339.05 (341.20) 1292097
CEAT LIMITED 1651.75 (1649.90) 550007
CENTRAL BANK 80.30 (73.55) 5472238
CHAMBAL FERT 148.85 (143.95) 1335611
CHENNAI PETR 417.05 (416.30) 804851
CITY UNIBANK 159.00 (162.20) 454482
CORPO BANK 46.55 (46.55) 121889
COX & KINGS 264.05 (262.50) 55681
D B REALTY L 37.10 (36.50) 264747
DELTA CORP L 186.45 (182.15) 4196498
DENA BANK 31.40 (31.15) 444993
DHANALAKBANK 34.55 (33.40) 701450
EDELWEISS CA 237.50 (236.10) 2180191
EDUCOMP SOLU 8.00 (8.20) 118156
EID PARRY 320.10 (315.40) 175340
EIH 133.15 (131.35) 67825
ESSAR SHIPPI 30.65 (25.55) 911606
ESTER INDUST 32.15 (31.50) 27821
EXIDE INDUST 200.05 (202.55) 2608325
FEDERAL BANK 109.65 (106.45) 4952851
FINOLEX CABL 534.20 (530.15) 55341
G E SHIP LTD 390.65 (389.50) 55655
GAMMON INDIA 8.35 (8.50) 532047
GAMMON INFRA 3.85 (3.90) 672234
GATI LIMITED 114.40 (113.80) 436082
GAYATRI PROJ 179.85 (176.30) 198573
GITANJALIGEM 61.25 (60.50) 403758
GMR INFRASTR 17.45 (17.25) 32962980
GODREJ IND 613.80 (604.65) 315393
GRASIM IND 1143.00 (1134.45) 864950
GUJ ALK&CHEM 433.60 (419.35) 367230
HCL INFOSYS 46.90 (45.15) 2279366
HEXA TECH 274.00 (274.15) 656392
HIMACHAL FUT 17.50 (17.30) 13337888
HINDU MOTORS 8.00 (8.10) 72723
HOUSING DEV 62.10 (61.60) 10677890
IDBI 56.00 (55.00) 1882463
IDFC 55.00 (54.60) 5637700
IFCI 23.85 (23.65) 4409898
IL&FS TRANS 83.35 (79.50) 376565
IND SWIFTLAB 34.15 (33.50) 22971
INDBULLS REL 231.80 (230.55) 8461079
INDIA CEM 180.25 (177.30) 2954360
INDIAN BANK 293.95 (294.95) 715275
INDO RAMA SY 27.25 (27.50) 35039
INDRAPRASTHA 1242.75 (1251.85) 446505
IND-SWIFTLTD 7.40 (7.45) 7329
INGERSOLL-R 808.75 (809.05) 4934
IOB 22.95 (22.95) 341004
IPCA LAB 417.35 (414.80) 76528
IRB INFRA DE 212.15 (212.55) 849387
J&K BANK 81.60 (81.95) 112319
JAI CORP 78.95 (77.65) 363459
JAIN IRRIGAT 98.20 (95.35) 4161508
JAYPEE INFRA 15.60 (14.90) 3099742
JAYSHREE TEA 100.55 (100.10) 42725
JET AIRWAYS 574.60 (574.25) 1095329
JINDAL SAW 91.20 (91.60) 343093
JINDAL STEEL 135.85 (135.15) 4814276
JK LAKSHMI C 413.05 (411.70) 54364
JK PAPER LIM 100.05 (99.25) 2142013
JM FINANCIAL 126.00 (126.25) 359310
JP ASSOCIATS 23.50 (23.35) 71555196
JSW ENERGY L 66.90 (63.80) 21281794
JUBILANT FOO 1382.50 (1393.55) 580508
JUBILANT ORG 718.10 (726.25) 355211

ఘనం (+)

నిఫ్టీ	28న	మార్పు %
INFOSYS	941.00	3.16
INDIAN OIL CORP	440.70	2.92
NTPC	173.30	2.54
SUN PHARMA	493.20	2.11
HERO MOTOCORP	3959.20	1.97
YES BANK	1753.35	1.97
ADANI PORT	387.50	1.96

గ్రహణం (-)

నిఫ్టీ	28న	మార్పు %
DR. REDDYS LAB	2049.40	-1.86
POWER GRID CORP.	217.10	-1.74
TATA MOTORS	379.30	-1.26
TATA MOTORS DVR	225.20	-0.95
TATA STEEL	635.85	-0.49
MARUTI SUZUKI	7579.00	-0.44
INDUSIND BANK	1660.55	-0.43

JYOTHY LABS 377.60 (377.75) 20621
KARNATA BANK 152.55 (151.45) 2099290
KEC INTL LTD 303.55 (296.20) 465243
KOLTE PATIL 161.85 (156.05) 112527
KPIT CUMMINS 118.10 (114.90) 766106
L&TFIN.HOLD 188.05 (174.85) 14135663
LAK VIL BANK 175.25 (177.20) 444748
M & M FINANC 418.40 (409.65) 1786058
MANAPPURAM G 95.60 (95.75) 4541543
MMTC LIMITED 56.35 (55.70) 348108
MOSER-BEAR 4.45 (4.50) 252022
MPHASIS LTD 614.45 (604.85) 63138
MRPL 128.00 (124.95) 2498302
MTNL 19.55 (19.55) 1337076
NCC LIMITED 86.50 (86.10) 1050660
NETWORK18 FI 50.30 (49.75) 182071
NEULAND LAB 1225.85 (1230.55) 2037
NIIT LTD 94.20 (94.45) 943083
NIIT TECHNOL 495.10 (497.10) 578555
OMAXE LTD 204.80 (203.65) 584563
ONMOBILE GLO 58.70 (58.55) 176447
ORIENT PAPER 94.30 (94.50) 218273
ORIENTALBANK 125.70 (124.35) 1365886
PATEL ENGG 71.00 (71.00) 100193
PFIZER 1811.45 (1813.20) 18234
POLARIS SOFT 242.15 (242.05) 27683
POWERTRADING 115.40 (114.80) 1834389
PRAJ IND 69.10 (68.90) 193902
PRISM CEMENT 110.05 (109.90) 43367
PUNJ LLOYD 19.20 (19.10) 692400
PUNJAB & SIN 49.00 (48.95) 47967
PURAVANKARA 71.35 (70.60) 106603
PVP VENTURES 5.40 (4.95) 473268
PVR LIMITED 1276.25 (1263.55) 183234
RADICO KHAIT 164.55 (165.00) 458566
RAJESH EXPOR 743.20 (719.90) 948931
RALLIS INDIA 231.00 (229.30) 142181
RAMCO IND 264.45 (243.50) 752638
RAMCO SYS 353.60 (347.65) 27689
RAMKY INFRA 83.10 (81.20) 67171
RAYMOND 765.15 (733.75) 451604
RELIANCE CAP 788.05 (776.90) 5549896
RELIANCE COM 23.25 (22.90) 10510360
RELIANCE INF 483.80 (479.90) 1710061
RELIANCE POW 40.25 (39.50) 1564284
ROLTA INDIA 53.35 (53.10) 230423
SAGAR CEMENT 814.75 (829.40) 9812
SAREGAMA 426.30 (395.55) 461845
SHANTHI GEAR 133.55 (132.65) 13936
SHIPPNG CORP 94.90 (94.70) 1188463
SHREE RENUKA 17.35 (17.35) 2415836
SINTEX IND 30.65 (30.00) 13411839
SOBHA DEVELO 384.70 (387.00) 97667
SOUTHINDBANK 28.00 (27.90) 6297398
SRS LIMITED 2.80 (2.70) 379954
STERLITE TEC 223.25 (217.10) 955667
SUJANA METAL 1.65 (1.60) 17617
SUN PHARMA 389.45 (391.90) 619698
SUND FASTNER 397.65 (392.55) 249331
SUZLON ENERG 16.65 (16.30) 32604351
SYND. BANK 65.55 (65.15) 1173068
TATA CHEM 589.70 (583.85) 1117309
TATA COFFEE 132.30 (132.05) 243151
TATA COMMUN 664.55 (641.55) 825547
TATA GLOBAL 193.30 (194.25) 3684762
TATA METALIK 636.20 (636.90) 59760
TATA TELESER 6.80 (6.75) 1125720
THE INDIAN H 112.85 (110.90) 338644
TORRENT POWE 213.65 (209.95) 1024247
TRIVENI ENGG 93.85 (92.60) 1285263
TTK PRESTIGE 6376.90 (6369.90) 550
TV TODAY NET 243.30 (242.60) 25844
TV18 BROADCA 36.85 (36.65) 1777307
TVS MOTOR 604.65 (595.15) 1123058
UCO BANK 31.50 (30.85) 356186
UNION BANK 136.65 (136.05) 1868001
UNITECH 7.65 (7.60) 23972877
UNITED BANK 18.45 (18.30) 436492
USHA MARTIN 19.20 (18.95) 640606
VADILAL INDU 857.15 (851.45) 10477
VENKYS 2026.65 (2032.70) 78867
V-GUARD IND 187.15 (182.25) 930900
VIJAYA BANK 70.85 (69.60) 1312606
VIP 222.05 (211.60) 1873730
VOLTAS 538.20 (521.00) 1969579
ZEE LEARN LI 42.80 (42.55) 103500
ZUARI GLOBAL 118.90 (118.60) 13343
ZYDUS WELLNE 878.35 (871.45) 3582

ALPHAGEO 768.75 (767.15) 2688
AMAR RAJA BA 772.05 (778.55) 535120
ANDHRA BANK 52.75 (52.30) 104090
ANDHRA CEMEN 9.26 (8.64) 32657
ANDHRA PAPER 295.25 (295.45) 2324
ANDHRA PETRO 31.35 (32.05) 58889
ANDHRA SUGAR 337.40 (336.95) 6959
ANJANI PORTL 236.15 (214.95) 8810
ASTRA MICROW 125.20 (122.35) 21091
AUROBINDO PH 741.35 (732.50) 177667
AVANTEL SOFT 259.45 (252.45) 8296
AVANTI FEEDS 1883.05 (1920.30) 13228
BALAJI AMIN 311.80 (311.20) 5561
BARTRONICS 13.95 (13.95) 15184
BHAGIRA CHEM 190.10 (199.85) 3700
BHAGYA NAG 21.65 (21.75) 6908
BRILLIANT SE 8.68 (8.27) 339978
CAMBRIDGE TE 77.90 (76.40) 1077
CONT COFFEE 281.40 (277) 5377
COROMAN FERT 441.15 (428.90) 8770
CUBEX TUB 16.35 (16.45) 1252
CYIENT LIMIT 534.95 (531.35) 9383
DECCAN CEMEN 1118.10 (1120.05) 650
DIVI'S LAB 694.60 (673.10) 198571
DR REDDY 2045.95 (2087.90) 78278
GATI CORPN 114.45 (113.50) 79545
GAYATRI PROJ 179.40 (175.45) 24043
GMR INFRASTR 17.45 (17.25) 1889389
GOLDST INFRA 143.90 (137.05) 169705
GRANULES (I) 130.15 (130) 106643

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 12.03 (11.46) 452345
HBL NIFE POW 44.95 (44.20) 34947
HERITAGE FOO 1423.70 (1373.05) 5125
HYD INDUS 1207.65 (1113.20) 15620
IDL INDUSTRS 525.05 (519.55) 2664
ILFS ENGINEE 40.65 (41.45) 12211
INNAREDY COM 2.70 (2.55) 5280
IVRCL INFRAS 5.01 (4.97) 76870
KAKATIYA CEM 346.25 (338.35) 3944
KALLAM SPG 31.50 (34) 137476
KAVERI SEED 549.05 (541.25) 29442
KNR CONSTRUC 214.45 (217.65) 2104
LANCO INDUS 361 (368.15) 6696
LANCO INFRAT 0.88 (0.92) 1574635
LAURUS LABS 513.20 (522.30) 23179
MADHUCON PRO 28.45 (28.55) 9770
MIC ELECTRON 7.82 (7.73) 20978
MOLD-TEK.TEC 53.15 (50) 65709
MOLDTK PLA 294.35 (290.75) 6435
NAGARJAGRICH 35.35 (34) 27118
NATCO PHARMA 714.20 (726.10) 62918
NAVA BH VENT 122 (121.85) 17716
NCC 86.55 (86.50) 92687
NCL IND 240.15 (231.50) 40270
NETTLINX 84.30 (82.75) 18375
NEULAND LAB 1235.95 (1236) 490
NILE 596.45 (594.05) 12822
PANYAM CEMEN 61.15 (58.95) 21538
PENNER IND 63 (61.65) 253614
PITTI LAMIN 61.10 (60.35) 27781
POKARNA 1258.65 (1246.90) 1384
PRISM CEMENT 110.10 (109.50) 9473
PRUDENTL PHA 3.99 (3.95) 65241
RAIN INDUSTR 145 (145.55) 231069
RAJ PACKAGIN 59.25 (60.60) 28571
SAMKRG PIST 263.90 (258.10) 3773
SATVAH. ISPA 46.30 (41.45) 136262
SMS PHARMA 79.25 (80.20) 14115
SPHERE GLOBA 46.40 (46.70) 17816
SREE RAYAL A 30.85 (30.30) 414280
SRINIVASA SH 72.80 (65.80) 20203
STEEL EXCHAN 82.60 (84.45) 61563
SUJANA UNIVE 0.97 (0.99) 27900
SURYALAKSH.C 99.40 (99.95) 1720
SUVEN PHARMA 166.75 (167.55) 25876
TAJ GVK HOTE 153.50 (155.95) 2871
TANLA 32.75 (32.10) 42000
TERA SOFTWAR 63.65 (61.30) 6239
VICEROY HOTE 18.40 (17.45) 64283
VIJAY TEXTIL 65.60 (63.40) 91871
VIMTA LABS 130.90 (130.25) 7044
VISAKA IND 627.05 (540.70) 186892
VISTA PHARMA 33.50 (32.50) 49187
VIVIMED LABS 102.55 (102.90) 51665
VST INDUS 2690.45 (2692.25) 95
YBRANT DIGIT 6.18 (6.44) 2081898
ZENTECH 50.50 (50.20) 13901

జన్‌ధన్‌తో కోట్ల ఆకాంక్షలకు రెక్కలు: మోదీ


దిల్లీ: జనధన్ యోజనకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించారు. జనధన్ యోజన, ముద్ర, స్టాండప్ ఇండియా వంటి సామాజిక భద్రత కార్యక్రమాల ద్వారా తమ ప్రభుత్వం కోట్లమంది ఆకాంక్షలకు రెక్కలు తొడిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. పేదల జీవితాల్లో నాణ్యమైన, పరివర్తనాత్మక మార్పు తీసుకొచ్చే కృషి కొనసాగుతుందన్నారు. సోమవారానికి జన్‌ధన్ యోజనకు మూడేళ్లు పూర్తయ్యాయనీ, కోట్ల మంది ప్రజల్ని, ముఖ్యంగా ఈ కార్యక్రమం నుంచి ప్రయోజనం పొందిన పేదల్ని అభినందిస్తున్నానని మోదీ ట్వీట్ చేశారు. జన్‌ధన్ విప్లవం పేదలు, అణగారిన వర్గాలను ప్రధాన ఆర్థిక జీవన స్రవంతిలోకి తీసుకొచ్చే ఒక చరిత్రాత్మక ఉద్యమమని వ్యాఖ్యానించారు.

భారత సాంస్కృతిక చరిత్రపై కొత్త కోర్సులు

కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్

దిల్లీ: భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల చరిత్రపై కొత్త కోర్సులకు జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) రూపకల్పన చేస్తుందని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ సోమవారం తెలిపారు. భారతీయ శిక్షణ మండల్ సహకారంతో ఇగ్నో 'భారత్ బోధ్' అనే అంశంపై ఉపన్యాసాల కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. అమూల్యమైన, విఖ్యాతమైన భారత చరిత్ర గురించి తెలుసుకోకుండా ప్రపంచం గురించి తెలుసుకోలేమని పేర్కొన్నారు. ఈమేరకు వివిధ కోర్సుల రూపకల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. తత్వశాస్త్రం (ఫిలాసఫీ), భారతీయ విద్య (ఇండాలజీ)ను అభ్యసిస్తున్న విద్యార్థులంతా ఉపన్యాసాలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. త్వరలోనే భారత్ బోధ్‌లో సర్టిఫికేట్ కోర్సును ప్రారంభించనున్నట్లు ఇగ్నో ఉప కులపతి రవీంద్రకుమార్ వెల్లడించారు.

అంతర్జాతీయ ఉపన్యాస పోటీలో విజేతగా భారత సంతతి వ్యక్తి


మనోజ్ వాసుదేవన్

సింగపూర్: కెనడాలో నిర్వహించిన అంతర్జాతీయ ఉపన్యాస పోటీలో సింగపూర్‌కు చెందిన భారత సంతతి వ్యక్తి విజేతగా నిలిచారు. సింగపూర్‌లో శాశ్వత నివాసి, ఇంజినీరైన మనోజ్ వాసుదేవన్(43) సహజసిద్ధమైన ఉపన్యాసకుడు కాకపోయినా, 2009లో సాధన ప్రారంభించారు. తనకు తాను శిక్షణ పొందేందుకు కార్యక్రమాల నిర్వాహకుడిగా, హాస్యకారుడిగా మారారు. పోటీ సందర్భంగా ప్రసంగంలో రాజీ, ఐక్యత ద్వారా ఆనందకరమైన దాంపత్య జీవితంపై ఆయనిచ్చిన సందేశం టోస్ట్‌మాస్టర్స్ ఇంటర్నేషనల్ ప్రపంచ ఉపన్యాస ఛాంపియన్‌షిప్‌లో న్యాయనిర్ణేతల్ని మెప్పించి స్వర్ణాన్ని సాధించింది. మనోజ్ గెలుపుతో సింగపూర్ వరసగా రెండేళ్లు ఛాంపియన్‌షిప్‌ను సాధించినట్లయింది. టోస్ట్ మాస్టర్స్ ఇంటర్నేషనల్‌లో 3.52 లక్షలకుపైగా సభ్యులున్నారు. 141 దేశాల్లో 16,400 క్లబ్‌లున్నాయి. సభ్యులు వీటిద్వారా తమ నాయకత్వ నైపుణ్యాల్ని పెంపొందించుకోవచ్చు.

భారత్‌లో విమానాల తయారీకి బోయింగ్ సిద్ధం

దిల్లీ: భారత్‌లో విమానాల తయారీ కార్మాగారం ఏర్పాటుకు అమెరికా రక్షణ రంగ దిగ్గజం బోయింగ్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎఫ్/ఏ 18 సూపర్ హార్నెట్ విమానాల సరఫరా ఒప్పందం తమకు దొరికితే వాటి తయారీ కేంద్రాన్ని భారత్‌లోనే ఏర్పాటు చేస్తామని సోమవారం ప్రతిపాదించింది. 57 బహుముఖ యుద్ధవిమానాల్ని కొనుగోలు చేసేందుకు భారత నౌకాదళం యత్నిస్తున్న నేపథ్యంలో తమ ఎఫ్/ఏ18 విమానాలు వారి అవసరాలకు సరిగ్గా సరిపోతాయని బోయింగ్ పేర్కొంది. భారత్‌లో భవిష్యత్తు తరం కర్మాగారాన్ని ఏర్పాటుదిశగా యోచిస్తున్నామనీ, సూపర్‌హార్నెట్ అత్యంత అధునాతమైన విమానమని కంపెనీ ఉన్నతాధికారి డ్యాన్ గిలియన్ వెల్లడించారు. సూపర్ హార్నెట్‌ల తయారీ కోసం 21వ శతాబ్దపు ఆధానిక కర్మాగారాన్ని నిర్మించగలమన్నారు భారత వైమానిక దళంలో మిగ్ 21 యుద్ధవిమానాలు పాతబడిన నేపథ్యంలో దీనిపైనా బోయింగ్ దృష్టిసారించింది.

విమానాన్ని ఆపిన ఎలుక

దిల్లీ: ఎగిరేందుకు సిద్ధంగా ఉన్న విమానంలో సిబ్బందికి అనుకోని అతిథి కనిపించడంతో ప్రయాణం తొమ్మిది గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. విమానంలో ఉన్నవారు ఊహించని ఆ అతిథి ఎలుక. ఈ సంఘటన దిల్లీలో ఆదివారం ఉదయం జరిగింది. దిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోకు 200 మందికి పైగా ప్రయాణికులతో బయలుదేరేందుకు సిద్ధమౌతున్న ఎయిరిండియా విమానంలో హఠాత్తుగా ఎలుక కనిపించింది. దీన్ని పంపించేందుకు విమానాన్ని పార్కింగ్ బేలో నిలిపి, పొగబెట్టే(ఫ్యుమిగేటెడ్) ప్రక్రియ పూర్తయ్యే సరికి ఆరుగంటలు పట్టింది. ఈలోగా సిబ్బంది పని వేళలు ముగిశాయి. డీజీసీఏ నిబంధనల ప్రకారం సిబ్బంది వరుస షిఫ్టుల్లో పనిచేసేందుకు అనుమతి లేదు. దీంతో మరో దఫా సిబ్బంది విధుల్లోకి వచ్చేసరికి ఇంకో మూడు గంటలకు పైగా సమయం పట్టింది.

అధికార పక్షాలదే గెలుపు

- ఉప ఎన్నికల్లో గోవాలో భాజపా, దిల్లీలో ఆప్ విజయం
- ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా జయకేతనం


విజేతలు విశ్వజిత్‌రాణే, పారికర్, రామ్‌చందర్

దిల్లీ: అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల ఫలితాలు ఆయా రాష్ట్రాల్లోని అధికార పక్షాలకు అనుకూలంగా వచ్చాయి. సోమవారం గోవాలోని పనాజీ, వాల్పోయి, దిల్లీలోని బవాన, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల నియోజకవర్గాల ఫలితాలు వెల్లడయ్యాయి. గోవాలో భాజపా, దిల్లీలో ఆప్, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీలు విజయం సాధించాయి.

గోవాలో విజయం సాధించిన ముఖ్యమంత్రి, ఆరోగ్య మంత్రి

గోవాలో ముఖ్యమంత్రి మనోహర్ పారికర్, ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజిత్ రాణేలు విజయం సాధించారు. పనాజీలో పారికర్ తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన గిరీశ్ చోదంకర్‌పై 4,803 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీకి గిరీశ్ సన్నిహితుడు కావడం గమనార్హం. 1994 నుంచి పారికరే ఈ స్థానం నుంచి గెలుపొందుతూ వస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన పారికర్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి తిరిగి రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన కోసం భాజపా ఎమ్మెల్యే సిద్ధార్థ్ కున్సోలియంకర్ రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరపాల్సి వచ్చింది. వాల్పోయిలో భాజపా అభ్యర్థి విశ్వజిత్ రాణే కాంగ్రెస్‌కు చెందిన రాయ్ నాయక్‌పై 10,066 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తొలుత కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన రాణే మంత్రివర్గంలో చేరిన తరువాత ఆ పార్టీకి రాజీనామా చేశారు. మళ్లీ పోటీ చేసి గెలుపొందారు. దీంతో 40 మొత్తం మంది సభ్యులు ఉన్న గోవా అసెంబ్లీలో భాజపా బలం 14కు పెరిగింది. 16 మంది సభ్యులు ఉన్న కాంగ్రెస్ ఇప్పటికీ అతి పెద్ద పార్టీగా ఉంది. భాజపా..మిత్రపక్షాలైన గోవా ఫార్వర్డ్ పార్టీ, మహారాష్ట్రవాదీ గోమంతక్ పార్టీ, ముగ్గురు ఇండిపెండెంట్ల సాయంతో ప్రభుత్వం నడుపుతోంది.

ఫిరాయింపుదారుని ఓటమి

దిల్లీలోని బవానలో ఆప్ అభ్యర్థి రాంచందర్ సమీప భాజపా అభ్యర్థి వేద్ ప్రకాశ్‌పై 24వేలకుపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తొలుత ఆప్ టిక్కెట్‌పై విజయం సాధించిన వేద్ ప్రకాశ్ భాజపాలో చేరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. మళ్లీ పోటీ చేసి ఓడిపోయారు. ఇక్కడ నుంచి గతంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కాంగ్రెస్ అభ్యర్థి సురేంద్ర కుమార్ మూడో స్థానంలో నిలిచారు.

ఎన్సీపీ ఎన్డీయేలో చేరదు: ప్రఫుల్ పటేల్

నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) ఎన్డీయేలో చేరబోతుందన్న వార్తలను ఆ పార్టీ సీనియర్ నాయకుడు ప్రఫుల్ పటేల్ ఖండించారు. ఎన్డీయే ప్రభుత్వంలో చేరబోతుందన్న ఊహాగానాలు నిరాధారమైనవని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వంలో ఎన్సీపీ చేరి త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో చోటు సంపాదించుకునే అవకాశం ఉందని ఇటీవల వార్తలు వినబడుతున్న నేపథ్యంలో ఆయన ఈ ట్వీట్ చేశారు. మోదీ, శరద్‌పవార్‌ల మధ్య సాన్నిహిత్యమే ఈ ఊహాగానాలకు దారి తీసింది. 2014 ఎన్నికలకు ముందు మోదీ ప్రధాని కావడాన్ని వ్యతిరేకించిన పవార్ ప్రస్తుతం ప్రధానితో సన్నిహితంగానే ఉంటున్నారు.

భాజపాలో చేరిన మేఘాలయ ఎమ్మెల్యేలు

మేఘాలయ రాష్ట్రానికి చెందిన ఇద్దరు స్వతంత్ర శాసనసభ్యులు భాజపాలో చేరారు. ఎమ్మెల్యేలు జస్టిన్ దఖర్, రాబినస్ సింకాన్ మరికొంత మందితో కలిసి భాజపా అధ్యక్షుడు అమిత్ షా సమక్షంలో సోమవారం నాడిక్కడ పార్టీలో చేరారు. వీరి చేరిక పార్టీని మరింత బలపరుస్తుందని ఆ రాష్ట్ర భాజపా వ్యవహారాల పర్యవేక్షకుడు నళిన్ కోహ్లి అన్నారు. మేఘాలయలో శాసనసభకు వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి.

ఇంగ్లాండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

8 మంది భారతీయుల మృతి

- గాయపడిన ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం

లండన్: దక్షిణ ఇంగ్లండ్‌లో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో 8 మంది భారతీయులు మరణించారు. మృతుల్లో ముగ్గురూ 'విప్రో'లో పనిచేస్తున్నారు. మరో ముగ్గురు నాటింగ్‌హ్యాంకు చెందిన 'క్యాపిటల్ వన్' సంస్థలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మృతుల్లో ఆరుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వారిలో అయిదేళ్ల చిన్నారి పాప ఉంది. ఈ పదకొండు మంది బృందం ఓ మినీవ్యానులో నాటింగ్‌హ్యాం నుంచి లండన్ వెళుతుండగా ప్రమాదం జరిగింది. రెండు ట్రక్కుల మధ్య మినీవ్యాను ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. ట్రక్కుడ్రైవర్ల నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి మూలకారణమని పోలీసులు తెలిపారు. ఫ్రాన్స్‌కు వెళ్లే వాహనాన్ని చేరుకునేందుకు వీరంతా మినీవ్యానులో బైలుదేరినట్లు వెల్లడించారు.

'విప్రో' ఉద్యోగుల వివరాలు

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 'విప్రో' ఉద్యోగులైన ముగ్గురు భారతీయుల వివరాలను ఆ సంస్థ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. కార్తికేయన్ రామసుబ్రమణియం పుగలూర్, రిషీరాజీవ్‌కుమార్, వివేక్ భాస్కరన్‌లు ముగ్గురూ విప్రో ఉద్యోగులేనన్నారు. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో ఉన్నవారిలో విప్రో మరో ఉద్యోగి మనోరంజన్ పన్నీర్‌సెల్వం ఉన్నారు. తీవ్రగాయాలతో చికిత్సపొందుతున్న అయిదేళ్ల పాప ఈ ప్రయాణికుల్లో ఎవరి కమార్తెనో అయిఉంటుందను కుంటున్నారు. మరణించిన మినీ బస్సు డ్రైవరు కూడా భారతీయుడేనని పోలీసులు తెలిపారు.

పట్టణ పేదలకు మరో 2.17 లక్షల ఇళ్లు

- ఆంధ్రప్రదేశ్‌కు అగ్రస్థానం

ఈనాడు, దిల్లీ: పట్టణ పేదల కోసం కేంద్ర ప్రభుత్వం మరో 2.17 లక్షల ఇళ్లు మంజూరు చేసింది. దీంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య 26.13 లక్షలకు పెరిగిందని గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పథకానికి మొత్తం రూ.1.39 లక్షల కోట్లు వ్యయం కానుండగా, కేంద్రం వాటా రూ.40,597 కోట్లుగా ఉంది. తాజాగా ఆరు రాష్ట్రాలకు ఇళ్లు మంజూరు చేశారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు 1.20 లక్షలు, ఉత్తర్‌ప్రదేశ్‌కు 41,173, అసోంకు 16,700, గుజరాత్‌కు 15,222, ఝార్ఖండ్‌కు 14,017, మహారాష్ట్రకు 9,894 కేటాయించారు. ఈ పథకం కింద ప్రతిపాదించిన మొత్తం ఇళ్లలో 82 శాతాన్ని పది రాష్ట్రాలకు కేటాయించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఝార్ఖండ్, బిహార్‌లు ఉన్నాయి. దిల్లీ, చండీగఢ్, గోవా, లక్షద్వీప్ మినహా అన్ని రాష్ట్రాలకు ఇళ్లు మంజూరయ్యాయి.

ఏపీకి 20.71% ఇళ్లు: అందుబాటు ధరల్లో గృహనిర్మాణం (అఫర్డబుల్ హౌసింగ్) విధానం కింద ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా 20.71 శాతం ఇళ్లు పొంది దేశంలో తొలిస్థానంలో నిలిచింది. తాజా కేటాయింపులతో పాటు, ఇంతవరకు 5,41,330 ఇళ్లు మంజూరయ్యాయి. మొత్తం రూ.31,056 కోట్ల పెట్టుబడికి కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.8,138 కోట్లు మంజూరు చేయనుంది. మిగతా రాష్ట్ర ప్రభుత్వం, లబ్ధిదారులు సమకూర్చుకోవాల్సిఉంటుంది. దేశంలో అతిపెద్దరాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌కంటే అధికంగా ప్రయోజనం పొందుతోంది.

10 రాష్ట్రాలకు మంజూరు చేసిన ఇళ్ల వివరాలు

రాష్ట్రం	ఇళ్లసంఖ్య	ఆమోదించిన పెట్టుబడి (రూ.కోట్లలో)	కేంద్రవాటా (రూ.కోట్లలో)
ఆంధ్రప్రదేశ్	5,41,300	31,056	8,138
తమిళనాడు	3,35,039	11,987	5,090
మధ్యప్రదేశ్	2,87,101	19,502	4,415
కర్ణాటక	2,03,260	9,282	3,345
గుజరాత్	1,71,816	11,497	2,493
పశ్చిమ బెంగాల్	1,44,904	5,920	2,186
మహారాష్ట్ర	1,44,165	15,868	2,244
ఉత్తరప్రదేశ్	1,20,028	4,767	1,959
జార్ఖండ్	95,742	3,561	1,474
బిహార్	88,375	3,915	1,454

సైనికుల రైలులో బాంబులు చోరీ

- దర్యాప్తు ముమ్మరం

ఝాన్సీ: సాయుధ సైనిక సిబ్బంది ప్రయాణిస్తున్న ప్రత్యేక రైలులో జరిగిన చోరీ అధికారులకు చెమటలు పట్టిస్తోంది. పొగబాంబులు భద్రపరిచిన రైలు పెట్టెలోంచి ఒక బాక్సు బాంబులు మాయం కావటంపై దర్యాప్తు ముమ్మరం చేశారు. సంచలనం సృష్టిస్తోన్న ఈ వ్యవహారంలో దొంగతనం ఎక్కడ జరిగింది, ఎలా జరిగిందీ ఆరా తీస్తున్నారు. మహారాష్ట్రలోని పుల్‌గావ్ నుంచి సైనికులతో బయలుదేరిన ప్రత్యేక రైలు పంజాబ్‌లోని పఠాన్‌కోటకు వెళ్లే మార్గంలో ఆదివారంనాడు ఝాన్సీ రైల్వే స్టేషన్ వెలుపల కొద్ది సమయంపాటు ఆగింది. ఒక బోగీకున్న సీలు తొలగించి ఉండటాన్ని గమనించిన జవాన్లు పరిశీలించి చూడగా పొగబాంబులు భద్రపరిచిన బాక్సు ఒకటి మాయం అయినట్లు గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని బినా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైలు పలుమార్లు ఆగిందని, ఆ సమయంలో ఈ చోరీ జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇలా ఉండగా ఝాన్సీ కలెక్టరేట్‌లో పని చేస్తున్న స్టెనోగ్రాఫర్ రాఘవేందర్ అహిర్వార్ అధికారిక రహస్యాలను, ముఖ్యంగా సైనికుల కదలికలకు సంబంధించిన సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులకు చేరవేస్తున్నారనే ఆరోపణలతో యూపీకి చెందిన ఉగ్రవాద నిరోధక దళం గత వారం అరెస్టు చేసింది. అహిర్వార్‌కు, అతనికి సహకరిస్తున్న వ్యక్తులకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐతో ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తుకొనసాగుతోంది.

ఇరాక్‌లో కారు బాంబు పేలి 12 మంది మృతి

బాగ్దాద్: ఇరాక్‌లోని దక్షిణ బాగ్దాద్‌లో జనసమ్మర్ధంగా ఉన్న మార్కెట్‌లో సోమవారం కారు బాంబు పేలి 12 మంది మృతి చెందారు. షియాలు అధికంగా ఉండే సదర్ పట్టణంలోని జమిలా మార్కెట్‌లో జరిగిన ఈ ఘటనలో 28 మందికి గాయాలయ్యాయని స్థానిక పోలీసు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య పెరగవచ్చని పేర్కొన్నారు. ఈ దాడికి తమదే బాధ్యతని ఐఎస్ తన అధికారిక వార్తా సంస్థ అమాక్ ద్వారా ప్రకటించింది.

సలాం.. శ్యామ్‌లాల్!

- ఒకేఒక్కడు.. చెరువు తవ్వాడు
- సంకల్పం సఫలమై.. సుజలమై..
- 27 ఏళ్ల అసామాన్య కృషి


చెరువు తవ్విన శ్యామ్‌లాల్

కోరియా: అతనో అతి సామాన్యుడు.. తోటివాళ్లకు మేలు చేయాలన్న మంచి మనసుండాలే గానీ.. దానికి డబ్బు, అధికారం లాంటివేవీ అవసరం లేదని నిరూపించిన నిజమైన కథానాయకుడు. ఎవరూ తోడు రాకున్నా, నలుగురూ నిరాశ పరుస్తున్నా, అతను చలించలేదు. ఒకటి కాదు.. రెండు కాదు.. 27 ఏళ్లు శ్రమించి ఏకంగా ఓ చెరువు తవ్వాడు. ఛత్తీస్‌గఢ్‌లో తన ఊరి కోసం ఓ గిరిజన తెగకు చెందిన వ్యక్తి చేసిన అసామాన్య సాహసమిది. కోరియా జిల్లాలో సాజా పహాడ్ గుట్టపై ఉండే ఓ కుగ్రామం.. ఇప్పటికీ ఆ పల్లెకు విద్యుత్తు సౌకర్యం లేదు.. రహదారీ లేదు. నీటి కోసం పడరాని పాట్లు పడే ప్రజలు. రెండు చిన్న బావుల ద్వారా ఎలాగోలా గొంతులు తడుపుకొంటున్నా.. పశువుల పెంపకానికి, ఇతర అవసరాలకు నీళ్లు కావాలంటే వారికి తలకు మించిన భారమే. ప్రభుత్వాలు, అధికారులు కూడా పట్టించుకోని స్థితిలో.. ఆనాడు 15 ఏళ్ల శ్యామ్‌లాల్ మనసు తల్లడిల్లిపోయింది. ఈ సమస్యకో పరిష్కారం చూడాలనుకున్న దృఢ సంకల్పం పెరిగిపోయింది. పక్కనే ఉన్న అటవీప్రాంతంలో ఓ స్థలాన్ని ఎంచుకుని చెరువు తవ్వడం ప్రారంభించాడు. అప్పట్లో అది చూసి గ్రామస్థులు నవ్వుకునేవారు.. నిరుత్సాహంగా మాట్లాడేవారు. అయినా శ్యామ్‌లాల్ ఆగిపోలేదు. అలా రెండున్నర దశాబ్దాలకు పైగా తవ్వుతూ వచ్చాడు. అతని కృషికి అద్భుత ఫలితంగా ఇప్పుడు అక్కడో చెరువు తయారైంది.. నీటితో కళకళలాడుతోంది. నాడు నవ్విన వ్యక్తులే నేడు శ్యామ్‌లాల్(42)ను వేనోళ్ల కొనియాడుతున్నారు. ఆదర్శప్రాయుడుగా.. రక్షకుడుగా భావిస్తున్నారు. "ఆ చెరువును ఇప్పుడు గ్రామస్థులమంతా వాడుకుంటున్నాం. శ్యామ్‌లాల్‌కు రుణపడి ఉంటాం.." అని 27 ఏళ్లుగా ఇదంతా గమనిస్తున్న రామ్‌శరణ్ బర్గార్(70) అనే పెద్దాయన తెలిపారు. కాగా శ్యామ్‌లాల్ ఘనతను తెలుసుకున్న ఎమ్మెల్యే (మహేందర్‌గఢ్) శ్యామ్‌బిహారీ జైశ్వాల్ ఆ గ్రామాన్ని సందర్శించారు. అతన్ని అభినందించి రూ. 10 వేలు బహూకరించారు. శ్యామ్‌లాల్ కృషి ఎనలేనిదని.. తాను ఆ గ్రామానికి వెళ్లి అన్నివిధాలుగా సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ నరేంద్ర దుగ్గల్ తెలిపారు.

గర్వంగా ఉంది : శ్యామ్‌లాల్

"ఆనాటి నుంచీ చెరువు తవ్వడంలో.. అటు అధికారులు, ఇటు గ్రామస్థులు గానీ నాకెవ్వరూ సహాయం చేయలేదు. నేను సాయానికి ఎదురుచూడనూ లేదు. గ్రామస్థుల సంక్షేమం.. మూగజీవాలకు తాగునీరు.. ఇదే సంకల్పంతో చెరువు తవ్వాను. ఇప్పుడు నాకు గర్వంగా ఉంది."

ప్రమాదకర ఇంజెక్షన్‌లతో 90 మంది ప్రాణాలు తీశాడు

బెర్లిన్: ఇద్దరు రోగులను మోతాదుకు మించి ప్రమాదకరమైన ఇంజెక్షన్‌లు ఇచ్చి చంపేసిన కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న మేల్‌నర్సు నీల్స్ హోజెల్(40) గతంలో కనీసం 90 మందిని ఇలాగే చంపేశాడన్న నివ్వెరపోయే నిజం వెలుగుచూసింది. అతడు రోగులను ఎడాపెడా చంపేయడానికి ఏమాత్రం వెనుకాడలేదనీ... ముఖ్యంగా ఐసీయూలో ఆరోగ్యపరిస్థితి అత్యంత విషమంగా ఉన్న వారినే అతడు లక్ష్యంగా ఎంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. 2015లో అతడికి ఏడున్నరేళ్ల కారాగార శిక్షపడిందన్నారు. అతడికి సంబంధించిన వివరాలను పోలీసులు సోమవారం నాడిక్కడ వెల్లడించారు. తీవ్రమైన గుండెపోటు సంభవించేలా ఓ మందును ముందుగా మోతాదుకు మించి ఇచ్చేసేవాడు. దాంతో, మరణయాతన పడుతున్న వారిని రక్షించే యత్నం చేసేవాడు. అతడి యత్నం ఫలించి రోగులు కనుక ప్రాణాలతో బైటపడితే...తానేదో గొప్ప పనిచేసిన వ్యక్తిలా సాటి ఉద్యోగుల ముందు ఫోజులు కొట్టేవాడు. ఎవ్వరైనా చనిపోతే అతడు ఎంతో కుంగిపోయేవాడనీ...ప్రాణాలతో బతికి బైటపడితే చెప్పలేనంత ఆనందాన్ని వ్యక్తం చేసేవాడనీ పోలీసులు వెల్లడించారు. ఇప్పుడు 130 మృతదేహాల అవశేషాలను వెలికి తీసి రసాయన పరీక్షల నిమిత్తం పంపారు.

ఆసారామ్ కేసుపై సుప్రీం ఆగ్రహం

- విచారణలో పురోగతిపై నివేదిక సమర్పించాలని గుజరాత్ ప్రభుత్వానికి ఆదేశాలు


ఆసారామ్ బాపు(పాతచిత్రం)

దిల్లీ, అహ్మదాబాద్: తనను తాను దేవుడుగా చెప్పుకొనే వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు ఆసారామ్ బాపు పైఉన్న అత్యాచారం కేసులో జాప్యంపై సుప్రీం కోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తంచేసింది. విచారణలో పురోగతిపై నివేదిక సమర్పించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇదివరకు జామీనుపై ఆసారామ్ పెట్టుకున్న పలు అభ్యర్థనలను ధర్మాసనం తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఆయన తాజాగా దాఖలుచేసిన అభ్యర్థనపై జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ అమితవ రాయ్‌లతో కూడా ధర్మాసనం విచారణ చేపట్టింది. 'విచారణను వేగవంతం చేయాలని ఇదివరకే ఆదేశించినా.. జాప్యంఎందుకు జరుగుతోంది? ఇప్పటివరకూ బాధితురాలిని ఎందుకు విచారించలేదు. ఈ కేసులో ఆమె కీలక సాక్షి' అని ధర్మాసనం ప్రశ్నించింది. వీటిపై గుజరాత్ తరపున అదనపు సోలిసిటర్ జనరల్ తుషార్ మెహ్తా ప్రత్యుత్తరం ఇచ్చారు. 'కేసులో ఇద్దరు కీలక సాక్షులు ఇప్పటికే మరణించారు. మరొకరి ఆచూకీ గల్లంతైంది. మరో 17 మందిపై దాడులు జరిగాయి. దీంతో బాధితురాలికి(కీలక సాక్షికి) పటిష్ఠ భద్రత కల్పించిన తర్వాతే విచారణ కోసం కోర్టులో ప్రవేశపెడతాం. ఇప్పటికే 92 ఆధారాల్లో 45ను కోర్టు ముందుంచాం' అని చెప్పారు. మరోవైపు ఆసారామ్ తరపున సీనియర్ న్యాయవాది సౌరభ్ అజయ్ గుప్తా వాదనలు వినిపించారు. 'కీలక సాక్షిగా చెబుతున్న ఆమెను విచారిస్తేనే ఆసారామ్ నిజాయితీని నిరూపించుకోగలం. ఆయనకు మొదట జామీను మంజూరు చేయాలి'అని కోరారు. మరోవైపు బాధితురాలి తరపున సంజయ్ హెగ్డే వాదనలు వినిపించారు. 'కేసు త్వరగా విచారణ చేపట్టేలా చూడాలి. సెప్టెంబరు 23లోగా బాధితురాలిని విచారించేలా ఆదేశాలు జారీచేయాలి'అని కోరారు. అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం వచ్చే నెల 23కు వాయిదా వేసింది. ఏప్రిల్ 12న విచారణను వేగవంతం చేయాలని గుజరాత్‌లోని సూరత్ విచారణ న్యాయస్థానానికి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

విచారణ న్యాయస్థానానిదే బాధ్యత: విజయ్ రూపానీ

ఈ కేసు విచారణను వేగవంతం చేయడంపై విచారణ న్యాయస్థానమే నిర్ణయం తీసుకోవాలని గుజరాత్ సీఎం విజయ్ రూపానీ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయమేమీ లేదని చెప్పారు. కోర్టు స్వతంత్రంగానే పనిచేస్తోందని పేర్కొన్నారు.

సైన్యాన్నే మించిపోయారుగా..!

దేశ రాజధాని ప్రాంత పరిధి(ఎన్‌సీఆర్)లోని దుకాణదారులు, సరఫరాదారులదగ్గర దీపావళి మందుగుండు సామగ్రి నిల్వలపై సుప్రీం కోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది. 'సైన్యం కంటే మీ దగ్గరే ఎక్కువ మందుగుండు సామగ్రి ఉన్నాయి. వీటితో దేశం మొత్తాన్నీ భస్మీపటలం చేయొచ్చు'అంటూ వ్యాఖ్యానించింది. టపాసులతో కాలుష్య ప్రభావం అంశంపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. 'దీపావళిని ఐదు రోజులపాటు ప్రజలు జరుపుకొంటారు. దీంతో రోజుకు పది లక్షల కేజీల చొప్పున.. ఐదు రోజులకు సరిపడా దాదాపు 50 లక్షల కేజీల మందుగుండు సామగ్రి దుకాణదారులు, సరఫరాదారుల దగ్గర ఉంది'అని దుకాణదారుల తరఫున న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. మరోవైపు చైనా మతాబులు నాసిరకమైనవని, వీటిలో ప్రభుత్వం నిషేధించిన చాలా పదార్థాలను ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై ధర్మాసనం స్పందించింది. 'చైనా టపాసులపై నిషేధానికి ఏం చర్యలు తీసుకున్నారు?'అని అదనపు సోలిసిటర్ జనరల్ పింకీ ఆనంద్‌ను ప్రశ్నించింది. ఈ విషయంపై త్వరలో సమగ్ర నివేదిక సమర్పిస్తామని పింకీ ప్రత్యుత్తరం ఇచ్చారు. దేశరాజధాని పరిధిలోని టపాసుల టోకు, సాధారణ విక్రయాల అనుమతులను మళ్లీ ఆదేశించేవరకూ రద్దుచేయాలని గత ఏడాది నవంబరులో ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశాలు జారీచేసింది. సోమవారం విచారణ సమయంలో.. టపాసుల తయారీదారులు విక్రయాలకు అనుమతించాలని కోరారు. మరోవైపు టపాసులతో కాలుష్య ప్రభావంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పాఠశాలలకు సూచించినట్లు ధర్మాసనానికి దిల్లీ ప్రభుత్వం తెలిపింది.

గత దారుణాల్ని పునరావృతం కానివ్వం

దేశంలో ఇనుప ఖనిజం విక్రయాలు, కొనుగోళ్లలో గతంలో చోటుచేసుకున్న దారుణమైన అక్రమాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండిపడిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆమోదయోగ్యం కాని నిబంధనలతో మళ్లీ అటువంటి భయంకరమైన పరిస్థితిని తలెత్తనీయబోమని స్పష్టం చేసింది. కర్ణాటకలో ఖనిజాల క్రయవిక్రయాలకు ప్రవేశపెట్టిన ఈ-వేలం విధానానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం ఈ వ్యాఖ్యల చేసింది. ఈ-వేలం రద్దు చేయాలంటూ భారత ఖనిజ పరిశ్రమల సమాఖ్య(ఫిమి) దక్షిణాది విభాగం చేసిన అభ్యర్థనను, సమాఖ్య వాదనలను బలపరుస్తూ వేదాంత లిమిటెడ్ దాఖలుచేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. గనుల తవ్వకాల ప్రాంతాల్లో సమగ్ర పర్యావరణ ప్రణాళికల ప్రకారం ఖనిజాల తవ్వకంపై పరిమితుల విధింపు, పర్యావరణ పునరుద్ధరణ అంశాలను చురుగ్గా పరిశీలిస్తున్నట్లు జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ పీసీ పంత్, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. కేంద్ర సాధికార కమిటీ, కర్ణాటక ప్రభుత్వం సమర్పించిన నివేదికలు,ప్రమాణ పత్రాలను ఇదేకారణంతో ఆమోదించటంలేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

సిమీ నిషేధ పిటిషన్లపై అక్టోబరు 13న విచారణ: సుప్రీం

దిల్లీ: స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమీ)పై ఎప్పటికప్పుడు ప్రభుత్వం విధిస్తున్న నిషేధాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వేర్వేరు పిటిషన్లపై అక్టోబరు 13న విచారణ నిర్వహించనున్నట్లు సుప్రీంకోర్టు సోమవారం ప్రకటించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద దాఖలైన రిట్ పిటిషన్లను, సిమిపై నిషేధాన్ని కోరుతూ దాఖలైనవాటిని విభజించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఖాన్విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌ల ధర్మాసనం నిర్ణయించింది. చట్ట నిబంధనల్ని సవాల్ చేస్తూ దాఖలైనవాటిని నవంబరు 9న విచారించనున్నట్లు తెలిపింది.

వైద్యబోర్డుల ఏర్పాటుకు ఆదేశం

గర్భస్రావానికి అనుమతి కోరుతూ దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం స్పందిస్తూ వైద్య నిపుణులతో ప్రత్యేక బోర్డుల ఏర్పాటుకు ఆదేశించింది. ఆయా కేసులను సదరు వైద్య బోర్డులు పరిశీలించి తదుపరి చర్యల నిమిత్తం నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. అత్యాచారానికి గురైన 13 ఏళ్ల బాలిక 30 వారాల గర్భంతో ఉండగా...గర్భస్రావం కోసం అనుమతి కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ అభ్యర్థనను జస్టిస్.ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్.ఎల్.నాగేశ్వర రావులతో కూడిన ధర్మాసనం పరిశీలించింది. ముంబయిలోని సర్ జెజె గ్రూపు ఆసుపత్రిలో ఏర్పాటయ్యే వైద్యబోర్డు ఆ బాలికను పరీక్షించి సాధ్యాసాధ్యాలపై నివేదికను ఇవ్వాల్సిందిగా కోరింది. మరో కేసులో పుణెకు చెందిన ఓ మహిళ 24 వారాల వయసున్న గర్భస్థ పిండానికి పుర్రె ఏర్పడని కారణంగా గర్భస్రావానికి అనుమతిని కోరింది. పుణెలోని బీజే. వైద్య కళాశాలలో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పించాల్సిందిగా సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశించింది.

ఈనాడు సినిమా

నేనంటే... నా సంగీతమే!


శ్రుతిహాసన్

"నా సంగీతమే నేను... నేనే నా సంగీతం" అంటూ సంగీతంపై తనకున్న ప్రేమని మరోసారి బయట పెట్టింది శ్రుతిహాసన్. నటిగానే కాకుండా, సంగీత దర్శకురాలిగా కూడా శ్రుతి సుపరిచితురాలే. తన సంగీతం గురించి మాట్లాడుతూ "నటిగా నేను డూప్లికేట్. అంటే ఎవరిదో పాత్రని నేను పోషిస్తుంటా. ఆ పాత్రని అర్థం చేసుకొని, తనలా ప్రవర్తిస్తుంటా. తెరపై నేను పోషిస్తున్న పాత్రకూ, నా వ్యక్తిగత జీవితానికీ ఏమాత్రం సంబంధం లేకపోవొచ్చు. కానీ సంగీతం మాత్రం అలా కాదు. నేనంటే ఏమిటో నా సంగీతంలో కనిపిస్తుంది. అక్కడ మాత్రమే నన్ను నన్నుగా చూడగలరు. బయటకు చెప్పలేని పిరికితనం కొంతమంది అమ్మాయిల్లో కనిపిస్తుంది. ప్రేమ, భావోద్వేగాలు వాళ్లు పెద్దగా ప్రకటించుకోలేరు. అలాంటి వాళ్లంతా డైరీ రాసుకొని సంతృప్తి పడుతుంటారు. నా డైరీ సంగీతమే. నా భావోద్వేగాలన్నీ సంగీతంపై చూపిస్తుంటా" అని చెప్పుకొచ్చింది శ్రుతి.


ఎన్టీఆర్

'జై లవకుశ'లో తమన్నా?

ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'జై లవకుశ'. బాబి దర్శకుడు. కల్యాణ్‌రామ్ నిర్మాత. ఈ దసరాకి ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. 'జై లవకుశ'లో ఇప్పుడు తమన్నా కూడా అడుగుపెట్టబోతోందని తెలుస్తోంది. ఈ చిత్రంలో ఓ ప్రత్యేక గీతం ఉంది. అందులో తమన్నా చిందులు వేయబోతోందట. 'అల్లుడు శీను', 'స్పీడున్నోడు' చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో కనిపించింది తమన్నా. ఆ తరవాత ఐటెమ్ గీతంలో కనిపించడం ఇదే. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న ఓ చిత్రంలో తమన్నా నాయికగా ఎంపికైంది. ఇప్పుడు ఆయన తమ్ముడు ఎన్టీఆర్ పక్కనా ఆడిపాడడానికి సిద్ధమైంది. ఎన్టీఆర్, తమన్నా ఇదివరకు 'ఊసరవెల్లి'లో జంటగా కనిపించారు. ఆ తరవాత వీరిద్దరూ తెరను పంచుకోవడం ఇదే. రాశీ ఖన్నా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ వారంలోనే పాటల్ని విడుదల చేస్తారు.


తమన్నా

పంచ్ డైలాగ్

ఎవరిపేరుతో వాళ్లను పిలిస్తే ఏముంటుంది? బంధుత్వంతో పిలిచినప్పుడు వాళ్ల మధ్య బంధం ఉంటుంది!

చిత్రం: శతమానం భవతి

- పంపినవారు: డి.సాయిలు, చీనూరు, కామారెడ్డి

గీతోపదేశం

స్నేహానికన్న మిన్న లోకాన లేదురా
కడదాక నీడలాగ నిను వీడిపోదురా
నీ గుండెలో పూచేటిది
నీ శ్వాసగా నిలిచేటిది
ఈ స్నేహమొకటేనురా

గీతం: స్నేహానికన్న మిన్న లోకాన లేదురా...
చిత్రం: ప్రాణ స్నేహితులు, రచన: భువనచంద్ర

- పంపినవారు: గోనె సూర్యప్రతాప్, వరంగల్


మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!
చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

అక్షయ్ 'కేసర్'?


అక్షయ్‌కుమార్

ఒకే తరహా కథాంశంతో బాలీవుడ్‌లో ఇప్పుడు రెండు చిత్రాలు తెరకెక్కుతున్నాయి. ఇప్పుడు ఆ జాబితాలోకి మరో చిత్రం చేరింది. 'సారాగడి' యుద్ధం నేపథ్యంలో రణ్‌దీప్ హుడా ప్రధాన పాత్రలో ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి. ఇదే కథాంశంతో అజయ్ దేవగణ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పుడు ఇదే కథలో అక్షయ్‌కుమార్ కనిపించబోతున్నట్టు సమాచారం. ఈ చిత్రాన్ని సల్మాన్‌ఖాన్, కరణ్‌జోహార్ కలిసి నిర్మిస్తున్నట్లు వార్తలొచ్చాయి. తర్వాత ఈ ప్రాజెక్టు ఆగిపోయిందనుకున్నారు. తాజాగా ఈ సినిమా మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ సినిమాకి 'కేసర్' అనే పేరు అనుకుంటున్నట్టు చెబుతున్నారు బాలీవుడ్ ట్రేడ్ ఎనలిస్ట్ గిరీష్ జోహార్. "సారాగడి యుద్ధం నేపథ్యంలో సాగే 'కేసర్' అక్షయ్‌కుమార్ తదుపరి చిత్రం అయ్యే అవకాశాలున్నాయి. ఎవరు నిర్మిస్తారనే విషయంపై ఇంకా స్పష్టత లేదు"అని చెప్పారు గిరీష్. "అజయ్ దేవగణ్ కూడా ఇదే కథాంశంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నా 'సారాగడి' వెండితెర యుద్ధంలో అక్షయ్‌కే గెలిచే అవకాశాలు ఎక్కువేమో. అలాగని అజయ్ దేవగణ్ శక్తి సామర్థ్యాలను తక్కువ అంచనా వేయలేం"అని చెప్పారు గిరీష్. "ఈ ప్రాజెక్టు ఆగిపోలేదు. ఎప్పుడు పట్టాలెక్కుతుందో చెప్పలేను కానీ సినిమా అయితే ఉంది"అని అక్షయ్‌కుమార్ చెబుతున్నారు.

కొత్త కథల్ని నమ్మడంలోనూ... కొత్త పాత్రల్ని భుజానికెత్తుకోవడంలోనూ ముందుండే కథానాయకుడు నాగార్జున. మూస ధోరణికి భిన్నంగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొంటూ సినిమాలు చేస్తుంటారు. 'గీతాంజలి', 'శివ' చిత్రాలు మొదలుకొని 'సోగ్గాడే చిన్నినాయనా' వరకు గుర్తుండిపోయే చిత్రాలెన్నో. తన వారసుల్నీ అదే దారిలో నడిపించే ప్రయత్నం చేస్తూ పుత్రోత్సాహంలో ఉన్నారు నాగార్జున. మంగళవారం ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...



తప్పులు చేస్తుంటాం... సరిదిద్దుకొంటుంటాం!

ఈసారి పుట్టినరోజుని ఎక్కడ జరుపుకోబోతున్నారు?

ఇంకా ఏమీ అనుకోలేదు. అప్పటికప్పుడు నిర్ణయం తీసుకొని వెళ్లిపోతుంటానంతే. అయితే ఇదివరకటిలా వేడుకలు జరుపుకోవడం లేదు. పిల్లలొచ్చారు కాబట్టి వాటికి సంబంధించిన వ్యవహారాల్ని వాళ్లకే అప్పజెబుతుంటా.

'విక్రమ్' నుంచి మొదలైన మీ ప్రయాణాన్ని వెనుదిరిగి చూసుకొంటే ఏమనిపిస్తోంది?

అది చెప్పాలంటే ఓ పెద్ద కథ (నవ్వుతూ). గుర్తు చేసుకొంటే మాత్రం ఓ తీయటి అనుభూతి కలుగుతుంది. అసంతృప్తి అంటూ ఏమీ లేదు. తప్పులు చేస్తుంటాం, వాటిని సరిదిద్దుకొంటుంటాం. మళ్లీ తప్పులు చేస్తుంటాం. ఇలాగే సాగిపోతుంటుంది ప్రయాణం.

పుట్టిన రోజనగానే మీకు గుర్తుకొచ్చే విషయమేమిటి?

అభిమానులే. మనసు బాగోలేదు అనుకొన్నప్పుడు వాళ్ల నుంచి ఫోన్లు వస్తాయి. ఏదో ఒక మంచి విషయం చెబుతారు. అదెలా సాధ్యమో? టెలిపతి తెలుసో ఏమో కానీ, వాళ్లు మాపై చూపిస్తున్న ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. నాన్నగారి దగ్గరుంటూ, చిన్నప్పుడు కలుసుకొన్న అభిమానులు ఇప్పుడు కూడా ఫోన్లు చేసి మాట్లాడుతుంటారు. వాళ్లంతా వయసు పరంగా చాలా పెద్దవాళ్లు. నాన్నగారు లేరు కాబట్టి యేటా ఆయనకి పంపించే పచ్చళ్లు, మిఠాయిలు ఇప్పుడు నాకు పంపిస్తున్నారు. ఆ విషయంలో చాలా గొప్ప అనుభూతికి గురవుతుంటా.

నిర్మాతగా వరుసగా సినిమాలు చేస్తున్నారు. అవి కూడా మీ అబ్బాయిల సినిమాలే కాబట్టి ఒత్తిడి ఇంకొంచెం ఎక్కువగానే ఉంటుందేమో కదా...

ప్రేమ ఉన్న చోట ఒత్తిడి కూడా ఉంటుంది. అయినా నిర్మాతగా సినిమాలు చేయడం నాకు కొత్త కాదు. కాకపోతే అఖిల్ సినిమా 'హలో!' కొంచెం క్లిష్టమైంది. బోలెడన్ని లొకేషన్లలో చిత్రీకరణ చేయాల్సి ఉంటుంది. బడ్జెట్టు కూడా ఎక్కువే. కథ అలాంటిది. నాగచైతన్యతో 'రారండోయ్ వేడుకచూద్దాం' చేశా. అది కూడా మంచి ఫలితాన్నిచ్చింది.

అఖిల్ సినిమా పేరుని ఆసక్తికరంగా ప్రకటించారు. ఆ ఆలోచన ఎవరిది?

నేను, అఖిల్ కూర్చుని మాట్లాడుకొంటున్నప్పుడు వచ్చిన ఆలోచన అది. వీడియోని ఎన్టీఆర్‌గారితో మొదలుపెట్టి, నాన్నతో పూర్తి చేసి.. ఆ తర్వాత పేరును ప్రకటించాలనుకొన్నాం. పెద్దాయన ఎన్టీఆర్‌గారు హలో అన్న వీడియో మాకు దొరకలేదు. దాంతో తారక్‌ని అడిగాం. తారక్, అఖిల్ మంచి స్నేహితులు. అలా తారక్‌తో మొదలుపెట్టి నాన్నగారితో 'హలో' అనిపించి పేరును ప్రకటించాం. మంచి స్పందన లభించింది.

దర్శకుడు విక్రమ్ కె.కుమార్ సినిమాలకి రెండక్షరాల పేర్లే ఎక్కువ కాబట్టి 'హలో'ని ఖరారు చేశారా?

అలా ఏమీ కాదు. సినిమాకి తగ్గ పేరు అది. కథానాయకుడు తాను ప్రేమించిన అమ్మాయి దగ్గర్నుంచి ఒక్క 'హలో' అనే మాట కోసం ఎదురు చూస్తుంటాడు. ఇది నేను నిర్ణయించిందే. చిత్రబృందమంతా ఆర్నెళ్లుగా పేరు గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. ఒక రోజు ఉదయం 6 గంటలకి వ్యాయామం పూర్తి చేసుకొని కూర్చున్నప్పుడు 'హలో' అనే పేరు తట్టింది. ఈ పేరును ఎవరో ఒకరు రిజిస్టర్ చేయించుంటారనుకొన్నా. కానీ గత అయిదేళ్లలో ఎవ్వరూ చేయించలేదు.

'హలో' ఎలా ఉండబోతోంది?

యాక్షన్‌తో కూడుకొన్న ఓ ప్రేమకథ అది. విక్రమ్ బాగా తీస్తున్నారు. కథానాయిక ఎంపిక ప్రక్రియ వల్లే సినిమా ఆలస్యమైంది. 'గీతాంజలి'లో గిరిజలా, 'ఏమాయ చేసావె'లో సమంతలా ఓ కొత్త అమ్మాయి కావాలనుకొన్నాం. చివరికి ప్రియదర్శన్‌గారి అమ్మాయి కల్యాణిని ఎంపిక చేశాం.

ఆ సినిమాని ఇతర భాషల్లో విడుదల చేసే ఆలోచనలేమైనా ఉన్నాయా?

ఇంతకుముందు నేను చేసిన ఐదారు సినిమాలు ఇతర భాషల్లో విడుదలయ్యాయి. కానీ ఫలితం ఆశించినంతగా రాలేదు. అందుకే ముందు మన భాషలో సినిమా చేద్దాం, ఆ తర్వాత మిగతా విషయాల గురించి ఆలోచిద్దాం అనుకొంటుంటా.

నాగచైతన్య 'యుద్ధం శరణం' సినిమాని చూశారా?

చూశా, చాలా బాగుంది. అదో కొత్త రకమైన జోనర్ సినిమా అవుతుంది. సోషల్ నెట్‌వర్కింగ్ నేపథ్యంతో కూడుకొన్న కథ అది.

నాగచైతన్య, సమంత పెళ్లి పనులు ఎంతవరకొచ్చాయి?

అంతా మేం చూసుకొంటాం, మీరు చెక్కు మీద సంతకం చేస్తే చాలంటున్నారు వాళ్లు (నవ్వుతూ). అక్టోబరు 6న గోవాలో పెళ్లి. ఒకే రోజు హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం జరుగుతుంది. పెళ్లి సింపుల్‌గానే చేసుకొంటామన్నారు. విందు కార్యక్రమాన్ని మాత్రం గ్రాండ్‌గా, హైదరాబాద్‌లో నేనే నిర్వహించబోతున్నా.

'రాజుగారి గది 2' గురించి చెప్పండి...

చిత్రీకరణ పూర్తయింది. హారర్ కామెడీతో కూడిన ఓ థ్రిల్లర్ చిత్రమది. నావైపు నుంచి కామెడీ తక్కువే కానీ వెన్నెల కిషోర్, ప్రవీణ్, అశ్విన్ తదితరులు పోషించిన పాత్రలు బాగా నవ్విస్తాయి. 'రాజుగారి గది'కీ, ఈ సినిమాకీ సంబంధమేమీ ఉండదు. జోనర్ ఎలా ఉంటుందని తెలియడానికే ఆ పేరు పెట్టాం.

ప్రచార చిత్రాల్లో మీరు చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

ఎదుటి వాళ్లు ఏమనుకొంటున్నారో పసిగట్టే ఓ మానసిక నిపుణుడి పాత్రలో నేను కనిపిస్తా. ఒక పది ప్రశ్నలు అడిగేసి నీ మనసులో ఏమనుకొంటున్నావో చెప్పేసే పాత్ర అది. నిజ జీవితంలోనూ అలాంటివాళ్లు ఉన్నారు. ఈ సినిమా ఒప్పుకొన్నాక వాళ్లని నేను కూడా కలిశా. అలాంటి ఓ కొత్త పాత్రలో నటించడం మంచి అనుభవాన్నిచ్చింది. ఓంకార్ చాలా స్పష్టతతో సినిమాని తీశాడు.

తదుపరి మీరు చేయబోయే సినిమా ఏది?

ఇంకా ఏమీ ఆలోచించలేదు. 'బంగార్రాజు' కథ చెబుతా అన్నాడు కల్యాణ్ కృష్ణ. ఇదివరకు ఒకట్రెండు లైన్లు వినిపించాడు. అవి నచ్చలేదు. 'సోగ్గాడే..'కి సీక్వెల్ అవుతుంది కాబట్టి మంచి కథ సిద్ధమైతేనే సినిమా చేయాలి.

మలయాళం నుంచి 'మహాభారతం'లో నటించే అవకాశం వచ్చింది కదా, అది ఎప్పుడు మొదలవుతుంది?

2018లో అన్నారు కానీ... ఎప్పుడు మొదలవుతుందో తెలియదు. అందులో నన్ను కర్ణుడి పాత్ర చేయమని అడిగారు.

ఈ మధ్య తెలుగు సినిమాలు మంచి ఫలితాల్ని సొంతం చేసుకొంటున్నాయి. దానిపై మీ అభిప్రాయం?


ఈమధ్య 'అర్జున్‌రెడ్డి' గురించి నేనూ విన్నా. చాలా సంతోషంగా అనిపించింది. శేఖర్ కమ్ముల తీసిన 'ఫిదా' కూడా బాగుంది. ఆయన మంచి దర్శకుడు. కొత్త కొత్త కథలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది మంచి పరిణామం.

'ఆక్సిజన్' సిద్ధమైంది


గోపీచంద్, అనుఇమ్మానియేల్

గోపీచంద్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఆక్సిజన్'. రాశీ ఖన్నా, అనుఇమ్మానియేల్ కథానాయికలు. ఎ.ఎం.జ్యోతికృష్ణ దర్శకుడు. ఎస్.ఐశ్వర్య నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. అక్టోబరు 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "సరికొత్త కథ, కథనాలతో సాగే చిత్రమిది. యాక్షన్ సన్నివేశాలకు ప్రాధాన్యం ఉంది. ముంబయి, సిక్కిం, గోవా, చెన్నైలాంటి ప్రదేశాల్లో చిత్రీకరించాం. నిర్మాణ విలువల విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. యువన్ శంకర్ రాజా అందించిన బాణీలు ఓ కొత్త అనుభూతిని పంచుతాయి. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తాం"న్నారు. జగపతిబాబు, కిక్ శ్యామ్, అలీ, చంద్రమోహన్, నాగినీడు, బ్రహ్మాజీ, అభిమన్యుసింగ్ తదితరులు నటించారు.

ఏమాటకామాటే!



"నేనెంతగానో అభిమానించే కథానాయకుడు సంజయ్ దత్. ఇప్పుడు ఆయన జీవితకథా చిత్రంలో సంజయ్‌గా నటించే అవకాశం నాకు రావడం, ఆ చిత్రాన్ని నా అభిమాన దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీ తెరకెక్కిస్తుండటం చూస్తే... నా కల సాకారమైనట్లు అనిపిస్తోంది. సంజయ్ పాత్ర నాకు శారీరకంగా, మానసికంగా సవాల్ విసరడమే కాదు... నాలో స్ఫూర్తిని రగిలిస్తోంది"

– రణ్‌బీర్ కపూర్

"నటిగా నన్ను నేను నిరూపించుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు, అనుకోను కూడా. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు కూడా చేస్తానని నిరూపించుకోవడానికే 'లూటెరా' లాంటి చిత్రంలో నటించానని కొందరు నా గురించి అంటుంటారు. నేను ఆ సినిమా చేసింది వరుస కమర్షియల్ సినిమాల మధ్యలో కొంచెం రిలీఫ్ ఉంటుందనే. సినిమా చిత్రీకరణ సమయంలోనూ ఇలానే అన్నారు. కానీ నేను పట్టించుకోలేదు. అందుకే పాత్ర అంత బాగా పండింది"


– సోనాక్షి సిన్హా



ఉద్యమం నేపథ్యంలో...

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రం 'మా దేవుడు'. ప్రభాకర్ వర్మన్ డొప్పలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష సినిమాస్ సంస్థ నిర్మిస్తోంది. వచ్చే నెల 15 నుంచి చిత్రీకరణ మొదలవుతుంది. ఈ సినిమా టైటిల్ లోగోని హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమం నేపథ్యం ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రముఖ నటీనటులు ఇందులో కీలక పాత్రల్లో కనిపిస్తార"న్నారు. సంగీతం: వందేమాతరం శ్రీనివాస్


లోగోని ఆవిష్కరిస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్



వృద్ధాప్య జీర్ణ సమస్యలు

సుఖీభవ

ఉదయాన్నే ఉరుకులు పరుగుల మీద ఆఫీసులకు పరుగెత్తాల్సిన పనిలేదు. డెడ్‌లైన్ దాటిపోతుందేమోనన్న బెంగ లేదు. కావాల్సినంత సమయం చేతిలో ఉంటుంది. మనవలు, మనవళ్లతో బోలెడంత కాలక్షేపం. వృద్ధాప్యానికి ఇదొక పార్శ్వం మాత్రమే. మరోవైపు- చర్మం ముడతలు పడుతుంటుంది. నడుం ఒంగిపోతుంటుంది. నిస్సత్తువ ఆవరించేస్తుంటుంది. ఇలా వృద్ధాప్యం మోసుకొచ్చే శారీరక మార్పులు ఎన్నెన్నో. లోలోపల్నుంచి తలెత్తే జబ్బులూ మరెన్నో. ముఖ్యంగా- జీర్ణ సమస్యల గురించి చెప్పాల్సిన పనేలేదు. ఆకలి తగ్గిపోయి, రుచి మారిపోయి.. సరిగా తినలేక, తిన్నది అరగక.. కడుపుబ్బరం, ఛాతీలో మంట, మలబద్ధకం వంటి వాటితో సతమతమయ్యే వృద్ధులు ఎందరో. చూడటానికివి మామూలుగానే, అంత ఇబ్బందికరమైనవి కావనీ అనిపించొచ్చు. అందుకేనేమో కొందరు వీటిని వయసుతో పాటు వచ్చే ఇబ్బందులుగా భావిస్తూ నిర్లక్ష్యం చేసేస్తుంటారు. వాటితో సర్దుకుపోతుంటారు. కానీ తాత్సారం చేస్తే ఇవే క్యాన్సర్ల వంటి తీవ్ర సమస్యలకూ దారితీయొచ్చు.

వృద్ధాపి జీర్ణం!



డా॥ డి.నాగేశ్వరరెడ్డి
ఛైర్మన్
ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ
హైదరాబాద్

మనం ఏ పని చేయాలన్నా శక్తి కావాలి. ప్రతి కణానికీ సత్తువ కావాలి. ఇది మనకు ఆహారం నుంచే లభిస్తుంది. తిన్న ఆహారం జీర్ణమై, దానిలోని పోషకాలను శరీరం గ్రహించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఇందుకు నోటి నుంచి మలద్వారం వరకూ జీర్ణ వ్యవస్థ మొత్తం సరిగా పనిచేయటం చాలా ముఖ్యం. లేకపోతే శరీరమంతా నిస్సత్తువతో జావగారిపోతుంది. మనం నోటి ద్వారా తీసుకున్న ఆహారం.. గొంతును దాటుకొని, అన్నవాహిక ద్వారా జీర్ణాశయంలోకి ప్రవేశిస్తుంది. అక్కడ్నుంచి చిన్న పేగుల గుండా ప్రయాణించి.. చివరికి పెద్దపేగుకు చేరుకుంటుంది. అప్పటికే జీర్ణవ్యవస్థ దానిలోని పోషకాలన్నింటినీ దాదాపుగా గ్రహించేస్తుంది. మిగిలిన వ్యర్థ పదార్థం మలంగా తయారై.. ముందుకు కదులుతూ గట్టిపడి పెద్దపేగు చివరి భాగానికి చేరుకొని.. అక్కడ్నుంచి మలద్వారం గుండా బయటకు వచ్చేస్తుంది. ఈ మొత్తం వ్యవస్థలో ఎక్కడ సమస్య తలెత్తినా మొత్తం జీర్ణ ప్రక్రియే ప్రభావితమవుతుంది. రకరకాల సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా వృద్ధుల్లో ఇలాంటి సమస్యలు మరింత ఎక్కువ. దీనికి ఆమ్లం ఉత్పత్తి తగ్గటం, పేగుల కదలికలు మందగించటం వంటి పలు అంశాలు దోహదం చేస్తాయి.

మలబద్ధకం



వృద్ధుల్లో సర్వ సాధారణంగా కనిపించే సమస్య మలబద్ధకం. సుమారు 70-80% మంది దీంతో బాధపడుతున్నారని అంచనా. మలం గట్టిగా వస్తుండటం, ముక్కాల్సి రావటం, విసర్జన పూర్తిగా కానట్టు అనిపించటం, ఉదయాన్నే విసర్జనకు వెళ్లాలని అనిపించకపోవటం.. ఇలా ఎలాంటి తేడా అనిపించినా చాలామంది మలబద్ధకంగా భావిస్తుంటారు. నిజానికి వైద్యపరంగా వారానికి 3 కన్నా తక్కువసార్లు మల విసర్జన జరుగుతుంటేనే మలబద్ధకంగా పరిగణిస్తారు. మలబద్ధకానికి ప్రధాన కారణం పెద్దపేగు కదలికలు తగ్గిపోవటం. మనం తిన్న ఆహారం జీర్ణమై, దానిలోని సారాన్ని పేగులు పీల్చుకున్న తర్వాత మిగిలిపోయిన వ్యర్థ పదార్థం మలం రూపంలో బయటకు వస్తుంది. ముందుగా ఇది చిన్న పేగుల నుంచి పెద్ద పేగు కుడి భాగంలోకి ప్రవేశించి.. పేగు కండరాలు సంకోచిస్తున్నకొద్దీ ముందుకు కదులుతూ ఎడమ వైపునకు వస్తుంది. క్రమంగా పేగు చివర్లోని మలాశయం లేదా పురీషనాళం (రెక్టమ్) వద్దకు చేరుకుంటుంది. ఇలా మలం వచ్చి చేరుతున్నకొద్దీ అక్కడ ఒత్తిడి పెరిగి, మల విసర్జనకు వెళ్లాలనే భావన కలుగుతుంది. అయితే వృద్ధుల్లో పేగు కదలికలు తగ్గటం వల్ల మల పదార్థం త్వరగా ముందుకు సాగదు. దీంతో మల పదార్థంలోని నీటిని పేగు మరింతగా పీల్చేసుకుంటుంది. మలం గట్టిపడుతూ వస్తుంది. మరోవైపు- వృద్ధుల్లో మల పదార్థం చాలాసేపు కుడివైపుననే ఉండిపోవటం వల్ల అక్కడి పేగు పెద్దగా అవుతుంది కూడా. విసర్జన సరిగా కాకపోవటం వల్ల మనసును ఎప్పుడూ ఏదో ఒకరకమైన భావన తొలిచేస్తుంటుంది. చిరాకూ మొదలవుతుంది. సాధారణంగా పీచు ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవటం ద్వారా మలబద్ధకం తగ్గుతుంది. కానీ వృద్ధులకు ఇది అంతగా ఉపయోగపడదు. పీచుతో మల పదార్థం ఎక్కువైనప్పటికీ.. అది కదలకుండా ఉండిపోవటం వల్ల మరిన్ని సమస్యలకు దారితీయొచ్చు. కాబట్టి వీరికి పీచుతో పాటు కదలికలను మెరుగు పరచే ప్రుకాలోప్రైడ్, ల్యుబిప్రోస్టోన్ వంటి (ప్రొకైనెటిక్) మందులూ ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే నీళ్లు ఎక్కువగా తాగటం, రోజూ ఒకే వేళకు విసర్జనకు వెళ్లటమూ అలవాటు చేసుకోవాలి.

మారింది వృద్ధ నిర్వచనం!

రోజురోజుకీ వృద్ధుల సంఖ్య పెరుగుతుండటంతో పాటు వృద్ధాప్య నిర్వచనమూ మారిపోయింది. ఒకప్పుడు 65 ఏళ్లు దాటితే వృద్ధాప్యంగా భావించేవారు. కానీ ప్రపంచ ఆరోగ్యసంస్థ తాజా సిఫారసుల ప్రకారం 80ల్లోకి అడుగుపెడితేనే వృద్ధాప్యం వచ్చినట్టు! అక్కడ్నుంచి 99 ఏళ్ల వరకూ వృద్ధాప్య దశే. 18-65 ఏళ్ల వారిని యువతరంగా, 66-70 ఏళ్ల వారిని మధ్యవయసువారిగా పరిగణించింది. అయితే మనదేశంలో ఇంకా 65 ఏళ్లు దాటినప్పట్నుంచే వృద్ధాప్యంగా భావిస్తున్నారు. త్వరలో మనదేశంలోనూ ఇది మారిపోవచ్చు.

ముద్ద దిగకపోవటం

మనం తిన్న ఆహారాన్ని జీర్ణాశయానికి చేర్చేది అన్నవాహిక. ఓ పొడవైన గొట్టంలా ఉండే దీనిలోని కండరాలుంటాయి క్రమపద్ధతిలో సంకోచిస్తూ.. మనం మింగిన ముద్దను జీర్ణాశయంలోకి చేరుస్తాయి. అయితే వృద్ధుల్లో ఈ కండరాల సంకోచం మందగిస్తుంది. దీన్నే 'ప్రెస్‌బయోఈసోఫేగస్' అంటారు. దీంతో ముద్ద సరిగా కిందికి దిగదు. లోపల తట్టుకున్నట్టుగా అనిపిస్తుంటుంది. ముద్ద ఎక్కువసేపు నిలిచిపోతుండటం వల్ల అన్నవాహిక వ్యాకోచించి, పెద్దగా అవుతుంది కూడా. అంతేకాదు.. రాత్రిపూట పడుకున్నప్పుడు ఆహార పదార్థాలు గొంతులోకి ఎగదన్నుకొనీ వస్తుంటాయి. ఇవి ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయి, ఇన్‌ఫెక్షన్‌కూ దారితీయొచ్చు. కాబట్టి వృద్ధులు భోజనం చేసేటప్పుడు నీరు బాగా తాగటం మంచిది. భోజనం చేశాక కనీసం 2 గంటల తర్వాతే పడుకోవాలి. కొన్నిసార్లు వేసుకునే మాత్రలు కూడా సరిగా కిందికి దిగవు. దీంతో అన్నవాహిక దెబ్బతిని (పిల్ ఈసోఫేజైటిస్) అల్సర్లకూ దారితీయొచ్చు. అందువల్ల మాత్రలు వేసుకున్న ప్రతిసారీ ఒక గ్లాసు నీళ్లు తాగటం మంచిది.



ఛాతీలో మంట



అన్నవాహిక అడుగున ఒక బిగుతైన కండర వలయం (స్ఫింక్టర్) ఉంటుంది. తిన్న ఆహారం జీర్ణాశయంలోకి ప్రవేశించే సమయంలో దీని బిగువు సడలుతుంది. ముద్ద లోపలికి వెళ్లగానే ఇది తిరిగి బిగుసుకుపోతుంది. ఇలా ఇది జీర్ణాశయంలోని ఆమ్లం, ఆహారం వంటివి పైకి ఎగదన్నుకొని రాకుండా గట్టిగా పట్టి ఉంచుతుంది. వృద్ధుల్లో ఈ కండర వలయం బలహీనపడి, బిగువు సడలుతుంది. దీంతో జీర్ణాశయంలోని ఆమ్లం గొంతులోకి ఎగదన్నుకొని వచ్చి ఛాతీలో మంట (జీఈఆర్‌డీ), నొప్పి వంటివి బయలుదేరతాయి. రాత్రిపూట పడుకున్నప్పుడు పైకి ఎగదన్నుకొని వచ్చిన ఆమ్లం ఊపిరితిత్తుల్లోకీ వెళ్లొచ్చు. ఇది ఇన్‌ఫెక్షన్‌కు దారితీయొచ్చు. కొందరు గుండెజబ్బులకు ఆస్ప్రిన్ వంటి మందులూ వేసుకుంటుంటారు. ఇవి గుండె కండరాలతో పాటు కండర వలయాన్నీ వదులుగా చేస్తాయి. దీంతో ఆమ్లం మరింతగా పైకి ఎగదన్నుకొని రావొచ్చు. అందువల్ల వృద్ధుల్లో ఛాతీలో మంట విషయంలో జాగ్రత్తగా ఉండటం మంచిది. వీరిలో గుండె సమస్యలతో పాటు జీర్ణాశయ సమస్యలేవైనా ఉన్నాయేమో కూడా చూసుకోవటం ముఖ్యం.

అజీర్ణ వేదన



తిన్న ఆహారం సరిగా జీర్ణమైతేనే దానిలోని పోషకాలు బాగా ఒంట పడతాయి. ఇందుకు జీర్ణాశయంలోని ఆమ్లం ఎంతగానో తోడ్పడుతుంది. అయితే వృద్ధుల్లో జీర్ణాశయంలో జిగురుపొరలు క్షీణించటం (అట్రోఫిక్ గ్యాస్ట్రయిటిస్) వంటి వాటి మూలంగా ఆమ్లం ఉత్పత్తి బాగా తగ్గిపోతుంది. దీంతో తిన్నది సరిగా జీర్ణం కాదు. ఫలితంగా కడుపుబ్బరం, త్రేన్పుల వంటివి వేధిస్తుంటాయి. వీరికి పాంక్రియాటిక్ ఎంజైమ్‌ల భర్తీ చికిత్స ఇస్తే జీర్ణక్రియ చాలావరకు మెరుగుపడుతుంది. ఆమ్లం తగ్గటం వల్ల తలెత్తే మరో ముప్పు విటమిన్ బి12 లోపం. ఆమ్లంలోని ఇంట్రిన్సిక్ ఫ్యాక్టర్ విటమిన్ బి12తో జత కలిస్తేనే శరీరం దాన్ని గ్రహించగలుతుంది. ఆమ్లం ఉత్పత్తి తగ్గితే ఇంట్రిన్సిక్ ఫ్యాక్టర్ కూడా తగ్గిపోయి విటమిన్ బి12 లోపం తలెత్తుతుంది. వృద్ధుల్లో ఇది మరింత ఎక్కువగా కనబడుతుంది. దీంతో చేతులు, కాళ్లు మొద్దుబారటం.. తిమ్మిర్లు, కండరాలు బలహీనం కావటం, రాత్రిపూట చూపు తగ్గటం వంటివన్నీ బయలుదేరతాయి. పాదాలకు స్పర్శ తగ్గటం, సమన్వయం కొరవడటంతో కింద పడిపోయే ప్రమాదమూ ఉంది. వీరికి విటమిన్ బి12 ఇంజెక్షన్లు క్రమం తప్పకుండా ఇస్తే చాలావరకు పరిస్థితి కుదుటపడుతుంది.

గ్యాస్-ఉబ్బరం



ఆహారాన్ని జీర్ణం చేస్తూ.. వాటిలోని పోషకాలను గ్రహించటంలో చిన్న పేగులదే కీలకపాత్ర. వృద్ధుల్లో చిన్న పేగుల కదలికలూ మందగిస్తాయి. దీంతో ఆహారం సరిగా ముందుకు కదలదు. దీంతో తలెత్తే మరో ముప్పు చెడు బ్యాక్టీరియా ఎక్కువగా వృద్ధి చెందటం. ఫలితంగా గ్యాస్ ఎక్కువై పొట్ట ఉబ్బరం.. త్రేన్పులు, అపాన వాయువుల వంటి సమస్యలన్నీ చుట్టుముడతాయి. తరచుగా విరేచనాలు కూడా కావొచ్చు. తిన్నది సరిగా జీర్ణం కాకపోవటం వల్ల పోషణలోపమూ తలెత్తొచ్చు. ముఖ్యంగా విటమిన్ డి, క్యాల్షియం మోతాదులు తగ్గిపోవటం వల్ల ఎముకలు బలహీనపడతాయి. చిన్నపాటి దెబ్బలకే ఎముకలు విరిగే ముప్పూ పెరుగుతుంది. కాబట్టి కడుపు ఉబ్బరం, అపాన వాయువుల వంటి లక్షణాలు కనిపిస్తే ఒకసారి 'హైడ్రోజెన్ శ్వాస' పరీక్ష చేసి బ్యాక్టీరియా తీరుతెన్నులను పరిశీలించాల్సి ఉంటుంది. బ్యాక్టీరియా ఎక్కువుంటే ఇందులో బయటపడుతుంది. వీరికి యాంటీబయోటిక్స్, పేగు కదలికలను మెరుగుపరచే మందులతో ఫలితం కనబడుతుంది. అలాగే ప్రొబయోటిక్స్ కూడా బాగా ఉపయోగపడతాయి. వీటితో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. చెడు బ్యాక్టీరియా తగ్గుతుంది. అలాగే పెరుగు, మజ్జిగ వంటివీ మేలు చేస్తాయి.

పేగులో తిత్తులు

మల పదార్థం సరిగా కదలనప్పుడు దాన్ని ముందుకు తోయటానికి పెద్దపేగు మరింతగా కష్టపడాల్సి వస్తుంటుంది. దీంతో లోపల ఒత్తిడి పెరిగి.. పేగు గోడ బలహీనపడి.. చిన్న సంచుల్లా తిత్తులు ఏర్పడుతుంటాయి. 60 ఏళ్లు పైబడిన దాదాపు సగం మందిలో ఇలాంటి తిత్తులు కనబడటం చూస్తుంటాం. ఒకప్పుడు ఇది విదేశాల్లో ఎక్కువగా కనబడేది. మన ఆహార అలవాట్లు మారిపోతుండటం, పూర్తిగా శుద్ధిచేసిన రిఫైన్డ్ పదార్థాలను తీసుకోవటం పెరుగుతున్నకొద్దీ మనదేశంలోనూ తరచుగా కనబడుతోంది. నిజానికి లోపల తిత్తులు ఉన్నప్పటికీ ఇవేమీ ఇబ్బంది కలిగించవు. పైకి ఎలాంటి లక్షణాలూ కనబడవు. కొన్నిసార్లు గ్యాస్, కడుపుబ్బరం, కడుపునొప్పి వంటివి పొడసూపొచ్చు. అయితే కొందరిలో ఈ తిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ మొదలై ఇవి వాచిపోవచ్చు. దీన్నే డైవర్టిక్యులైటిస్ అంటారు. దీంతో తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం, చలి, వికారం, వాంతి వంటివి మొదలవుతాయి. దీనికి యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ మందులు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్నిసార్లు సర్జరీ చేసి తిత్తులు తలెత్తిన భాగాన్ని తొలగించాల్సి వస్తుంది కూడా.



రుచి-ఆకలి తగ్గటం



నాలుకపై, గొంతులో రుచి మొగ్గలుంటాయి. ఒక్కో రుచి మొగ్గలోనూ చాలా రుచి కణాలుంటాయి. మనం ఆహారాన్ని నమిలినప్పుడు ఈ కణాలు ప్రేరేపితమై.. వీటికి అనుసంధానంగా ఉన్న నాడుల ద్వారా ఆ సమాచారం మెదడుకు చేరుతుంది. అప్పుడు మనకు ఆయా పదార్థాల రుచి తెలుస్తుంది. అయితే వృద్ధుల్లో ఈ రుచి మొగ్గల సంఖ్య తగ్గుతుంది. దీంతో నోటికి చాలా పదార్థాలు చప్పిడిగా అనిపిస్తుంటాయి. అలాగే వాసనలు పసిగట్టే ఘ్రాణ శక్తి కూడా మందగిస్తుంది. ఫలితంగా ఆకలి వేయటమూ తగ్గుతుంది. పోషణలోపం ముఖ్యంగా జింక్ లోపించటం కూడా రుచి తగ్గటానికి దారితీయొచ్చు. అందువల్ల కొందరికి జింక్ ఇస్తే రుచి మెరుగవుతుంది. జీర్ణకోశంలో వాపు, కొన్నిరకాల మందులు, మద్యం, పొగ అలవాటు, ఒత్తిడి, కుంగుబాటు వంటివీ ఇందుకు దోహదం చేయొచ్చు. వృద్ధుల్లో ఆకలి తగ్గితే క్యాన్సర్ ఉందేమోననీ అనుమానించాలి. ఎందుకంటే క్యాన్సర్ల మూలంగా ఆకలిని ప్రేరేపించే ఘ్రెలిన్, కడుపునిండిందనే భావన కలిగించే లెప్టిన్ హార్మోన్ల మధ్య సమతుల్యం దెబ్బతిని ఆకలి మందగిస్తుంటుంది. కాబట్టి ఆకలి తగ్గటాన్ని తేలికగా తీసుకోవటానికి వీల్లేదు. క్షుణ్నంగా పరిశీలించి, తగు కారణాన్ని గుర్తించి చికిత్స చేయాల్సి ఉంటుంది.

క్యాన్సర్లు పెద్ద సమస్య

ఈ జీర్ణ ప్రక్రియ అస్తవ్యస్తం కావటం వల్ల వృద్ధులకు క్యాన్సర్ల ముప్పూ ఎక్కువే. వీరిలో అల్సర్ల కన్నా క్యాన్సర్లే అధికంగా కనబడుతుంటాయి. అన్నవాహిక, జీర్ణాశయం, పెద్దపేగు.. ఇలా ఎక్కడైనా క్యాన్సర్లు రావొచ్చు. దీర్ఘకాలంగా గొంతులోకి ఆమ్లం ఎగదన్నుకొని వస్తుంటే అన్నవాహిక లోపలుండే సున్నితమైన పొర దెబ్బతింటుంది. క్రమంగా ఇది జీర్ణాశయంలో ఉండే పైపొర మాదిరిగానూ మారిపోతుంది (బ్యారెట్స్ ఈసోఫేగస్). దీంతో క్యాన్సర్ ముప్పూ పెరుగుతుంది. జీర్ణాశయంలోని జిగురుపొరలు క్షీణించటం (అట్రోఫిక్ గ్యాస్ట్రయిటిస్) వల్ల జీర్ణాశయ క్యాన్సర్లు తలెత్తొచ్చు. జీర్ణాశయంలో క్యాన్సర్ ఉంటే కడుపునొప్పి ఉంటుందని చాలామంది భావిస్తుంటారు. కానీ కడుపునొప్పి అనేది తీవ్రదశలోనే కనబడుతుంది. అప్పటికే క్యాన్సర్ బాగా ముదిరిపోయి ఉంటుంది. అందువల్ల ఒక వయసు వచ్చాక ఎండోస్కోపీ చేసి జీర్ణాశయాన్ని క్షుణ్నంగా పరిశీలించటం మంచిది. దీంతో క్యాన్సర్‌ను తొలిదశలోనే పట్టుకోవచ్చు. క్యాన్సర్ అక్కడికే పరిమితమైతే ఈఎస్‌డీ (ఎండోస్కోపిక్ సబ్‌మ్యూకోజల్ డిసెక్షన్) ద్వారా తేలికగా తొలగించొచ్చు.

- వృద్ధుల్లో చాలామందిలో పెద్దపేగు గోడలకు పిలకలు (పాలిప్స్) ఏర్పడుతుంటాయి. కొందరిలో ఇవి క్యాన్సర్‌గానూ మారొచ్చు. కాబట్టి వీటిని ముందుగానే గుర్తించి తొలగిస్తే క్యాన్సర్ తలెత్తకుండా కాపాడుకోవచ్చు. అందుకే విదేశాల్లో వృద్ధులకు తరచూ కొలనోస్కోపీ పరీక్షను తప్పనిసరి చేశారు. ఇందులో పిలకలు ఉన్నట్టు తేలితే వెంటనే వాటిని కూడా తొలగిస్తారు. ఈ పద్ధతి ద్వారా పెద్దపేగు క్యాన్సర్‌ను చాలావరకు నివారించగలిగారు. మనదేశంలో పెద్దఎత్తున ఇలాంటి పరీక్షలు చేయటం సాధ్యం కాకపోవచ్చు గానీ వీలున్నవారు కొలనోస్కోపీ పరీక్ష చేయించుకోవటం మంచిది. ఒకసారి పరీక్ష చేయించుకున్నాక.. బుడిపెలు లేకపోతే ప్రతి మూడేళ్లకు ఒకసారి, బుడిపెలుంటే ప్రతి సంవత్సరం దీన్ని చేయించుకోవాలి. కుటుంబంలో ఎవరికైనా రొమ్ము, గర్భాశయ ముఖద్వార, పెద్దపేగు క్యాన్సర్లుంటే చిన్న వయసులోనే కొలనోస్కోపీ పరీక్ష చేయించుకోవటం మంచిది.

ఇవీ.. క్యాన్సర్ హెచ్చరికలు

1. ముద్ద సరిగా మింగలేకపోవటం.
2. ఆకలి తగ్గటం 3. కడుపునొప్పి
4. బరువు తగ్గటం 5. అజీర్ణం
6. మలవిసర్జనలో మార్పులు
7. మలంలో రక్తం పడటం

మార్చేద్దాం జీవగడియారం!

మనకు సమయానికి కడుపులో ఆకలి మరగులుతుంది. రాత్రి పడుకునే వేళకు నిద్ర ముంచుకొస్తుంది. ఎవరూ లేపకపోయినా ఉదయాన్నే ఠంచనుగా మెలకువ వచ్చేస్తుంది. ఇలాంటి పనులన్నీ ఒక క్రమపద్ధతిలో జరిగేలా చూసేది మన మెదడులోని 'జీవగడియారం' (సర్కేడియన్ రిథమ్). ఇది సక్రమంగా పనిచేసినంతవరకూ అన్ని జీవక్రియలు సజావుగా సాగిపోతుంటాయి. అస్తవ్యస్తమైతే అన్నీ మారిపోతాయి. తరచుగా పనివేళలు మారిపోయే షిఫ్ట్ ఉద్యోగులు, వేర్వేరు టైమ్‌జోన్లలో ప్రయాణాలు చేసేవారికి జీవగడియారం అస్తవ్యస్తమయ్యే ముప్పు ఎక్కువ. ఫలితంగా నిద్రలేమి, ఊబకాయం వంటి పలు సమస్యలు బయలుదేరతాయి. సాధారణంగా శరీరానికి వెలుతురు తగిలేలా చూసుకోవటం, అవసరమైతే మెలటోనిన్ మాత్రలు వేసుకోవటం ద్వారా జీవగడియారం కుదురుకుంటుంది. అయితే ఇవి ఉప జీవగడియారాల మాదిరిగా పనిచేసే కణాల్లోని కొన్ని అణువులపై నేరుగా ప్రభావం చూపవు. ఇలాంటి ఇబ్బందిని తగ్గించుకోవటానికి భోజనం వేళలను మార్చుకోవటం కూడా తోడ్పడుతుందని ఇంగ్లాండులోని సర్రే విశ్వవిద్యాలయ



పరిశోధకులు చెబుతున్నారు. మనం తిన్న ఆహారం జీర్ణమయ్యే వేగం రోజంతా ఒకేలా ఉండదు. ఉదాహరణకు.. రాత్రిపూట భోజనం చేసినప్పుడు రక్తంలో గ్లూకోజు స్థాయులు చాలా పెరిగిపోతాయి. పైగా చాలాసేపు అదే స్థాయిలో ఉంటాయి. అయితే ఇది వ్యతిరేక దిశలోనూ పనిచేస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. అంటే భోజనం వేళలను మారిస్తే రక్తంలో గ్లూకోజు స్థాయులను నియంత్రించటానికి సంబంధించిన జీవగడియారం పనితీరూ మారిపోతుందన్నమాట. భోజన వేళలను ఎంత ముందుకు, వెనక్కి జరిపితే గడియారం కూడా అంత మేరకు కుదురుకోవటం గమనార్హం.

పాపాయికి కథల తెలివి

'అనగనగా ఒక రాజు. ఆయనకు ఏడుగురు కొడుకులు..' ఇలా కథలు చెబుతామంటే పిల్లలకు ఎగిరి గంతేస్తారు. వీటితో వినోదమే కాదు.. విజ్ఞానమూ లభిస్తుంది. కాస్త పెద్ద పిల్లలు మాత్రమే కాదు.. ఇంకా మాటలు రాని పిల్లలు కూడా కథలను శ్రద్ధగా వింటారని, ఇవి వారిలో తెలివి తేటలు పెరగటానికీ తోడ్పడతాయంటే నమ్ముతారా? తాజా అధ్యయనం ఒకటి ఈ విషయాన్నే స్పష్టంగా పేర్కొంటోంది. అమ్మ ఒడిలో ఆడుకునే పిల్లలకూ పుస్తకాలను చదివి వినిపిస్తే నాలుగేళ్ల తర్వాత వారిలో పద సంపద, చదివే నైపుణ్యాలు మెరుగుపడుతుండటం విశేషం. అంటే ప్రాథమిక విద్య ఆరంభించటానికి ముందే పేరు రాసే నైపుణ్యమూ అలవడే అవకాశముందన్నమాట. సుమారు 250 మంది తల్లీబిడ్డల జంటలను శాస్త్రవేత్తలు పరిశీలించి మరీ ఈ విషయాన్ని గుర్తించారు. ఎంత ఎక్కువగా, ఎంత శ్రద్ధగా పుస్తకాలను చదివి వినిపిస్తే అంత ఎక్కువ ఫలితం కనబడుతుంటం గమనార్హం. పసిపిల్లలు కళ్లు తెరచినప్పటి నుంచే తమ చుట్టూరా పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తుంటారు. చూడటం, తాకటం, వినటం వంటి వాటి ద్వారా చాలా విషయాలను నేర్చుకుంటుంటారు. అందువల్ల పుస్తకాలు చదివి వినిపిస్తే ఏడాది లోపు పిల్లలు సైతం పదాలను గ్రహించగలుగుతారని, ఆయా భావాలను అర్థం చేసుకోగలరని పరిశోధకులు చెబుతున్నారు. కాబట్టి చిన్నప్పటి నుంచే పిల్లలకు మంచి మంచి పుస్తకాలు చదివి వినిపించటం మేలని సూచిస్తున్నారు.

జబ్బులకు మెగ్నీషియం కళ్లెం!

గుండెజబ్బు, పక్షవాతం, మధుమేహం. ఆధునిక ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఈ జబ్బుల పేర్లు వినగానే ఎవరికైనా మనసులో కలవరం మొదలవుతుంది. ఇవి ఎప్పుడెలా చుట్టుముడతాయో తెలియదు. ఎవర్ని కబళిస్తాయో తెలియదు. అందుకే మన జాగ్రత్తలో మనం ఉండటం అవసరం. కాస్త అప్రమత్తంగా ఉంటే వీటి బారిన పడకుండానూ చూసుకోవచ్చు. ఇందుకు మనం తినే ఆహారమే మార్గం చూపుతోంది! ఆహారం ద్వారా తగినంత మెగ్నీషియం లభించేలా చూసుకున్నవారికి గుండెజబ్బు ముప్పు 10%.. పక్షవాతం ముప్పు 12%.. మధుమేహం ముప్పు 26% తగ్గుతున్నట్టు తేలటమే దీనికి నిదర్శనం. మెగ్నీషియం మరింత అదనంగా లభించేలా చూసుకుంటే ప్రయోజనాలు కూడా అదే స్థాయిలో పెరుగుతుండటం గమనార్హం. నిర్ణీత మోతాదు కన్నా రోజుకు 100 మి.గ్రా. అదనంగా మెగ్నీషియం లభించేలా చూసుకున్నవారికి పక్షవాతం ముప్పు మరో 7%.. మధుమేహం ముప్పు 19% తగ్గుముఖం పడుతోంది కూడా. మెగ్నీషియం మనకు ప్రధానంగా ఆహారం ద్వారానే అందుతుంది. మసాలా దినుసులు, గింజపప్పులు, చిక్కుళ్లు, పొట్టుతీయని ధాన్యాలు, ఆకుకూరల వంటి వాటిల్లో ఇది దండిగా ఉంటుంది.

హెచ్‌ఐవీ ఉచ్చులో యువత!

- బాధితుల్లో 65 శాతం మంది వారే
- కొన్నాళ్లుగా కరవైన ప్రచారం
- సామాజిక చైతన్యంతోనే నియంత్రణ

★ గుంటూరు జిల్లాకు చెందిన రామకృష్ణ (పేరు మార్చాం) ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరు ముగ్గురు యువతులతో శారీరక సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ మధ్య అనారోగ్యంతో పరీక్ష చేయించగా హెచ్‌ఐవీ ఉన్నట్లు తేలింది. ఈ విషయం గురించి ఇంట్లో చెప్పొద్దంటూ పరీక్షా కేంద్రం వారిని బతిమలాడుతున్నాడు.

★ కృష్ణా జిల్లాకు పవన్‌కుమార్ పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆటో డ్రైవరుగా మారాడు. ఆరునెలలకే హెచ్‌ఐవీ బారినపడ్డాడు.

ఇలాంటి కేసులు రాష్ట్రంలో దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఎప్పటికప్పుడు వెలుగు చేస్తూనే ఉన్నాయి. యవ్వనంలో సహజ లైంగిక ఆకర్షణకు లోనై కొందరు, సహచరుల ప్రోద్బలంతో ఇంకొందరు, ఎయిడ్స్ ఉన్న తల్లిదండ్రుల ద్వారా మరికొందరు ఈ మహమ్మారి బారిన పడుతున్నారు. హెచ్‌ఐవీ నమోదైన కేసుల్లో 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉన్న యువతే 65 శాతానికి పైగా ఉంటున్నారు. వీరిలో పురుషుల శాతం 3.5, మహిళల శాతం 3.2 వరకు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. తూర్పుగోదావరి, గుంటూరు, కృష్ణా, నెల్లూరు, ప్రకాశం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లో హెచ్‌ఐవీ కేసులు నమోదు ఎక్కువగా ఉంది. వ్యాధికి కారణమయ్యే హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్ (హెచ్‌ఐవీ) సోకినప్పటికీ... జీవించేందుకు ఎటువంటి ఢోకా లేదన్న ధోరణితో పలువురు లైంగిక చర్యల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంలేదని వైద్య వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల నుంచి పట్టణ, నగరాలకు వివిధ పనులపై వచ్చే వారు అమ్మాయిలను కలుస్తున్నారు. ఇవే హెచ్‌ఐవీ కేసుల సంఖ్య పెరిగేందుకు దోహదపడుతున్నాయి. ఇక కొందరు లారీ డ్రైవర్లు, క్లీనర్లు గతంలో మాదిరిగానే హెచ్‌ఐవీ బారినపడుతూ వస్తున్నారు.



కండోమ్‌ల వినియోగంపై కొంత వరకు సానుకూల స్పందన కనిపిస్తోందని ఇటీవల సెక్స్ వర్కర్లపై జరిగిన ఓ అధ్యయనంలో తేలింది. గత మూడేళ్లలో కేసుల సంఖ్య కొంత తగ్గినప్పటికీ ఈ మహమ్మారిని పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న గణాంకాలు కంటే ఎక్కువగానే హెచ్‌ఐవీ బాధితులు ఉంటారని తెలుస్తోంది. పరీక్షలు చేయించుకునేందుకు వెనుకడుగు వేసేవారు, వ్యాధి ఉందని తేలినా రికార్డుల్లోకి ఎక్కని వారి సంఖ్య భారీగానే ఉంటుందని అంటున్నారు. ఎయిడ్స్‌పై విస్తృత ప్రచారం చేసి, సామాజిక చైతన్యం తీసుకురావడంతోనే వ్యాధి వ్యాప్తిని అడ్డుకోగలమంటున్నారు.

కనుమరుగైన పులిరాజా!

పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా?... ఎయిడ్స్ పట్ల ప్రజల్ని అప్రమత్తం చేస్తూ దాదాపు 14 ఏళ్ల కిందట అందరి దృష్టిని ఆకర్షించిన ప్రచారాస్త్రమిది. గత మూడేళ్ల నుంచి మాత్రం ఈ తరహా ప్రచారం కనుమరుగైంది. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తరపున ప్రచార కార్యకలాపాలు మందగించాయి. 2016-17లో 11,16,930 మందికి పరీక్షలు చేయగా వీరిలో 25,322 మందికి హెచ్‌ఐవీ సోకినట్లు తేలింది.

ప్రచారం కీలకం...

హెచ్‌ఐవీ కేసుల నమోదుపై అధికారికవర్గాలు స్పందిస్తూ..."హెచ్‌ఐవీ బారినపడకుండా ఉండేందుకు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పాయి. రాష్ట్ర విభజన వల్ల కొన్ని సమస్యలు తలెత్తాయి. ఇప్పుడిప్పుడే అవి పరిష్కారమవుతున్నాయి. 2012-13లో 15 నుంచి 24 సంవత్సరాల మధ్య హెచ్‌ఐవీ కలిగిన వారి శాతం 2.0 ఉండగా 2016-17 నాటికి ఇది 1.3కు పరిమితమైంది. 25, ఆ సంవత్సరాలు పైబడిన వారిలో హెచ్‌ఐవీ వచ్చిన వారు 2012-13లో 5.6% నమోదు కాగా 2016-17 నాటికి 3.4%కు పరిమితమైంది. 2017-18లో జూన్ వరకు 5,00,992 మందికి పరీక్షలు చేయగా 6210(1.24%) మంది హెచ్‌ఐవీ బారినపడ్డారు. దీన్ని ఇంకా తగ్గించేందుకు కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నాయి.

– ఈనాడు, అమరావతి

జిల్లాల వారీగా హెచ్‌ఐవీ కేసులు

జిల్లా	హెచ్‌ఐవీ పరీక్షలు	నిర్ధరణ	గర్భిణులకు పరీక్షలు	నిర్ధరణ
అనంతపురం	93043	1195	77491	71
చిత్తూరు	91902	1745	81721	62
కడప	71520	981	49744	35
తూర్పు గోదావరి	97602	3536	76029	113
గుంటూరు	100669	3709	65942	111
కృష్ణా	105749	3327	68506	89
కర్నూలు	78484	1249	62498	67
నెల్లూరు	79394	1597	50289	53
ప్రకాశం	82783	1876	46821	73
శ్రీకాకుళం	68068	911	53646	43
విశాఖపట్నం	91804	1999	65952	77
విజయనగరం	73577	701	49593	30
పశ్చిమగోదావరి	82335	2496	65081	92

'అక్రిడేషన్'పై వ్యాజ్యాల విచారణ వాయిదా

ఈనాడు, హైదరాబాద్: తమ నుంచి తప్పనిసరిగా అక్రిడేషన్ తీసుకోవాలని పేర్కొంటూ జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ) జారీచేసిన సవరణ నిబంధనను సవాల్ చేస్తూ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయ విద్యాసంస్థలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం ఉమ్మడి హైకోర్టు విచారణ జరిపింది. రూ.1.50 లక్షల రుసుము సొమ్ము చెల్లించకుండా ఆయా కళాశాలలవారీ సమాచారాన్ని వెబ్‌సైట్లో పొందుపరిచేందుకు అవకాశం ఉందేమో తెలుసుకొని చెప్పాలని స్టాండింగ్ కౌన్సిల్ రమాకాంత్‌రెడ్డికి న్యాయస్థానం సూచించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. పిటిషనర్ సంస్థల తరఫున న్యాయవాదులు వాదనలువినిపిస్తూ.. వెబ్‌సైట్లో వివరాలు పొందుపరిచేందుకు లింక్ అనుసంధానం కావాలంటే రూ.1.50 లక్షలు రుసుము చెల్లించాల్సిందేనని నిబంధనల్లో స్పష్టంచేశారని.. ఇది అదనపు భారం అవుతుందన్నారు. ఎన్‌సీటీఈ తరఫున రమాకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ నిబంధనను జస్టిస్ వర్మ కమిటీ సుప్రీంకోర్టుకు ఇచ్చిన నివేదిక ఆధారంగా తీసుకొచ్చారన్నారు. వివాదం సుప్రీంకోర్టుకు చేరిన నేపథ్యంలో ప్రస్తుత వ్యాజ్యాలపై విచారణ జరపొద్దని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం విచారణను 31కి వాయిదా వేసింది.

ఏసీబీ కార్యాలయ భవనాలకు రూ.4.50 కోట్లు

ఈనాడు, అమరావతి: అనంతపురం, విజయవాడ, ఒంగోలులో ఏసీబీ రేంజి కార్యాలయ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.1.50 కోట్ల చొప్పున కేటాయించింది. ఏసీబీ డీజీపీ ఆర్.పి.ఠాకూర్ నుంచి అందిన ప్రతిపాదనల మేరకు ఈ నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.



'లక్ష్మీ'గణపతి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరులోని ఏలూరు బజార్ శ్రీవరసిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి రూ.78 లక్షల కరెన్సీ నోట్లతో గణపతికి విశేష అలంకారం చేశారు. కార్యక్రమాలను అవరపల్లి వెంకటభాస్కరరావు, కనిగల్ల దశరథ రామయ్య, మారం మల్లికార్జునరావు, భానుశంకర్, కొత్తమాసు రాకేష్, తదితరులు పర్యవేక్షించారు.

ఆదాయ రెట్టింపు లక్ష్యం.. రైతుల ఆత్మహత్యల నివారణే

- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

దిల్లీ: రైతుల ఆత్మహత్యలను నివారించేందుకే 2022నాటికి వ్యవసాయదారుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. వ్యవసాయంపై ఆధారపడిన వారిలో అత్యధికులు దారిద్ర్యరేఖ దిగువునే ఉన్నారని, దీనికి తోడు ఆ రంగంలో తలెత్తే సంక్షోభాల వల్ల బలవన్మరణాలు చోటుచేసుకుంటున్నాయని న్యాయస్థానానికి సమర్పించిన స్థాయీ నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. రైతుల ఆదాయాన్ని పెంచటమే దీనికి పరిష్కారమని భావిస్తున్నామని, వివిధ మంత్రిత్వ శాఖల సమన్వయంతో తగిన వ్యూహాలను సిద్ధంచేస్తున్నామని వివరించింది. పంజాబ్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ 'యూత్ కమల్'.. రైతుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం సోమవారం సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. జస్టిస్ ఎంబీ లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తలతో కూడిన ధర్మాసనం... కేంద్ర ప్రభుత్వం సమర్పించిన స్థాయీ నివేదికను నమోదు చేసుకుంది. పంటల సాగు వ్యయాన్ని తగ్గించేందుకు, ఫలసాయాన్ని పెంచేందుకు పలు పథకాలను అమలు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2007లో రూపొందించిన జాతీయ రైతుల విధానం(ఎన్‌పీఎఫ్)ను సమీక్షిస్తున్నట్లు పేర్కొంది. రైతులకు బ్యాంకుల ద్వారా రుణ లభ్యత పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని, తక్కువ ప్రీమియంతో పంటల బీమా అందుబాటులోకి తెచ్చినట్లు వివరించింది. పంటలకు మద్దతు ధరలను పెంచుతున్నట్లు తెలిపింది.

తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకు వినతి

ఈనాడు, అమరావతి: తెలుగు భాష అభివృద్ధి కోసం తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరింది. ప్రభుత్వ ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగు భాషలోనే సాగాలని, ఇది ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే ఆచరణ మొదలు కావాలని పేర్కొంది. తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగు భాషోద్యమ సమాఖ్య తరఫున అధ్యక్షుడు సామల రమేష్‌బాబు ఓ లేఖ రాశారు. తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకు 2016లో వేసిన కమిటీ ఇచ్చిన నివేదికను పూర్తిగా ఆమోదించి, చట్టపూర్వకంగా దాన్ని స్థాపించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పురపాలక శాఖ జారీ చేసిన జీఓ నం.14తో ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించారని, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు రెండు ఉంటాయని చెబుతూనే తెలుగు మాధ్యమంలో ఎలాంటి ప్రవేశాలు లేకుండా చేస్తున్నారని రమేష్‌బాబు పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నంలో రూ.650 కోట్లతో 'ఎయిమ్స్'..!

ఈనాడు, అమరావతి: విజయవాడ శివారు ఇబ్రహీంపట్నంలో రూ.650 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు 'అమరావతి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' (ఎయిమ్స్) ముందుకొచ్చింది. సోమవారం విజయవాడలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి సీఈవో జాస్తి కృష్ణ కిశోర్, ఎయిమ్స్ సంస్థ ప్రధాన ఆర్థికాధికారి చంద్ర మొక్కపాటిల మధ్య అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదిరింది. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు టక్కర్ సమక్షంలో ఈ పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ కిశోర్ మాట్లాడుతూ ఎయిమ్స్ సంస్థ అమరావతిలో 20ఎకరాల విస్తీర్ణంలో ఆస్పత్రి నిర్మిస్తుందని తెలిపారు. తొలి దశలో రూ.300కోట్ల వ్యయంతో 700 పడకలతో, మలి దశలో మరో రూ.300కోట్లు వెచ్చించి 400 పడకలతో ఆస్పత్రిని నిర్మిస్తుందని తెలిపారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీ!

కళాశాలల్లో చేరకుంటే ఆ సీట్లకు రేపే కౌన్సెలింగ్!

ఈనాడు, అమరావతి: ఎంబీబీఎస్, దంత వైద్య విద్య (బీడీఎస్)లో తొలి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన నాలుగో విడత కౌన్సెలింగ్ ద్వారా కన్వీనర్ కోటా సీట్లన్నీ భర్తీ అయ్యాయి. మూడో విడత కౌన్సెలింగ్ అనంతరం ఎంబీబీఎస్‌లో 60, దంత వైద్య విద్యలో 322 సీట్లు మిగిలాయి. వీటితోపాటు ఎన్‌సీసీ, క్రీడలు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు కేటాయించిన సీట్ల భర్తీకి కూడా విద్యార్థులు ఐచ్ఛికాలు నమోదు చేసుకోవాలని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం సూచించింది. దీని ప్రకారం విద్యార్థులు ఐచ్ఛికాలు నమోదుచేసుకున్నారు. సీట్లన్నీ భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన వారు మంగళవారం మధ్యాహ్నంలోగా సంబంధిత కళాశాలల్లో చేరాలి. సాయంత్రానికి ఖాళీల వివరాలు అందితే 5వ విడత కౌన్సెలింగ్‌ను బుధవారమే నిర్వహించేసి, సీట్లను కేటాయిస్తారు. విద్యార్థులు గురువారంలోగా కళాశాలల్లో చేరాలి. ఎంసీఐ నిబంధనలను అనుసరించి ప్రవేశాల ప్రక్రియను ఆగస్టు 31వ తేదీలోగా ముగించాల్సి ఉంది.

పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్యకార్యదర్శి అనూహ్య బదిలీ

ఈనాడు, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్యకార్యదర్శి, కేంద్ర జలసంఘం హైదరాబాద్ కేంద్రం చీఫ్ ఇంజినీర్ ఎ.కె.గుప్తా అనూహ్యంగా బదిలీ అయ్యారు. దిల్లీలోని జలసంఘం కార్యాలయంలో రిపోర్టు చేయాలంటూ ఆయనకు ఆదేశాలు అందాయి. గుప్తా పదవీ విరమణకు నెల సమయం మాత్రమే ఉండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ శ్రీవాత్సవకు పోలవరం అథారిటీ సభ్యకార్యదర్శిగా, జలసంఘం హైదరాబాద్ కేంద్రం చీఫ్ ఇంజినీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఏర్పాటైన కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు సభ్యకార్యదర్శిగా నియమితులైన ఆర్.కె.గుప్తా తర్వాత హైదరాబాద్‌లోని జలసంఘం చీఫ్ ఇంజినీర్‌గా నియమితులయ్యారు. తర్వాత కృష్ణా బోర్డుకు వేరే సభ్యకార్యదర్శిని నియమించి పోలవరం అథారిటీకి గుప్తాను నియమించారు. ఈనెల 24న జలవనరుల మంత్రిత్వ శాఖ కమిషనర్ ఓహ్రా ఆధ్వర్యంలో అథారిటీ బృందం పోలవరం ప్రాజెక్టును పరిశీలించింది. ఈ బృందం దిల్లీకి వెళ్లిన వెంటనే గుప్తా బదిలీ ఆదేశాలు వచ్చాయి. ఎక్కడాపోస్టింగు ఇవ్వలేదని తెలిసింది.

48మందికి ఉపకలెక్టర్లుగా పదోన్నతులు

ఈనాడు, అమరావతి: రెవెన్యూ శాఖలో పని చేస్తున్న 48 మందికి ఉప కలెక్టర్లుగా పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 43మంది తహసీల్దార్లుకాగా, అయిదుగురు సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేస్తున్నవారున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై సీఎం చంద్రబాబును సోమవారం సచివాలయంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ సంఘం అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం బొప్పరాజు మాట్లాడుతూ శాఖలో పదోన్నతులకు సంబంధించిన చర్యలు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. 76మంది ఉప తహసీల్దార్లకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ఆధ్వర్యంలో డీపీసీ నిర్వహించారనీ, ఇందుకు సంబంధించిన జాబితా సిద్ధమైందన్నారు. అలాగే ఉపకలెక్టర్ ప్రమోషన్ ద్వారా ఏర్పడే ఖాళీల్నీ భర్తీ చేయాలని కోరామనీ ఇందుకు సీసీఎల్ఏ సానుకూలంగా స్పందించారన్నారు. నెలాఖరున మరోసారి డీపీసీ నిర్వహించనున్నారని చెప్పారు.

నిందితుణ్ని నేరుగా విచారించాల్సిందే

- కార్పొరేట్ నేరాల్లో ఇది తప్పదు
- వాటివల్ల కుటుంబాలు నాశనమవుతాయి
- అగ్రిగోల్డ్ డైరెక్టర్ ముందస్తు బెయిలు పిటిషన్ కొట్టివేస్తూ హైకోర్టు వ్యాఖ్య

ఈనాడు – హైదరాబాద్

అగ్రిగోల్డ్ తరహా కార్పొరేట్ నేరాలు జరిగిన విధానం గురించి తెలుసుకోవడానికి నిందితుడిని నేరుగా విచారించాల్సి ఉందని, నిందితుడి హాజరు తప్పనిసరని ఉమ్మడి హైకోర్టు పేర్కొంది. హేయమైన నేరాలకంటే వైట్‌కాలర్ నేరాలు తీవ్రమైనవని వ్యాఖ్యానించింది. కార్పొరేట్ నేరాలతో కొన్నిసార్లు పలు కుటుంబాలు కోలుకోలేని విధంగా నాశనమవుతాయంది. అగ్రిగోల్డ్ నామినేటెడ్ డైరెక్టర్ భానోజీరావు పెట్టుకున్న ముందస్తు బెయిలు పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తనపై ఆంధ్ర, తెలంగాణాల్లో దాఖలైన కేసుల్లో ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ భానోజీరావు పెట్టుకున్న పలు పిటిషన్లపై విచారించిన జస్టిస్ టి.సునీల్ చౌదరి వాటిని కొట్టివేస్తూ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేదని, ముందస్తు బెయిలు మంజూరు చేయాలన్న భానోజీరావు వినతిపై న్యాయమూర్తి స్పందిస్తూ ప్రతి చిన్న విషయమూ ఉండటానికి ఎఫ్ఐఆర్ ఎన్‌సైక్లోపీడియా కాదన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకపోయినా కుట్రకు ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులు ఎవరో తెలుసుకోవాల్సిన బాధ్యత దర్యాప్తు సంస్థపై ఉందన్నారు. కేసు తీవ్రతను పరిశీలించాక ముందస్తు బెయిలును అనుమతించలేమన్నారు. సుమారు 32 లక్షల మంది నుంచి రూ.6,380 కోట్లు వసూలు చేసిన అగ్రిగోల్డ్ గ్రూపు కంపెనీల వ్యవహారాలు ఆర్థిక వ్యవహారాల కిందే పరిగణనలోకి తీసుకోవచ్చని, నిందితుడిపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేయడం సబబేనని అన్నారు. సుమారు 159 కంపెనీలు ఏర్పాటు చేశారని, 13 అనుబంధ కంపెనీల్లోకి రూ.600 కోట్ల నిధులను చట్టవిరుద్ధంగా బదలాయించారన్న ఉభయ రాష్ట్రాల పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వాదనను న్యాయమూర్తి సమర్థించారు. డైరెక్టర్‌గా కంపెనీతోపాటు వాటాదారుల వ్యవహారాలను సమన్వయం చేసుకోవాల్సిన పిటిషనర్ ఆ బాధ్యతను విస్మరించారన్నారు. ఇలాంటి వ్యవహారాల్లో న్యాయస్థానాలు కళ్లు మూసుకుని ఉండవన్నారు. పిటిషనర్‌కు ముందస్తు బెయిలు మంజూరు చేసి.. కార్పొరేట్ చట్టాలను అడ్డం పెట్టుకుని సామాన్యుల నుంచి డిపాజిట్లు వసూలు చేసి బెయిలు కింద రక్షణ పొందవచ్చన్న అభిప్రాయాన్ని కలిగించలేమని న్యాయమూర్తి పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీల్లో కేవలం నామినేటెడ్ డైరెక్టర్‌గా చెప్పుకొంటూ 13 అనుబంధ కంపెనీల్లో డైరెక్టర్‌గా, వైస్ ఛైర్మన్‌గా ఉన్న విషయాన్ని బెయిలు పిటిషన్లలో వెల్లడించకపోవడాన్ని ప్రశ్నించారు. 1994లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగవైకల్యం ఏర్పడిందన్న పిటిషనర్ వాదనతో విభేదిస్తూ అలాంటి వ్యక్తికి ఏ కంపెనీ వైస్‌ఛైర్మన్, డైరెక్టర్ పదవులను అప్పగించదన్నారు. డిపాజిట్ల వసూలులో పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలున్నాయని, కేసు తీవ్రత ఆధారంగా ముందస్తు బెయిలు ఇవ్వలేమంటూ పిటిషన్‌ను కొట్టివేశారు.

కన్యాశుల్కానికి మరింత ప్రాచుర్యం కల్పిస్తాం

- గురజాడ ఇంటిని అందరూ మెచ్చేలా అభివృద్ధి చేస్తాం: మంత్రి గంటా

ఈనాడు – విజయనగరం

మహాకవి గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకానికి మరింత ప్రాచుర్యం కల్పించాల్సి ఉందని రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మధ్యాహ్నం విజయనగరంలో జరిగిన కన్యాశుల్కం 125వ జాతీయోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గురజాడ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి గురజాడ గృహం వరకూ ర్యాలీ నిర్వహించారు. గురజాడ ఇంటిలో రజత ఫలకాన్ని ప్రతిష్ఠించి గురజాడ వాడిన వస్తువుల్ని, చదివిన పుస్తకాల్ని పరిశీలించారు. అనంతరం జాతీయోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి యువతకు సాహిత్యాన్ని, ఆచారవ్యవహారాల్ని దగ్గర చేసేందుకు కృషి చేస్తామన్నారు. గురజాడ ఇంటిని అందరూ స్ఫూర్తి పొందేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గురజాడ గృహం పక్కనే ఉన్న స్థల వివాదం పరిష్కరించి డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేయడమో, లేక గోల్కొండ తరహాలో లైట్ అండ్ షో పెట్టి గురజాడ జీవితం గురించి తెలిసేలా చేస్తామని తెలిపారు. కన్యాశుల్కం 125 ఏళ్ల వేడుకని విశాఖలోని చిల్డ్రన్ థియేటర్‌లో ఒక వేడుకగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఇక నుంచి విద్యార్థులకు ఇచ్చే బహుమతులు లోహంతో చేసినవి కాకుండా గురజాడ దేశభక్తి గేయమున్న జ్ఞాపికలు అందజేసేందుకు కృషిచేస్తామన్నారు. ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ గురజాడ రచనల్ని చదవని, నాటకాలు చూడని విద్యార్థులు రాష్ట్రంలో ఉండకూడని పరిస్థితి తీసుకురావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి, జడ్పీ అధ్యక్షురాలు స్వాతిరాణి, విజయనగరం ఎమ్మెల్యే మీసాల గీత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దేశభక్తి గేయమున్న జ్ఞాపికలను అందజేయాలని చెబుతూ నమూనాను ఆవిష్కరిస్తున్న మంత్రి గంటా, పరకాల ప్రభాకర్ తదితరులు

శశికళ బహిష్కరణపై సర్వసభ్య సమావేశంలో నిర్ణయం

- అన్నాడీఎంకే నేతల స్పష్టీకరణ
- 40మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు!

చెన్నై, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే (అమ్మ) వర్గం ప్రధాన కార్యదర్శి శశికళను పార్టీ నుంచి బహిష్కరించే విషయమై త్వరలో జరగనున్న పార్టీ సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం సంయుక్త అధ్యక్షతన ఓ సమావేశం సోమవారం నగరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అంశాలకు సంబంధించి నాలుగు తీర్మానాలను ఆమోదించారు. పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా పేర్కొంటున్న దినకరన్‌ను గతంలోనే పార్టీ నుంచి బహిష్కరించినట్లు పేర్కొన్నారు. దీంతో పార్టీ నుంచి నేతలను తొలగించే హక్కు ఆయనకు లేదన్నారు. కొత్త వారి నియామకాలు కూడా చెల్లవన్నారు. పార్టీ నిర్వాహకులు, సభ్యుల కోరిక మేరకు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దినకరన్ ఆధీనంలో ఉన్న జయ టీవీ, నమదు ఎంజీఆర్ పత్రికల స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. జయలలిత ఎంతో క్రమశిక్షణతో నిర్వహించిన పార్టీ కార్యకలాపాలను మరింత మెరుగు పరిచేందుకు వీలైనన్ని చర్యలు చేపట్టాలని పేర్కొంటూ తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశానికి సుమారు 40 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారని సమాచారం.

చిక్కుల్లో పడిన డీఎంకే?

చెన్నై: తమిళనాట వ్యూహ ప్రతివ్యూహాలతో రాజకీయాలు వేడి పుట్టిస్తున్నాయి. రోజుకో మలుపుతో కొంత కాలంగా కొనసాగుతున్న అన్నాడీఎంకే సినిమా త్వరలో అసెంబ్లీలో ముగుస్తుందని రాష్ట్ర మంత్రి దిండిగల్ శ్రీనివాస్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇది జరిగిన 24 గంటల అనంతరం డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ సహా 21 మంది ఎమ్మెల్యేలకు ప్రివిలేజ్ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ప్రభుత్వ చీఫ్‌విప్ రాజేంద్రన్ ఇటీవల ఫిర్యాదు చేయడంతో టీటీవీ దినకరన్ వర్గంలోని 19 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. తాజాగా డీఎంకే ఎమ్మెల్యేలకు నోటీసులు రావడంతో ఆ పార్టీ చిక్కులో పడింది. శాసనసభలో ముఖ్యమంత్రి బల పరీక్షకు అవకాశం వస్తే లాభపడాలని చూస్తున్న డీఎంకేకు తాజా పరిణామాలు మింగుడుపడటం లేదు.



సోదరుడిని పూలమాలతో సత్కరిస్తున్న మంత్రి భూమా అఖిలప్రియ

ఓటుతో నాన్నను బతికించారు

'నాకు ఆళ్లగడ్డ అమ్మ, నంద్యాల నాన్నతో సమానం. తల్లిదండ్రులను ఏవిధంగా చూసుకుంటామో అదేవిధంగా ఈ ప్రాంతాలను చూసుకుంటా. ఎన్నికల ప్రచారంలోనూ చెప్పా. ముందు చెప్పినట్లే మెజార్టీ వచ్చింది. ప్రభుత్వం, భూమా కుటుంబంపై నమ్మకంతోనే ప్రజలు మా సోదరుడిని గెలిపించారు. ప్రజలు ఓటుతో మా నాన్న భూమా నాగిరెడ్డిని బతికించారు. గతంలో ఆయన ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల రుణం తీర్చుకుంటాం. ముఖ్యమంత్రి చంద్రబాబు మా కుటుంబానికి పూర్తిగా సహకరించారు.

- మంత్రి భూమా అఖిలప్రియ



సోమవారం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబుకు మిఠాయి తినిపిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు

అభివృద్ధికి పట్టం కట్టారు

ప్రజలు కేవలం అభివృద్ధికే పట్టంకట్టారనే విషయం రుజువైంది. ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుడు వాడిన భాషకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పిచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయాల్లో ప్రత్యర్థులు హుందాగా ప్రవర్తించాలనే విషయాన్ని ఈ ఎన్నికల ఫలితం సూచిస్తున్నాయి.

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు

2024 వరకు తెదేపాకు తిరుగులేదు

2019 ఎన్నికల్లో తెదేపాయే గెలుస్తుంది.. 2024 వరకు పార్టీకి తిరుగులేదని తేటతెల్లమైంది. రాష్ట్రాన్ని అభివృద్ధిబాట పట్టించిన ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రజలు గుర్తించారు. జగన్ అహంకారం, అసంబద్ధ ప్రేలాపనలు మాకు కలిసొచ్చాయి. ఈ తీర్పు, రాష్ట్రం మరింత అభివృద్ధిలో పరుగులు పెట్టేలా చేయనుంది.

- కాలవ శ్రీనివాసులు, కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

సక్రమ మార్గంలో వెళితేనే ఆదరణ

- **పార్టీ నాయకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు**

ఈనాడు అమరావతి: నంద్యాల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదలైన తొలి రౌండ్ నుంచీ ఫలితాలు తెదేపాకు అనుకూలంగా వస్తుండటంతో ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సోమవారం ఉదయం నుంచి చాలా సంతోషంగా కనిపించారు. తనను కలిసేందుకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో ఆయన తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం నమ్మిన ఆశయానికి, సిద్ధాంతానికి కట్టుబడి చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజలు ఆదరిస్తారని, విజయం ఎప్పుడూ మనదే అవుతుందని పేర్కొన్నారు. ''మనం సక్రమమైన మార్గాన్ని ఎంచుకున్నాం. ఎవర్నీ బెదిరించలేదు. అరాచకాలకు పాల్పడలేదు. పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మనల్ని మనం మార్చుకుంటూ వెళుతున్నాం. కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురైనా పార్టీని నిలబెట్టుకున్నాం...'' అని వివరించారు. అక్రమ మార్గాల్లో, దారితప్పి నడిస్తే ఎలా ఉంటుందో దానికి బాబా గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను ఉదాహరణగా చెప్పారు. వైకాపా అధ్యక్షుడు జగన్ వ్యవహార శైలిని బాబా రామ్ రహీంతో పోల్చారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కూడా తనను ఎన్నో ఇబ్బందులు పెట్టాలని చూశారని, తెదేపాని నామరూపాల్లేకుండా చేస్తానన్నారని ఆయన గుర్తు చేశారు.

తెదేపా శ్రేణుల్లో మిన్నంటిన సంబరం

పార్టీ ఘన విజయం సాధించడంతో రాష్ట్ర వ్యాప్తంగా తెదేపా శ్రేణులు సంబరాల్లో మునిగితేలాయి. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం, గుంటూరులోని తెదేపా రాష్ట్ర కార్యాలయం సహా రాష్ట్ర వ్యాప్తంగా తెదేపా కార్యాలయాల వద్ద పండగ వాతావరణం నెలకొంది. తెదేపా విజయం జగన్‌కు చెంప పెట్టు అని ఆ పార్టీ అధికార ప్రతినిధి డొక్కా మాణిక్యప్రసాద్ వ్యాఖ్యానించారు. తాడేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు దండమూడి మనోజ్ కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు దండమూడి శైలజారాణి ఆధ్వర్యంలో తెదేపా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ముఖ్యమంత్రి నివాసం వద్దకు చేరుకున్నారు. భారీగా బాణసంచా కాల్చారు. నృత్యాలు చేశారు. ముఖ్యమంత్రి కేక్ కోసి అక్కడున్న వారందరికీ స్వయంగా తినిపించారు. మనోజ్‌కుమార్ తదితరులు ముఖ్యమంత్రికి తలపాగా, కరవాలం బహూకరించారు. ముఖ్యమంత్రి సచివాలయానికి వెళుతూ... తన నివాసం ఎదుట పెద్ద ఎత్తున గుమిగూడిన కార్యకర్తల్ని చూసి ఆగారు. వారికి అభివాదం చేశారు.



గెలుపు అనంతరం ఎన్నికల అధికారి సమక్షంలో సంతకం చేస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి

ప్రగతి బాటకే పట్టం

- **కీలక రహదారి విస్తరణకే రూ.110 కోట్లు**
- **13 వేల పక్కాగృహాలకు రూ.840 కోట్లు**
- **రూ.1,500 కోట్లతో పనులు**

నంద్యాలలో తెలుగుదేశం ఘనవిజయం సాధించడానికి ప్రధాన కారణం అభివృద్ధే. అధికారంలో ఉన్న పార్టీగా ఉపఎన్నికల్లో సహజంగా ఉండే అనుకూలతలు, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు వ్యూహరచన, దాని అమలులో మంత్రులు, శాసనసభ్యుల చొరవ, మైనారిటీల మద్దతు తదితర కారణాలతో పాటు రూ.1,500 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులే కీలకమయ్యాయి. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజలకు బాగా ఇబ్బందికరంగా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా తీసుకున్న చర్యలే తెదేపా విజయానికి సోపానమయ్యాయి. ఏదో ఒక భావోద్వేగ అంశం లేకుండా అభివృద్ధిని ఎన్నికల అజెండాగా మార్చడం సాధారణ పరిస్థితుల్లో ఒక విధంగా సాహసమే. తెదేపా ఈ ఎన్నికల్లో అలా సాహసించి సానుకూల ఫలితం రాబట్టింది.

ఈనాడు - అమరావతి

నంద్యాలలో వాహనాల రాకపోకలపరంగా అత్యంత సంక్లిష్టంగా ఉండే సుమారు రెండున్నర కిలోమీటర్ల రహదారిని విస్తరించాలన్నది మూడు దశాబ్దాల డిమాండ్. నంద్యాలలో నివసించే వారితోపాటు నియోజకవర్గంలోని నంద్యాల గ్రామీణ, గోస్పాడు మండలాల ప్రజలు ఏపని కావాలన్నా ఏదోఒక రూపంలో ఈ రహదారిపై ప్రయాణించాల్సిందే. ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా స్థాయి ఆసుపత్రి, న్యాయస్థానం, సినిమాహాళ్లు, సమస్త వ్యాపారాలకు ఈ రహదారే కేంద్రం. ఎన్నికల షెడ్యూల్ విడుదలవడానికి రెండు నెలల ముందు విస్తరణకు మోక్షం లభించింది. దాదాపు రూ.80కోట్ల నిర్మాణ వ్యయంతో ఇప్పటికే ఉన్న రహదారిని రెండింతలు విస్తరించడం, పరిహారం రూపంలో ఉదారంగా రూ.30కోట్లు కేటాయించడం ప్రజలను ఆకట్టుకుంది. విశాఖపట్నం నమూనాగా పట్టణంలోని రహదారులన్నింటినీ విస్తరించడం, రెండువైపులా మురికినీటి కాలువలు, వాటిపై పైకప్పు నిర్మించడానికి రూ.60కోట్లు కేటాయించారు. పట్టణంలో అసలు గూడులేని వారే ఉండరాదన్న లక్ష్యంతో రూ.850కోట్ల వ్యయమయ్యే 13వేల ఇళ్లు మంజూరు చేశారు. నిర్మాణం పూర్తయ్యాక అవి ఎలా ఉంటాయో తెలియజేసేలా నమూనా గృహాలను నిర్మించి లబ్ధిదారులకు చూపారు. వెలుగోడు నుంచి నేరుగా పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటిందించేందుకు రూ.137కోట్లు కేటాయించారు. ఇదే పైపులైన్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు నీరిచ్చేందుకు మరికొంత మొత్తం మంజూరుచేశారు. భారీ వర్షాలతో ఆకస్మికంగా వచ్చే వరదలతో నంద్యాల ముంపునకు కారణమయ్యే కుందూ నది, చామ

కాలువల్లో పూడికతీతకు కావాల్సినంత మొత్తం కేటాయించారు. వీటిల్లో కొన్ని ముందునుంచి ప్రతిపాదన దశలో ఉన్నా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి ప్రతిదీ కనీసం 20 నుంచి 40 శాతం మేర పనులు జరిగేలా చూశారు. రహదారి విస్తరణ కోసం భవనాలు, దుకాణాల తొలగింపునకు ఒకేసారి పదులు, వందల సంఖ్యలో జేసీబీలు, టిప్పర్లను వినియోగించడం.. కొన్ని గంటల్లోనే పని పూర్తి చేయటం నంద్యాలవాసులకు గుర్తుండిపోయేలా, పనులు పూర్తవుతాయన్న నమ్మకం కలిగేలా చేసింది. ఒకేసారి వందకుపైగా రహదారి, మురికి కాలువల పనులు పట్టణానికి మంజూరై 70

కిపైగా ప్రారంభమయ్యాయి. అత్యధికుల ఇళ్ల ముందు ఈ పనులు జరుగుతుండడం, రాకపోకలకు ఇబ్బందికరం అవుతుండడంతో.. కౌన్సిలర్లు మంత్రి నారాయణకు చెప్పి మిగిలిన వాటిని బలవంతంగా ఆపించాల్సి వచ్చిందంటే ఒకేసారి ఎంత భారీ స్థాయిలో పనులు చేపట్టారో స్పష్టమవుతోంది. ఇవన్నీ 50శాతంలోపునే ఉండటంతో తెదేపాను గెలిపిస్తేనే ఇవి పూర్తవుతాయన్న పార్టీ శ్రేణుల ప్రచారం ఓటర్లలోకి బలంగా వెళ్లింది. పట్టణంతోపాటు దీనిపై పూర్తిగా ఆధారపడిన గ్రామీణ ప్రాంతాల్లోని వారూ వర్గాలకతీతంగా ఓట్లేయటంతో ఈ స్థాయి ఘన విజయం సాధ్యమైంది.



నంద్యాలలో తెదేపా విజయం నేపథ్యంలో సోమవారం ఉండవల్లిలోని తన నివాసానికి తరలివచ్చిన పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న చంద్రబాబు నాయుడు

ఆ 20 స్థానాల్లోనూ ఒకేసారి ఎన్నికలకు రా

- **ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిపక్ష నేత జగన్ సవాల్**
- **రూ.200 కోట్లు పంచి, అధికార దుర్వినియోగంతో గెలిచారు**
- **మాకూ సమయం వస్తుంది.. మేమూ దెబ్బకొడతాం**

ఈనాడు - అమరావతి

మొత్తం మంత్రులను కూర్చోబెట్టి.. రూ.200 కోట్లు డబ్బు పంపిణీ చేసి, పింఛన్, రేషన్ ఆపేస్తామంటూ ప్రజలను భయపెట్టి, ఇతర పార్టీల కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేలా పోలీసులతో వారి ఇళ్లపై దాడులు చేయించి నంద్యాలలో అధికార తెదేపా గెలిచిందని ప్రతిపక్ష నేత, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. నంద్యాలలో ఫలితం తన విజయమని చంద్రబాబు అనుకుంటే ఆయనకంటే మూర్ఖుడు మరొకరు ఉండరని వ్యాఖ్యానించారు. సోమవారం నంద్యాల ఉప ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు.

నంద్యాల ఒక్కటే రెఫరెండం ఎలా అవుతుంది?

నంద్యాల ఉప ఎన్నిక ఒకటే రెఫరెండం ఎలా అవుతుంది? అసలు రెఫరెండం అంటే ఏంటి? చంద్రబాబుకు సవాల్ విసురుతున్నా ... వైకాపా నుంచి తెదేపాలో చేరిన మిగిలిన 20మందితోనూ ఒకేసారి ఎన్నికలకు రా... ఆ 20 నియోజకవర్గాల్లో రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.4వేల కోట్లు ఎలా ఖర్చు పెడతారో చూస్తా?. అన్ని చోట్లా పోలీసులు మీ మాట వింటారేమో చూస్తా. ఆ 20 చోట్లా మీరెలా భయపెట్టగలుగుతారో చూస్తా. అది రెఫరెండం అంటే.. మా పార్టీ గుర్తు మీద గెలిచిన వాళ్లను చంద్రబాబు తీసుకున్నారు.. ఆయన పార్టీ గుర్తుపై తిరిగి వారిని గెలిపించుకునే ధైర్యం, నమ్మకం ఆయనకు లేదు.. అదే ఆయన మనిషి కాదని స్పష్టం చేస్తోంది...'' అని జగన్ విమర్శించారు.



నంద్యాల ఫలితాల వెల్లడి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్

దెబ్బకొట్టారు.. పడ్డాం..

'రాజకీయాల్లో గుండె ధైర్యం ఉండాలి.. అవతలోడు గట్టిగా కొడుతున్నపుడు వెనక్కుపోతామే తప్ప... కొట్టాడు కాబట్టి పడిపోయాడనుకోవాల్సిన అవసరం లేదు. అవతలోడు ఎంత గట్టిగా కొడతాడో దాన్ని నేను ఎంత గట్టిగా తీసుకుంటాననేదే వచ్చే ఎన్నికలకు నాంది.. కొట్టాడు. తీసుకున్నాం.. మా సమయం వస్తుంది. మేమూ కొడతాం... '' అని జగన్ పేర్కొన్నారు.

ఇది చంద్రబాబు విజయం కాదు

''ఎన్నికల ప్రచారంలో ప్రతీచోట ప్రజలతో నేను మాట్లాడా. వారిని ప్రశ్నించినప్పుడు 2014 ఎన్నికలపుడు చంద్రబాబు ఇచ్చిన హామీలు... ఆ తర్వాత ఆయన చేసిన ప్రతీ మోసం పైనా వారు అవగాహనతో చేతులు ఎత్తి చూపించారు. ప్రజల్లో ఆ భావన ఉన్నప్పటికీ నంద్యాలలో గెలిచారంటే కారణం ఇవి సాధారణ ఎన్నికలు కావు. చంద్రబాబుకు వ్యతిరేకంగా ఓటు వేసినా వెంటనే ఆయన అధికారం నుంచి తప్పుకోరు. మరో సంవత్సరం ఆయన అధికారంలోనే ఉంటారు. గత్యంతరం లేక, ఆయనకు భయపడుతూ, ఆయన ఇచ్చిన డబ్బుకు ఒప్పుకోక తప్పక ఓట్లు వేయడం వల్ల నంద్యాలలో గెలిచారే తప్ప.... ఇది ఏ రకంగానూ చంద్రబాబు విజయం కాదు...'' అని జగన్ స్పష్టం చేశారు. భయభ్రాంతులకు గురిచేసేలా పోలీసులతో దాడులు చేయించినా, ప్రలోభాలకు గురి చేసినా గట్టిగా నిలబడిన నంద్యాల ప్రజలు, వైకాపా కార్యకర్తలకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతున్నానని జగన్ తెలిపారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న తమ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లో విలువలకు అర్థం చెప్పిన శిల్పా చక్రపాణిరెడ్డిలకు హ్యాట్సాఫ్ అని పేర్కొన్నారు.

13 రోజులు మకాం వేసినా..

ఈనాడు - అమరావతి

వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల ఉపఎన్నికలో విజయంపై పెట్టుకున్న నమ్మకం వమ్మయింది. స్వయంగా 13 రోజుల పాటు నియోజకవర్గంలోనే మకాం వేసి.. ఉధృతంగా ప్రచారం నిర్వహించినా పార్టీకి పరాజయం తప్పలేదు. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ప్రతి కూడలిలో గంటల తరబడి ప్రచారం నిర్వహించినా, సెల్ఫీలతో యువతరాన్ని ఆకట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కీలకమైన ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకును కాపాడుకోలేక పోవటం, తెదేపా అభివృద్ధి వ్యూహానికి బదులివ్వలేక పోవటం, ముఖ్యమంత్రిపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు వికటించటం తదితర అంశాలు వైకాపా అభ్యర్థి పరాజయానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

సిట్టింగ్ శాసనసభ్యుని మరణంతో జరిగిన సాధారణ ఉపఎన్నికను రాష్ట్రస్థాయిలో అందరూ చర్చించుకునే స్థాయిలో మలిచిన జగన్.. ఓటమి ప్రభావాన్ని రెట్టింపు చేసుకున్నారన్న భావన ఏర్పడింది. ముఖ్యమంత్రికి, తనకూ మధ్య జరుగుతున్న పోరు అన్నంతగా ఈ ఎన్నికని మార్చేసిన విపక్ష నేత.. సీఎంని కాల్చి చంపినా ఫర్వాలేదు, ఎన్నికల హామీల్ని నెరవేర్చలేదు కనుక ఉరి తీయాలి అంటూ చేసిన కటువైన వ్యాఖ్యలు తీవ్ర స్థాయిలో విమర్శలకు తావిచ్చాయి. దీనిపై ఎన్నికల సంఘం కూడా తాఖీదులివ్వటంతో జగన్ ఆత్మరక్షణ ధోరణిలో పడ్డారు.

2014 ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మారిన ముస్లిం మైనారిటీలను పార్టీకి మద్దతుదారులుగా కొనసాగించేందుకు వైకాపా ఈసారి ప్రత్యేకించి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. పార్టీ అభ్యర్థిగా ఆఖరి నిమిషంలో తీసుకొచ్చిన శిల్పా మోహన్‌రెడ్డిపై మైనారిటీల్లో కొంతకాలంగా వ్యతిరేకత ఉందన్న సంకేతాలు వెలువడినా.. వాటిని తొలగించేందుకు సరైన చొరవ చూపలేదు. రాష్ట్రం మొత్తంమీద ఉన్న సమస్యల్ని, తెదేపా ఎన్నికల ప్రణాళికను చెప్పినంత గట్టిగా.. స్థానిక సమస్యలపై జగన్ దృష్టి పెట్టలేకపోయారు. 2019లో అధికారంలోకొచ్చాక నంద్యాలని అభివృద్ధిపథంలో నడుపుతానని ఆయన చేసిన ప్రకటన ఓటర్లను ఆకర్షించలేకపోయింది. ప్రస్తుతం జరుగుతున్న పనులు కొనసాగాలంటే తెదేపాని గెలిపించాలనే భావన ప్రజల్లో ఉన్నట్లు వచ్చిన సంకేతాల్ని విస్మరించారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బృందం చేసిన సర్వేలు, ఇచ్చిన సూచనలు సైతం పార్టీని పరాజయం నుంచి కాపాడలేకపోయాయి. తెదేపాకు దీటుగా రాష్ట్రం నలుమూలల నుంచి వైకాపా సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు పలువురు నంద్యాలలో మకాం వేసినా.. అధికార పార్టీకి దీటుగా వ్యూహాలు రచించటంలో, వాటిని అమలుచేయటంలో వెనకబడిపోయారు. మంత్రి అఖిలప్రియ, మరో మంత్రి ఆదినారాయణరెడ్డిలపై ఎమ్మెల్యే రోజా చేసిన వ్యాఖ్యలు సైతం పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. మొత్తంగా తానే అభ్యర్థి అనే స్థాయిలో జగన్ ప్రచారం చేసినా.. నాయక శ్రేణులు, కార్యకర్తల బలగాన్ని కాపాడుకోవటంలో, పోలింగ్‌కి సిద్ధం చేయటంలో చొరవ చూపలేకపోయారు.

వెలవెలబోయిన లోటస్‌పాండ్

- **జగన్ రాజకీయ కార్యదర్శులు మినహా అటుగా రాని ప్రధాన నేతలు**
- **నంద్యాల ఫలితంపై ప్రశాంత్ కిశోర్ బృందం సమీక్ష**

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో సోమవారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైకాపా కేంద్ర కార్యాలయం వెలవెలబోయింది. నాయకులు, కార్యకర్తలు హడావుడి కనిపించలేదు. ఉదయాన్నే ఇక్కడికి చేరుకున్న మీడియా ప్రతినిధులతో మాట్లాడేవారూ కరవయ్యారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి రాజకీయ కార్యదర్శులైన ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి తప్ప ఇతర ప్రధాన నాయకులు ఎవరూ కార్యాలయం వైపు రావడం, ఉప ఎన్నికల ఫలితాల సరళిపై చర్చించడం వంటిది లేకపోవడం గమనార్హం. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మాత్రం టీవీ ఛానెళ్ల చర్చల్లో పాల్గొనేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చి, అది ముగియగానే అక్కడ నుంచి వెళ్లిపోయారు.

- మరోవైపు వైకాపాకి రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరిస్తున్న ప్రశాంత్ కిశోర్‌కు సంబంధించిన బృందానికి హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ప్రత్యేకంగా కార్యాలయాన్ని ఆ పార్టీ కేటాయించింది. అక్కడ సోమవారం ప్రశాంత్ బృందం నంద్యాల ఉప ఎన్నిక ఫలితంపై ప్రత్యేకంగా సమీక్షించింది. ఎక్కడ లోపం జరిగింది వంటి విషయాలపై గణాంకాలను పరిశీలించినట్లు వైకాపా వర్గాలు తెలిపాయి. దీనిపై ఈ బృందం జగన్‌కు ఒక నివేదికను సమర్పించనుందని తెలిసింది.

జగన్ వివాహ వార్షికోత్సవం

నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలు వెలువడిన సోమవారమే జగన్ వివాహ వార్షికోత్సవం కూడా. ఉప ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా రావడంతో ఈ సమయంలో జగన్‌కు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు వెనకాడినట్లు తెలిసింది. ఫలితాలు వెలువడ్డాక జగన్ తన నివాసంలోనే విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులు కొందరు ఆయనకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో మీకు చెప్పొచ్చో లేదో అంటూ సంశయం వ్యక్తం చేస్తూనే శుభాకాంక్షలు తెలుపగా జగన్ నవ్వుతూ వారితో కరచాలనం చేసి ఇంట్లోకి వెళ్లిపోయారు.

ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం: రఘువీరా

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉపఎన్నికలో ప్రజల తీర్పుని గౌరవిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. అధికారంతో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతుందని తెలిపారు.

ప్రజామోదం లభించినట్టు కాదు

ఉపఎన్నిక ఫలితం రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం పనితీరుకి లభించిన ప్రజామోదంగా భావించడం సరికాదని ఏపీసీసీ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ అన్నారు. ''దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి కుటుంబానికి సానుభూతి పవనాలు వీచాయి. శిల్పా మోహన్‌రెడ్డికి బదులు ప్రతిపక్షాలన్నీ ఉమ్మడి అభ్యర్థిని నిలిపితే బాగుండేది. తెదేపా విచ్చలవిడిగా డబ్బు పంచడంతో పాటు అధికారాన్ని దుర్వినియోగం చేసింది. ముఖ్యమంత్రిని ఉద్దేశించి వైకాపా అధ్యక్షుడు శ్రుతి మించి చేసిన పరుష వ్యాఖ్యలు సైతం తెదేపా విజయానికి కలిసొచ్చాయి'' అని పేర్కొన్నారు.

ఇది సానుకూల ఓటు

- **కాకినాడపైనా ఇదే ప్రభావం**
- **తెదేపా వర్గాల విశ్లేషణ**

ఈనాడు - అమరావతి

ఉపఎన్నికలో సాధించిన ఘనవిజయాన్ని సానుకూల ఓటుగా తెలుగుదేశం పరిగణిస్తోంది. ఈ ఎన్నికలను 2019లో జరిగే సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్‌గా, రాష్ట్ర స్థాయి ఎన్నికలుగా వైకాపా మలిచిన తీరు తమకు అనుకోని వరమైందని భావిస్తోంది. 2014 సార్వత్రిక ఎన్నికలు జరిగి మూడున్నరేళ్లు గడిచాయి. ఇప్పటిదాకా ప్రభుత్వ పనితీరును ఓటు ద్వారా పరీక్షించుకునే అవకాశం రాలేదు. ఆళ్లగడ్డ, నందిగామ శాసనసభ స్థానాలకు ఉపఎన్నికలు వేర్వేరుగా జరిగాయి. ఒకటి ఏకగ్రీవంకాగా రెండోది ఏకపక్షం. తాజాగా నంద్యాలలో జరిగిందే అధికార, విపక్ష పార్టీలు హోరాహోరీగా తలపడిన ఎన్నికలు. ఇది వైకాపాకు సిట్టింగ్ స్థానం. చనిపోయిన శాసనసభ్యుడి కుటుంబీకులను ఏకగ్రీవంగా ఎన్నుకునే సంప్రదాయం రాష్ట్రంలో కొన్నేళ్లుగా ఉంది. నంద్యాలలో ఏపార్టీ అయినా ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలన్న వాదనను పక్కనబెడితే మూడున్నరేళ్ల తరువాత సీరియస్‌గా పరిగణించిన ఎన్నిక మాత్రం ఇదొక్కటే. నంద్యాలలో ఘనవిజయం సాధించడం, అందునా అభివృద్ధి అజెండాగా జరిగిన ఎన్నిక కావడంతో దీనిని ప్రభుత్వ పనితీరుకు సానుకూల విజయంగా పరిగణించే పరిస్థితులు ఏర్పడ్డాయని అధికార పార్టీ వర్గాల విశ్లేషణ. వైకాపా నేతలు తాము బలంగా ఉన్నామని భావించే రాయలసీమలో జరిగిన ఎన్నికలివి. ఇలాంటిచోటే ఘనవిజయం సాధించటం 2019 సాధారణ ఎన్నికల సన్నాహాల్ని సానుకూల దృక్పథంతో ప్రారంభించడానికి దోహదపడుతుందని తెదేపా నేతలు అంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రతిపక్షాల నుంచి ఎమ్మెల్యేలు, నాయకులను చేర్చుకోవటంతో ఒక ఒరలో రెండు కత్తులు ఇమడక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తాజాగా విజయంతో ఇకపై రెండు వర్గాలూ సర్దుకుపోతాయని తెదేపా వర్గాల అంచనా. నంద్యాల ఫలితాల ప్రభావం మంగళవారం పోలింగ్ జరిగే కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలపైనా ఉంటుందని తెదేపా నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



సంబరాల్లో భాగంగా టపాసులు కాలుస్తున్న తెదేపా మహిళా నాయకులు, అభిమానులు

కర్నూలు జిల్లాలో మరో ఉపఎన్నిక!

కర్నూలు జిల్లా త్వరలోనే మరో ఉపఎన్నికకు వేదిక కానుంది. ఈసారి ఇది శాసనమండలికి జరుగుతుంది. శాసనమండలిలో స్థానిక సంస్థల కోటా కింద కొద్దినెలల కిందట జరిగిన ఎన్నికల్లో శిల్పా చక్రపాణిరెడ్డి తెదేపా తరఫున ఎన్నికయ్యారు. ఇటీవల వైకాపాలో చేరిన సందర్భంగా మండలిలో సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈస్థానానికి త్వరలోనే ఎన్నిక జరగనుంది.



కర్నూలు జిల్లా ఆదోనిలో తెదేపా నాయకుల సంబరాలు

చేతులు మారిన రూ.వందల కోట్లు

నంద్యాల ఫలితాలపై జోరుగా పందేలు

ఈనాడు, అమరావతి: నంద్యాల ఉపఎన్నికలపై రూ.వందల కోట్లలో పందేలా సాగాయి. గత కొన్ని రోజులుగా సాగుతున్న ఈ పందేలు సోమవారం నాటికి తారస్థాయికి చేరాయి. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కాగా, అంతకు కొన్ని నిమిషాల ముందు వరకు కూడా భారీ మొత్తాల్లో పందెం కాశారు. లెక్కింపు ప్రారంభమైన తర్వాత తొలి రౌండు నుంచే తెదేపా స్పష్టమైన ఆధిక్యం కనబరచడంతో అప్పటికప్పుడు కొంతమంది తెదేపా ఎంత ఆధిక్యంతో గెలుపొందుతున్న దానిపైనా పందేలు కాయడం ప్రారంభించారు. ఇలా ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాదాపు రూ.వందల కోట్లు చేతులు మారాయని అంచనా. ప్రధానంగా ప్రకాశం, కడప, కర్నూలు, కృష్ణా, గుంటూరు తదితర జిల్లాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి పట్టణాల్లోనూ భారీగా సాగాయి.

అమెరికాలోనూ భారీగా పందేలు: ఉప ఎన్నికల ఫలితాలపై ఎన్ఆర్ఐలు కూడా సోమవారం భారీగా పందేలు కాశారు. అమెరికా సహా మరికొన్ని దేశాల్లో పెద్ద ఎత్తున పందేలు సాగాయి. కొందరు తెదేపా అయిదు వేల ఓట్లకు మించి ఆధిక్యత సాధిస్తుందని.. మరికొందరు అంతకు లోపే ఆధిక్యత ఉంటుందని పందెం కాశారు. ఎన్ఆర్ఐలు ఇక్కడ ఉన్న తమ పరిచయస్తులతో కూడా పందెం కాశారు. సామాజిక మాధ్యమాల వేదికగానూ సాగాయి.



ఆళ్లగడ్డలో భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డి సమాధుల వద్ద మంత్రి అఖిలప్రియ, బ్రహ్మానందరెడ్డి నివాళి

ఎక్కడైనా తెదేపాదే విజయం

ఈనాడు – అమరావతి

ప్రతిపక్ష నేత జగన్ ఎన్నికలని సరదాపడుతూ ఊరేగుతున్నందున తన ఎంపీలతో రాజీనామా చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సవాల్ విసిరారు. "ప్రత్యేక హోదా కోసం జూన్ నెలాఖరు నాటికి ఎంపీలతో రాజీనామాలు చేయిస్తానని ప్రకటించారు. మాట తప్పం... మడమ తిప్పం అన్నారు. మంచిదే...రాజీనామాలు చేయించాలి. జూన్‌లో ఐదుగురు ఎంపీలతో రాజీనామాలు చేయిస్తానన్నారు... ఆగస్టు వచ్చింది.. చేయించాలి..." అని చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో విలేకర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సుపరిపాలన గుర్తించి తెలుగుదేశం పార్టీకి నంద్యాల ఓటర్లు ఘన విజయాన్ని అందించడంతో రాష్ట్ర ప్రజలందరూ ఉపశమనం పొందారని చెప్పారు. "ప్రతిపక్ష నేత జగన్ తీరు, అతను మాట్లాడే విధానం అభ్యంతరకరంగా ఉన్నాయి. రాష్ట్రమంతా ఈ ధోరణిని గమనిస్తూనే ఉంది. ఇక్కడ ఉప ఎన్నికకు ఇంత హోరాహోరీ అవసరం లేదు. ఏడాదిన్నర నుంచి రెండేళ్ల కాలమే మిగిలి ఉంది. ప్రతిపక్ష నేత మాట్లాడిన మాటలు... చేసిన ప్రచారం... తెదేపా ప్రభుత్వాన్ని విమర్శించిన తీరు వల్లే జాతీయస్థాయిలో అందరి దృష్టి నంద్యాలపై పడింది. సిద్ధాంతపరంగా విభేదించి విమర్శలు చేయడం సహజమే. కాల్చేయండి... నడిరోడ్డుపై ఉరేయండి... బట్టలిప్పుతా అంటూ... జగన్ వాడిన భాష అభ్యంతరకరంగా ఉంది. ఈ తరహా శైలిని ప్రజలు హర్షించలేదు. అభివృద్ధి చేసే పార్టీనే ప్రజలు ఆదరిస్తారు. నంద్యాలలో సానుభూతిపై గెలిచామని వ్యాఖ్యానిస్తున్నారు. మరి సానుభూతి ఉంటే ఎందుకు భూమా కుటుంబంపై పోటీ పెట్టారు..." అని చంద్రబాబు ప్రశ్నించారు.



నంద్యాల ఉప ఎన్నికలో తెదేపా అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి భారీ విజయం సాధించడంతో సోమవారం వెలగపూడి సచివాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నారాయణ

నాయకుడు కార్యకర్తల్ని నడిపించాలి

ఏ ప్రతిపక్ష నేత ఇన్నాళ్లు ఒక చోట ఉండి ప్రచారం చేయలేదు. నాయకుడు కార్యకర్తల్ని నడిపించాలి. తానే కార్యకర్తలా ఇంటింటికి తిరిగాడు. అక్కడే ప్రతిపక్షనేత బలహీనత వెల్లడైంది. భవనాలు కొట్టేస్తే అభివృద్ధా అని విమర్శలు చేశారు. మరి రోడ్లు ఆకాశంలో వేస్తారా? ఉర్దూ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ ఎక్కడ అంటారు. అవి మొదలై రెండేళ్లయినా ఆ విషయం కూడా అతనికి తెలియదు. నంద్యాల ప్రజలు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. వారికి హామీ ఇచ్చినవే కాకుండా మరింత అభివృద్ధి చేస్తాం. అక్కడ పోటీ పెట్టి వైకాపా అభాసుపాలైంది. పులివెందులను కూడా నంద్యాలలాగే అభివృద్ధి పరుస్తాం..." అని సీఎం వివరించారు.

> కేవలం పోల్ మేనేజ్‌మెంట్‌తోనే గెలవలేం. ప్రజల విశ్వసనీయతే ముఖ్యం. మన నడవడికతో, చిత్తశుద్ధిగా చేసే అభివృద్ధితోనే విశ్వసనీయత సంపాదించుకోగలం. ఇష్టానుసారం మాట్లాడితే ప్రజల విశ్వసనీయత సాధించలేం. నంద్యాల ఫలితం అక్కడి ఓటర్లు ప్రదర్శించిన విజ్ఞతకు నిదర్శనం.

ప్రజల కోసం భరిస్తున్నా

"ప్రతిపక్ష నేతను అతని తండ్రే భరించలేకపోయాడు. ఇక ప్రజలేం భరిస్తారు. అతను శ్రుతి మించి మాట్లాడుతున్న విధానం చూస్తుంటే 39 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నాకు ఇన్ని మాటలు అనిపించుకోవాలా అనే బాధ కలుగుతోంది. అయినా ప్రజల కోసం భరిస్తున్నా. డేరా బాబా తనను నమ్మినవాళ్లపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడి హింసకు పాల్పడేలా ప్రేరేపించారో ఇక్కడ జగన్ బాబా కూడా అరాచకాలకు తెర తీస్తున్నాడు. సమాజానికి చాలా నష్టం చేస్తున్నాడు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అడుగడుగునా అడ్డుపడుతున్నాడు. రాజధాని, పట్టిసీమ, పోలవరం.. ఇలా అన్నింటికీ పిటీషన్లు వేస్తూ అవరోధాలు సృష్టిస్తున్నారు. చివరకు ఉపాధి నిధులు రాకుండా విఫలయత్నాలు చేశారు. పి.వి.సింధుకు ఉప కలెక్టర్ ఉద్యోగం ఇచ్చేందుకు సవరణ తీర్మానం పెడితే అందుకు కూడా సుముఖత చూపలేదు. శాసనసభలో వాళ్ల తీరు ఏదో ముఠా కక్షలు మాదిరి ఉంటోంది. జగన్‌కు మంచి భాష రాదనీ... ప్రజలే భరించే ఓపిక తెచ్చుకోవాలని..." చంద్రబాబు వ్యాఖ్యానించారు.

> ఇక్కడి ఫలితంపై తొలి నుంచీ విశ్వాసంతోనే ఉన్నాను. నాకేమీ ఎన్నికలు కొత్త కాదు. కొత్తగా వచ్చినవాళ్లకే (ప్రతిపక్షనేతను ఉద్దేశిస్తూ) ఏం అర్థం కాక అటూ ఇటూ పరుగులు పెట్టారు. నంద్యాల ఫలితంతో కాకినాడ నగరపాలక ఎన్నికల్లో తెదేపా మరింత ఉత్సాహంగా దూసుకువెళ్తుంది.

అరాచకమా? అభివృద్ధా అని ప్రశ్నించాను

"నంద్యాల ఓటర్లను అరాచకం... అవినీతి ఉన్న వాళ్లు కావాలా? .... అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన కావాలా? అని ప్రశ్నిస్తే అభివృద్ధికే ఓటేశారు. ప్రతిపక్షానికి బలం ఉందనుకున్న గోస్పాడు మండలంలోనూ తెదేపాకే పట్టం కట్టారు. ఎన్నో అవాంతరాలు, ఇబ్బందుల నడుమ పాలన మొదలుపెట్టి అభివృద్ధి చేపట్టాం. ఈ అభివృద్ధినీ, సంక్షేమ కార్యక్రమాల అమలునీ మరో ఎత్తుకు తీసుకువెళ్తాం. ఇందుకోసమే ఎప్పటికప్పుడు పరిష్కార వేదిక ద్వారా అభిప్రాయాలు తెలుసుకొంటున్నాం..." అని చంద్రబాబు వెల్లడించారు. నంద్యాల ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకొన్న వారందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా ఉండాలి

"ఎన్నికల సంఘం పాత్ర రిఫరీగా ఉండాలి. అందులోని అధికారులు బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. పద్ధతిగా పని చేయాలి. విమర్శలకు, అపోహలకీ తావు లేకుండా వ్యవహరించాలి. మా పార్టీ వాళ్లు పిటీషన్లు ఇస్తే దానిపై కేసు దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చినా అమలు చేయలేదు. ఆ తర్వాత క్షమాపణ చెబితే ఎలా? అఫిడవిట్లు తెల్ల కాగితం మీద రాసిచ్చారనీ, అధికారం లేని నోటరీతో రాయించారని చెప్పినా చర్యలేవు.. ఎన్నికల సంఘం పనిలో సమతూకం అవసరం...." అని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రూ.2వేల నోట్లు రద్దు అవసరమని మరోసారి స్పష్టం చేశారు. జనసేన తటస్థ వైఖరిపై స్పందిస్తూ అది ఆ పార్టీ వాళ్ల నిర్ణయమన్నారు. ఉద్దానం సమస్యపై వచ్చినప్పుడు స్పందించామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ పాల్గొన్నారు.

మీరు పని చేస్తేనే మాకు ఫలితాలు

పోలవరం ప్రాజెక్టు పనుల సమీక్ష సందర్భంగా నంద్యాల ఉప ఎన్నికలో విజయం సాధించినందుకు జలవనరులశాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబును అభినందించారు. దీనికి స్పందిస్తూ... "ప్రజాస్వామ్యంలో మీ పాత్ర చాలా ఉంటుంది. మీ పని తీరుతోనే మా ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ఈ ఫలితం వెనుక మీ కృషి కూడా ఉంది. మీరు బాగా పని చేస్తేనే మాకు ఫలితాలు వస్తాయి..." అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ప్రాధాన్యమిస్తూ.. పెద్దపీట వేస్తూ..

- మైనారిటీల మద్దతు చూరగొన్న తెదేపా!

ఈనాడు, అమరావతి: ముస్లిం మైనారిటీలే మెజారిటీ సంఖ్యలో ఉన్న నంద్యాల నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధించటం వెనక ఆ వర్గం మద్దతు అపారం. 2014 ఎన్నికల్లో గంపగుత్తగా వైకాపాకి ఓట్లేశారని భావించిన ముస్లిం మైనారిటీలు ఈసారి తెదేపా పక్షం వహించారని పోలింగ్ జరిగిన తీరు, పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల లెక్కింపుపై జరిపిన విశ్లేషణ స్పష్టం చేస్తోంది. ఇక్కడ 2014 ఎన్నికల్లో తెదేపా కేవలం 3,604 ఓట్ల తేడాతో పరాజయం పాలవగా.. ఈసారి మైనారిటీల మద్దతుతో ఏకంగా 27,466 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందింది. 2014 సాధారణ ఎన్నికల్లో భాజపాతో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం.. రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనారిటీలకు రెండుచోట్ల మినహా పోటీచేసే అవకాశమివ్వలేదు. ముస్లింలు అధికంగా ఉండే స్థానాల్లో భిన్న సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థుల్ని నిలిపి ప్రయోగాలు చేసింది. అనేకచోట్ల అవి ఫలించలేదు. అధికారంలోకొచ్చాక మాత్రం తెదేపా మైనారిటీలకు ప్రాధాన్యమివ్వసాగింది. తొలుత పార్టీ నేత షరీఫ్, తాజాగా ఉప ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి ఫరూక్‌లకు ఎమ్మెల్సీలుగా అవకాశమిచ్చింది. వైకాపా నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు జలీల్‌ఖాన్, చాంద్ బాషాలను పార్టీలో చేర్చుకుంది. నంద్యాలకే చెందిన మైనారిటీ నేతకి ఉర్దూ అకాడమీ పదవి కట్టబెట్టింది. కర్నూలులో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసింది. మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్‌లకు నెలవారీగా గౌరవ వేతనం మంజూరుచేసింది. కడప, విజయవాడలకు హజ్ హౌస్‌ల నిర్మాణానికి నిధులిచ్చింది. నంద్యాల ఎన్నికల నేపథ్యంలో శాసనమండలి అధ్యక్ష స్థానాన్ని మైనారిటీలకే ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నంద్యాలకి చెందిన మాజీ మంత్రి ఫరూక్‌నే ఎంపిక చేయొచ్చని భావిస్తున్నారు. వీటన్నింటికీ మించి అభివృద్ధి పనుల విషయంలో బాగా ఆకర్షితులయ్యారు.

పార్టీ మారినా 'ఫలితం' శూన్యం

- శిల్పా మోహన్‌రెడ్డికి తప్పని ఓటమి
- చెడ్డపేరు తెచ్చిన అక్రమాల ఆరోపణలు
- దూరమైన అనుచరగణం
- దెబ్బతీసిన 'భూమా'పై విమర్శలు

ఈనాడు, అమరావతి, నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డికి మరోసారి నిరాశ తప్పలేదు. నంద్యాల ఉప ఎన్నికల్లో విజయంపై గట్టి ధీమాతో తెదేపాని వీడి వైకాపాలో చేరి పోటీ చేసినా ఫలితం దక్కలేదు. తనతోపాటు పార్టీ మారిన సోదరుడినీ మాజీని చేశారు. 1998లో తెదేపాతోనే రాజకీయ రంగ ప్రవేశం చేసిన శిల్పా మోహన్‌రెడ్డి తరువాత 2004 ఎన్నికల్లో తొలిసారి కాంగ్రెస్ తరపున శాసనసభకు ఎన్నికయ్యారు. 2009 ఎన్నికల్లో రెండోసారి వరసగా గెలుపొంది వైఎస్‌రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో చేరారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మంత్రివర్గంలో స్థానం దక్కలేదు. 2014 సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో తెదేపాలో చేరారు. సాధారణ ఎన్నికల్లో తెదేపా తరపున పోటీ చేసి వైకాపా అభ్యర్థి భూమా నాగిరెడ్డి చేతిలో 3,604 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆయన సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డి కూడా శ్రీశైలం నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. తెదేపా అధికారంలోకి రావటంతో సోదరులిద్దరూ ఆయా నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌ఛార్జులుగా ఉంటూ చక్రం తిప్పారు. శాసనమండలికి స్థానిక సంస్థల కోటాలో జరిగిన ఉప ఎన్నికల్లో చక్రపాణిరెడ్డి ఎమ్మెల్సీ అయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగానూ వ్యవహరించారు. నంద్యాల, శ్రీశైలంల నుంచి గెలుపొందిన భూమా నాగిరెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డిలు తెదేపాలోకి రావటంతోనే ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. రెండు వర్గాలూ పార్టీలో కొనసాగేలా చూసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నిరకాల ప్రయత్నాలూ చేశారు. భూమా నాగిరెడ్డి ఆకస్మిక మరణంతో మరల సమీకరణాలు మారిపోయాయి. ఈదశలోనే ఎమ్మెల్సీ పదవీ కాలం పూర్తవటంతో చక్రపాణిరెడ్డికి పార్టీ మరో అవకాశం కల్పించింది. నంద్యాల ఉప ఎన్నికల్లో మోహన్‌రెడ్డి తెదేపా తరపున పోటీ చేసేందుకు గట్టిగా ప్రయత్నించగా... సంప్రదాయం మేరకు భూమా కుటుంబీకులకు టిక్కెట్ ఇచ్చేందుకు చంద్రబాబు మొగ్గుచూపారు. దీంతో ఆయన వైకాపాలో చేరారు. ఎమ్మెల్సీగా ఉన్న సోదరుడు చక్రపాణిరెడ్డి సైతం వైకాపాలో చేరే క్రమంలో రాజీనామా సమర్పించారు. దీనిని ఆమోదించటంతో మాజీ అయ్యారు. సర్వశక్తులూ కూడదీసుకుని మోహన్‌రెడ్డి పోటీ చేసినా రెండోసారి పరాజయం పాలయ్యారు.

అక్రమాలతో చెడ్డ పేరు: అధికారంలో ఉన్న పదేళ్లు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గట్టెక్కిస్తాయని శిల్పా మోహన్‌రెడ్డి భావించినా.. ఆ ముసుగులో ఇసుక అక్రమ రవాణా, భూకబ్జాలు వెలుగు చూడటం నియోజకవర్గంలో చెడ్డపేరు తీసుకొచ్చాయి. పట్టణంలో నాలుగేళ్ల క్రితం రెండు సామాజిక వర్గాల్లో వివాదం తలెత్తినప్పుడు ఒక వర్గానికి చెందిన వారిపై కేసులు నమోదు కావడంతో ఆ వర్గం ఓటర్లు ఈ ఎన్నికల్లో శిల్పా వెంట నడవలేదు. నియోజకవర్గంలో మరో బలమైన సామాజిక వర్గాన్ని తొలి నుంచి దగ్గరికి తీయకపోవడంతో ఆ వర్గం ఈ ఎన్నికల్లో కసితో పని చేసింది. ఇదే సమయంలో తన చుట్టూ కేవలం కొంత మందితో 'కోటరీ' ఏర్పాటు చేసుకుని పని చేయడంతో మిగతా క్యాడర్ క్రమంగా దూరమవుతూ ఈ ఎన్నికల్లో పూర్తి వ్యతిరేకంగా పని చేసింది. తన వెంటే ఉన్న కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వకుండా కేవలం ఒక్కరిద్దరి మాట చెల్లుబాటయ్యేలా చూశారనే విమర్శలు శిల్పా వర్గం నుంచే వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో ఐదారుగురు కౌన్సిలర్లు దూరం జరిగారు. మరోవైపు నంద్యాల, గోస్పాడు మండలాల్లోని గ్రామాల్లో బహు నాయకత్వాన్ని ప్రోత్సహించడం భారీ నష్టాన్నే తెచ్చిపెట్టింది. తన కుటుంబ సభ్యుల పెత్తనం కూడా నియోజకవర్గ ప్రజలకు రుచించలేదు.

తరచూ పార్టీలు మారడం: పదిహేనేళ్ల రాజకీయ జీవితంలో మూడుసార్లు పార్టీ మారడంతో తన అనుచరులకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. తెదేపాను ఎందుకు వీడాల్సి వచ్చిందో నియోజకవర్గ ప్రజలకు సరైన రీతిలో సమాధానం చెప్పుకోలేకపోయారు. శిల్పా సహకార్, మహిళా బ్యాంకుపై తెదేపా విమర్శలు ఓటర్ల దరి చేరాయి.

అవకాశాలను అందిపుచ్చుకోలేక..: పట్టణ ప్రజల కలగా మిగిలిపోయిన రహదారుల విస్తరణపై చొరవ తీసుకోలేకపోవడం.. తెదేపా ఈ అంశాన్ని అందిపుచ్చుకోవడం శిల్పా వెనుకబాటుకు కారణమైంది. రేషన్‌కార్డులు, పింఛన్లు నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో మంజూరయ్యే విషయంలో కనీస పాత్ర కూడా లేకపోవడం ఇబ్బంది కలిగించింది.

మైనార్టీల్లో వ్యతిరేకత.. 'భూమా'పై విమర్శలు: మైనార్టీల్లో వ్యతిరేకత ఉందని తెలుసుకున్న శిల్పా బహిరంగ సభల్లో ఆ వర్గానికి క్షమాపణలు చెప్పినా వారిని ఆకట్టుకోలేకపోయారు. భూమా కుటుంబంపై చేసిన విమర్శలు ఓటర్లను మరింత దూరం చేశాయి.

డబ్బు ప్రభావమే ఓటమికి కారణం

తెదేపా నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంచడం వల్లే ఓటమి పాలయ్యాం. ఈ ఎన్నికల్లో డబ్బు ప్రభావం కనిపించింది. ఓటుకు రూ.మూడు, నాలుగు, ఐదు వేల వరకు పంపిణీ చేశారు. పదవీ కాలం ఒకటిన్నర ఏడాది మాత్రమే ఉండటం కూడా ఫలితాల వ్యతిరేకతకు కారణమైంది. మైనార్టీలు తెదేపాకే మద్దతునిచ్చారు. భూమా కుటుంబంపై సానుభూతి కొంతమేర పని చేసింది.

- వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి



కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్తున్న శిల్పా మోహన్‌రెడ్డి

నంద్యాలలో తెదేపాకు పెరిగిన బలం

- సాధారణ ఎన్నికలతో పోల్చితే 11.15శాతం అధిక ఓట్లు
- వైకాపాకు తగ్గిన 6.77శాతం ఓట్లు

ఈనాడు, అమరావతి: నంద్యాల నియోజకవర్గంలో తెదేపా బలం పెరిగింది. 2014 సాధారణ ఎన్నికలతో పోల్చితే ఈ ఉపఎన్నికలో 11.15శాతం ఓట్లు పెరిగాయి. సాధారణ ఎన్నికల్లో మొత్తం పోలైన ఓట్లలో తెదేపాకు 44.90శాతం ఓట్లు రాగా.. ఈసారి 56.05శాతం ఓట్లు వచ్చాయి. వైకాపాకు 46.96శాతం ఓట్లు రాగా.. ఈ ఉపఎన్నికలో 40.19శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. సాధారణ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిగా బరిలో నిలిచిన శిల్పా మోహన్‌రెడ్డిపై వైకాపా తరపున పోటీ చేసిన భూమానాగిరెడ్డి 3,604 మెజారిటీతో విజయం సాధించారు. నంద్యాల పట్టణం నుంచి నంద్యాల, గోస్పాడు మండలాల్లోనూ వైకాపా మెజారిటీ సాధించగా.. ప్రస్తుత ఉప ఎన్నికల్లో ఓటరు తీర్పు పూర్తిగా మారింది. మండలాలు, పట్టణంలోనూ తెదేపాదే హవా సాగింది. 2014 ఎన్నికల్లో మొత్తం 2,42,742 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 1,74,999 మంది ఓటు వేశారు. ప్రస్తుత ఎన్నికలో మొత్తం 2,18,858మంది ఓటర్లు ఉండగా.. 1,73,187మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పార్టీ	2014లో వచ్చిన ఓట్లు	శాతం	2017లో వచ్చిన ఓట్లు	శాతం	వ్యత్యాసం (శాతాల్లో)
తెదేపా	78,590	44.90	97,076	56.05	11.15
వైకాపా	82,194	46.96	69,610	40.19	-6.77
కాంగ్రెస్	2,459	1.40	13,82	0.79	-0.61



సోమవారం నంద్యాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది



తెదేపా ఘన విజయాన్ని పురస్కరించుకొని ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం సమీపంలో నిర్వహించిన సంబరాల్లో నృత్యం చేస్తున్న కార్యకర్తలు

అభివృద్ధి గెలిచింది.. అవినీతి ఓడింది

- మంత్రులు, తెదేపా నేతల స్పందన
- నగరపాలక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలన్న హోంమంత్రి రాజప్ప

ఈనాడు, అమరావతి, కాకినాడ, న్యూస్‌టుడే యంత్రాంగం: నంద్యాల ఉప ఎన్నికలో తెదేపా విజయం పట్ల మంత్రులు, తెదేపా ముఖ్య నేతలు హర్షం వెలిబుచ్చారు. తెదేపా అభ్యర్థిని గెలిపించిన నంద్యాల ప్రజలకు, గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. విజేత బ్రహ్మానందరెడ్డికి అభినందనలు తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లోను రాష్ట్రవ్యాప్తంగా ఇదే ఫలితం పునరావృతమవుతాయన్నారు. నంద్యాల ఎన్నికల్లో అభివృద్ధి గెలిచి అవినీతి ఓడిందని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. జగన్‌మాటల్లో మార్పు రాకపోతే భవిష్యత్‌లోనూ ఇలాంటి తీర్పులే వస్తాయన్నారు. ఎక్సైజ్ మంత్రి జవహర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కాకినాడలో ఉన్న మంత్రులు, నేతలు ఘనవిజయంపై పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళావెంకట్రావ్ మాట్లాడుతూ ప్రజలు చంద్రబాబుపాలనపై సంతృప్తిగా ఉన్నారని రుజువైందన్నారు. జగన్ పీకే (ప్రశాంత్ కిశోర్)ను నమ్ముకొని రెచ్చిపోయి మాట్లాడారని మంత్రి పుల్లారావు ఎద్దేవా చేశారు. పీకేను కాదు ప్రజలను నమ్ముకోవాలన్నారు. జగన్‌ను నంద్యాల ప్రజలు విశ్వసించలేదని మంత్రులు సిద్దా, పితాని పేర్కొనగా.. కాకినాడ నగరపాలక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు ఖాయమని హోం మంత్రి రాజప్ప జోస్యం చెప్పారు.

మూడేళ్ల తెదేపా పాలనకు కితాబిది..: నంద్యాలలో తెదేపా విజయం మూడేళ్ల చంద్రబాబు పరిపాలనకు ప్రజలిచ్చిన కితాబు అని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి.. ఇక జగన్ అన్నీ సర్దుకుని ఇంట్లో కూర్చోక తప్పదని మంత్రి సునీత పేర్కొనగా.. ముఖ్యమంత్రి చంద్రబాబుపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన వైకాపా అధ్యక్షుడు జగన్ నంద్యాల ఓటమితోనైనా బుద్ధి తెచ్చుకోవాలని జలవనరుల మంత్రి ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రతిపక్ష నాయకుడు నంద్యాలలో తిష్టవేసి వీధి వీధికీ వెళ్లి ఓట్లు అడిగినా ప్రజలు తిరస్కరించారని మంత్రి నారాయణ విమర్శించారు. తెదేపా ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి ఈ ఫలితాలు అద్దంపట్టాయని పంచాయతీరాజ్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. నేరపూరిత రాజకీయాలకు ఓటర్లు బుద్ధి చెప్పారన్నారు. జగన్ ప్రవర్తనలో, భాష, సంస్కారంలో ఇప్పటికైనా మార్పు రావాలని మంత్రి సోమిరెడ్డి అనగా.. నంద్యాల ప్రజలు పనిచేసే ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇచ్చారని మంత్రులు అచ్చెన్నాయుడు, రవీంద్ర, గంటా శ్రీనివాసరావు, ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు.

అహర్నిశలు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న తెదేపా ప్రభుత్వానికి అన్ని వర్గాల మద్దతు ఉందన్న విషయం ఈ ఎన్నికల ద్వారా మరోసారి స్పష్టమైందని హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యానించారు. నంద్యాల నియోజకవర్గంలో జగన్ 14 రోజులు ప్రచారం చేయడంతోనే రోజుకు రెండు వేల ఓట్ల చొప్పున తెదేపాకు మెజార్టీ వచ్చిందని మంత్రి ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అభివృద్ధి చూసి నంద్యాల ప్రజలు తెదేపాకి పట్టం కట్టినట్లు ఈ విజయంతో వెల్లడవుతోందని దేవాదాయ ధర్మాదాయ మంత్రి మాణిక్యాలరావు అన్నారు.



కేకు కట్‌చేస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళా వెంకట్రావు, చిత్రంలో ఉప ముఖ్యమంత్రి రాజప్ప, మంత్రులు యనమల, పుల్లారావు, రవీంద్ర తదితరులు



పోర్టల్ ప్రారంభోత్సవంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, క్రీడల మంత్రి విజయ్ గోయల్

ఛాంపియన్స్

ప్రతిభాన్వేషణ కోసం..

జాతీయ పోర్టల్ ఆరంభం

దిల్లీ: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం జాతీయ క్రీడా ప్రతిభాన్వేషణ పోర్టల్‌ను ఆరంభించారు. క్రీడా మంత్రిత్వ శాఖ, సీనియర్ క్రీడల అధికారులకు తమ ప్రతిభ గురించి తెలిసేలా చేయడానికి చిన్నారులు, కుర్రాళ్లకు www.nationalsportstalenthunt.com అనే ఈ వెబ్‌సైట్ ఉపయోగపడనుంది. ఎనిమిదేళ్లు దాటిన ఎవరైనా వెబ్‌సైట్లో తమ పేరును నమోదు చేసుకుని, తమ బయోడాటా లేదా వీడియోలను అప్‌లోడ్ చేయవచ్చు. అతడి తరఫున అతడి తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులు కూడా ఈ పని చేయవచ్చు. క్రీడా మంత్రిత్వ శాఖ, ప్రతిభావంతులను ఎంపిక చేసి భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్) కేంద్రాల్లో శిక్షణకు పంపిస్తుంది. పోర్టల్ ఆరంభం సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భారత్ బలమైన క్రీడా దేశంగా ఎదగాలంటే అన్ని రాష్ట్రాల్లో క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించడం, చిన్న వయసు నుంచే ప్రతిభావంతులను సానపట్టడం అవసరమని అన్నారు.



ముగురుజ శుభారంభం

న్యూయార్క్: యుఎస్ ఓపెన్లో స్పెయిన్ స్టార్ ముగురుజ శుభారంభం చేసింది. సోమవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ముగురుజ 6-0, 6-3తో లెప్చెంకొ (అమెరికా)ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ఐదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన ముగురుజ.. 16 విన్నర్లు కొట్టింది. మరో వైపు చెక్ రిపబ్లిక్ అమ్మాయిలు క్వితోవా, ప్లిస్కోవా కూడా ముందంజ వేశారు. క్వితోవా 7-5, 7-5తో జంకోవిచ్ (సెర్బియా)ను ఓడించగా, ప్లిస్కోవా 6-2, 6-2తో ఎగుచి (జపాన్)పై గెలిచింది. కార్నెట్ (ఫ్రాన్స్), రొడినోవా (ఆస్ట్రేలియా), గర్సియా (ఫ్రాన్స్) కూడా ముందంజ వేశారు. బ్రిటన్ అమ్మాయి హెథర్ వాట్సన్‌పై 6-4, 6-4తో కార్నెట్ గెలవగా, గర్సియా 6-0, 6-1తో మార్టిన్‌కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి ముందంజ వేసింది. పురుషుల సింగిల్స్‌లో కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా) ముందంజ వేశాడు. అతను 6-3, 6-3, 6-1తో అరాగాన్ (అమెరికా)పై గెలిచాడు. కారెనొ బుస్టా (స్పెయిన్), మేయర్ (జర్మనీ) కూడా ముందంజ వేశారు.



క్వార్టర్స్‌లో కవిందర్, గౌరవ్

ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

హాంబర్గ్: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. కవిందర్ బిష్త్ (52 కిలోలు), గౌరవ్ బిధూరి (56 కిలోలు) క్వార్టర్స్‌లో అడుగుపెట్టగా.. శివ థాపా అనూహ్యంగా నిష్క్రమించాడు. ప్రిక్వార్టర్స్‌లో కవిందర్ 3-2 తేడాతో మహ్మద్ ఫ్లిస్సి (అల్జీరియా)పై, గౌరవ్.. మైకోలా (ఉక్రెయిన్)పై విజయం సాధించారు. ప్రపంచ బాక్సింగ్‌లో రెండో పతకం సాధించాలనుకున్న ఐదో సీడ్ శివ థాపా (60 కిలోలు) ఒక్క పంచైనా విసరకుండానే తప్పుకున్నాడు. తీవ్ర జ్వరం కారణంగా ప్రిక్వార్టర్స్‌లో వాకోవర్ ఇచ్చాడు. కామన్వెల్త్ క్రీడల స్వర్ణ విజేత మనోజ్‌కుమార్ (69 కిలోలు), మూడో సీడ్ వికాస్ కృష్ణన్ (75 కిలోలు), సుమిత్ సంగ్వాన్ (91 కిలోలు) పరాజయంపాలయ్యారు.



క్రికెట్‌ను దాటేయొచ్చు!

ప్రస్తుతం దేశంలో ఉన్న శిక్షణ వ్యవస్థ, టోర్నీల నిర్వహణ, పరిపాల విధానంలో మార్పులు తీసుకొస్తే ప్రపంచ బ్యాడ్మింటన్‌లో భారత్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు కంటే ఎక్కువ పతకాలు ఆశించామని తెలిపాడు. ప్రస్తుత ఫలితాలు యువతరంలో స్ఫూర్తినింపుతాయంటున్న గోపీచంద్ ఇంటర్వ్యూ 'ఈనాడు'కు ప్రత్యేకం.

ఈనాడు – హైదరాబాద్

ఫైనల్లో సింధు ప్రదర్శన ఎలా ఉంది?

మాటల్లో వర్ణించలేను. నేను చూసిన అత్యుత్తమ మ్యాచ్ ఇది. అమ్మాయిలు ఇంతలా ఆడటం నేనెప్పుడూ చూడలేదు. ఇద్దరూ కొదమసింహాల్లా తలపడ్డారు. ఎవరూ వెనక్కి తగ్గలేదు. తమ శక్తిసామర్థ్యాలకు మించి పోటీపడ్డారు. ఈ మ్యాచ్‌ను బ్యాడ్మింటన్ అభిమానులు కొన్నేళ్ళ పాటు గుర్తుంచుకుంటారు.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు వస్తాయని ఊహించారా?

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో బరిలో దిగిన అత్యంత బలమైన భారత జట్టు ఇదే. ఇటీవలి ప్రదర్శన, ఫామ్ ప్రకారం రెండు కంటే ఎక్కువ పతకాలే ఆశించాం. అందుకు తగ్గట్లే క్రీడాకారులు సత్తాచాటారు. మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో మనోళ్లు కొద్దిలో ఓడారు. శ్రీకాంత్ కూడా పతకం గెలిచేవాడే. ఈ మూడు విభాగాల్లో త్రుటిలో పతకాలు చేజారాయి. మొత్తంగా భారత జట్టు ప్రదర్శన సంతృప్తికరం. భవిష్యత్తు ఆశావహం. ప్రస్తుత విజయాలు యువతరంలో స్ఫూర్తిరగిలిస్తాయనడంలో సందేహం లేదు.

భారత్‌లో రోజురోజుకూ బ్యాడ్మింటన్‌కు ఆదరణ పెరుగుతోంది. క్రికెట్‌ను అధిగమించే శక్తి బ్యాడ్మింటన్‌కు ఉందా?

మనదేశంలో ఒకప్పుడు హాకీకి ఎక్కువ ఆదరణ ఉండేది. 1983 ప్రపంచ కప్ తర్వాత క్రికెట్ ఆ స్థానంలోకి వచ్చింది. ఇప్పటికిప్పుడు క్రికెట్‌ను బ్యాడ్మింటన్ అందుకుందని, దాటేసిందని చెప్పను. కాకపోతే దాటేందుకు అవకాశం నూటికి నూరు శాతం ఉంది. ఎప్పుడో ఒకప్పుడు క్రికెట్‌ను వెనక్కినెట్టడమో లేదా సరిసమానంగా నిలువడమో ఖాయం. ఒలింపిక్స్‌లో సింధు పతకం గెలిచినప్పుడు.. మంచి ఫలితాలు వచ్చినప్పుడు లభిస్తున్న ఆదరణ, ప్రచారం ఇందుకు నిదర్శనం. సింధు పతకం సాధించినప్పుడు క్రికెట్ కంటే ఎక్కువగా పత్రికలు, టీవీ ఛానెళ్లలో కవరేజీ లభించింది.

ఒలింపిక్స్‌లో పతకం, సూపర్ సిరీస్ విజయాలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు.. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో చైనాను భారత్ అధిగమించినట్లేనా?

ప్రస్తుత ఫలితాల ప్రకారం మనం మెరుగైన స్థితిలో ఉన్నామన్నది వాస్తవం. ఐతే చైనాను అధిగించామని చెప్పలేం. చైనాలో ఉన్నంత మంది క్రీడాకారులు మన దగ్గర లేరు. ప్రతి మూడు, నాలుగేళ్ళలో ఒక ప్రపంచ స్థాయి క్రీడాకారుడు వచ్చే వ్యవస్థ ఇక్కడ లేదు. మౌలిక వసతులు ఉన్నా కూడా శిక్షణ పద్ధతులు, టోర్నీల నిర్వహణ, పరిపాలన విధానంలో విప్లవాత్మకమైన మార్పులు అవసరం. ఇప్పుడున్న వ్యవస్థను ఇంకా మెరుగుపరిస్తే ఇంతకంటే ఎక్కువ పతకాలే వస్తాయి. బ్యాడ్మింటన్‌లో భారత్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుంది కూడా.



ఏ రోజూ రాజీ పడలేదు

పూసర్ల వెంకట సింధు.. గత ఏడాది ఇదే సమయానికి దేశమంతా ఆమె పేరు మార్మోగింది. రియో ఒలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శనతో రజతం గెలిచిన ఆమెపై ప్రశంస సల జల్లు కురిసింది. ఏడాది తర్వాత ఇప్పుడు కూడా సింధు పేరు మార్మోగుతోంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఆమె ప్రదర్శన అభిమానుల మనసు దోచింది. ఆదివారం హోరాహోరీగా సాగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో తుది కంటా పోరాడి.. రజతానికి పరిమితమైన సింధు.. తన ప్రదర్శన, తాను సాధించిన పతకం విషయంలో గర్విస్తున్నానని చెప్పింది. ఒకుహర చేతిలో ఓడినా.. తన ఆటతో కోట్లాది హృదయాల్ని గెల్చుకున్న సింధు ఇంటర్వ్యూ 'ఈనాడు'కు ప్రత్యేకం.

ఈనాడు – హైదరాబాద్

ఈనాడుకు ప్రత్యేకం

ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం రంగు మారుస్తానన్న మాటలు నిజం చేయడం ఎలాంటి అనుభూతినిస్తోంది?

గతంలో రెండుసార్లు కాంస్య పతకాలే వచ్చాయి. స్వర్ణమే లక్ష్యంగా ఈసారి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లా. ఫైనల్లో విజయం కోసం తుదికంటా పోరాడా. కానీ ఫలితం మరోలా వచ్చింది. స్వర్ణం గెలవకపోవడం నిరాశ కలిగించినా.. రజతం కూడా ఆనందాన్నిచ్చింది. నా కెరీర్‌లో అత్యుత్తమ మ్యాచ్‌లలో ఇదొకటి. పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తులో మరింత పక్కాగా సన్నద్ధమవుతా.

ఫైనల్ అంత సుదీర్ఘంగా సాగుతుందని అనుకున్నారా?

ఒకుహర గట్టి ప్రత్యర్థి. ఆమెతో ఇంతకుముందు నేనాడిన మ్యాచ్‌లన్నీ సుదీర్ఘంగా సాగాయి. ఈసారి కూడా మ్యాచ్ అలాగే ఉంటుందనుకుని ఫైనల్లో అడుగుపెట్టా. మూడో గేమ్ 20 పాయింట్ల వద్ద సమమైంది. ఆ సమయంలో మ్యాచ్ ఎవరిదైనా కావొచ్చు. మేమిద్దరం పట్టు వదల్లేదు. ఇద్దరం స్వర్ణం కోసమే పోరాడాం. ఆఖరి క్షణాలు పరిస్థితిని మార్చేశాయి.



ర్యాలీలు సుదీర్ఘంగా సాగుతున్నప్పుడు మీ ఆలోచనలెలా ఉన్నాయి?

రెండో గేమ్‌లో 21-20 దగ్గర ఉన్నప్పుడు 22వ పాయింటు కోసం 73 షాట్ల ర్యాలీ ఆడాం. అదొక్కటే కాదు.. మ్యాచ్‌లో చాలా ర్యాలీలు సుదీర్ఘంగా సాగాయి. కోర్టులో ఎక్కడ ఉన్నా షటిల్‌ను కిందపడనివ్వకూడదన్న పట్టుదలతో ఆడాను. అసాధ్యమనిపించినా షటిల్‌ను అందుకోవడం మానలేదు. ఎలాగైనా సరే పాయింటు సాధించాలన్నదే ఆ సమయంలో మా ఇద్దరి లక్ష్యం. అందుకు తగ్గట్లే ఆడటంతో ర్యాలీలు సుదీర్ఘంగా నడిచాయి. మొత్తంగా అదో అద్భుతమైన మ్యాచ్. అది నారోజు కాదంతే.

ఫైనల్ మ్యాచ్‌తో ఏం నేర్చుకున్నారు?

గతంలో జరిగిన మూడు గేమ్‌ల మ్యాచ్‌ల్లో ఎక్కువ శాతం నాదే పైచేయి. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండటం నాకు కలిసొచ్చే అంశం. ఐతే ఫైనల్లో ఒకుహర నాకంటే ఎక్కువ దృఢత్వం కనబరిచింది. మానసికంగా, శారీరకంగా పరీక్ష పెట్టేలా కఠినంగా సాగిందా మ్యాచ్. ఒకుహర అంత సులువుగా మ్యాచ్‌ను విడిచిపెట్టదని నాకు అర్థమైంది. ఐతే ఈ మ్యాచ్‌తో ఆత్మవిశ్వాసం పెరిగింది. సుమారు రెండు గంటల పాటు కోర్టులో కదలడం ఎప్పటికీ మరిచిపోలేని అనుభవం. భవిష్యత్తులో ఇలాంటి మ్యాచ్‌లు ఎదురైతే ఎలా ఆడాలో అర్థమైంది.

ఒకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు పతకాలు దక్కడంపై ఏమంటారు?

ఇది భారతీయులంతా గర్వించదగ్గ విషయం. సైనా కూడా అద్భుతంగా ఆడింది. దేశానికి రజత పతకం అందించినందుకు నాకు గర్వంగా ఉంది. ఈ పతకం నా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. భవిష్యత్తులో మరిన్ని టైటిళ్లు సాధిస్తా. ఈ రెండు పతకాలు యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపుతాయని అనుకుంటున్నా. ఈ ప్రదర్శనతో బ్యాడ్మింటన్ రాకెట్ పట్టే వాళ్ల సంఖ్య పెరగొచ్చు.

ఫిట్‌నెస్ పరంగా మీరు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

ఫిట్‌నెస్ విషయంలో ఏరోజూ రాజీ పడలేదు. ఈ విషయంలో మా నాన్నది ప్రత్యేక శ్రద్ధ. నాన్న మార్గనిర్దేశనంలో గంటలకొద్దీ శ్రమిస్తున్నా. మిగతా వాళ్ళతో సమానంగా రోజంతా సాధన చేసినా.. అదనంగా కసరత్తులు చేస్తా.. సాధన ముగిశాక కూడా జిమ్‌లో కష్టపడతా. ఇష్టంతో చేసేది ఎప్పుడూ కష్టంగా అనిపించదు.

భారత బ్యాడ్మింటన్ చరిత్రలో అత్యుత్తమ క్రీడాకారిణి మీరే అంటూ వినిపిస్తున్న ప్రశంసలపై ఏమంటారు?

ఆ మాట చాలా గొప్పది. ఆ స్థానాన్ని అందుకోడానికి ఎంతో కష్టపడాలి. అక్కడికి చేరుకున్నాక రెట్టింపు శ్రమించాలి. భవిష్యత్తులోనూ నా కఠోర శ్రమ కొనసాగుతుంది.

పాక్‌తో మ్యాచా.. కాలు లేకున్నా ఆడతా!



చెన్నై: పాకిస్థాన్‌తో మ్యాచ్‌ను భారత్ ఎంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుందో కొత్తగా చెప్పేదేముంది? అందుకే నిరుడు ఆసియా కప్‌లో పాకిస్థాన్ పోరుకు ముందు తీవ్ర గాయమైనా అప్పుడు కెప్టెన్‌గా ఉన్న ధోని బరిలోకి దిగాడట. చెన్నైలో ఓ కార్యక్రమం సందర్భంగా ప్రధాన సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ ఈ విషయం వెల్లడించాడు. "పాకిస్థాన్ కీలక మ్యాచ్‌కు రెండు రోజుల ముందు రాత్రి జిమ్‌లో కసరత్తులు చేస్తుండగా ధోని గాయపడ్డాడు. బరువులెత్తుతుండగా వెన్నులో నొప్పి రావడంతో కింద పడ్డాడు. అదృష్టవశాత్తూ బరువులు అతడిపై పడలేదు. ఐతే నొప్పితో అతడు లేవలేకపోయాడు. అతణ్ని స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సి వచ్చింది. పరిస్థితేంటో తెలుసుకుందామని ధోని గదికి వెళ్లా. అతడిలో ఎలాంటి కంగారూ లేదు. 'ఆందోళన వద్దు ఎమ్మెస్కే భాయ్' అని నాకు ధైర్యం చెప్పాడు. ధోనికి ప్రత్యామ్నాయంగా పార్థివ్‌ను పిలిపించాం. ఐతే మధ్యాహ్నం తుది జట్టును ప్రకటించే ముందు ధోని జెర్సీ ధరించి మ్యాచ్‌కు సిద్ధంగా ఉన్నాడు. నన్ను తన గదికి పిలిచి 'నువ్వెందుకు ఆందోళన చెందుతున్నావు. నేను ఓ కాలు లేకున్నా సరే పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో ఆడతా' అని అన్నాడు" అని ప్రసాద్ తెలిపాడు. ధోని ఎలాంటి సౌకర్యాలు లేని ప్రాంతం నుంచి వచ్చి గొప్ప స్థాయికి ఎదిగాడని.. అతణ్ని ఆదర్శంగా తీసుకుని ఎదగాలని కుర్రాళ్లకు ప్రసాద్ పిలుపునిచ్చాడు.



ఆ ముగ్గురూ ఎదురు చూస్తున్నారు

వీవీఎస్ లక్ష్మణ్

శ్రీలంకపై వన్డే సిరీస్ ఆరంభానికి ముందే భారత్ విజయం ఊహించిందే అయినప్పటికీ.. వరుసగా ఐదో ద్వైపాక్షిక వన్డే సిరీస్ గెలిచిన కోహ్లి బృందానికి అభినందనలు. భారత బౌలర్లు మొదట్నుంచి నిలకడగా సత్తా చాటుతున్నారు. బుమ్రా వారి దళపతిగా ఉన్నాడు. మూడు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీశాడంటే.. అది అతడి నైపుణ్యం, బౌలింగ్‌లో వైవిధ్యం వల్లే. భువనేశ్వర్ కూడా చాలా బాగా బౌలింగ్

చేసినా.. అదృష్టం కలిసి రాక ఎక్కువ వికెట్లు పడలేదు. అక్షర్ పటేల్ ఆకలితో ఉన్నవాడిలా అవకాశాల్ని అందిపుచ్చుకున్నాడు. సిరీస్ ఇప్పటికే చేజిక్కిన నేపథ్యంలో భారత్ మరిన్ని ప్రయోగాలు చేయొచ్చు. రహానె కొత్తగా తనేంటో నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. ఐతే మనీష్ పాండే, కుల్దీప్, శార్దూల్ అవకాశం కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తుంటారు. ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి 2019 ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగంగా కొత్త ఆటగాళ్లకు అవకాశాలివ్వాలి. రాబోయే కొన్ని నెలల్లో సొంతగడ్డపై కొన్ని వన్డే సిరీస్‌లు భారత్‌కు సవాలు విసిరే అవకాశముంది. దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా జట్టులో, బ్యాటింగ్ ఆర్డర్లో మార్పులు అవసరం.

లంక చేసిన తప్పు అదే



మహేల జయవర్ధనె

రెండో వన్డేలో భారత్‌కు గట్టిపోటీ ఇచ్చిన లంక పుంజుకున్నట్లే కనిపించింది. అయితే మూడో వన్డేలో టీమ్‌ఇండియా ఆ జట్టును కోలుకోలేని దెబ్బ కొట్టింది. లంక అభిమానులకు ఇది తీవ్ర నిరాశను కలిగించే ఫలితమే. చివరి రెండు మ్యాచ్‌లకు జట్టుకు అభిమానులు అండగా నిలుస్తారని భావిస్తున్నా. మూడో వన్డేలోలంక ఆత్మవిశ్వాసంతోనే కనిపించింది. కానీ టాస్

గెలిచి బ్యాటింగ్ ఎంచుకోవడమే వాళ్లు చేసిన తప్పు. ఆరంభంలో పిచ్ నుంచి సహకారాన్ని రాబట్టిన భారత పేసర్లు ప్రత్యర్థిని దెబ్బ తీశారు. సానుకూలాంశం ఏమిటంటే పునరాగమనంలో తిరిమానె రాణించడం. సిరీస్ ఇప్పటికే లంక చేజారింది. ఇక పోరాడాల్సింది పరువు దక్కించుకోడం కోసమే.



విండీస్ లక్ష్యం 322

లీడ్స్: ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో విజయానికి రంగం సిద్ధం చేసుకున్నట్లుగా కనిపించిన విండీస్.. నాలుగో రోజు మ్యాచ్‌పై పట్టు కోల్పోయింది. చివరి రోజు ఓటమి తప్పించుకోవడానికి పోరాడాల్సిన స్థితికి చేరుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 169 పరుగుల ఆధిక్యం సమర్పించుకుని.. మూడో రోజు 171/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. అనూహ్యంగా 8 వికెట్ల నష్టానికి 490 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. కెప్టెన్ జో రూట్ (72)తో పాటు మలన్ (61), స్టోక్స్ (58), మొయిన్ అలీ (84), వోక్స్ 61) కీలక ఇన్నింగ్స్‌లతో జట్టుకు అనూహ్యమైన స్కోరు అందించారు. అలీ, వోక్స్ ఎనిమిదో వికెట్‌కు 117 పరుగులు జోడించడం విశేషం. విండీస్ ముందు 322 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యం నిలిచింది. సోమవారం 6 ఓవర్లాడిన విండీస్ వికెట్ నష్టపోకుండా 5 పరుగులు చేసింది. విండీస్ విజయం గురించి ఆలోచించే అవకాశాల్లేనట్లే. చివరి రోజంతా ఇంగ్లాండ్ బౌలర్లను కాచుకుని డ్రాతో గట్టెక్కడానికే పోరాడాల్సి ఉంటుంది. మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే.

ఆసీస్‌పై బంగ్లాకు ఆధిక్యం

ఆసక్తికరంగా తొలి టెస్టు

ఢాకా: బంగ్లాదేశ్-ఆస్ట్రేలియా తొలి టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. చిన్న జట్టయిన బంగ్లా.. ఆస్ట్రేలియాపై 43 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 18/3తో రెండో రోజు, సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. స్పిన్నర్లు షకిబ్ అల్‌హసన్ (5/68), హసన్ మిరాజ్ (3/62)ల ధాటికి 217 పరుగులకే ఆలౌటైంది. ఆట ఆరంభమైన కాసేపటికే ఆసీస్ కెప్టెన్ స్టీవెన్ స్మిత్ (8)ను మిరాజ్ ఔట్ చేసి ప్రత్యర్థిని గట్టి దెబ్బ తీశాడు. ఈ దశలో మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ రెన్‌షా (45)తో కలిసి హాండ్స్‌కాంబ్ (33) పోరాడాడు. ఐతే క్రీజులో కుదురుకున్న వీళ్లిద్దరూ స్వల్ప వ్యవధిలో వెనుదిరిగారు. మాథ్యూ వేడ్ (5), మాక్స్‌వెల్ (23) కూడా ఎంతోసేపు నిలవలేదు. దీంతో ఆసీస్ ఓ దశలో 144/8తో నిలిచింది. ఈ స్థితిలో అగార్ (41 నాటౌట్) పోరాడి జట్టు స్కోరును 200 దాటించాడు. చివరి రెండు వికెట్లను షకిబ్ స్వల్ప వ్యవధిలో పడగొట్టి ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లా.. ఆట ముగిసే సమయానికి 45/1తో నిలిచింది. తమీమ్ ఇక్బాల్ (30), తైజుల్ ఇస్లామ్ (0) క్రీజులో ఉన్నారు.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00